




గురువులు

దత్తాత్రేయ

గురులీల






సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

"నేను" గా ఉండటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి.మహానుభావులైన సాధకులు, జిజ్ఞాసువులు జ్ఞాన ప్రచారార్ధం తాము సేకరించిన విలువైన గ్రంధాలను స్క్రిబ్డ్ వెబ్ సైట్ ద్వారా eBOOK(PDF) రూపంలో అందిస్తున్నారు. వారు చేస్తున్న జ్ఞాన యజ్ఞానికి సాయి రామ్ కూడా తమవంతుగా సహాయం చేసే కార్యక్రమంలో భాగంగా వారి గ్రంధాలను సాయి రామ్ ద్వారా కూడా అందచేస్తున్నాము, ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం చేసిన ఆర్కైవ్ సైట్(https://archive.org), గూగుల్ సైట్(https://www.google.co.in),మైక్రోసాఫ్ట్ సైట్ (www.microsoft.com) వారికి కూడా మేము ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలతో నిండిపోవాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) స్క్రిబ్డ్ వారి వెబ్ సైట్: http://www.scribd.com/
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సేవక బృందాన్ని సంప్రదించుటకు:sairealattitudemgt@gmail.com

సాయి రామ్ భక్తి,జ్ఞాన సమాచారం: https://www.facebook.com/SaiRealAttitudeManagement

సాయి రామ్ భక్తి,జ్ఞాన సంబంధ వీడియోలు: https://www.youtube.com/user/sairealattitudemgt

ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము. మీరు చదువుకోవటంలో ఏమైనా ఇబ్బంది కలిగితే సేవక బృందంను సంప్రదించగలరు. ఒకవేళ మా సేవలో ఏమైన పొరపాటు వస్తే మన్నించగలరు.


గమనిక: భక్తి,జ్ఞాన ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో సాధకులు,జిజ్ఞాసువులు స్క్రిబ్డ్ వెబ్ సైట్ ద్వారా అందించటం జరిగింది. ఈ గ్రంధముపై వ్యాపార,ముద్రణ హక్కులు వారికి గలవు, కనుక వారిని సంప్రదించగలరని మనవి చేసుకొంటున్నాము.

Sai**R**eal**A**ttitude**M**anagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)

* సర్వం శ్రీ సాయినాథ పాద సమర్పణమస్తు*

స్క్రిబ్డ్ వారి వెబ్ సైట్:

http://www.scribd.com



అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

“దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం” అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.




రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన ‘ఇచ్ఛ’ (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. “నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది” అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014


శ్రీగురులీల




శ్లో॥ దత్తాత్రేయం శివం శాంతం అవధూతం దిగంబరం ।
భక్తాభీష్టప్రదం వందే గ్రంధరూపేణ సంస్థితం ॥

శ్రీ గురులీలాత్మక శ్రీపాద శ్రీ వల్లభ
శ్రీ నృసింహసరస్వతీ శ్రీ దత్తాత్రేయ
పరబ్రహ్మణే నమః

1వ అధ్యాయము



శ్రీ గణేశాయ నమః



శ్రీ సరస్వత్యై నమః



శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

శుక్లాం బరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం ।
ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోప శాంతయే ॥

ఓ గణపతీ! నీకు నమస్కరిస్తున్నాను. త్రికరణ శుద్ధిగా నిన్ను ధ్యానించి, నమస్కరించెడి భక్తులకు సర్వాభీష్టముల నొసగు అభయ ప్రదుడవు. 'శ్రీగురులీల' అను ఈ గ్రంధమును వ్రాయుట గురుతరమైన బాధ్యతగా తీసుకొని, పరబ్రహ్మ స్వరూపమైన శ్రీ దత్తాత్రేయుని అవతార విశేషములను వ్రాయుటకు ఉపక్రమించినాను. నీ చల్లని చూపులు నా పై ప్రసరింప చేసి ఎట్టి విఘ్నములు రాకుండా నన్ను ఆశీర్వదింపుము.

సరస్వతీ నమస్తుభ్యం వరదే కామరూపిణీ ।
విద్యారంభం కరిష్యామి ! సిద్ధిర్భవతు మే సదా ॥

జననీ ! సరస్వతీ దేవీ ! నీవు చదువుల రాణివి. సకల విద్యాప్రదాయినివి. సమస్త జీవుల యందు బుద్ధి రూపముగా వున్న పరదేవతవు నీవు. 'శ్రీగురులీల' అను ఈ ఉత్తమ గ్రంధమును, సద్గురు

దత్త ప్రచార నిమిత్తమై, లోక కళ్యాణార్థమై, ధర్మ సంరక్షణార్థమై, రచన గావించుటకు ప్రయత్న మొనరించితిని: నీ వాడించినట్లు కలము నాడించెదను. ఈ భారము నీది. భావము నీది, పదములు నీవి. గ్రంథము నీది. 'నా' యనునది నా యందు ఏనాడో నశించినది. కావున సర్వమూ నీ అధీనము.

సదా నింబవృక్షశ్య మూలాధి వాసాత్ ! సుధాస్రావిణం తిక్తమప్యప్రియంతమ్ ॥
తరుం కల్పవృక్షాధికం సాధయంతం ! నమామీశ్వరం సద్గురుం సాయినాథమ్ ॥

సమర్థ సద్గురు సాయినాథునికి ప్రణామములు. సాయిదేవా । నీ చరణ కమలములయందు దృష్టి నుంచి దత్తాత్రేయుని అవతార లీలా విశేషములను "శ్రీగురులీల" అను గ్రంథము పేర వ్రాయ సంకల్పించితిని. పరిపూర్ణ దత్తావతారమైన తమరి సంపూర్ణ అనుగ్రహమును పొంది, వ్రాయ సంకల్పించితిని. తమరి కృపాకటాక్ష వీక్షణములును, జ్ఞానభిక్షను ప్రసాదించి కైవల్యపదమను పూలబాటలో ప్రజలందరినీ ఈ గ్రంథము ద్వారా నడిపింతురని ఆశిస్తున్నాను.

శ్లో. నామధారక భక్తాయ నిర్విణ్ణాయవ్య దర్శయత్ ।
తుషః స్తుత్యా స్వరూపం సశ్రీ దత్తశ్శరణం మమ ॥

(భా. అరణ్యములో నామధారకునకు సిద్ధయోగి దర్శనమిచ్చుట)

గంధర్వ నగరంలో శ్రీ నృసింహ సరస్వతీ స్వామివారి మహిమ లోక ప్రసిద్ధమై దూర దూర ప్రాంతాల నుంచి కూడా ఎందరెందరో వచ్చి, వారి అనుగ్రహమును పొంది, పెళ్ళి కాని వారు పెండ్లిని, సంతానము లేని వారు సంతానమును, కూడు-గుడ్డలు లేనివారు ధనధాన్యముల

సమృద్ధి, అనారోగ్యముగా ఉన్నవారు సంపూర్ణ ఆయురారోగ్యములు పొందుతున్నారు.

"నామధారకుడు" అనే బ్రాహ్మణుడు శ్రీ నృసింహసరస్వతీ స్వామివారి పాద పద్మములు దర్శించవలెనని, తహతహతో గాణ్గాపురము పయనమయ్యెను. నామధారకుడు గురుదేవులను చూడవలెనను ఆకాంక్ష ఎక్కువగా ఉన్ననూ, మనస్సులో మాత్రము చింతాక్రాంతుడై వున్నాడు.

శ్రీ నృసింహ సరస్వతీ స్వాముల వారిని స్మరించి తన కష్టములను మనస్సులోనే ఈ విధముగా మొర పెట్టుకున్నాడు : "స్వామీ, నృసింహా ! అందరి కష్టాలను తొలగించే మీ నామస్మరణతో నా కష్టాలు ఎందుకు తొలగడం లేదు? అందుకు నా పాపాలే కారణమైతే, సర్వపాపహరమైన మీ నామం వాటిని ఎందుకు నశింపచేయటం లేదు? గురువే త్రిమూర్తి స్వరూపం అని వేదాలు, స్మృతులు చెబుతున్నాయి. తలచిన వెంటనే గురువే ఫలితం ఇస్తాడని, ఈ కలియుగంలో శ్రీ నృసింహ సరస్వతీ స్వామియే అంతటి గురువని కీర్తి వచ్చింది కదా! మరి నా పట్ల అదెందుకు నిరూపణ కావట్లేదు? మీ పై నాకు భక్తి కుదరడం లేదెందుకు? నన్ను అనుగ్రహించే సమయం ఇంకా రాలేదు అనడం, సర్వసమర్థులైన మీకు తగదు. ఇంతకు ముందు నీవే దిక్కని మిమ్మల్ని సేవించని మాట నిజమే. సేవిస్తేనే ప్రసాదించేది దానమెలా అవుతుంది? రాజనేటటువంటివాడు కూడా, తన దేశంలో పుట్టిన వారిని రక్షిస్తాడు. మా పూర్వీకులు అందరూ మిమ్మల్ని నిష్కామంగా సేవించినందుకైనా, మీరు నన్ను రక్షించాలి. మీరు నాపై అలిగినట్లుగా తోస్తున్నది. అది మీ సాటివారి పట్ల తగునేమో గానీ, అల్పుడైన నా యందు తగదు. ఇందుకు నేను చేసిన తప్పులే కారణమేమో? అజ్ఞానినైన

నేను తప్పులు చేయడం సహజం. మీ యొక్క కృపా దృష్టిని ఎలాగయినా

దిక్కులేదు. దయామయుడవు, కరుణామయుడవు అయిన మీ కారుణ్యమేమయ్యింది ప్రభూ?"

ఈ విధంగా శ్రీ నృసింహ సరస్వతీ స్వామివారిని, కళ్ళనీళ్ళ పర్యంతము వేడుకున్నాడు. శోష వచ్చి, కొద్ది దూరంలో ఒక చెట్టు క్రింద విశ్రమించాడు. ఆ వెంటనే అతనికి ఒక స్వప్నము వచ్చింది. ఆ స్వప్నములో ఒక యోగిపుంగవుడు జడలు, పులితోలు, నారబట్టలు ధరించి దర్శనమిచ్చాడు. ఆ యోగిపుంగవుడు తన నెత్తిపై చేయి పెట్టి ఆశీర్వదించిన అనుభవం కూడా కల్గింది. నిద్ర నుంచి లేచే సరికి కూడా ఆ స్వప్నము, ఆ యోగి, ఆ అనుభవము అలాగే గుర్తుకు వస్తున్నాయి. ఆ యోగి యొక్క రూపాన్నే ధ్యానిస్తూ గంధర్వపురములోనికి ప్రవేశించాడు.

ఓం శ్రీ దత్తాయ గురవే నమః

ఓం శ్రీపాద స్వామినే నమః **ఓం శ్రీనృసింహ సరస్వత్యై నమః**

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

(ఒకటవ అధ్యాయము సంపూర్ణము)


(1, 2 అధ్యాయములు నిత్యము పారాయణ చేయు వారికి గురు సమాగమము, అనుగ్రహము లభించును)



2 వ అధ్యాయము



శ్రీ గణేశాయ నమః



శ్రీ సరస్వత్యై నమః



శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

శ్లో. యః కలిబ్రహ్మ సంవాద మిషేణా హ యుగస్థితిః ।
గురు సేవాంచసిద్ధస్యాత్ శ్రీ దత్తశరణంమమ ॥

(భావము : గురు సేవ వలన సర్వము సిద్ధిస్తుందని, అట్టివానిని కలి పురుషుడేమి చేయలేడని బ్రహ్మ కలికి వివరించుట)

నామధారకుని మనస్సున స్వప్నములో కన్పించిన ఆ యోగి పుంగవుడి రూపము చెరగరాని ముద్ర వేసుకున్నది. ఆ మూర్తిని ప్రత్యక్షంగా దర్శించుకోవాలనే తపన తీవ్రమైనది. అతడు కొద్ది దూరం వెళ్ళే సరికి కృపాకరుడు, ద్వంద్వాతీతుడు అయిన ఒక యోగి స్వప్నములో దర్శనమిచ్చిన యోగి వలె ప్రత్యక్షముగా ఉన్నాడు. నామధారకునికి రోమాంచితమై కంఠం గద్గదమై, కన్నులు ఆనందభాష్పాలతో నిండాయి. అతడు ఆనంద పారవశ్యంతో "స్వామీ । సద్గురోత్తమా । నేను ఎన్నో కష్టాల్లో ఉన్నాను. మాపూర్వీకులందరూ శ్రీ నృసింహసరస్వతీ స్వామి వారి భక్తులు. వారిని ఆర్తితో ప్రార్థిస్తూ ఉంటే తమరి స్వప్న దర్శనమైనది.

స్వామీ తమరెవరు? ఎక్కడ ఉంటారు? ఏం చేస్తుంటారు?" అని అడిగి ప్రార్థించాడు.

ఆ యోగి పుంగవుడు ఇలా చెప్పాడు : "నాయనా! ఎవరి భక్తులు తప్పక భుక్తిని, ముక్తిని పొంది తీరుతారో, ఎవరిని యోగులు కూడా ధ్యానిస్తారో అట్టి సంపూర్ణ దత్తావతారం అయిన శ్రీ నృసింహ సరస్వతీ స్వామి వారి శిష్యుణ్ణి నేను. నన్ను "సిద్ధుడు" అని అంటారు. లోకకళ్యాణ నిమిత్తం నేను సంచరిస్తూంటాను."

అప్పుడు నామధారకుడు, "స్వామీ! శ్రీ నృసింహ సరస్వతీ స్వామివారి యొక్క మహిమ చాలా గొప్పదని విన్నాను నేను. మా పూర్వీకులు అందరూ కూడా వారి భక్తులే. కాని నేను కష్టాల్లో పడి ఎంత ప్రార్థించినా నన్ను ఆయన అనుగ్రహించలేదు. ఎందుకని? నాపై కోపమెందుకు? అని అడిగాడు. సిద్ధయోగి ప్రేమతో ఇలా చెప్పాడు. "నాయనా! నేను చెప్పేది శ్రద్ధగా విను. **భక్త వత్సలుడై నటువంటి సద్గురువు తన యొక్క కృపను, అన్ని జీవులపైననూ ఎల్లప్పుడూ సమానంగానే ప్రసరిస్తాడు. ఆయన్ని అంతగా సేవించినా గాని నీ కష్టాలు పోలేదంటే ఆశ్చర్యం కల్గుతున్నది. నీవు ఆయన్ను అనుమానించి ఉండాలి. అందుకే ఇన్ని కష్టాలు వచ్చాయి. నీకు గురుభక్తి ఇంకా కుదరలేదు. శ్రద్ధ లేనివాడు, విశ్వాసము లేనివాడు ఎవరి చేతా ఎన్నడూ అంగీకరింపబడడు. గురువు త్రిమూర్తుల స్వరూపము బ్రహ్మా-విష్ణు-రుద్రులు తన భక్తుని శపించిన గురువు వానిని రక్షించగలడు. కానీ, గురువే శపిస్తే వానిని రక్షించగలవారు ఎవరూ లేరు. అయినా కూడా ఆయన ఎన్నడూ ఎవరిమీదా కోపించలేదు."**

అప్పుడు నామధారకుడు "సద్గురువు త్రిమూర్తి స్వరూపమన్నారు కదా! ఆయన ఎలా అయ్యారు?" అని అడిగాడు.

అంత సిద్ధయోగి "నాయనా! మొదట పరమాత్మ అనేటటువంటి వాడు ఒక్కడే వున్నాడు. 'ఆయన నేను అనేక మౌదునుగాక' అనుకొని ఈ చరాచర విశ్వమయ్యాడు. జీవులను ఉద్ధరించటానికి ఆయనే సద్గురువుగా అవతరిస్తూ ఉంటాడు. శిష్యునికి తత్త్వజ్ఞానం కల్గించటం వలన, అజ్ఞానం నుంచి రక్షించటం వలన, సృష్టి-స్థితి-లయలకు కారణమైన త్రిమూర్తి స్వరూపమయ్యాడు" అని చెప్పాడు.

నామధారకుడు, ''స్వామీ! దేవతలు కోపించినా గురువు రక్షించగలడు" అన్నారు కదా! అది ఎలా సంభవము ? అందుకు తార్కాణమేమున్నది ? నా సందేహాన్ని తీర్చి, నామనస్సుకు స్థిరాన్ని ప్రసాదించండి" అని వేడుకున్నాడు. సిద్ధయోగి అతని తెలివికి సంతోషించి "నాయనా! నీవు బుద్ధిమంతుడవు. మంచి ప్రశ్న వేశావు. మొదట ఒక్కడుగా వున్న పరమాత్మ తాను అనేకమవ్వాలని సంకల్పించాడు. ఆ సంకల్పమే ఈ చరాచర జగత్తు. మొదట విష్ణువు నాభి నుంచి ఒక కమలము, దాని నుంచి బ్రహ్మ పుట్టారు. ఆయన విష్ణువు యొక్క ఆజ్ఞననుసరించి వేదాలలో వివరించబడిన రీతిని విశ్వాన్ని సృష్టించాడు. ఆయన మొదట బ్రహ్మ నిష్ఠులైన సనక, సనందన, సనత్కుమార సనత్సుజాతులను ఆ తర్వాత ప్రజాపతులను, ఆ తరువాత ముల్లోకాలను, సృష్టిచేశాడు. మొదట సత్యమే ఆకారము కల్గిన కృతయుగాన్ని పిల్చి, భూలోకంలో పది హేడు లక్షల ఇరవై ఎనిమిది వేల సంవత్సరాలు తన ధర్మాన్ని ప్రవర్తించమని ఆదేశించాడు. ఈ కృతయుగం యజ్ఞోపవీతము మొదలైన ఆభరణాలను ధరించి ఉంటుంది. జ్ఞానము, వైరాగ్యము ఈ కృతయుగపు లక్షణాలు.

ఆ తర్వాత, ఆయన త్రేతాయుగాన్ని పిల్చి, భూమిపై పన్నెండు లక్షల తొంభై ఆరువేల సంవత్సరాలు ధర్మాన్ని ప్రవర్తింపచేయమని ఆదేశించాడు. ఈ త్రేతాయుగం దృఢం అయిన శరీరం కల్గి, యజ్ఞసామాగ్రిని చేతిలో ధరించి ఉంటుంది. అందుకే ఈ యుగంలో అందరూ ధర్మశాస్త్రాలను ఎరిగి, యజ్ఞ యాగాదులను అనుష్టించారు.

ఆ తర్వాత, ద్వాపరయుగాన్ని పిలిచి భూమిపై ఎనిమిది లక్షల అరవై నాల్గువేల సంవత్సరాలు తన ధర్మాన్ని ప్రవర్తింపచేయమని ఆదేశించాడు. ఖడ్గము, మంచపుకోడు, ధనుర్భాణాలు ధరించి ఉంటుంది, ఈ ద్వాపర యుగం. అందుకే ఈ యుగంలో శాంతి, ఉగ్రత్వము, దయ, కాఠిన్యము మిశ్రమమై నటువంటి భావాలతో మానవుడు జీవించాడు.

అటు తర్వాత కలిపురుషుని పిలిపించాడు బ్రహ్మ. ఈ కలి పురుషుడు మలినుడు. తగువులంటే అతనికి ఎంతో ఇష్టము. 'కలి' అంటే 'తగవు' అని అర్ధము. ఇతడు తన ఎడమ చేతితో మర్మావయవాన్ని, కుడి చేతితో నాలుకను పట్టుకొని, ఆనందంతో గంతులు వేస్తూ వచ్చాడు. బ్రహ్మ అతన్ని చూసి నవ్వి అతని యొక్క వికృత చేష్టకు అర్థమేమిటని అడిగాడు. కలి "నేను మానవులందర్నీ కాముకులుగాను, నా బానిసలుగా చేసుకొని, వారు ఉత్తమ గతిని పొందకుండా చేస్తాను. అదే నా చేష్టకు అర్థమని" కలి చెప్పాడు.

అప్పుడు బ్రహ్మ 4 లక్షల 32 వేల సంవత్సరాలు భూలోకానికి వెళ్ళి, తన ధర్మాన్ని ప్రవర్తింప చేయమని ఆదేశించాడు. అప్పుడు కలి పురుషుడు భయంతో వణికి పోతూ స్వామీ నేను నిద్ర,కలహము, సోమరితనము ఇష్టపడేవాడిని, కొంగ జపం చేసే దొంగ సన్యాసులు,

స్త్రీలను మాయమాటలతో నమ్మించి మోసం చేసేవారు, నాకెంతో ఇష్టులు. ఎందరో ధర్మపరులున్న భూలోకానికి వెళ్ళి నేనెలా నా ధర్మాన్ని ప్రవర్తింప చేయగలను?" అని అడిగాడు. అప్పుడు బ్రహ్మ "ఓ కలీ! "శివకేశవులు ఒక్కరే అని తలచి, పూజించేటటువంటి వారిని, తల్లి, తండ్రి, గురువు, దైవమును, గౌరవంతో చూసేటటువంటి వారిని, భక్తితో స్వధర్మాన్ని ఆచరించేటటు వంటి వారిని నీవు ఏమీ చేయలేవు. ఇట్లుగాక, మిగతా వారందరూ నీ వశం అవుతారు. ముఖ్యంగా గురుసేవలో నిమగ్నమైనటువంటి వారిని మాత్రము నీవు ఏమీ చేయలేవు" అని అన్నాడు.

అప్పుడు కలి "గురువు గురించి ప్రత్యేకంగా చెబుతున్నారే అందుకు తార్కాణమేమి? అని అడిగాడు. **"గురువే పరబ్రహ్మ స్వరూపము. గురువు యొక్క కృపా దృష్టిచేతనే సకల విఘ్నములు నివారింపబడును.** అందుకు తార్కాణంగా ఈ కథను వినుము" అని బ్రహ్మ చెప్పెను.

పూర్వము నైమి శారణ్యంలో పైలుని కుమారుడు వేదధర్ముడు అనే ముని ఉండేవాడు. అతని వద్ద ఎందరో శిష్యులు ఉండేవారు. ఒక రోజు వేదధర్ముడు శిష్యుల యొక్క భక్తి శ్రద్ధలను, నియమనిష్ఠలను పరీక్షించగోరి, శిష్యులు అందర్నీ దగ్గరకు పిల్చి, ఈ విధంగా అన్నాడు. "నాయనలారా! పూర్వపు జన్మలో నేను చేసుకున్న పాపము తపస్సుతో నశింప చేసుకున్నాను. ఇంకా కొద్ది భాగము మిగిలిపోయింది. దానిని ఈ జన్మలోనే అనుభవింప దల్చుకున్నాను. అందుకు విధిగా పవిత్రక్షేత్రమైన కాశీకి వెళ్ళి పూర్వ జన్మ పాపములను అనుసరించి 12 సంవత్సరాలు కుష్ఠురోగిని, కుంటివాడిని, గుడ్డివాడిని అయి జీవిస్తాను. అందుకు విధిగా మీలో సంపూర్ణముగా సేవచేయగల్గిన వారు నాతో రావచ్చు" అని అన్నాడు. చాలామంది శిష్యులు గురు సేవలో ఏమి లోపం చేస్తే ఏమి ప్రమాదమో అని భయంతో

అంగీకరించలేదు. కానీ "దీపకుడు" అనే శిష్యుడు మాత్రము ముందుకు వచ్చి, "గురుదేవా! ఆ పాపాన్ని నాకు సంక్రమింప చేయండి. నేను అనుభవిస్తాను." అని చెప్పాడు. వేదధర్ముడు "నాయనా! **ఎవరి పాపాన్ని, ఎవరి కర్మలను వారే అనుభవించాలి.** పాపాన్ని అనుభవించేవారి కంటే, వారికి సేవ చేసే వారికే కష్టమెక్కువ. అందుకు ఇష్టమైతే రావచ్చు" అన్నాడు.

వేదధర్ముడు, దీపకుడు కాశీకి వెళ్లి మణికర్ణికా ఘట్టమున స్నానము చేశారు. వేదధర్ముడు చెప్పిన దాన్ననుసరించి అతనికి కుష్టుతనము, గుడ్డితనము, కుంటితనము వచ్చేసాయి.

దీపకుడు దగ్గర్లోనే, ఒక కుటీరాన్ని నిర్మించి, గురు సేవలోనే నిరంతరం నిమగ్నమయ్యాడు. తన శరీరానికి కూడా ఏమి కావలెనో పట్టించుకొనక, అంత పవిత్ర క్షేత్రంలోని దేవతలను, విశ్వనాధుని కూడా దర్శించుకోకుండా, నిరంతరం గురుసేవలోనే నిమగ్నమయ్యేవాడు. ప్రతిరోజూ గురువు గారి కుటీరాన్ని చిమ్మి, గురువుగారి శరీరమును శుభ్రంగా తుడిచి, భిక్షాన్నము కొరకు వెళ్లి, ముందుగా గురువుగార్కి అర్పించిన తర్వాతే, తాను తీసుకునేవాడు. పాపము ఎక్కువగా ఉన్నవారికి కష్టాలుతో పాటు దుష్టత్వం కల్గుతుందన్నట్లుగా, వేదధర్ముడు ప్రవర్తించేవాడు.

అతడు భిక్షకు వెళ్ళి మంచి అన్నము తెచ్చినా, కొంచెమే తెచ్చాడని విసిరి కొట్టేవాడు. ఒక్కొక్కసారి 'ఓరేయ్, నా శరీరంలో నున్న రసిని పూర్తిగా కడగటం లేదు. అందువలన ఈగలు నన్ను కుడుతున్నాయి అని చెప్పి తిట్టేవాడు, కొట్టేవాడు, కసిరేవాడు, ఒక్కొక్కసారి ప్రేమతో దగ్గరకు తీసుకొని అబ్బాయి! నీవు నా గురించి బాగా కష్టపడుతున్నావు అని అనేవాడు. మళ్ళీ అంతలోనే అకారణముగా కోపించేవాడు. అయినా దీపకుడు మాత్రం

చలించక గురుసేవ యందు నిమగ్నమై ఉండేవాడు. ఒకనాడు దీపకుడి యొక్క గురుభక్తికి మెచ్చి కాశీ విశ్వనాధుడు ప్రత్యక్షమై, ఏమి వరం కావాలో కోరుకోమన్నాడు. గురుసేవ తప్ప తనకు ఏ వరం వద్దన్నాడు. గురువు వద్దకు వెళ్ళి వర ప్రభావం వలన పాపాన్ని తగ్గించుకోవచ్చు కదా! అని అడిగాడు. అపుడు వేదధర్ముడు 'వరప్రభావం వలన ఈ జన్మలో నశింపచేసుకున్నట్లైతే వచ్చే జన్మలో అనుభవింప వలసి ఉంటుంది. నా సేవ నీ కంత కష్టమైతే నీవు వెళ్ళిపోవచ్చు' అన్నాడు. దీపకుడు కాశీవిశ్వనాధుని వద్దకు వెళ్ళి వరము వద్దని చెప్పాడు. విశ్వనాధుడు ఆశ్చర్యంతో నిర్వాణ మండపంలోని దేవతల సమక్షమునకు వెళ్ళి జరిగినదంతా విష్ణుమూర్తికి చెప్పాడు. విష్ణుమూర్తి కూడా దీపకుని గురు భక్తిని పరీక్షించుట కొరకు ప్రత్యక్షమై వరం కోరుకోమన్నాడు.

అప్పుడు దీపకుడు "వరాలు కోరి తపస్సు చేస్తున్న మహాత్ములకు దర్శనం ఇవ్వవలసిన మీరు ఏ తపస్సూ చేయని నాకు దర్శనమిచ్చారే"మని అడిగాడు. అంత విష్ణుమూర్తి 'నాయనా! **గురువే పరమేశ్వరుడని చెప్పి సేవించే శిష్యులు, పతిని సేవించేటువంటి పతివ్రతలు, నన్ను సేవించినట్లే అవుతుంది. అట్టి శిష్యోత్తములకు నేను అధీనుణ్ణి!** నీవు కాశీలోనే నివసించు. నవనిధులు నీకు పరిచారకులు అవుతాయి. అష్టసిద్ధులు నీకు సంప్రాప్తమవుతాయి" అని ఆశీర్వదించాడు. దీపకుడు మాత్రము 'నాలో నిరంతరం గురుభక్తి వృద్ధి చెందేలా అనుగ్రహించండి చాలు' అని ప్రార్థించాడు. ఈ విషయం గ్రహించిన వేదధర్ముడు రోగరహితమైన నిజరూపంతో దర్శనం ఇచ్చి 'నాయనా! నీలో గురుభక్తిని పరీక్షించుట కొరకు ఇలా మేము పాపగ్రస్తులమయ్యాము. చిరంజీవ! నీవు కాశీలోనే

నివసించు. అష్టసిద్ధులు నవనిధులు నీకు ప్రాప్తమవుతాయి. భక్తితో నీ నామస్మరణ చేసినా, ఈ కథను జ్ఞప్తికి తెచ్చుకొన్నా, భక్తులలో గురుభక్తి దృఢం అవుతుంది.” అని సంపూర్ణంగా అనుగ్రహించాడు.

నామధారకా! ఇటువంటి గురుశిష్య వృత్తాంతాలు ఎన్నో ఉన్నాయి. ఇవి చెప్పేవారి యొక్క దోషాలని, వినేవారి యొక్క పాపాలను కూడా పోగొడ్తాయి.

ఓం శ్రీదత్తాయ గురవే నమః

ఓం శ్రీపాద స్వామినే నమః **ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః**

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

(రెండవ అధ్యాయము సంపూర్ణము)

సద్గురుండు నాకు చాల మేలొనరించె
పొగడతరమె వాని భూరి మహిమ
వేలవేల కనులు విప్పార్చి చూపించె
ఎన్నో దర్శనంబులను హృదయమందూ
మరచిపోకుడు శివానందుని మంచిమాట


* * *

చంద్రనాడిలోన సమసెను రవినాడి
రెండు కలసి బ్రహ్మదండమందూ
పూర్వజన్మ సుకృత భాగ్యంబున
చింతదీరి నాకు సిద్ధికలిగె
మరచిపోకుడు శివానందుని మంచిమాట


– శ్రీ స్వామి శివానంద మహరాజ్



3 వ అధ్యాయము



శ్రీ గణేశాయ నమః



శ్రీ సరస్వత్యై నమః



శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

శ్లో. దూర్వాసశ్శాపమాశ్రుత్య యోంబరీషార్ద మవ్యయః
నానావతారధారీ శ్రీ దత్తశ్శరణం మమ ॥

(భావము : భక్తుడైన అంబరీషుని రక్షించు నిమిత్తం విష్ణుమూర్తి నానా రూపములును ధరించుటకై దుర్వాసుని శాపమును గ్రహించుట)

నామధారకుడు నమస్కరించి, "సద్గురోత్తమా! ఓ సిద్ధమునీ! నాకు ఇపుడు గురువు యొక్క యదార్థ తత్త్వం తెల్సింది. సంశయాలన్నీ తొలగిపోయాయి. ఇంతకూ తమ నివాసమెక్కడ? మీకు భోజనం ఎక్కడ లభిస్తుంద"ని అడిగాడు. సిద్ధయోగి నామధారకుని ఆశీర్వదించి" నాయనా! ఎపుడూ కూడా నేను శ్రీగురువు చెంతనే ఉంటాను. శ్రీగురుని నామస్మరణే నాకు ఆహారం. వారి యొక్క లీలలే నాకు అమృత తుల్యమైన పానీయము. ఈ శ్రీగురులీల అను గ్రంథమును నిత్యమూ పారాయణము చేస్తూంటే, లేదా శ్రవణం చేస్తుంటే భుక్తి-ముక్తి శ్రీఘ్రంగా కల్గుతాయి. పరిశుద్ధులై ఏడు రోజులలో సప్తాహ పద్ధతిలో పారాయణము లేదా శ్రవణం చేసిన వారి పాపాలు నశించి, సంతానము, ధన ధాన్యాలు, దీర్ఘాయువు, జ్ఞానము

ఎవరు కోరినది వారికి లభిస్తుంది. నిష్కాములకు ముక్తి లభిస్తుంది" అని చెప్పి తన వద్దనున్న గ్రంధాన్ని చూపించాడు. నామధారకుడు ఎంతో ఆసక్తితో ఆయన పాదాలకు నమస్కరించి, "స్వామీ! మీరు ఆ గ్రంథం గురించి చెప్తూంటే, ఎంతో దూరము నడచి దప్పికగొన్న వారికి అమృతం పోసినట్లుగా అయినది. దీనిని శ్రవణం చేయాలని అనిపిస్తున్నది. నన్ను అనుగ్రహించండి. నాకింత మేలు చేస్తున్న మీరే నా గురుదేవులు" అని వేడుకున్నాడు. సిద్ధముని సంతోషించి, వెనుక శ్రీ గురుడు పావనం చేసిన అశ్వద్ధ వృక్షం వద్దకు తీసుకువెళ్ళి, నామధారకుని తన ఎదురుగా కూర్చుండ బెట్టుకొని ఇలా చెప్పాడు : నాయనా! అజ్ఞానం వలన నీలో గురుభక్తి దృఢం కాలేదు. ఆయన్ని అనుమానించటం వల్లనే నీకిన్ని కష్టాలు వచ్చాయి. గురువుని సంపూర్ణమైనటువంటి భక్తితో సేవించగల్గినటువంటి వారికే ఆయన అనుగ్రహం కల్గుతుంది. నిజానికి గురువు తన పర అనే బేధాన్ని విడచి, అందరిపైననూ కృపాదృష్టిని సమానంగానే ప్రసరింపచేస్తాడు. నీరు ఎత్తైన ప్రాంతంలో నిలువజాలనట్లు డాంభికులకు మాత్రము ఆయన కృప లభింపదు. కల్పవృక్షము, చింతామణి కోరినవి మాత్రమే ప్రసాదిస్తాయి. కాని సద్గురువు కోరని దానిని కూడా ప్రసాదించగల సమర్థుడు. అట్టి శ్రద్ధ, భక్తి విశ్వాసములతో అందరూ ఆయనను సేవించరు. అందువలన కొందరికి ఆయన కృప లభింపదు. అప్పుడు వారు తమకు గురువు ఏమీ చేయలేదని చెప్పి నిందిస్తారు.

నామధారకుడు ఆయనకు నమస్కరించి "స్వామీ! నాకు శ్రీగురుని లీలలను వినాలని వుంది. అవి నాకు వినిపించి నన్ను కృతార్థుడను చేయండి. శ్రీ గురుడు త్రిమూర్తి స్వరూపమని మీరు అన్నారు గదా! ఆయన అలా ఎందుకవతరించారో సెలవిమ్మ"ని వేడుకున్నాడు.

సిద్ధయోగి సంతోషించి 'నాయనా! శ్రీ గురువు పట్ల ఇంత శ్రద్ధగల్గటం ఎంతో శుభసూచకం. ఇంత వరకూ కూడా శ్రీ గురుని లీలలు చెప్పమని ఇంత ఆర్తితో అడిగిన వారు లేరు. నీకు తప్పక పురుషార్థాలు సంప్రాప్తమవు తాయి. శ్రద్ధగా విను' అని చెప్పి ఇలా అన్నాడు : జగత్తుకు మూలకారణమైన భగవంతుడు మొదట అనేకం కావాలని చెప్పి సంకల్పించినపుడు బ్రహ్మ-విష్ణు-మహేశ్వరులు స్వరూపం ధరించారు. వీటిలో రజోగుణం ప్రకోపించినపుడు బ్రహ్మరూపంలో ఆశక్తే సర్వాన్ని సృష్టించింది. సత్వగుణం బలీయమై, విష్ణు రూపంలో సర్వాన్ని పాలించింది. తమోగుణం బలీయమై, శివుడై సర్వాన్ని సంహరించింది. అంతేగాని, ముగ్గురికీ బేధం లేదు.

పూర్వము సూర్య వంశానికి చెందిన అంబరీషుడనే రాజు ఒకడు ఉండేవాడు. అతడు నిష్టతో ఏకాదశవ్రతాన్ని ఆచరించేవాడు. ఒక రోజు దూర్వాస మహర్షి శిష్య, ప్రశిష్యులతో అంబరీషుని వద్దకు వచ్చాడు. ద్వాదశి ఒక్క గడియ మాత్రమే ఉందనగా వ్రత భంగం కాకుండా ఉండేందుకు, అంబరీషుడు దూర్వాసుని త్వరగా స్నానానుష్టానాలు పూర్తి చేసుకొని భోజనానికి దయచేయమని వేడుకున్నాడు. అంబరీషుడు పారాయణ సమయం మీరిపోతున్నదనే ఉద్దేశ్యంతో, కొద్ది నీరుని స్వీకరించాడు. అప్పుడు దూర్వాసుడు వచ్చి, అతిధిని అలక్ష్యం చేసాడన్న ఉద్దేశ్యంతో 'రాజా! నీవు నానా యోనులలో జన్మింతువు గాక! అని శపించాడు. అప్పుడు అంబరీషుడు హరిని ధ్యానించి వేడుకున్నాడు. హరి ప్రత్యక్షమై దూర్వాస మహర్షితో 'మహర్షీ! నీ యొక్క శాపము ఊరికేపోకూడదు. ఆ శాపాన్ని నాకు సంక్రమింపచేయండని అడిగాడు. అప్పుడు దూర్వాస మహర్షి 'హరీ, నీవు భక్తుల పాలిట కామధేనువు. సకల చరాచర ప్రపంచ సృష్టిలో

భక్తులనుద్ధరించుట కొరకై నానాయోనులలో జన్మింతువు గాక!' అని శపించాడు. ఆ శాపాన్ని అనుసరించి శ్రీ మహావిష్ణువు దశావతారములలో అవతరించెను. మరి కొన్నిటిలో గుప్తంగా ఉండి ఉత్తమ తపస్వులకు మాత్రమే దర్శనమిచ్చే అవతారం శ్రీ దత్తాత్రేయ అవతారం. ఈయనే యోగిరాజు. అత్రి అనసూయల పుత్రుడై జన్మించాడు.

ఓం శ్రీదత్తాయ గురవే నమః

ఓం శ్రీపాద స్వామినే నమః **ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః**

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః


(3వ అధ్యాయం సంపూర్ణం)

గురుని వద్ద జేరికుటిలంబులను మాని
పటు తరముగ వారి పాదయుగము
నమ్మియుండు వాడు ననవతరం బాత్మ
పదముగాంచునంచు బలుకు శృతులు

– "గురువాక్సుధారసము"

మహిమచూపిన గారడి మనిషి అనుచు
ఈర్ష్యతో చచ్చు నాస్తిక భక్తులనేమందు
పరులగొప్ప సహింపడు పాడు మనిషి
మరచిపోకుడు శివానందుని మంచిమాట


– శ్రీ స్వామి శివానంద మహరాజ్



4 వ అధ్యాయము



శ్రీ గణేశాయ నమః



శ్రీ సరస్వత్యై నమః



శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

శ్లో. అనసూయసతీ దుగ్ధస్వాదాయేవ్రతరూపతః ।
అవతార రజోయోపి శ్రీ దత్తశ్శరణం మమ ॥

(భావము : అనసూయాదేవి పాతివ్రత్యమును పరీక్షింప వచ్చిన త్రిమూర్తులు పసి బాలురుగా మారుట)

పరమ యోగీశ్వరుడైన దత్తాత్రేయుని అవతారము గురించి నామధారకునితో సిద్ధయోగి ఈ విధంగా చెబుతూ ఉన్నాడు :

పూర్వం ఒక కల్పాంత ప్రళయం తర్వాత పరమాత్మ 'నేను అనేక మౌదును గాక' అని సంకల్పించినపుడు శ్రీ మహావిష్ణువు యొక్క నాభి నుంచి కమలము, ఆ కమలము నుంచి బ్రహ్మ ఉద్భవించి, సనక, సనంద, సనత్కుమార, సనత్సుజాతులను, సప్త ప్రజాపతులను తన మానస పుత్రులుగా అవతరింపచేశాడు. ఆ తరువాత, శతరూప, మనువులను సృష్టించాడు. వారి కుమార్తె దేవహూతి కర్ధముని యొక్క భార్య అయింది. ఆమెకు కల్గిన కుమార్తెలలో అనసూయాదేవి మహాపతివ్రతగా ప్రసిద్ధికెక్కినది. ఆమె పాతివ్రత్య ప్రభావానికి భయపడి శిలలతో కూడిన

భూమి ఆమె నడుస్తూ ఉంటే మృదుత్వాన్ని అందించేది. అగ్ని కూడా ఆమె ముందు తన యొక్క వుష్ణమును మరచి చల్లదనాన్ని ఇచ్చేవాడు. దేవతలు ఏ మానవుడైనా ఆమె అనుగ్రహాన్ని పొంది తమను కూడా జయింపగలరని భయపడుతూ ఉండేవారు.

ఒక నాడు నారదమహర్షి అనసూయాదేవి పాతివ్రత్య మహిమను కీర్తిస్తూ త్రిమూర్తుల నివాసములకు వెళ్ళి, వారి భార్యలతో అనసూయాదేవి పాతివ్రత్య మహిమను కీర్తించాడు. త్రిమూర్తుల భార్యలు అసూయ చెంది, తమ భర్తలతో ఆవిడ పాతివ్రత్య మహిమను తగ్గించమని కోరారు. త్రిమూర్తులు వృద్ధ బ్రాహ్మణుల రూపంలో అత్రి మహాముని ఆశ్రమానికి ఏగి 'భవతీ, భిక్షాందేహీ!' అని అడిగారు. అనసూయా దేవి వారిని చూచి 'అయ్యలారా! అత్రి మహాముని తపస్సుకై అరణ్యములోకి వెళ్ళారు. వారు వచ్చేంతవరకూ కూర్చొని మా ఆతిథ్యాన్ని స్వీకరించండని వేడుకొన్నది. వారు 'అమ్మా! మీవారెప్పుడు వస్తారో మాకు తెలియదు. వారు వచ్చేవరూ మేము ఉండలేము. ఆకలి మమ్మల్ని బాధిస్తున్నది. భోజనం పెట్టు' అని అడిగారు. అనసూయాదేవి కుటీరంలోకి వెళ్ళి భోజనాదులు తయారుచేసి, బయటకు వచ్చి, భోజనానికి దయచేయండని వేడుకున్నది. అప్పుడు వారు 'అమ్మా! మాకు ఆతిథ్యమిస్తామని మాట ఇచ్చావు. కాని మాదొక షరతు ఉన్నది. నీవు కట్టుకున్న బట్టలు విడచి, నగ్నంగావడ్డిస్తేనే, మేము భోం చేస్తాము' అన్నారు. అప్పుడు ఆవిడ ధర్మాధర్మాల మధ్య చేజిక్కించుకోజూచిన వీరు సామాన్యులు కారని తలచి "అయ్యలారా! అలాగే వడ్డిస్తాను, దయచేయండ'ని వేడుకొన్నది. వాళ్ళకు కాళ్ళు కడుగుకొనుటకు నీళ్ళు ఇచ్చి, భోజన ఆసనములను అలంకరించి, విస్తళ్ళు వేసి, దయచేయమని వారితో చెప్పి, కుటీరములోనికి వెళ్ళి, అత్రి మహర్షి యొక్క పాదుకలతో 'స్వామీ! గృహస్థుల ఇంటికి దేహీ అని వచ్చిన వారికి చేతనైనది సమర్పించవలెనని నియమం ఉన్నది కదా! అట్లుగాక, నియమాన్ని మీరితే

గృహస్థుల యొక్క పుణ్యాన్ని ఆకలితో తిరిగి వెళ్ళిన అతిథి తీసుకుపోతాడు అనునది శాస్త్ర వాక్యము, కనుక వారు నా బిడ్డలన్న భావంతో భోజనం వడ్డిస్తాను.' అని చెప్పి మనస్సులో సంకల్పం చెప్పి, నగ్నంగా భోజనం వడ్డించుటకు వెళ్ళేసరికి, ఆ ముగ్గురూ పసిపిల్లలై, భోజనాసనాల మీదనే కేరింతలు కొడుతూ ఉన్నారు. అప్పుడు ఆవిడకు అద్భుతంగా స్తన్యం వచ్చింది. గుడ్డలను ధరించి, ముగ్గురు పసిబాలురకు పాలు ఇచ్చి మూడు ఉయ్యాల్లలో పడుకోబెట్టి, జరిగిన కథనే జోలగాపాడుతున్నది. ప్రపంచాన్ని సృష్టిచేసి అలసిపోయిన వానిలాగ బ్రహ్మదేవుడు, జగత్తుని పాలించి సోలిపోయిన వానిలా విష్ణువు, జగత్సంహార కార్యక్రమం వలన మరింత సోలిపోయిన వానిలా శివుడు, హాయిగా నిద్రపోతున్నారు. ఇంతలో అత్రి మహర్షి వచ్చి, జరిగినదంతా తెల్సుకొని, దివ్య దృష్టితో ఆ ముగ్గురూ త్రిమూర్తులని తెల్సుకొని వారిని స్తుతించాడు. అతని స్తోత్రానికి తృప్తి చెందిన త్రిమూర్తులు తమ నిజరూపాలలో దర్శనమిచ్చారు. అత్రి మహర్షి అనసూయాదేవితో "దేవీ! వీరు నీ పాతివ్రత్య మహిమను పరీక్షించవచ్చారు. నీకు నచ్చిన వరం కోరుకో" అన్నాడు. అప్పుడు అనసూయాదేవి "పాపులను ఉద్ధరించుటకు, లోకకళ్యాణార్థమై ధర్మాన్ని సంరక్షించుటకు, ఈ ముగ్గురు మూర్తులూ పుత్రులుగా జన్మించవలెనని నా కోరిక" అన్నది. అంత త్రిమూర్తులు "అమ్మా మమ్ము మేము మీకు సంపూర్ణముగా దత్తత చేసుకుంటున్నాము." అని వరాన్ని అనుగ్రహించారు.

అట్టి వర ప్రభావం వల్ల అనతికాలంలోనే అనసూయాదేవి గర్భమును ధరించి, ముగ్గురు పుత్రులను కన్నది. బ్రహ్మ అంశలో జన్మించిన బాలునికి చంద్రుడని, విష్ణు అంశతో జన్మించిన బాలునికి దత్తుడని, శివాంశతో జన్మించిన బాలునికి దూర్వాసుడని, నామకరణం చేశారు. వీరు అత్రి మహర్షి పుత్రులు గనుక ఆత్రేయులని, దత్తుడ్ని దత్తాత్రేయుడనే నామంతో వ్యవహరిస్తారు. అనతికాలంలోనే బ్రహ్మాంశతో జన్మించిన చంద్రుడు,

శివాంశతో జన్మించిన దూర్వాసుడు కూడా, తమ తమ అంశలను దత్తాత్రేయుని యందుంచి వెళ్ళిపోయిరి. దూర్వాసుడు కోపస్వభావుడై నప్పటికీ, లోక కళ్యాణార్థమై ఉపయోగపడింది ఆ కోపము. దత్తాత్రేయుడు శృతులకు కూడా అందని వాడు కావుననే, నామధారకా! అలనాటి దూర్వాస శాపం వల్లనే శ్రీ దత్తుడు శాశ్వతంగా భూమి మీద సంచరిస్తూ ఉన్నాడు. నిజానికి ఇతర అవతారాలలో తమ కార్యాలు తీరగానే వైకుంఠానికి వెళ్ళిపోయినట్టుగా ఈ దత్తావతారంలో చేయలేదు. శ్రీ రాముడు, రావణాది రాక్షస సంహారం కోసము, శ్రీ కృష్ణుడు ధర్మాన్ని పునరుద్ధరించుట కొరకు జన్మించి, ఆ కార్యాలు తీరగానే, ఆ ఇద్దరూ కూడా తమ శరీరాలను వదిలి వేశారు. కాని దత్తావతారం మాత్రం సృష్టి ఉన్నంతవరకూ కొనసాగవలసినదే. ఈ దత్తాత్రేయుడే ఆది గురువు. ప్రస్తుత కలియుగంలో ఇప్పటికి రెండుసార్లు అవతరించాడు. అజ్ఞానులకు గోచరం కాకపోయినా, ఇప్పటికీ అభీష్టాలను నెరవేరుస్తున్నాడు. కనుక, నామాధారకా! ఈ కలియుగంలో అవతరించిన ఈ రెండు అవతారముల యొక్క లీలలను శ్రద్ధతో వినేటటువంటి అవకాశం నీకు లభించింది." అని సిద్ధయోగి నామధారకునితో చెప్పాడు.

నామధారకుడు, "ఆహా! అనసూయాదేవి యొక్క పాతివ్రత్య మహిమ ఎంత గొప్పది?" అన్నాడు.

ఓం శ్రీదత్తాయ గురవే నమః

ఓం శ్రీపాద స్వామినే నమః **ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః**

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

(4వ అధ్యాయము సంపూర్ణం)



5 వ అధ్యాయము



శ్రీ గణేశాయ నమః



శ్రీ సరస్వత్యై నమః



శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

కృతే జనార్ధనో దేవో త్రేతాయాం రఘునందనః
ద్వాపరే రామకృష్ణశ్చ కలౌ శ్రీపాదవల్లభః

నామధారకుడు భక్తితో సిద్ధయోగికి నమస్కరించి "మహానుభావా! భగవంతుడు కలియుగంలో రెండుసార్లు అవతరించెనని చెప్పారు కదా! వాటిని వివరించండని" ప్రార్థించాడు. అప్పుడు సిద్ధయోగి "మంచిది నాయనా! అవి వినటం వలన నీకు ఎంత ప్రయోజనమో, చెప్పటం వలన నాకూ అంతే ప్రయోజనము. కనుక చెప్తాను శ్రద్ధగా విను." ఈ కలియుగంలో ఇప్పుడు మనం కూర్చున్న ప్రదేశానికి తూర్పు దిక్కున దూరంగా, పవిత్ర గోదావరీ సమీపంలో పిఠాపురం అనే అగ్రహారం ఉన్నది. (కాకినాడకు 18 కి.మీ. దూరంలో ఉన్నది.) పిఠాపురంలో అప్పలరాజుశర్మ, సుమతి అనే పుణ్య దంపతులు ఉండేవారు. వారు నియమ నిష్ఠలతో వైదిక కర్మలన్నీ ఆచరిస్తూ, దత్తాత్రేయ భక్తులై జీవిస్తూ ఉండేవారు. వారికి ఇద్దరు పిల్లలుండేవారు. పెద్దవాడు గ్రుడ్డివాడు, చిన్నవాడు కుంటివాడు. అంగ వికలురైన పిల్లలకు సేవ చేస్తూ, భక్తితో దత్తుని పూజిస్తూ, సత్కార్యక్రమాలు చేస్తూ జీవిస్తుండేవారు.

ఒకనాడు వారింట్లో శ్రాద్ధ కర్మను చేస్తున్నారు. యజమాని అయిన అప్పల రాజుశర్మ శ్రాద్ధ కలాపములో నిమగ్నమై ఉన్నాడు. ఆ కాలములో శ్రాద్ధ బ్రాహ్మణులు భోజనం చేసేంతవరకూ ఎవరికీ భిక్ష వేయరాదని నియమం. పరమ యోగీశ్వరుడైన దత్తాత్రేయుడు ఒక సన్యాసి వేషంలో వారి ఇంటి ముందు నిలచి 'భవతీ! భిక్షాందేహిః' అని కోరాడు. సుమతీ దేవి ఆ వచ్చిన వారు పరమ యోగీశ్వరుడైన దత్తాత్రేయుడనే భావంతో భిక్ష ఇచ్చింది. శ్రాద్ధ కలాపంలో నిమగ్నుడై ఉన్న భర్తకి ఈ సంగతి తెలియదు. నామధారకా! ఆ యోగిపుంగవుడు తన నిజరూపమైన దత్త దర్శనాన్ని అనుగ్రహించాడు. నామధారకా! ఆనాటి స్వామిని చూడటానికి వేయి కనులు చాలవు. కర్పూర కాంతి కల్గిన దేహంతో జడలు, పులితోలు ధరించి, దర్శనాన్ని ఇచ్చి, శ్రీ దత్తుడు ఆమెతో "అమ్మా! శ్రాద్ధ బ్రాహ్మణులు ఇంకా భోజనం చేయక ముందే నేను దత్తాత్రేయుడననే భావంతో భిక్ష ఇచ్చావు. నీకేమీ కావాలో కోరుకొమ్మ"ని అన్నారు. ఆవిడ 'సర్వశుభలక్షణాలు కల్గిన మీవంటి పుత్రుని పొందాలని నా ఆకాంక్ష' అని కోరినది. 'అమ్మా! నీకు వరాన్ని అనుగ్రహిస్తున్నాను. గానీ, ఆ బిడ్డ నీ చెప్పుచేతలలోనే ఉండాలని కోరుకోకూడదు. అతడు చెప్పినట్టే జరగాలి" అని అన్నారు. సుమతీదేవి దత్తప్రభువుతో "పుత్రుడు కల్గిన తర్వాత వాత్సల్యంతో వ్యామోహం ఉంటుంది కదా! అట్టి వ్యామోహాన్ని అంతరింపచేసేందుకు సమయానుకూలంగా బుద్ధిని ప్రసాదించు" అని వేడుకున్నది. శ్రీ దత్తుడు, అట్టి వరాన్ని ఆవిడకు అనుగ్రహించి వెళ్ళిపోయారు. సుమతీ దేవి భర్త దగ్గరకు వెళ్ళి స్వామీ "నేనీనాడు ఒక అపరాధం చేశాను. చేసిన అపరాధం చెబితే దోషం పోతుంది అంటాము కదా। శ్రాద్ధ బ్రాహ్మణులు భోజనం చేయకముందే మధ్యాహ్న సమయంలో ఒక సన్యాసి వచ్చి భిక్ష అడిగారు. వారు శ్రీ దత్తస్వరూపమే అని భావించి నేను భిక్ష ఇచ్చాను. తర్వాత గుప్తంగా ఉన్న తన

దత్తాత్రేయ స్వరూప దర్శనమును నాకు అనుగ్రహించారు. తనతో సమానమైన పుత్రుడు జన్మిస్తాడని వరాన్ని ఇచ్చారు" అని చెప్పింది. అప్పల రాజుశర్మ "దేవీ। నీవు చేసినది అపరాధం కాదు. దాని వలన నీకే దోషమూ అంటుకోదు. పరమ కారుణ్యమూర్తి అయిన దత్తాత్రేయుడు తాము నిత్యమూ పూజిస్తున్న భక్తుల ఇండ్లకు మధ్యాహ్నవేళ భిక్షకుని రూపంలో భిక్షకు వస్తారని శాస్త్రం చెబుతున్నది కదా! అయినా, శ్రాద్ధ బ్రాహ్మణులకు వడ్డించిన భోజనమును విష్ణువనే భావంతో మనం సమర్పిస్తాము కదా! అట్టిది, సాక్షాత్తూ విష్ణువే వచ్చి భిక్షను తీసుకున్నాడంటే మన అదృష్టమే కదా।" అన్నాడు. వారిద్దరూ శ్రీ దత్తుడు ఇచ్చిన దివ్య అనుగ్రహ దర్శనం వలన సంతృప్తి చెంది జీవించసాగారు.

కొద్ది కాలంలోనే సుమతీదేవి గర్భమును ధరించి, ఒక భాద్రపద శుద్ధచతుర్థినాడు, ఉదయం శుభ ముహూర్తంలో, కాలాతీతుడు, పుట్టుక లేని వాడు అయిన భగవంతుడునికి జన్మనిచ్చింది. జ్యోతిష్కులు శిశువు యొక్క జన్మలగ్నమును గణించి, సాక్షాత్తూ దత్తుడే వారింట వెలసెనని చెప్పిరి. ఆ శిశువు యొక్క పాదాలలో శ్రీ చక్రములను చూచి 'శ్రీపాదుడు' అని నామకరణం చేశారు. శుక్లపక్ష చంద్రునిలాగా శ్రీపాదుడు పెరిగి పెద్దవాడయ్యాడు. చిన్నతనములోనే షట్‌శాస్త్ర నిపుణులు కూడా, ఆయన వద్ద విద్యార్థులై కృతార్థులయ్యారు. ఇలా 16 సంవత్సరములు వచ్చాయి. శ్రీపాదునికి తగిన కన్యను చూసి పెండ్లి చేయాలనే ఉద్దేశ్యంతో తల్లిదండ్రులు వివాహ ప్రయత్నాలను ఆరంభించారు. ఒకనాడు శ్రీ పాదుడు తల్లిదండ్రులతో "మీరు నాకు వివాహము చేయవలదు. నేను సన్యాసం స్వీకరిస్తాను. సర్వ శుభ లక్షణములు కల్గిన కన్య నాకు సిద్ధముగా వున్నది. ఆమె పేరు "యోగశ్రీ" అని అన్నారు. తల్లిదండ్రులెంతో దుఃఖించి 'నాయనా! నీవు భగవదవతారమే కావచ్చు. మా పూర్వ జన్మ

పుణ్యములననుసరించి నీవు మా గర్భమున జన్మించావు. కాని మాకు ఉన్న పుత్రులలో ఒకడు కుంటివాడు. ఇంకొకడు గ్రుడ్డివాడు. నీవు సన్యసించి మా దగ్గర లేకుండాపోతే వారిని చూస్తూ మేమెలా బ్రతకాలి?" అని అడిగారు. అప్పుడు శ్రీపాదవల్లభుడు తన అన్నలైన కుంటివాడిని, గ్రుడ్డివాడిని దగ్గరకు తీసుకొని తన అమృతతుల్యమైన అపూర్వమైన హస్తమును వారి నెత్తియందుంచాడు. ఆ మహానుభావుని హస్త స్పర్శ వల్ల కుంటివాడు, గ్రుడ్డివాడు సంపూర్ణ ఆయురారోగ్య వంతులై, అద్భుత తేజస్సుతో ప్రకాశిస్తూ ఉన్నారు. ఈ అద్భుత సన్నివేశం చూసిన తల్లిదండ్రులకు శ్రీపాదుడు కేవలం తమ పుత్రుడని ఇంటబెట్టుకోవటం కేవలం అవివేకమని అన్పించింది. అంతే గాక పుత్రవ్యామోహం కూడా అంతరించింది. అప్పుడు సుమతీదేవి స్వామిని ఇలా ప్రార్థించింది. 'ప్రభూ నీమాయ చేత నిన్ను ఇప్పటివరకూ నా పుత్రుడని చెప్పి భ్రమించాను. అనంత కోటి బ్రహ్మాండాలు నీలోనే ఇమిడి ఉన్నాయి. నా భ్రాంతి తొలగించు' అని ప్రార్థించింది. అంత శ్రీపాదుడు తన సంపూర్ణమయిన దత్త స్వరూపాన్ని మరొక్కసారి తల్లికి దర్శనం ఇచ్చాడు. కోటి సూర్యుల కాంతితో, కోటి చంద్రుల చల్లదనంతో, సంపూర్ణం అయిన ఆ దత్త స్వరూపాన్ని చూచిన వారిని అమృతంలో ముంచివేసేలా దర్శనం అయ్యింది. అప్పుడు శ్రీపాదుడు, తల్లితో 'అమ్మా! నీవిప్పుడు దర్శించిన రూపం నిరంతరం ధ్యానిస్తూ ఉండు. త్వరలో ఈ అజ్ఞానంధకారాన్ని దాటి నీవు నా సాయుజ్యమును పొందగలవు. నీ కొడుకులిద్దరూ నూరేళ్లు సుఖంగా జీవించి, మిమ్ములను భక్తితో సేవిస్తారు. మీరు కూడా లోకమాన్యులవుతారు. ఆ సోదరులిద్దరు శ్రీపాదస్వామిని భక్తితో స్తుతిస్తూ ఉంటే 'మీరు తల్లిదండ్రులను ప్రత్యక్ష దైవాలుగా భావించి, వారిని సేవించి, తరించండి నేను సన్యసించాలి" అని వారితో చెప్పి, తల్లిదండ్రులకు ముమ్మారు ప్రదక్షిణం చేసి, సన్యాసం స్వీకరించి, పాదచారియై ద్వారక, కాశీ,

బృందావనము, మొదలగు పుణ్యక్షేత్రాలను దర్శిస్తూ, బదరీ వెళ్ళి, అటు తర్వాత గోకర్ణం చేరారు. ఇక్కడ మహాబలేశ్వర రూపంలో సాక్షాత్తు శంకరుడే నివసిస్తూంటాడు. ఈ లింగాన్ని ప్రతిష్ఠించిన వాడు గణేశుడు. ఈ క్షేత్రం సజ్జనులకు నెలవు. అందువల్లనే ఈ క్షేత్రాన్నీ, భక్తులనూ ఉద్ధరించుట కొరకు శ్రీపాదవల్లభస్వామి అక్కడకు వెళ్ళాడు" అని సిద్ధయోగి నామధారకునితో చెప్పాడు.

ఓం శ్రీదత్తాయ గురవే నమః

ఓం శ్రీపాద స్వామినే నమః **ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః**

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

(5వ అధ్యాయం సంపూర్ణం)


(4,5 అధ్యాయములు నిత్యము పారాయణము చేయువారికి దైవాంశ కలిగిన సత్ సంతానము కలుగును)

ప్రియుని ఎడబాసిన జనంబు వెర్రిగానూ
తిరుగుచుందురు పలుచోట్ల దిక్కులేక
మమ్మువిడువక ప్రియుండుండె మా ఎదురుగా
ఎవరి కొరకు నిరీక్షణ ఇంక మాకూ
మరచిపోకుడు శివానందుని మంచిమాట

– శ్రీ స్వామి శివానంద మహరాజ్

6 వ అధ్యాయము







శ్రీ గణేశాయ నమః

శ్రీ సరస్వత్యై నమః   శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

శ్లో. ప్రకాశయామాస సిద్ధముఖాత్స్థాపనమాదితః
మహాబలేశ్వరస్యైష శ్రీదత్తశ్శరణం మమ ॥

(భావము : రావణుడు శివుని మెప్పించి, ఆత్మలింగము తీసికొని, లంకకు పోవునపుడు గణపతి యుక్తితో ఆత్మలింగమును సముద్రతీరమున ప్రతిష్టించుట)

నామధారకుడు ఇలా అడిగాడు : కాశీ, బదరీ, కేదారం వంటి పుణ్యక్షేత్రాలు ఎన్నో వున్నాయి కదా. వారు గోకర్ణానికి వచ్చారని మీరు చెప్పారు. ఆ క్షేత్రం యొక్క ప్రాధాన్యతను నాకు వివరించవలసినదని ప్రార్థించాడు. దానికి సిద్ధయోగి ఈ విధంగా చెప్పాడు.

పూర్వము రావణాసురుని తల్లి 'కైకసి' కైలాసాన్ని పొందగోరి, రోజూ ఇసుకతో చేసిన శివలింగాన్ని పూజిస్తూ ఉండేది. ఒకనాడు రావణాసురుడు తల్లి పూజను చూసి, కైలాస పర్వతాన్నే తీసుకురావాలని కైలాసానికి వెళ్ళి, శివుడు ధ్యాననిమగ్నుడై ఉన్న సమయంలో కైలాస

పర్వతాన్ని భుజస్కంధాలపై ఎత్తుకున్నాడు. దేవతలందరూ ఆ దుశ్చర్యను చూసి ఆ ఆపద నుంచి రక్షించమని శివుని వేడుకున్నారు. అప్పుడు పరమశివుడు కైలాస పర్వతం క్రింద రావణాసురుడు అణిగి పోయేటట్లుగా తన ఎడమ కాలి బొటన వేలితో కైలాస పర్వతాన్ని అదిమిపట్టాడు. ప్రాణాపాయంలో పడిన రావణాసురుడు అకుంఠిత దీక్షతో తన ఉదరము నుండి ప్రేగులను బయటకులాగి, వీణగా తయారు చేసి, మృదుమధురం అయిన స్వరంతో కీర్తిస్తూ, వీణ మీటుతూ గానం చేశారు. భోళాశంకరుడైన పరమశివుడు రావణాసురుని భక్తి శ్రద్ధలకు ముగ్ధుడై రావణాసురుని వరం కోరుకొమ్మన్నాడు. రావణాసురుడు "ఓ పరమేశ్వరా నా తల్లి పూజ కొరకు కైలాసగిరిని తీసుకెళ్ళాలని అనుకొన్నాను. చతుర్ముఖుడైన బ్రహ్మ దేవుడే నా జ్యోతిష్కుడు, లక్ష్మీదేవియే నా దాసి, దేవతలందరూ నా సేవకులు, మహోజ్జ్వలమైన, సువర్ణమయమైన నా లంకానగరం వంటిది ఇంకెక్కడా లేదు. నీవు వరం ఈయదల్చుకుంటే, నా తల్లి పూజ కొరకు కైలాసగిరిని తీసుకువెళ్లే వరాన్ని అనుగ్రహించు' అన్నాడు.

పరమ శివుడు "రావణా। నాతో సమానమైన నా ఆత్మలింగాన్ని నీకు ప్రసాదిస్తాను. దీన్ని భక్తితో మూడు సంవత్సరాలు పూజిస్తే, నీవు నా అంతటి వాడవు అవుతావు" అని శివునికి ప్రతిరూపమైన ఆత్మలింగాన్ని రావణునికి ఇచ్చాడు. ఆ ఆత్మ లింగాన్ని తీసుకొని రావణుడు భక్తితో నమస్కరించి, లంకా పట్టణానికి బయలుదేరాడు. ఈ చర్యనంతా చూచిన నారదుడు దేవతల సమక్షమునకు వెళ్ళి బ్రహ్మ విష్ణువులకు ఈ విషయం అంతా చెప్పాడు. దేవతలు అందరూ శివుని వద్దకు వచ్చి, "రాక్షసరాజైన రావణునికి ఆత్మలింగాన్ని ఇవ్వటం శ్రేష్టమా? అతడు మీ అంతటి వాడవటం తగునా? అన్నారు. అప్పుడు పరమశివుడు 'అతని గానానికి

పరవశించి నా ఆత్మలింగాన్ని ఇచ్చాను. అందుకు తగిన ఉపాయమును ఆలోచించండి' అని శ్రీ మహావిష్ణువుతో అన్నాడు. అంత శ్రీ మహావిష్ణువు దుర్మార్గుల చర్యలను యుక్తితోనే అడ్డుకోవాలి అనే ఉద్దేశ్యంతో నారదుడ్ని, గణపతిని అందుకు ప్రేరేపించాడు. అప్పుడు నారదుడు రావణుడు వెళ్తున్న మార్గానికి ఎదురుగా వచ్చి 'రావణా। ఎక్కడ్నుంచి వస్తున్నావు? ఎక్కడికి వెళ్తున్నావు?' అని అడిగాడు. అంత రావణుడు "నారదా। పరమశివుని ప్రత్యక్షం చేసుకొని, ఆత్మలింగాన్ని తీసుకువెళ్తున్నాను" అన్నాడు.

నారదుడు, రావణున్ని మాటలతో ఏమార్చాలని చూచాడు. కాని రావణుడు, 'నారదా। నేను తొందరగా వెళ్ళాలి, అడ్డులే' అన్నాడు. అంత నారదుడు 'రావణా అత్యంత బ్రహ్మనిష్టాగరిష్ఠుడవు నీవు. సంధ్యాసమయం దాటిపోతున్నది. సంధ్య వార్చుకోకుండా ఎలా వెళ్తావు? అయినా నాకెందుకు నీయిష్టం' అని వెళ్ళిపోయాడు. అప్పుడు, రావణుడు ఆ బాటలో ఎవరైనా కనిపిస్తారేమోనని చూచాడు. ఒక బ్రాహ్మణ బాలుడు అక్కడ కనిపించాడు. రావణుడు ఆ బాలునివద్దకు వెళ్ళి 'ఓయీ! నీవెవరవు? ఎవరి పిల్లవాడివి?" అని అడిగాడు. "నేను ఉమాశంకరుల పుత్రుణ్ణి. నన్ను గణేశుడు అంటారు." అని గణపతి చెప్పాడు. అంత రావణుడు "నీవెవరివైతే నాకేమి? ఈ ఆత్మలింగాన్ని కొంచెంసేపు పట్టుకో. దగ్గరలో ఉన్న కొలనుకి వెళ్ళి సంధ్యవార్చుకొని వస్తాను. దానికి ప్రతిగా నీకేమి కావాలన్నా ఇస్తాను. సువర్ణమయమైన నా లంకానగరాన్ని చూపిస్తాను. నీకేది కావాలంటే అది తీసుకోవచ్చు" అని అన్నాడు. అప్పుడు గణపతి, "బాబూ। నీవు రాక్షస రాజువు. నిన్ను చూస్తుంటేనే, నాకు భయమేస్తున్నది. నీ లంకకు నేను రాను బాబూ. అయినా ఇంత బరువైన లింగాన్ని నేను అంతసేపు మోయలేను" అన్నాడు.

రావణుడు, సంధ్యాసమయం దాటుతోందన్న ఉద్దేశ్యంతో ఆత్మలింగాన్ని అతని చేతిలో పెట్టి ఇప్పుడే వస్తాను. కొంచెం సేపు పట్టుకో నాయనా" అని చెప్పి, దగ్గరలో ఉన్న కొలను వద్దకు వెళ్ళాడు. అప్పుడు గణేశుడు పెద్దగా చెబుతూ, "రావణా, నేను మూడు అంకెలు లెక్క పెడతాను. నీవు రాని పక్షంలో బరువైన శివలింగాన్ని, దీన్ని ఇక్కడే ప్రతిష్టిస్తాను' అని చెప్పి, రావణుడు వెళ్ళినదే తడవుగా ఇంత బరువైన శివలింగాన్ని నేను మోయలేను బాబూ అంటూ 1, 2, 3 అని లెక్క పెట్టి ప్రతిష్టించాడు. రావణుడు వచ్చి కోపంతో ఎంత పెకిలించుదామని చూసినా ఆ లింగము బైటికి రాలేదు. అతని బలమైన చేతుల యొక్క రాపిడికి ఆ లింగము రూపాన్ని కోల్పోయింది. అంతేగాక, అది 'ఆవు చెవి' ఆకారాన్ని పోలి ఉండటం వల్ల దాన్ని 'గోకర్ణం' అంటారు. నామ ధారకా। దానిని భూకైలాస మనవచ్చు. అక్కడ శివుడు సపరివారంగా నివసిస్తాడు. ఆ క్షేత్రంలో దేవర్షులు, రాక్షసులు, మానవులు, చివరకు పశుపక్ష్యాదులు కూడా శివుని అనుగ్రహం వల్ల తమ అభీష్టాలు పొందారు. అంతటి పవిత్రమైన క్షేత్రం ఇంకోటి లేదు. అని నామధారకునితో సిద్ధయోగి చెప్పాడు.

ఓం శ్రీదత్తాయ గురవే నమః

ఓం శ్రీపాద స్వామినే నమః **ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః**


శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

(6వ అధ్యాయం సంపూర్ణం)

7 వ అధ్యాయము



శ్రీ గణేశాయ నమః



శ్రీ సరస్వత్యై నమః



శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

శ్లో. చండల్యాపి యతోముక్తా
గోకర్ణేతత్రయోవసత్ ।
లింగతీర్థమయేత్ర్యబ్దం
శ్రీ దత్తశ్శరణం మమ ॥

(భావము: ఛండాల స్త్రీ దైవయోగము వలన గోకర్ణక్షేత్రమునకు వచ్చి శివరాత్రి పర్వదినమందు శివానుగ్రహము పొంది కైలాసమునకు వెళ్ళుట)

నామధారకుడు సిద్ధయోగికి నమస్కరించి 'స్వామి! మన దేశంలో ఎన్నో క్షేత్రాలున్నాయి కదా! ఈ క్షేత్రాన్నే ఎందుకు ఆశ్రయించారో సెలవీయండి' అని వేడుకున్నాడు. అప్పుడు సిద్ధయోగి ఇలా చెప్పాడు : నాయనా! పూర్వం ఇక్ష్వాకు వంశంలో మిత్ర సహుడు అనే పేరుగల రాజుండేవాడు. అతడు వేద మార్గతత్పరుడై, రాజ్యాన్ని ధర్మంగా పరిపాలిస్తూ ఉండేవాడు. ఒకనాడు అతడు అడవికి వెళ్ళి, క్రూరజంతువులను వేటాడుతూ ఒక రాక్షసుని చూచాడు. విషపూరితం అయిన బాణాలను అతనిపై వేశాడు.

అతడు చనిపోతూ తన తమ్ముడైన మరో రాక్షసుణ్ణి పిల్చి, ఆ రాజుపై ప్రతీకారం తీర్చుకోమని ఆదేశించాడు. ఆ రాక్షసుడు తనకున్న మాయలతో ఒక వంట బ్రాహ్మణుని రూపంలో ఆ రాజు కొలువులో చేరి సమయం కోసం ఎదురుచూస్తూ ఉన్నాడు. ఒకనాడు ఆ రాజు పితృశ్రాద్ధానికి వశిష్టాది మహర్షులను భోక్తలుగా ఆహ్వానించాడు. ఆ రాక్షసుడు అదే అనువుగా తలచి, ఆ మహర్షులకు నరమాంసాన్ని కలిపి భోజనంలో వడ్డించాడు. మహర్షులు అది తెల్సుకొని, రాజుపై కోపించి "రాజా! మాకు నిషిద్ధమైన నరమాంసాన్ని వడ్డించావు కనుక నీవు బ్రహ్మరాక్షసుడవై జీవించు" అని శపించారు. అప్పుడు ఆ రాజు తనకు తెలియని ఆ తప్పిదాన్ని గుర్తించి, అన్యాయంగా శపించిన మహర్షులపై ప్రతిశాపం ఇవ్వాలని జలాన్ని చేతిలోకి తీసుకున్నాడు. అప్పుడా రాజు భార్య మదయంతి అడ్డుపడి, గురువును శపించటం మహాపాపమని చెప్పింది. రాజు శాంతించి శాపజలాన్ని తన పాదములపైనే పోసుకున్నాడు. అందువలన 'కల్మష పాదుడు' అనే పేరును గ్రహించాడు. మదయంతి మహర్షుల పాదాలపై పడి ప్రార్థించగా వారు 12 సంవత్సరముల తర్వాత శాపం పోతుంది అని చెప్పి వెళ్ళిపోయారు.

అప్పటి నుండి ఆ రాజు బ్రహ్మరాక్షసుడై అరణ్యములో తిరుగుతూ కన్పించిన ప్రాణినెల్లా చంపి తింటూ ఉండేవాడు. ఒకనాడు ఒక బ్రాహ్మణుడు ఆ మార్గం గుండా వస్తుంటే చూచి, కల్మషపాదుడు ఆ బ్రాహ్మణుని చంపి తిన్నాడు. బ్రాహ్మణుని భార్య ఆ సంఘటనను చూసి శోకంతో '12 సంవత్సరములు తర్వాత పిశాచత్వం తొలగిపోయి, మానవరూపం వచ్చిన తరువాత నీవు భార్యా సంగమం చేస్తే నశిస్తావు. తక్షణమే మరణిస్తావు' అని శపించింది. ఒక రోజు శాపవిమోచనుడైన

రాజు తన రాజ్యంలోనికి పోయి రాణిని చూస్తూ తనకు కొత్తగా సంక్రమించిన బ్రాహ్మణ పత్ని శాపం గురించి చెప్పాడు. అందుకు రాజు దంపతులు ఎంతో దుఃఖించి, ఎన్నో పుణ్యక్షేత్రాలను దర్శిస్తూ ఒక రోజు గౌతమ మహర్షి ఆశ్రమానికి చేరుకున్నారు. అప్పుడు గౌతమ మహర్షి 'రాజా! గోకర్ణమంతటి పవిత్రం అయిన పుణ్యక్షేత్రం ఇంకొకటి లేదు. అక్కడి శిలలన్నీ కూడా శివలింగాలే. ఎంతటి శాపం అయినా గోకర్ణేశ్వరుని దర్శన స్పర్శనములతోనే విమోచనం కల్గుతుంది. నా కళ్ళతో నేను చూసిన ఒక వృత్తాంతాన్ని చెప్తాను. పూర్వం 'సౌదామిని' అనే అందమైన బ్రాహ్మణ కన్య ఒకామె ఉండేది. ఆమెకు వయస్సుమించిన భర్తతో వివాహం చేశారు. భర్త కొద్దికాలంలోనే చనిపోయాడు. ఆమెకు పిల్లలు కలుగకముందే భర్త మరణించాడు. ఆమె కామవశం చేత, ఒక కోమటివాడిని ఉంచుకొన్నది. జారత్వమెన్నడూ దాగదు కదా! త్వరలో ఈ రహస్యం బంధువులందరికీ తెల్సి వారామెను వెలివేశారు. అప్పటి నుంచి ఆమె నిర్భయంగా వైశ్యునితో జీవించనారంభించింది. ఇంతలోనే మద్యపానానికి కూడా అలవాటుపడినది. ఒక రోజు మద్యం తాగిన మైకంలో ఆవుదూడను మేక అనుకొని చంపి, తలను మాత్రం ఉంచి, శరీరమునంతా కూడా వండి వైశ్యునికి పెట్టి తనూ తిన్నది. మరునాడు ఆ ఆవుదూడతలను చూచి ఏమి చేయాలో పాలుపోక, ఆవుదూడను పులి చంపి తిని పోయిందని, అబద్ధం కూడా చెప్పింది. ఈ విధంగా కొన్నాళ్ళు జీవించి, ఆ తర్వాత చనిపోయింది. ఆ తర్వాత పూర్వజన్మలో చేసుకొన్న పాపముల ననుసరించి, ఒక పేద కుటుంబంలో పుట్టుగ్రుడ్డి, కుష్ఠురోగియై జన్మించింది. కొద్దికాలంలోనే ఆమె తల్లిదండ్రులు చనిపోయారు. ఆమెను చూచి అందరూ అసహ్యించుకొనేవారు. భిక్ష చేసుకొని ఏదో వచ్చింది మాత్రమే తింటూ

బ్రతుకుతూండేది. ఒక రోజు భిక్షకని బయలుదేరి ఊరంతా తిరిగినా భిక్ష దొరకలేదు. ఆ రోజు శివరాత్రి కనుక ఉపవాస ఉద్దేశ్యంతో జనులెవ్వరూ వంట చేసుకోలేదు. కుష్టు రోగియైన ఆమె ఆకలితో అలమటిస్తూ భిక్ష కోసం యాచిస్తూ తిరుగుతూ ఉన్నది. ఎవరో కొద్ది మారేడు దళములను ఆమె చేతిలో ఉంచారు. అవి తినటానికి పనికి రావని తలచి జారవిడ్చింది. అవన్నీ ఒక శివలింగం మీద పడ్డాయి. ఆ రోజంతా శివరాత్రి కనుక, భిక్ష ఎవ్వరూ వేయలేదు కనుక ఉపవాసం చేసిన ఫలితం కూడా ఆమెకు దక్కింది. అంతేగాక, ఆ రాత్రంతా శివనామ సంకీర్తన విన్నది. మరునాడే చనిపోయింది. ఆమెను యమలోకానికి తీసుకువెళ్ళాలని యమకింకరులు వస్తే, అదే క్షణంలో శివదూతలు అక్కడ ప్రత్యక్షమై వాళ్ళను వెళ్ళగొట్టి, ఆమెను కైలాసానికి తీసుకొని వెళ్ళారు. అసంకల్పితంగా చేసిన ఆమె వ్రతానికి ఇంత ఫలితం ఉంటే, మీరు బుద్ధిపూర్వకంగా చేసిన దానికి ఫలితం చెప్పతరమా! కనుక రాజా గోకర్ణానికి వెళ్ళి మహాబలేశ్వరుని సేవించు.

గోకర్ణమంతటి పవిత్ర పుణ్యక్షేత్రం ఇంకొకటి లేదు. మిగిలిన క్షేత్రాలు అన్నీ కూడా చంద్రుడు, నక్షత్రాలు అనుకుంటే, గోకర్ణము పాపమనే కారుచీకట్లను నశింపచేసేటటువంటి సూర్యుని వంటిది. ఆ క్షేత్ర దర్శనము వల్లే కాకుండా, స్మరణం వల్ల కూడా సర్వపాపాలు నశిస్తాయి. అక్కడ ఇంద్రాది దేవతలందరూ కూడా తపస్సు చేసి శివానుగ్రహం వల్ల సర్వ అభీష్టాలను పొందారు. అక్కడ మహాబలేశ్వరునికి బ్రహ్మ, విష్ణువు, ఇంద్రుడు, విశ్వదేవతలు, మరుద్గణాలు, సూర్యచంద్రులు, అష్టవసువులు తూర్పు ద్వారంలోను, యమధర్మరాజు, చిత్రగుప్తుడు, అగ్నిదేవుడు, ఏకాదశరుద్రులు, పితృదేవతలు, దక్షిణ ద్వారంలోను, వరుణుడు మొదలగు

దేవతలు పడమటి ద్వారంలోను, కుబేరుడు, భద్రకాళి, వాయుదేవుడు, సప్తమాతృకలు ఉత్తర ద్వారంలోను, నిలచి ఆయనను నిత్యం ఉపాసిస్తూ ఉంటారు. కశ్యపుడు, అత్రి, వశిష్టుడు, కణ్వుడు మొదలగు మునీశ్వరులు, విశ్వామిత్రుడు, జాబాలి, భరధ్వాజుడు మొదలగు మహర్షులు, సనక సనందాది బ్రహ్మ మానసపుత్రులు, నారదాది దేవర్షులు, సిద్ధులు, సాధ్యులు, యతులు కూడా నిత్యమూ గోకర్ణేశ్వరుని ఉపాసిస్తూ ఉంటారు. రావణుడు మొదలగు రాక్షసులు కూడా గోకర్ణేశ్వరుని సేవించి, వరాలను పొందారు. ఇక్కడ చేసిన తపస్సు, జపం, ధ్యానాలకు లక్ష రెట్లు ఫలితం లభిస్తుంది, అని గౌతమ మహర్షి రాజుకు క్షేత్ర మహాత్మ్యాన్ని వివరించారు. అప్పుడా రాజు గోకర్ణం వెళ్ళి, మహాబలేశ్వరుని సేవించి కొత్తగా సంక్రమించిన బ్రాహ్మణ పత్ని శాపం నుంచి విముక్తుడయ్యాడు. కనుక, ఓ నామధారకా! ఎందరో మహానుభావుల తపస్సు వల్ల ఈ గోకర్ణం పరమ పవిత్రం అయింది. గణపతి కూడా ఇక్కడ శివలింగాన్ని స్థాపించటం జరిగింది. అందుకే పరమసాధు జీవనుడైన శ్రీపాదస్వామి కూడా ఈ క్షేత్రమహాత్మ్యాన్ని పునరుద్దరించారు. ఆ తర్వాత ఆయన కృష్ణా తీరంలోని కురువపురం (రాయచూరుకు 15 కి.మీ. దూరంలో కృష్ణానదిలో ఒక ద్వీపం) వెళ్ళి అక్కడ గుప్తంగా జీవించారు.

ఓం శ్రీదత్తాయ గురవే నమః

ఓం శ్రీపాద స్వామినే నమః **ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః**

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః


(7వ అధ్యాయం సంపూర్ణం)



8 వ అధ్యాయము



శ్రీ గణేశాయ నమః



శ్రీ సరస్వత్యై నమః



శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

శ్లో. కృష్ణాద్వీపే కురుపురే కుపుత్రం జననీయతం ।
యోహిమృత్యోరపాచ్ఛీఘ్రం శ్రీదత్తశ్శరణం మమ ॥

(భా. శ్రీ పాదులవారు మందమతి అగు బాలుని విద్యావంతునిగా మార్చుట)

నామధారకుడు భక్తితో నమస్కరించి "స్వామీ! శ్రీపాదవల్లభుడు గోకర్ణంలో ఎంతకాలం ఉన్నారు? అసలు సంపూర్ణ దత్త స్వరూపమయిన ఆయన, పుణ్యక్షేత్రాలు దర్శించాల్సిన అవసరం ఏమున్నది? ఈ సందేహం నివృత్తి చేసి అటుపైన నాకు శ్రీపాదస్వామివారి లీలలను తెలియ చెప్పండి!" అన్నాడు.

అప్పుడు సిద్ధయోగి, 'నాయనా, నామధారకా! శ్రీపాదుడు గోకర్ణంలో మూడు సంవత్సరాలు నివసించారు. ఆ తర్వాత శ్రీశైలం వెళ్ళారు. అక్కడ నాలుగు నెలలు ఉండి, అక్కడ నుంచి నివృత్తి సంగమానికి వెళ్ళి, స్నానం చేసి, కురువపురం వెళ్ళారు. అక్కడ కృష్ణ, వేణి అనే నదుల సంగమం

వలన ఆ క్షేత్రం పవిత్రం అయింది. అంతేగాక, శ్రీపాదులు అక్కడ నివసించడం వలన ఇంకా లోక విఖ్యాతం అయింది ఆ ప్రదేశం. అక్కడ శ్రీపాదస్వామిని భక్తితో కొలిస్తే సర్వకామ్యములు నెరవేరుతాయి. అక్కడ నుంచి శ్రీపాదస్వామి అదృశ్యులై మరొక అవతారం ధరించారు. అయినా కానీ మరొక దేహంతో గుప్తరూపంలో అక్కడే స్థిరంగా ఉన్నారు.

శ్రీపాదవల్లభులు సాక్షాత్తూ భగవంతుడే, వారి పాదాలలో సర్వతీర్థక్షేత్రాలు ఉంటాయి. అయినప్పటికీ ఆయన పుణ్యక్షేత్రాలను దర్శించటానికి గల కారణం పుణ్యక్షేత్రాలుగానీ, పుణ్యనదులుగానీ భక్తుల యొక్క పాపాలు చిరకాలం కడిగివేయటం వల్ల, చివరికి అవి కూడా మలినం అవుతాయి. అప్పుడు అవి శ్రీపాదులు వంటి మహాత్ముల యొక్క స్పర్శ కొరకు తహతహలాడుతూ ఉంటాయి. వారి స్పర్శ తలిగిన వెంటనే పవిత్రం అవుతాయి. అందువల్లనే శ్రీపాదస్వామి క్షేత్ర సందర్శనం చేశారు.

కురువపురంలో వేద విదుడైనటువంటి ఒక బ్రాహ్మణుని యొక్క భార్య 'అంబిక' మహాపతివ్రత. పూర్వ కర్మ వలన, ఆమెకు పిల్లలెందరో పుట్టి చనిపోతూ ఉండేవారు. ఎంతో కాలమునకు ఒక పిల్లవాడు జన్మించాడు. లేక లేక కల్గిన సంతానం వలన అంబిక, ఆ పిల్ల వానిని ఎంతో గారాబంగా చూచుచున్నది. అతనికి ఉపనయనం చేయాలని తల్లిదండ్రులెంతో ప్రయత్నించారు. కానీ అతడు బుద్ధిమాంద్యం వలన, గాయత్రీ మంత్రమును అనుష్టించలేకపోయాడు. చివరికి అతడు తిండిపోతుగా, సోమరిపోతుగా తయారయ్యాడు. తండ్రి పిల్లవానిని దండన ద్వారా ప్రయోజనంలోనికి తీసుకురావాలని కొడుతూ ఉండేవాడు. అంబిక అది చూసి, వాడు లేక లేక కల్గిన పిల్లవాడు. వాడ్ని మీరు కొట్టవద్దు.

కొడితే నేను మీ ఎదుటే బావిలో దూకి ప్రాణం తీసుకుంటానన్నది. చివరికి ఆ బ్రాహ్మణుడు, పిల్లవాడు అజాగళస్తనం (మేక మెడకు ఉండే వ్యర్థమైన చన్నులు) వలే వ్యర్థుడు అని తలచి ఊరుకున్నాడు. కొన్నాళ్లకు ఆ దిగులుతోనే మరణించాడు. అంబిక ఇరుగుపొరుగు ఇళ్ళలో పాచి పనులు చేసి సోమరిపోతు అయిన కొడుకును పోషిస్తూండేది. ఊరి వారందరూ ఆ పిల్లవానిని చూచి 'ఓరీ! పండిత పుత్రా నీ బ్రతుకు వ్యర్థము. అంతటి మహాపండితుని కడుపున చెడపుట్టావు. చదువుకోలేకపోతే మంచినీళ్ళు మోసుకునైనా బ్రతకరాదా!' అని హేళన చేస్తూండేవారు. ఒక రోజు ఆ పిల్లవాడు ఆ హేళనలను భరించలేక ఆత్మహత్య చేసుకుందామనే ఉద్దేశ్యంతో పరుగు పెడ్తున్నాడు. అతని తల్లి అయిన అంబిక కూడా, వ్యర్థమైన కొడుకును చూస్తూ లోకుల పరిహాసములను తట్టుకోలేక కొడుకు వెంట పరిగెడ్తూ వున్నది. వారికి శ్రీపాదస్వామి ఎదురై "అమ్మా ఏమిటి విశేషము?" అని అడిగారు. తన వృత్తాంతము నంతా ఆవిడ తెల్పింది. అప్పుడు శ్రీపాదస్వామి అమ్మా! శివపూజలోనే జీవితం అంతా గడుపు. ఆత్మహత్య మహాపాపము. అందువలన నీవు జీవించి ఎంతటి కష్టాలనైనా ఓరిమితో భరించి, దుష్కర్మల నుంచి విముక్తులవ్వటం చాలా మంచిది. అంతేగాక వచ్చే జన్మలో నా అంతటి కుమారుని పొందగలవు' అన్నారు. అప్పుడు అంబిక 'స్వామీ శివపూజ యొక్క ప్రాశస్త్యాన్ని వివరించండని ప్రార్థించింది. అంత శ్రీ పాదస్వామి 'అమ్మా పూర్వం ఉజ్జయనీ రాజ్యాన్ని చంద్రసేనుడు అనే రాజు పాలిస్తూండేవాడు. అతని యొక్క మిత్రుడు మణిభద్రుడు, అతడు మిక్కిలి శివపూజా దురంధరుడు. శివుని యొక్క వరప్రభావం వలన చింతామణిని పొందాడు. ఆ మణి యొక్క విలువ లెక్కకు మీరినదని తెల్సుకొని, శత్రురాజులు వారిపై దండెత్తి, చేజిక్కించుకోవాలని ప్రయత్నిస్తూ

ఉండేవారు. ఒక రోజు శత్రురాజులంతా కూడా కపటంతో మణిని చేజిక్కించుకోవాలని యుద్ధసన్నద్ధులై బయలుదేరారు. ఆ సమయంలో చంద్రసేనుడు, మణిభద్రుడు శివపూజలో నిమగ్నులై ఉన్నారు. అక్కడికి దగ్గర్లోనే ఉన్న గొల్లపల్లెలో చిన్నపిల్లలు కొంతమంది ఆటలు ఆడుకుంటూ, ఆ ఆటలలోనే ఒక రాయిని శివునిగా పెట్టి పూజిస్తున్నారు. వాళ్ళ తల్లిదండ్రులు భోజన సమయమయ్యిందనే ఉద్దేశ్యంతో పిల్లలను బలవంతాన లాక్కొని వెళ్ళారు. అందులో ఒక పిల్లవాడు పూజకు విఘ్నం కల్గినందుకు ఆత్మహత్యకు కూడా సన్నద్ధమయ్యాడు. ఆ సమయంలో శివుడు ప్రత్యక్షమై, ఆ పిల్లవానికి అనుగ్రహాన్ని ప్రసాదించి, వరం కోరుకోమన్నాడు. అపుడా పిల్లవాడు పూజకు విఘ్నం కల్గినందుకు బాధపడ్తూ, తల్లి చేసిన అపరాధమును మన్నించమని వేడుకున్నాడు. శివుడు ఆ పిల్లవానికి, అతని తల్లి తెలియక చేసిన అపరాధం కనుక, అయిననూ వాళ్ళు చేసిన పూజ చూసింది కనుక, మరుజన్మలో శ్రీ కృష్ణుని తల్లి యశోదగా జన్మిస్తుందని, వరాన్ని అనుగ్రహించాడు. అప్పుడు ఆ పిల్లలు పూజ చేసేటటువంటి రాయిలో అద్భుతం అయిన తేజస్సు వెలువడి, వింతకాంతితో ప్రజ్వరిల్లసాగింది. అప్పుడే శివపూజ ముగించిన మణిభద్రుడు, చంద్రసేనుడు, ఇద్దరూ అంత ప్రకాశం ఎక్కడ నుంచి వస్తున్నదో అని చూసి, భగవంతుని అనుగ్రహం వలన వచ్చిన ప్రకాశం అని తెలుసుకొన్నారు. చంద్రసేనుడికి కీడు చేయతల్చడం మహాపాపమని, శత్రు రాజులు వెనుతిరిగి వెళ్ళిపోయారు. అపుడు చంద్రసేన, మణిభద్రులు ఆ ప్రకాశాన్నంతా చిన్న పిల్లలు చేసిన శివపూజా ఫలితం అని తలచి, ఆ పిల్లవానికి గోపాధిపత్యమును, ధనమును ఇచ్చి వెళ్ళిపోయారు. ఆ తర్వాత ఆ పిల్లవాని తల్లి యశోదగా జన్మించి విష్ణువుకు జనని అయ్యింది.

అందువలన, అమ్మా! నీవు కూడా శివపూజ చేస్తే వచ్చే జన్మలో నా అంతటి కుమారుని పొందగలవు' అని అన్నారు. అప్పుడు అంబిక 'స్వామీ! శివపూజ వలన కల్గే ఫలితం వచ్చే జన్మలో కదా! ఇప్పుడు ఇంతటి మూర్ఖబాలుని పెట్టుకొని నేను ఎన్నాళ్ళో జీవించాలి. మీరే దయచూడాలి' అని కుమారుణ్ణి శ్రీపాదస్వామి ఎదుటకు తీసుకువచ్చింది. శ్రీపాదులు ఆ బాలుని తలపై చేయి ఉంచి ఓంకారాన్ని ఉచ్చరించారు. వెంటనే ఆ బాలుడు వేద పండితుడై, వక్తయై, బృహస్పతి అంతటి జ్ఞాని అయ్యాడు.

అప్పుడు శ్రీపాదస్వామి, 'ఆమెతో అమ్మా! దుఃఖం విడచి నీ జీవిత శేషం అంతా కూడా శివపూజలో గడుపు. వచ్చే జన్మలో నా అంతటి కుమారుడు కల్గుతాడు' అని వరాన్ని ఇచ్చారు. ఆమె పరమానంద భరితురాలై పుత్రునితో తన ఊరికి వచ్చి జీవితం అంతా శివార్చనలో గడిపి తరించింది.

ఓం శ్రీదత్తాయ గురవే నమః

ఓం శ్రీపాద స్వామినే నమః **ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః**


శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

(8వ అధ్యాయం సంపూర్ణం)


శ్లో. శివేరుష్టేన గురుస్త్రాతా
గురౌరుష్టేన శంకర ః

శివుడు కోపించినా గురువు రక్షించగలడు కాని గురువు కోపిస్తే శివుడు రక్షించడు.

9 వ అధ్యాయము



శ్రీ గణేశాయ నమః



శ్రీ సరస్వత్యై నమః



శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

శ్లో. రజకాయాపిదాస్యన్యోరాజ్యం కురుపురేప్రభుః ।
తిరోభూదజ్ఞ దృష్ట్వాసః శ్రీ దత్తశ్శరణం మమ ॥

(భావము: శ్రీపాదుల వారు కురుగడ్డలో ఒక రజకుని భక్తికి మెచ్చి రాబోవు జన్మలో 'బీదర్'కు రాజు కాగలడని చెప్పుట)

సిద్ధయోగి నామధారకునితో ఇలా అన్నాడు. నాయనా! శ్రీ పాదుని రూపంలో అవతరించిన దత్తస్వామి సాక్షాత్తూ భగవంతుడు. సకల తీర్థస్వరూపుడు. సాధకులకు సన్మార్గాన్ని చూపించుటకు ప్రతీ రోజూ మూడు కాలాలలో కృష్ణానదికి వెళ్ళి స్నానము, అనుష్ఠానము, నిర్వహించుకొని, మఠానికి తిరిగి వస్తూండేవారు. **ఎవరి కృపా దృష్టి వలన భక్తులకు గంగాస్నాన ఫలితం కంటే ఎక్కువ ఫలితం లభిస్తుందో, అటువంటి స్వామికి నదీ స్నానంతో** పని ఏమున్నది?

శ్రీపాదులు ప్రతీరోజూ కృష్ణానదీ సంగమానికి స్నానమునకు వెళ్ళి వచ్చే సమయంలో ఒక చాకలి వాడు నమస్కరించుతూ ఉండేవాడు. ప్రతీ

రోజూ నమస్కరించుతూ ఉండటం వలన అతనిలో సాత్త్విక చింతన బయలుదేరి, మఠానికి వెళ్ళి, ముంగిలి ఊడ్చి, నీళ్ళు చల్లుతుండేవాడు. ఒక రోజు శ్రీపాదస్వామి నవ్వుతూ అతనితో "ఓరేయ్! నీవు రాజువై జన్మించి రాజ్యం ఏలుతావురా" అన్నారు. అతనికి ఆ మాటలు అర్థం కాలేదు. కొద్ది దినముల తర్వాత ఒక రోజు గుడ్డలు ఉతుకుటకు నది వద్దకు వెళ్ళిన అతడు, జలక్రీడకని వచ్చిన ఒక యవనరాజుని చూచి, అతని వైభోగమును చూచి ఈ రాజు ఎంతటి గొప్ప అదృష్టవంతుడో కదా! అని తలచాడు. ఇంతలో శ్రీపాదస్వామి సంగమమునకు స్నానమునకై వచ్చారు. అతడు స్వామికి నమస్కరించి, స్వామీ ఆ యవనరాజు వైభవం చూస్తుంటే ఆశ్చర్యము, ఆనందము కల్గుతున్నాయి. అతడు ఎంతటి అదృష్టవంతుడో కదా! కాని, మీస్థితియే నిజమైన స్థితి అనిపిస్తున్నది అన్నాడు. శ్రీపాదస్వామి అతనితో 'నాయనా! నీవు రాజ్యభోగాలు కావాలని కోరుకుంటున్నావు కదా! నిజం చెప్పు" అని అడిగారు. అతడు చెప్పటానికి సంశయిస్తూంటే, "నాయనా! **మనస్సులో కల్గిన సంకల్పం జరిగి తీరవల్సిందే. సంకల్పం అనుసరించి కర్మ జరుగుతుంది. ఎట్టి భావములో అట్టి సంకల్పములు, ఎట్టి సంకల్పములో అట్టి కర్మలు.** నిజం చెప్పు నీవు రాజ్యభోగాదులను ఈ జన్మలో కోరుకుంటున్నావా? లేక వచ్చే జన్మలో కావాలని కోరుకుంటున్నావా?" అన్నారు. ఆ చాకలివాడు శ్రీ పాదస్వామికి నమస్కరించి "స్వామీ! ఇప్పుడు నేను ముసలివాడను అయిపోయాను. తృప్తిగా అనుభవించలేను, వయస్సు ముదిరిపోతున్నది" అన్నాడు. శ్రీపాదస్వామి "నాయనా। వచ్చే జన్మలో యవన రాజవంశంలో వైఢూర్య నగరానికి రాజువై జన్మిస్తావు." అని ఆశీర్వదించారు. చాకలి వాడు, "స్వామీ! నేను రాజుగా జన్మించినప్పటికీ మీ కృపాదృష్టి నాకు ఉండాలి. మీ దర్శన

స్పర్శన భాగ్యము నాకు ఉండాలి” అని ప్రార్థించాడు. అంత శ్రీపాదస్వామి, “నాయనా! అప్పుడు మేము నృసింహసరస్వతి అనే సన్యాసి రూపంలో ఉంటాము. మా దర్శనం తప్పక లభిస్తుంది. ఇక నీవు వెళ్ళి రావచ్చు” అని ఒక వింతైన చిరునవ్వును అతని వైపు చూస్తూ నవ్వారు. ఆ చాకలివాడు అక్కడికక్కడే క్రిందపడి చనిపోయాడు. శ్రీపాదస్వామి ఇలాంటి లీలలను ఎన్నో చేస్తూ కురువపురంలోనే కొంతకాలం నివసించారు. ఒకప్పుడాయన మేము అంబికకు జీవితాంతం శివపూజ చేస్తే, మరుజన్మలో మావంటి పుత్రుడు కల్గుతాడని ఆశీర్వదించాను. మాతో సమానుడు మరొకడు లేడు కనుక మేమే ఆమె గర్భాన జన్మించి మా మాట నిలబెట్టుకోవాలి అని తలచారు. అటు తర్వాత ఆయన ఒక ఆశ్వీయుజ మాసం, కృష్ణ ద్వాదశి, హస్తా నక్షత్రమున శ్రీపాదవల్లభుడు కృష్ణానదిలో అంతర్హితులై, మరొక చోట మరొక రూపంలో అవతారాన్ని దాల్చారు. అయినప్పటికీ గుప్తరూపంలో ఆయన ఇక్కడే ఉన్నారని తెల్పే సంఘటనలు ఎన్నో ఉన్నాయి. భక్తిశ్రద్ధలతో కురువపురం దర్శించే వారికి ఆ స్వామి ప్రత్యక్షుడే. అందుచేతనే కురువపురం అంతటి పుణ్యక్షేత్రం అయింది.

ఓం శ్రీదత్తాయ గురవే నమః


ఓం శ్రీపాద స్వామినే నమః **ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః**

అనంత కోటి బ్రమ్మండ నాయక రాజాధి రాజ యోగి రాజ పరబ్రహ్మ శ్రీ దత్తాత్రేయ

శ్రీపాద శ్రీవల్లభ శ్రీనృసింహ సరస్వతీ మహరాజ్‌కీ జై

(9వ అధ్యాయం సంపూర్ణం)

(గురువారపు పారాయణము పూర్తి అయినది)



10 వ అధ్యాయము



శ్రీ గణేశాయ నమః



శ్రీ సరస్వత్యై నమః



శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

శ్లో. విశ్వాసఘాతినశ్చోరాన స్వభక్తఘ్నాన్నిహస్యసః ।
జీవనయామాసభక్తంసః శ్రీదత్తశ్శరణం మమ ॥

(భావము : ఒక భక్తుడు వ్యాపారములోని లాభమును తీసికొని కురుగడ్డలో అన్నసమారాధనకు బయలుదేరినప్పుడు దొంగల బారి నుంచి అతనిని శ్రీపాదులవారు జీవమును పోసి రక్షించుట)

సిద్ధయోగి చెప్పినదంతా శ్రద్ధగా వింటున్న నామధారకుడు, 'స్వామీ! శ్రీపాదవల్లభుడు కృష్ణానదిలో అంతర్ధానమై మరొక అవతారం ఎత్తారని మీరు చెప్పారు కదా! అటువంటప్పుడు, ఆయన గుప్తరూపంలో కురువపురంలోనే ఉన్నారని అన్నారు. ఈనాటికీ కూడా ప్రార్థించినటువంటి భక్తులను రక్షిస్తున్నారని అన్నారు. అదెలా సాధ్యం?' అని అడిగాడు. అప్పుడు సిద్ధయోగి ఇలా చెప్పాడు; "నాయనా! శ్రీపాదస్వామి సాక్షాత్తూ భగవంతుడే. ఆయనకు సాధ్యాసాధ్యాలులేవు. ఆయన ఏమైనా చేయగల సమర్థుడు. మొదట ఒక్కడుగా ఉన్నటువంటి ఆయన త్రిమూర్తులుగా అవతరించి

తమ కార్యక్రమాలు నిర్వర్తించుట లేదా? ఆ క్షేత్రంలోనే ఉండి, ఇప్పటికీ భక్తులను రక్షిస్తున్నారనే ఒక దివ్యలీల ఒకటి చెప్తాను విను.

కాశ్యపస గోత్రీకుడైన వల్లభేశుడు అనే బ్రాహ్మణుడు ఉండేవాడు. అతడు వ్యాపారం చేసుకొని జీవిస్తూ ఉండేవాడు. అతని కుటుంబం చాలా పెద్దది. కురువపురంలో అదృశ్యం అయిన శ్రీపాదస్వామి తనను ప్రార్థించిన భక్తులను ఇప్పటికీ రక్షిస్తున్నారని అతడు విని, శ్రీపాదస్వామికి భక్తుడయ్యాడు. అతడు ఒకసారి వ్యాపార నిమిత్తమై వేరు గ్రామాంతరం వెళ్తూ, తనకు వ్యాపారంలో మంచి లాభం వస్తే, కురువపురం వెళ్ళి 1000 మంది బ్రాహ్మణులకు భోజనం పెడతానని మ్రొక్కుకున్నాడు. అతడు అనుకున్నట్లుగానే, అతడు ఆశించిన దానికంటే ఎన్నో రెట్లు లాభం వచ్చింది. మొక్కు చెల్లించుట కొరకై డబ్బు మూటకట్టుకొని కురువపురం బయలుదేరాడు. ముగ్గురు దొంగలు అతని వద్ద ఎంతో డబ్బు ఉందని పసిగట్టి, తాము కూడా కురువపుర యాత్రీకులమని అతన్ని నమ్మించి, అతని వెంట బయలుదేరారు. ఇంతలో ఇంకొక యాత్రికుడు కూడా కలిశాడు. వారు ఒక చెట్టు క్రింద విశ్రమించిన సమయంలో, వల్లభేశుడు మంచి నిద్రావస్థలో ఉన్నప్పుడు ముగ్గురు దొంగలు అతనిపైకి దుమికి, కత్తితో అతని తలను నరికి, అతనివద్ద ఉన్న డబ్బును స్వాధీనపర్చుకొని, అతని శవమును దహనము చేయుటకు కూడా సిద్ధపడ్డారు. కానీ వల్లభేశుడు మరణించే సమయంలో "శ్రీపాదవల్లభా" అని కేకపెట్టాడు. ఆర్తత్రాణ పరాయణుడైన శ్రీపాదవల్లభుడు ప్రత్యక్షమై త్రిశూలంతో ముగ్గురు దొంగలను పొడిచి చంపాడు. నాల్గవ వ్యక్తి శ్రీపాదుల వారి పాదములపై

పడి "ప్రభూ! నేను వీరిని దుష్టబుద్ధితో వెంబడించలేదు. సర్వసాక్షి అయిన మీరు అంతర్దృష్టితో గమనిస్తే మీకే తెలుస్తుందని వేడుకున్నాడు. అప్పుడు శ్రీపాదస్వామి వల్లభేశుని తెగి పడి ఉన్న తలను మొండానికి అతికించమని ఆ వ్యక్తితో చెప్పారు. ఆ బాటసారి ఆయన చెప్పినట్లే చేశాడు. శ్రీపాదులు తన అమృతములైన కృపా దృష్టిని తెగి పడి ఉన్న వల్లభేశుని శరీరంపై ప్రసరింపచేసి అంతర్ధానమయ్యాడు. కొద్ది క్షణాల్లోనే వల్లభేశుడు లేచి తన ప్రక్క నున్న బాటసారిని చూచి, చనిపోయిన దొంగలను, రక్తసిక్తములైన ప్రాంతమును చూచి, "వీరందరూ ఎలా మరణించారు? ఏమి జరిగిందని?" ప్రశ్నించాడు. అప్పుడు ఆ బాటసారి 'మనలను అనుసరించి వచ్చిన వీరు దొంగలే కాని యాత్రీకులు కారు. మిమ్ములని చంపి, మీ వద్ద ఉన్న డబ్బు అపహరించారు. కానీ అదేం విచిత్రమో గాని, ఒక యోగిపుంగవుడు ఇక్కడ ప్రత్యక్షమై తన చేతిలో ఉన్న శూలంతో ఆ దొంగలను చంపి మిమ్మల్ని బ్రతికించారు. ఆయన ఎవరో గాని సాక్షాత్తు పరమశివుని వలే వున్నారు. మీమీద తమ యొక్క కృపా దృష్టి సారించి, ఇప్పుడే అంతర్ధానమయ్యారు' అని చెప్పాడు. అప్పుడు వల్లభేశుడు తనను రక్షించినది, సర్వజీవ రక్షకులైన పరమ యోగీశ్వరులైన, దత్తస్వామియైన శ్రీపాదవల్లభులే అని తలచి, కురువపురం వెళ్ళి, ముందు తాను అనుకున్నట్లు 1000 మందికిగాక 4000 మందికి అన్నదానాన్ని చేసి, భక్తితో శ్రీపాద స్వామిని పూజించాడు. కనుక నామధారకా! శ్రీ నృసింహసరస్వతీస్వామి అనే పేర వేరొకచోట అవతారం ఎత్తినప్పటికీ, కురువపురంలో శ్రీపాదులు అదృశ్యంగా ఇప్పటికీ ఉన్నారనేటటువంటి లీలలు ఇంకా ఉన్నాయి. భక్తులు ఎక్కడ ఉన్నప్పటికీ శ్రీపాద స్మరణ చేస్తే

చాలు. అట్టి స్మరణకు అనుగుణం అయిన నామము ఇలా ఉన్నది. ఈనామాన్ని భక్తితో ఎవరైతే జపిస్తారో అక్కడ స్వామివారి అనుగ్రహం తప్పక ఉంటుంది.

దిగంబరా । దిగంబరా । శ్రీపాదవల్లభ దిగంబరా ॥
దిగంబరా । దిగంబరా । అవధూత చింతన దిగంబరా ॥

ఓం శ్రీదత్తాయ గురవే నమః

ఓం శ్రీపాద స్వామినే నమః **ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః**

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

(10వ అధ్యాయం సంపూర్ణం)

(ఈ అధ్యాయము నలభై రోజులు పారాయణ చేసినవారికి, దత్తస్వామి అనుగ్రహముతో ఉపద్రవ నివారణ, వ్యాపారాభివృద్ధి కలుగును.)

సూ.త్రి సత్యస్యభక్తిరేవగరీయసీ, భక్తిరేవగరీయసి

--- నారదభక్తి సూత్రములు ---

తా. భగవంతునికి నామరూపాలు లేవు. అయినను బోధనార్థము భగవంతుని పరమ, నిత్యము, సత్యము అని వచించిరి. అట్టి భగవంతునికి భక్తి చేయుటయే అనగా వానిని త్రిశుద్ధిగా ప్రేమించుటయే ఉత్తమ సాధనము.

వర్ణరహితుని నేనెట్లు వర్ణింపగల్గుదూ
చూడలేదు వాని గొప్ప నేను
ఆత్మవర్ణజాలమాతనిపై రుద్దీ రుద్దీ
పలికి పలికి లోకములు అలసిపోయె
మరచిపోకుదు శివానందుని మంచిమాట


– శ్రీ స్వామి శివానంద మహరాజ్



11 వ అధ్యాయము



శ్రీ గణేశాయ నమః



శ్రీ సరస్వత్యై నమః



శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

శ్లో. కరంజ నగరేంబాయాః ప్రదోషవ్రత సిద్ధయే ।
యో భూత్సుతోన్యహర్యాఖ్యః శ్రీదత్తశ్శరణం మమ ॥

(భావము: శని ప్రదోష పూజను ఆచరించిన అంబ అను ఆమె పవిత్ర గర్భమున, కరంజా నగరంలో శ్రీపాదులవారు తిరిగి జన్మించుట. పుట్టుట తోడనే ప్రణవముచ్చరించుట)

నామధారకుడు అత్యంత ఆసక్తితో, శ్రీపాద స్వామి మరొక అవతారం ఎత్తారని చెప్పారు కదా! ఆ రెండవ అవతార లీలా విశేషములను కూడా వివరించండి” అన్నాడు. అప్పుడు సిద్ధయోగి “పరమ యోగీశ్వరుడైన దత్తస్వామి యొక్క లీలా విశేషములన్నీ చెప్పడం ఎవరితరమూ కాదు నాయనా! ఎంత వర్ణించినా గాని అది అగాధమైన ఆ గాథలో లవలేశమే అవుతుందిగాని, అన్నీ చెప్పినట్లు కాదు సుమా! శ్రద్ధగా విను” అని చెప్పాడు.

నాయనా! శ్రీపాదస్వామి ఆదేశించినట్లే అంబిక తన జీవిత శేషమంతా శివపూజలోనే గడిపింది. ఆమె మరు జన్మలో మహారాష్ట్రలోని

కరంజా (అకోలా జిల్లా – లడకారంజా) అనే గ్రామంలో వాజసనేయ శాఖకు చెందిన ఒక సత్‌బ్రాహ్మణుని కుమార్తెగా జన్మించింది. తల్లిదండ్రులు ఆమెకు 'అంబ' అనే నామకరణం చేసినారు. ఆమెకు పూర్వ జన్మసంస్కారం వలన సౌశీల్యంతో పాటు శివభక్తి కూడా అబ్బింది. యుక్త వయస్సు రాగానే మాధవశర్మ అను బ్రాహ్మణోత్తమునకు ఇచ్చి వివాహం చేశారు. అతడు కూడా మంచి శివభక్తుడు. ప్రతీ దినము ఆ దంపతులు సంధ్యా సమయంలో శివపూజ, శనిప్రదోష పూజ, శని త్రయోదశినాడు విశేషమైన పూజ చేస్తూండేవారు. ఇలా 16 సంవత్సరములు గడిచాక అంబ గర్భవతి అయినది. నెలలు నిండిన తర్వాత మహామహిమాన్వితమైన శుభలగ్నంలో ఆమెకొక బిడ్డ కల్గాడు.

నామధారకా! ఆ పిల్లవాడు పుట్టిన వెంటనే అందరి పిల్లలవలె ఏడ్వలేదు. సరికదా స్పష్టంగా "ఓం" కారాన్ని ఉచ్చరించాడు. అది విన్నవారు ఆశ్చర్య చకితులయ్యారు. జ్యోతిష్కులు పిల్లవాని జాతకం చూసి "మాధవశర్మా! నీ భాగ్యం పండింది. ఈ శిశువు సాక్షాత్తూ భగవంతుడే. ఇతుడు సన్యాసాన్ని స్వీకరిస్తాడు. ఇతని దర్శనం చేతనే పాపులు కూడా పావనులౌతారు. ఇతనిని కన్నందువల్ల నీ జన్మ ధన్యమైంది." అని చెప్పారు. ఆ బాలుడు పుట్టిన వెంటనే ఓంకారం ఉచ్చరించిన సంగతి వాడ వాడలా ప్రాకిపోయి, అతనిని చూడటానికి జనం ఇసుక వేస్తే రాలనంతగా వచ్చారు. పిల్లవానికి దృష్టి దోషం తగలకుండా ఉండేందుకు తల్లి, ఉప్పు, మిరపకాయలు, వేపాకుతో దిష్టి తీసేది. తండ్రి రక్షాబంధనం చేయించాడు. ఆ తర్వాత, ఒక శుభ ముహూర్తంలో ఆ బిడ్డడికి 'శాలగ్రామదేవ' అను పేరు పెట్టారు. కాని ఇంట్లో అందరూ 'నరహరి' అని పిల్చుకోసాగారు.

బలహీనంగా ఉండటం వలన అంబవద్ద పిల్లవానికి చాలినన్ని పాలు లేనందువల్ల ఒకదాదిని గాని, పాడి మేకను గాని ఏర్పాటు చేయాలని ఆ దంపతులు ఆలోచిస్తూ ఉండగా, ఆ బిడ్డడు తన చిన్నారి చేతులతో తల్లి వక్షస్థలాన్ని స్పృశించాడు. ఆశ్చర్యంగా ఆమెకు స్తన్యం పెల్లుబికి, 32 ధారలుగా కారి నేలపై పడ్డాయి. ఈ విషయం జనులందరికీ తెలిస్తే బిడ్డకు దృష్టి దోషం తగులుతుందని అంబ ఈ లీలను రహస్యంగా ఉంచింది. అంతేగాక, ఆయన అవతారమూర్తి అని ముందే సూచించుటకు గాను ఆ బిడ్డడు ఊయలలో పడుకోబెడితే ఏడ్చేవాడు. నేలపై పడుకోబెడితే నవ్వేవాడు. ఇలాంటి లీలలు ఎన్నో జరిగినప్పటికీ అంబ వీటిని ప్రకటించలేదు. అందువలన ఆ ప్రభువు యొక్క సంపూర్ణ దివ్యత్వం అందరికీ తెలియలేదు.

ఇలా సంవత్సరం గడచినా గానీ అతనికి ఒక్కమాట రాలేదు. కుల దేవతలను ఆరాధించమని చెప్పి కొందరు, మర్రి ఆకుల విస్తళ్ళలో భోజనం పెట్టించమని మరికొందరు, రావి ఆకుల విస్తళ్ళలో భోజనం పెట్టించమని మరికొందరు చెబుతూ వుండేవారు. ఆమె ఎవ్వరేది చేయమన్నా అదల్లా చేస్తూ ఉండేది. ఎన్ని విధులను ఆచరించినా పిల్లవానికి మాటలు రాలేదు. ఇలా ఆరు సంవత్సరాలు గడచిపోయాయి. కొంతమంది జ్యోతిష్కులు ఆ పిల్లవానిని చూసి ఇతడు మన మాటలు వినగల్గుతున్నాడు గనుక చెవిటివాడు గాదని స్పష్టమౌతున్నది. అయినా 'ఓం' అనటం అందరికీ సాధ్యం గాదు. బహుశా ఇతను మాటలు వచ్చి కూడా ఎందుకో మాట్లాడటం లేదు" అనేవారు. నరహరి వారిని దగ్గరకు పిలచి ఆ ప్రక్కనే వున్న ఒక ఇనుప వస్తువును తెప్పించి చేతితో తాకాడు. మరుక్షణమే అది బంగారంగా మార్చాడు. ఆ లీలలు చూచి తల్లిదండ్రులు ఆ పిల్లవాడు

తమ బిడ్డకాదని, ఆ జన్మసిద్ధుడని తలచారు. అయినా, అతను మాట్లాడకపోవడం గురించి దిగులుపడ్తూ వుండేవారు. తల్లి ఒక రోజున అతన్ని అక్కున చేర్చుకొని 'ఓ నాకన్నతండ్రీ! నీ మాటలు విని ఆనందించే భాగ్యం మాకు లేదా?' అన్నది. నరహరి ఆ మాటలకు నవ్వి తనకు ఉపనయనం చేస్తే మాట్లాడతానని మొట్టమొదటిగా తల్లితోనే మాట్లాడతానని సైగల ద్వారా చెప్పాడు.

ఈ సంగతి విని మాధవశర్మ ఆశ్చర్యపడి ఒక శుభముహూర్తాన్ని నిర్ణయించి, ఊరివారినందర్నీ ఆ ఉపనయన కార్యక్రమానికి ఆహ్వానించాడు. కొందరు పెద్దలు మాత్రము, ఆ పిల్లవాడు గాయత్రీ మంత్రం ఉచ్ఛరించితే మనకేమి? లేకపోతే మనకేమి? మనకు మాత్రం దక్షిణ తాంబూలాలు ముడతాయి కనుక, ఆ కార్యక్రమాన్ని జరుపుకోనివ్వండి' అన్నారు. ఆ శుభ ముహూర్తం రానే వచ్చింది. ఉపనయనానికి మాధవశర్మ ఇంట అందరూ చేరారు.

నరహరి ముండనము, మాతృభోజనం అయ్యాక, జింక చర్మము, పసుపు వస్త్రం ధరించాడు. చెవిలో గాయత్రీ మంత్రం ఉపదేశించినపుడు నరహరి ఆ మంత్రాన్ని మనస్సులోనే జపించి దీక్ష తీసుకున్నాడు. ఆ తర్వాత అతడు తల్లికి నమస్కరించి, ఆమెను "భవతీ! భిక్షాం దేహీ" అని తల్లికి తానిచ్చిన మాటను నిలబెట్టుకున్నాడు. తల్లి మొదటిసారి భిక్ష ఇచ్చి 'ఋగ్వేదం పఠించు' ఆచారం పాటించు' అనగానే, నరహరి "అగ్నిమీళే పురోహితం" అంటూ ఋగ్వేదంలోని మొదటి మంత్రాన్ని గానం చేశాడు. అంబ, రెండవ భిక్ష ఇచ్చి 'యజుర్వేదం పఠించు, ఆచారం పాటించు" అనగానే, నరహరి "ఇషేత్వా" అని ప్రారంభించి యజుర్వేదం లోని మొదటి మంత్రాన్ని గానం చేశాడు.

అంబ మూడవసారి భిక్ష ఇచ్చి, 'సామవేదం పఠించు, ఆచారం పాటించు' అనగానే, "అగ్ని ఆయాహి" అని సామవేదంలోని మొదటి మంత్రాన్ని ఉచ్ఛరించాడు. అది వినగానే సభలోని వారి ఆశ్చర్యానికి, తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేవు. జీవితంలో మొట్టమొదటిసారిగా మాట్లాడటం ప్రణవోచ్చారణ, ఆ తర్వాత వేద పఠనంతో గానీ చేయకూడదని, నరహరి అంతకాలం మాట్లాడలేదని, అందరూ అనుకున్నారు. మూడు భిక్షలూ అయ్యాక ఆయన నాల్గవ వేదమును కూడా చదివాడు. ఆయన భగవదవతారమని తెల్సుకొని, అచట బ్రాహ్మణులంతా నమస్కరించారు. సర్వ శాస్త్రాలకు జన్మస్థానం అయిన ప్రభువుకు ఇది లెక్కలోనిది కాదు కదా!

క్రతువు పూర్తి కావచ్చింది. మాధవ శర్మ దంపతులు అమితోత్సాహంతో ఉన్నారు. తల్లి అతన్ని ఆశీర్వదించి 'నాయనా! ఇక నుంచి నీవు భిక్షతోనే జీవించాలి సుమా! అని అన్నది. వెంటనే ఆయన తల్లికి నమస్కరించి 'అమ్మా' మీ ఆజ్ఞ మేరకు నేను భిక్షువు నవుతాను. నేను సన్యాసాశ్రమం స్వీకరిస్తాను. నాకు అనుమతి ఇవ్వండి' అని అన్నాడు. అప్పుడు అతని మాటలకు ఆ తల్లి నివ్వెరపోయి దుఃఖిస్తూ 'నాయనా! ఒక్కగానొక్క మొగబిడ్డవు నీవు. 16 సంవత్సరములు ఎన్నో పూజలు చేశాక, నీవు పుట్టావు. అయినా ఏడు సంవత్సరాలు మాట్లాడనే లేదు. ఇప్పుడే మొదటిసారిగా నీ మాటలు వినగల్గుతున్నాము. నీవు ఇల్లు విడిచిపోతే, నాగతేమిటి? నీవు కూడ పెండ్లి చేసుకొని, గృహస్థాశ్రమం స్వీకరించాక, బిడ్డలు కల్గాక, సన్యసించవచ్చు కదా!" అని బ్రతిమిలాడింది. అప్పుడాయన తల్లిని ఓదార్చి 'అమ్మా! వ్యర్థమైన దుఃఖాన్ని తొలగించుకో. నేను ధర్మరక్షణ కొరకు అవతరించాను. నీకు ఇంకానల్గురు బిడ్డలు పుట్టి నీ సేవ చేస్తారు.

నీవు నిష్టతో శంకరుణ్ణి పూజించుట వల్లనే నేను నీ గర్భాన జన్మించాను.' అని చెప్పి, ఆమె శిరస్సుపై చేయి వుంచి, శ్రీపాదవల్లభునిగా దర్శనమును ప్రసాదించారు. ఆమె ఆనందంతో పరవశించి, నరహరి పాదములపై పడి, 'ప్రభూ! వెనుకటి జన్మలో ఆత్మాహుతికి పాల్పడినపుడు రక్షించిన శ్రీపాదుడు నీవేను. అట్టి నీవు నా గర్భమున జన్మించుట వలన నా భర్త వంశము, పితృ వంశము పావనం అయ్యాయి" అన్నది. అతడామెను లేవదీసి 'అమ్మా! ఈ పూర్వ వృత్తాంతాన్ని ఎవ్వరికీ వెల్లడి చేయవద్దు. నీకో రహస్యాన్ని చెప్తాను విను. నేను సంసారం అంటని సన్యాసిని. నేను చేయవలసిన తీర్థాటనము, క్షేత్ర సందర్శనం ఎన్నో వున్నాయి. అవి నేను ప్రకటించవీలు పడదు. కనుక నాకు అనుమతిని ప్రసాదించు' అన్నాడు.

ఓం శ్రీదత్తాయ గురవే నమః

ఓం శ్రీపాద స్వామినే నమః **ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః**

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

(11వ అధ్యాయం సంపూర్ణం)

ధన్యామాతా పితా ధన్యోగోత్రం ధన్యంకులోద్భవః ।
ధన్యాచవసుధాదేవి యత్రస్యాద్గురు భక్తతా ॥

– గురుగీత –


ఎవనియందు గురుభక్తి యుండునో, అతని తల్లి ధన్యురాలు. తండ్రి ధన్యుడు. గోత్రము ధన్యము. అట్టివాని కులములో పుట్టుట ధన్యము. పార్వతీ అతని జన్మభూమి కూడ ధన్యమైనది.



12 వ అధ్యాయము



శ్రీ గణేశాయ నమః



శ్రీ సరస్వత్యై నమః



శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

శ్లో. మూకోభూత్వావ్రతాత్పశ్చాత్
వదన్వేదాన్స్వమాతరం ।
ప్రవ్రజన్ బోధయామాస
శ్రీ దత్తశ్శరణం మమ ॥

(భావము: ఉపనయనకాలము వరకు "ఓం" కార ముచ్చరించి, ఉపనయన కాలమందు వేదములను పఠించి, తల్లికి ఆత్మజ్ఞానమును ఉపదేశించి, శ్రీపాదుల రూపమును తల్లికి చూపి, సన్యాస ఆశ్రమ స్వీకారము చేయుట)

సిద్ధయోగి ఇంకా ఇలా చెప్పాడు : అప్పుడా తల్లి పుత్రవాత్సల్యంతో నరహరితో 'నాయనా! నీవు లోకానికి ధర్మం చెప్తావు కదా! మరి నీవుకూడా 12 సంవత్సరాలు బ్రహ్మచర్యత్వాన్ని అవలంభించి, ఆ తర్వాత గృహస్థువై, బిడ్డలు కల్గాక సన్యసించవచ్చు కదా ! ఇలా కాక, తొందరపడి సన్యసిస్తే వాసనా క్షయం అవ్వకుండా మానవులు పతితులౌతారని శాస్త్రము

చెబుతున్నది కదా" అని బ్రతిమలాడింది. అప్పుడు వటువైన నరహరి, ఆమెకు తత్త్వమును ఈ విధంగా బోధించాడు. "అమ్మా! భౌతికమైన శరీరం, వైభవం ఆశాశ్వతములు. మరణం లేని వాడంటూ ప్రపంచంలో ఎవడూ లేడు. మృత్యు దేవత ప్రతీ మానవుని జీవితాన్ని అంటియే ఉంటుంది. రాత్రి-పగలు మానవుని శరీర ఆయుర్ధాయాన్ని ఎగరగొట్టు కొని పోతూంటాయి. ఈ శరీరము, భార్య-బిడ్డలు శాశ్వతమని తలిచేవారు మూర్ఖులవంటివారు. అలా కాక మృత్యువును జయించిన వారు మాత్రమే, నీవు చెప్పినట్లు జీవించవచ్చు. నేను ధర్మ రక్షణ కొరకై అవతరించాను. నాకు విషయ వాసనలు లేవు కనుక, నేను సన్యాసాన్ని స్వీకరిస్తాను. నన్ను ధ్యానిస్తూ ఉండు. నీవు సంసారమును దాటగలవు" అని తన యొక్క దివ్య స్వరూపాన్ని మరొక్కసారి దర్శింప చేశారు. ఆమె ఆ మూర్తిని కన్నులారా దర్శించి 'స్వామీ! మాయా మోహితురాలైనటువంటి నేను, నీవు నా బిడ్డవనే భావంతో ఇంట కట్టిపెట్టుకోవటం తగదు. బ్రహ్మాండాలన్నీ నీలోనే వున్నాయి. సకల చరాచర ప్రపంచ సృష్టికి నాధుడవు నీవేను. నాకు ఇంకా పుత్రులు కల్గుతారని అన్నావు కదా! నాకింకా ఒక్క బిడ్డ పుట్టేవరకైనా నీవు ఉండు. అప్పటి వరకూ సన్యసించటానికి మాత్రం నేను అనుమతించను. నీవు నామాట వినకుండా వెళ్లిపోతే నేను మరణిస్తాను. నిన్ను విడచి నేను బ్రతకలేను" అని ప్రార్థించింది. అప్పుడు నరహరి, "అమ్మా! నీకు సంవత్సరం లోగా కవలలు పుడతారు. అంత వరకూ ఉంటాను గానీ, ఆ తర్వాత నాకు అడ్డు చెప్పకూడదు" అని ఆమె వద్ద మాట తీసుకున్నాడు.

అతడు పరమేశ్వరుడన్న జ్ఞానంతో, ఆ దంపతులు అతన్ని నిత్యమూ పూజిస్తూ ఉండేవారు. చతుర్వేద పారంగతులు, షట్‌శాస్త్ర నిపుణులు కూడా

ఆయన వద్ద విద్యార్థులై కృతార్థులయ్యారు. ఇలా సంవత్సరం గడిచేసరికి అంబకు ఇద్దరు మగపిల్లలు కల్గారు. ఒక రోజు, అంబ పిల్లలను ఆడిస్తూ ఉంటే నరహరి తల్లివద్దకు వచ్చి "అమ్మా! నీ విచ్చిన మాట నిలుపుకో, నేను చెప్పినట్లు నీ కిద్దరు పిల్లలు కల్గారు. నీ కింకా ఒక కొడుకు, కూతురు కల్గుతారు. నేను తీర్థయాత్రలకు బయలుదేరుతాను. నన్ను మాత్రము సంతోషంగా సాగనంపాలి" అన్నారు. అప్పుడు అంబ "స్వామీ! నీవు మా రక్తమాంసాలు పంచుకొని పుట్టటం వలన మా దేహాలు కూడా పవిత్రం అయ్యాయి. నీవు మా బిడ్డవనే భ్రాంతితో ఎప్పుడైనా నిష్టూరములాడి ఉంటే మమ్ములను క్షమించు. ఇక ముందు మా గతి ఏమిటి?" అన్నది. అంత నరహరి "అమ్మా మీకు మరుజన్మ ఉండదు. మీకు నన్ను చూడాలని అనిపిస్తే స్మరిస్తే తక్షణమే నా దర్శనం కల్గుతుంది. నేను మరల 30 సం॥ల తర్వాత మీ వద్దకు వస్తాను" అని చెప్పాడు. అతను తల్లిదండ్రులకు నమస్కరించి, అనుమతి తీసుకొని, కాషాయాంబరములు ధరించి, చేత దండమును ధరించి మహా సంతోషంగా బయలుదేరాడు. ఆ ఊరి జనమంతా ఆయన అవతారమూర్తి అనే భావంతో నమస్కరించారు. ఆయనకు వీడ్కోలు చెప్పడానికి గ్రామస్తులు, తల్లిదండ్రులు బయలుదేరారు. గ్రామస్తులు కొంత దూరం వెళ్ళారు. నరహరి తన సంపూర్ణ దత్తాత్రేయ స్వరూపమును వారికి కన్నుల పండుగగా మరొక్కసారి దర్శింప చేశారు. నరహరి వారితో మళ్ళీ దర్శనమిస్తానని మాట ఇచ్చి, వాళ్ళని వెనుకకు పంపి, బదరీనాథ్ దిక్కుగా బయలుదేరి, ప్రాణవాయువును కుంభించి ఖేచరీ ముద్రలో నాదానుసంధానపరులై కూర్చున్నారు. ఆయన నిత్యమూ కూడా మూడు వేళలా మణికర్ణికా ఘట్టానికి వెళ్ళి గంగాస్నానం చేసి వస్తూ ఉండేవారు. ఆ క్షేత్రంలో ఉండే మునులు, సాధువులు ఆయన్ను

చూసి ఆశ్చర్య చకితులైనారు. యవ్వనం కూడా పూర్తిగా రాకముందే అంతటి వైరాగ్యము, కఠోరం అయిన ఆయన తపస్సును చూసి ఆయన యోగపూర్ణుడని భక్తితో నమస్కరిస్తుండేవారు. అచ్చట సన్యాసులలో వృద్ధుడైన శ్రీకృష్ణ సరస్వతీ స్వామి ఆయనకు భక్తితో నమస్కరిస్తూండేవారు. ఆయన సాక్షాత్తూ అవతార పురుషుడని, వయస్సులో చిన్నవారైనా, జ్ఞానంలో వృద్ధులు కనుక భక్తితో అందరూ నమస్కరించవచ్చని ఆయన అందర్కీ చెబుతుండేవారు. ఒకసారి కృష్ణ సరస్వతీ స్వామి వారి శిష్యులు, నరహరి వద్దకు వచ్చి నమస్కరించి "స్వామీ! మీరు ధర్మాన్ని ఉద్ధరించుటకై భూమిపై అవతరించారు. శ్రీ ఆదిశంకరాచార్యులు స్థాపించిన సన్యాస మార్గము దాదాపు మరుగున పడింది. దానిని మరల మీరే విస్తరింప చేయాలి. సన్యాసులమైన మేము, ఇప్పుడు మీకు సేవ చేస్తే లోకనింద యేర్పడుతుంది." అని ప్రార్థించారు. అంత నరహరి వారి ప్రార్థన స్వీకరించి, శ్రీకృష్ణ సరస్వతీ స్వామిని గురువుగా స్వీకరించి, వారి వద్ద సన్యాసాశ్రమ స్వీకారం చేశారు. అప్పుడు గురువు ఇచ్చిన నామం "శ్రీనృసింహ సరస్వతి". ఆ తర్వాత ఆయన కొంతకాలం కాశీ పట్టణంలోనే ఉండి, భక్తులకు నాలుగు పురుషార్థాలను ప్రసాదించారు.

అంతవరకూ గురు కథను శ్రద్ధగా వింటున్న నామధారకుడు "స్వామీ నాకొక సందేహం కల్గుతోంది. విశ్వగురువైన శ్రీ గురునికి ఇంకొకరు గురువు ఎలా కాగలరు? గురువును ఆశ్రయించి ఆయన సాధింప వలసినది ఏమున్నది?" అని అడిగాడు. అప్పుడు సిద్ధయోగి ఇలా చెప్పారు.

నాయనా! పూర్వము శ్రీరామచంద్రుడు వశిష్ట మహర్షిని, శ్రీ కృష్ణుడు సాందీప మహర్షిని గురువులుగ వరించినట్లే, ఈ శ్రీ గురుడు కూడా కృష్ణ

సరస్వతీ స్వామిని గురువుగా ఎన్నుకొన్నారు. **ఈ గురు సాంప్రదాయం ఈ కాలము నాటిది కాదు. సకల సృష్టికి గురువు శివుడు. ఆయన శిష్యుడు విష్ణువు. విష్ణువు శిష్యుడు బ్రహ్మదేవుడు. బ్రహ్మ శిష్యుడు వశిష్టుడు. శక్తి–పరాశరుడు – వ్యాసుడు – శుకుడు – గౌడపాదుడు – గోవిందభగవత్ పాదాచార్యులు – శంకర భగవత్‌పాదులు – విశ్వరూపుడు – బోధజ్ఞానగిరి – సింహగిరి – ఈశ్వర తీర్థుడు – నృసింహతీర్థుడు – విద్యారణ్యుడు – మలయానందుడు – దేవతీర్థుడు – యాదవేంద్ర సరస్వతి – కృష్ణ సరస్వతి. ఈ కృష్ణ సరస్వతీ స్వామియే ఈ నృసింహసరస్వతీ స్వామి వారి గురువు.**

ఆ తర్వాత శ్రీగురుడు అనేక పుణ్యతీర్థాలను దర్శిస్తూ, బదరికాశ్రమాన్ని చేరారు. మేరు పర్వతానికి ప్రదక్షిణంగా సంచరిస్తూ, సర్వక్షేత్రాలను దర్శిస్తూ పుణ్య తీర్థాలలో స్నానం చేస్తూ, శిష్యులతో కలసి గంగాసాగర సంగమం చేరారు. ఆయన మొదట గంగకు ప్రదక్షిణంగా ప్రయాగ వరకు తటాక యాత్ర చేసారు. అది కూడా గంగా ప్రదక్షిణంతో సమానమే. అందుకే ప్రయాగను కూడా గంగాసాగరం అంటారు. ప్రయాగలో ఆయనకు ఎంతోమంది శిష్యులు అయ్యారు. 'మాధవుడు' అనే బ్రాహ్మణునికి శ్రీ గురుడే స్వయంగా తత్త్వమును ఉపదేశించి, సన్యాసం ఇచ్చారు.

ఓం శ్రీదత్తాయ గురవే నమః

ఓం శ్రీపాద స్వామినే నమః **ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః**


శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

(12వ అధ్యాయం సంపూర్ణం)

13 వ అధ్యాయము



శ్రీ గణేశాయ నమః





శ్రీ సరస్వత్యై నమః   శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

శ్లో. భూమిం ప్రదక్షిణీకృత్య సశిష్యో వీక్ష్య మాతరం ।
జహార ద్విజ శూలార్తిం శ్రీదత్తశ్శరణం మమ ॥

(భావము : నరహరి సన్యాసాశ్రమమును స్వీకరించి, శిష్య సమేతముగా తీర్థయాత్రలు చేస్తూ జన్మస్థానమునకు వెళ్ళి, అచ్చట ఎన్నో రూపాలలో ఒకే సమయంలో అందరి భిక్షలను స్వీకరించి జనులను ఆశ్చర్యపరచి, గౌతమీ యాత్ర చేస్తూ, ఉదరశూల రోగికి మృష్టాన్నమును తినిపించి, అతని రోగబాధ మాయం చేయుట)

(ఈ పై శ్లోకమును చదివి, క్రింది అధ్యాయమును నిత్యం పారాయణ చేస్తూ, 108 రోజులు ఇలా చేస్తే, ఎటువంటి కఠిన రోగములైన నయమగును.)

శ్రీగురుని కథను శ్రద్ధగా విని పులకరించి పోయిన నామధారకుడు సిద్ధమునికి నమస్కరించి, 'స్వామీ! ఈ గురుచరిత్ర ఎంత విన్నా తనివి తీరడం లేదు. నా పరిస్థితి లేత పచ్చికను రుచిచూచిన ఆవు వలె వున్నది.

ఎన్నో సంవత్సరములుగా ఆకలిగొని ఉన్న బీదవానికి, పాలసముద్రమే దొరికినట్లుగా ఉన్నది. ఇంతవరకు అజ్ఞానములో మునిగి ఉన్న నాకు, జ్ఞానజ్యోతి లాగా మీరు కనిపించారు. మీ ఋణం ఈ జన్మకు తీర్చుకోలేను. మీ బోధ వలన నాకు నిరంతరమూ గురు నామస్మరణ బాగా కుదురుతోంది. శ్రీగురుడు అటు తర్వాత ఎక్కడకు వెళ్ళారు? ఏమి చేశారు? ఆ లీలలను నాకు తెల్పి, నన్ను కృతార్థుడను చేయండి' అని వేడుకున్నాడు. అప్పుడు సిద్ధయోగి, నామధారకుడ్ని కౌగిలించుకొని, ఆశీర్వదించి 'నాయనా! ఇంతవరకూ గురుకథలను ఇంత శ్రద్ధగా చెప్పమని ఎవ్వరూ అడుగలేదు. నీవు ఈ కథలను శ్రద్ధతో విన్నచో భక్తి తీవ్రతరం అవుతుంది. విశ్వాసం బలపడుతుంది. శ్రీ గురుని యొక్క కృపాకటాక్షములు నీకు దొరుకుతాయి' అని మనస్ఫూర్తిగా చెప్పి, ఈ క్రింది విధంగా చెప్పాడు. శ్రీగురుడు ప్రయాగ క్షేత్రంలో కొంతకాలం ఉండి, అనేక మందికి సన్యాస దీక్షను ఇచ్చారు. స్వామి వారి యొక్క శిష్యులలో ప్రఖ్యాతి గాంచిన వారు ఏడుగురు.

1. బాల సరస్వతి
2. కృష్ణ సరస్వతి
3. ఉపేంద్ర సరస్వతి
4. మాధవ సరస్వతి
5. సదానంద సరస్వతి
6. జ్ఞానజ్యోతి సరస్వతి
7. సిద్ధ సరస్వతి (అనగా నేను)

మేము ఏడుగురుమూ స్వామికి ముఖ్య శిష్యులుగా ఉండేవారం. మా అందరి పేర్ల చివర 'సరస్వతి' అనే బిరుదు ఉంటుంది. గురుదేవులతో కలసి, మేమంతా దక్షిణ దిక్కువగా బయలుదేరి స్వామి వారి జన్మస్థానమగు కరంజా నగరమునకు వచ్చాము. స్వామి తల్లిదండ్రులు వారిని గుర్తించి పూజించిరి. స్వామి వారు చెప్పినట్లు వారి తల్లిదండ్రులకు నల్గురు పుత్రులు,

ఒక కుమార్తె కల్గిరి. నగర వాసులందరూ వచ్చి స్వామివారికి పూజ చేసి హారతులిచ్చి భిక్షకు ఆహ్వానించిరి. పరమ దయామూర్తులైన శ్రీ నృసింహసరస్వతీ స్వాములవారు, అన్ని రూపములలో అందరి ఇళ్ళకూ ఏకకాలంలో వెళ్ళి భిక్షను స్వీకరించిరి. ఈ అద్భుతమైన లీలలకు నగరవాసులందరూ ఆశ్చర్యచకితులయి భక్తితో స్వామిని సేవించిరి. తల్లిదండ్రులగు మాధవశర్మ, అంబికలకు శ్రీ గురుడు తమ ముందటి అవతారం అయిన శ్రీపాదుల రూపంలో దర్శనమిచ్చిరి. అప్పుడు తల్లి వారి పాదములకు నమస్కరించి, "సర్వేశ్వరా! మేము చేసిన ప్రదోష పూజల వలననే నీవు మా గర్భమున జన్మించావు" అని భర్త వంక చూచుచూ, "స్వామీ! పూర్వజన్మమున కుపుత్రవతియైన నేను,ఈ దేవుని ఆరాధించినందు వల్లనే వీరు మనపుత్రులైరి" అని చెప్పెను. తల్లిదండ్రులు స్వామికి మరింత భక్తితో నమస్కరించి, "యతిసార్వభౌమా! మమ్మీ సంసారం నుంచి ఉద్ధరించు" అని కోరారు. అంత శ్రీగురుడు "ఏ కులమున ఉత్తముడైన సన్యాసి జన్మిస్తాడో, ఆ కులము ధన్యము. 42 తరముల వారు ఉద్ధరింపబడెదరు. పూర్వమున నరకమున ఉన్నవారు కూడా విముక్తులౌతారు. నేను మీ కులమున జన్మించాను. కనుక మీకు బ్రహ్మపథం లభించును. మీ చివరి క్షణాలలో కాశీ పట్టణము చేరి, అచ్చట జీవించి, తరించగలరు" అని వారికి తమ అద్వీతీయ అనుగ్రహ భాషణమును అందించారు. స్వామివారి చెల్లెలైన రత్న ఆయనకు నమస్కరించి "స్వామీ! నాకీ సంసార తాపత్రయం నుంచి విముక్తి ప్రసాదించండి. నేను తపస్సు చేసుకొనుటకు నా కేదైనా మంత్రము ఉపదేశించండని" కోరింది. స్వామివారు ఆమెకేసి నవ్వుతూచూసి "అమ్మా! స్త్రీలకు తపస్సుతో పనియేమున్నది? భర్త యొక్క సేవ చేతనే స్త్రీలు ఉత్తమ

గతిని పొందగలరు. కావున భర్తనే పరమేశ్వరునిగా భావించి, సేవించి నీవు తరించగలవు" అని తిరిగి స్వామి, "అమ్మా! నీ పూర్వజన్మ పాపంతో కూడుకొని ఉన్నది. పూర్వజన్మలో నీవు ఒక ఆవును తన్నితివి. అన్యోన్యముగా ఉన్న దంపతులను విడదీశావు. ఈ రెండు దోషాల యొక్క ఫలమును నీవు అనుభవించవలెను. నీ చివర దశలో నీ భర్త నిన్ను విడచి పెడతాడు. నీకు కుష్ఠ రోగం వస్తుంది. అప్పుడు నీవు భీమ, అమరజనదీ సంగమము దగ్గర ఉన్న, "గాణ్గాపుర క్షేత్రము"నకు వెళ్ళు. అచ్చట నా దర్శనమౌతుంది. అచ్చట ఉన్న పాపవినాశ తీర్థములో స్నానం చేస్తే నీ కుష్ఠరోగం పోతుంది." అని చెప్పి, అందరినీ సమాధాన పర్చి, శిష్య సమేతంగా బయలుదేరి, గోదావరి పుట్టుక స్థానమైన 'త్రయంబకమున'కు వచ్చిరి. నామధారకా! ఇది మహాతీర్థము. పూర్వము ఋషీశ్వరులు భూమిపై ఒడ్లు చల్లి, ఏరోజు పంటను ఆ రోజు పండించుకొని తినేవారు. అప్పుడు ఋషులు అంతా కలసి గౌతమి మహర్షి ఆశ్రమానికి వచ్చి, ఆయనకొక గొప్ప సంకటమును కల్గిస్తే, మనందరి కొరకు గంగను భూమిపైకి తీసుకొని రాగలడు అని తలచి, ఒక రోజు గౌతముడు తపస్సుకు కూర్చున్న సమయంలో దర్భలతో ఒక ఆవును, దూడను తయారు చేసి ప్రాణం పోసి, గౌతముని పంట చేనుపై తోలారు. తపస్సు నుంచి లేచిన గౌతముడు అది చూచి తన దగ్గరున్న పుల్లతో వాటిని అదిలించాడు. తక్షణమే అవి మరణించాయి. గోహత్య చేసినందువలన ఆ పాపము నుంచి తప్పుకొనుట కొరకై గంగను భూమి పైకి తీసుకు రమ్మని ఋషులంతా కోరారు. అందుకుగాను గౌతముడు తపస్సు చేసి గంగను భూమిపైకి తీసుకువచ్చాడు. గౌతమునిచే తీసుకొని రాబడింది. కావున 'గౌతమి' అని, గోహత్యా పాతకము నుండి విముక్తి చేసింది కనుక, 'గోదావరి' అని ప్రసిద్ధి చెందింది.

ఇది గొప్ప పుణ్యతీర్థము. శ్రీగురుడు ఆ తీర్థమునందలి క్షేత్రములన్నీ దర్శించుకుంటూ, 'మంజరీకరము' అను గ్రామమునకు వచ్చిరి. అక్కడ మాధవారణ్యుడు అను ముని కలడు. అతడు ఒక రోజు ధ్యానమునకు కూర్చున్న సమయంలో శ్రీ నృసింహ సరస్వతీ స్వాముల వారి రూపము నరసింహావతారంలో అతనికి దర్శనమిచ్చెను. అతడు శ్రీగురుని వద్దకు వచ్చి భక్తితో పూజించెను. శ్రీగురుడు, "మాధవారణ్యా! నీవు మంత్ర సిద్ధిని పొందితివి. నీవు నిత్యమూ నరసింహోపాసన చేయుట వలన మా దర్శనం కల్గినది" అని చెప్పి, అతనికి సంపూర్ణ అనుగ్రహమును ప్రసాదించి, అక్కడ నుంచి శిష్యసమేతంగా 'వాసర బ్రహ్మేశ్వరము' అను క్షేత్రమునకు వచ్చిరి. అక్కడ గోదావరి తీరంలో స్నానం ఆచరించుటకు శిష్య సమేతంగా శ్రీ గురుడు వెళ్ళగా, అదే సమయంలో ఉదర రోగంతో బాధపడ్తున్న ఒక బ్రాహ్మణుడు నదిలో పడి ఆత్మహత్య చేసుకొనుటకు సంసిద్ధుడై "ఓ భగవంతుడా! అన్ని జీవులకూ ఆధారమైనటువంటి అన్నము నాకు గిట్టటలేదు. అన్నము తినకుండా ఎన్ని రోజులని, ఎవ్వరు బ్రతికుండగలరు? అన్నము తింటే చాలు విపరీతమైన కడుపు నొప్పి ప్రారంభమగుతున్నది. ఎన్నాళ్ళు తినకుండా నేను జీవించగలను? నేను ఎన్ని పాపములు చేసుకుంటే ఈ రోగము వచ్చిందో? సద్గురువును నిందించానేమో? ఈశ్వరుని పూజించలేదేమో? తల్లిదండ్రులను వదిలిపెట్టి భార్యతో మృష్టాన్న భోజనం చేసానో? ఎన్నో జీవులకు ఆశ్రయమైన వనమునకు నిప్పు పెట్టానేమో? ఇంక ఎందుకు నా బ్రతుకు" అని తలుస్తూ నడుముకు బండకట్టుకొని, ప్రవాహములోనికి దూకాడు. స్వామివారు ఈ సంఘటనను చూసి, శిష్యులను పంపి, అతన్ని ఒడ్డుకు తీసుకురండి అని ఆజ్ఞాపించారు. శిష్యులు అదే విధంగా చేశారు. స్వామివారు అతనివైపు

చూస్తూ "బ్రాహ్మణుడా! ఆత్మహత్య మహాపాపమని తెల్సి కూడా అందుకు ప్రయత్నిస్తున్నావేమి?" అని అడిగారు. అప్పుడా ఉదరరోగి స్వామికి నమస్కరించి, "స్వామీ! నేను ఈ భూమికి భారంగా జన్మించాను. పక్షమునకు గానీ, మాసమునకుగానీ ఒక్కసారి తిన్ననూ ఉదరరోగం నన్ను బాధిస్తుంది. శరీరమునకు అన్నమే కదా ముఖ్యము! అది తినకుండా నేను ఎన్నాళ్ళని జీవించగలను?" అని తన బాధను వ్యక్తం చేశాడు. అప్పుడు శ్రీవారు అతనితో "నాయనా! నన్ను మించిన వైద్యుడేలేడు. క్షణంలో నీ బాధను పోగొట్టగల ఔషధం ఇస్తాను. నామాట మీద విశ్వాసం ఉంచి, నీవు వెళ్ళి భోజనం చెయ్యి. ఇంక నీకా రోగ బాధ ఉండదు." అని అన్నారు. అతడు భక్తితో నమస్కరిస్తూ వున్న సమయంలో, ఆ ఊరి గ్రామాధికారి వచ్చి స్వామివారికి నమస్కరించాడు. అప్పుడు శ్రీగురుడు, "నాయనా! నీవెవ్వరు? నీ పేరేమి?" అని అడిగారు. అతడు "అయ్యా! నాది ఆపస్థంభ శాఖ, బ్రాహ్మణుడను, కౌండిన్యస గోత్రీకుడను, నా పేరు సాయందేవుడు, ఉదర పోషణార్థమై నేను ఒక యవనరాజు సేవలో గ్రామాధికారిగా జీవిస్తున్నాను. తమరి దర్శన భాగ్యం వల్లనే నా మనస్సు శాంతించింది. గంగాస్నానం వల్ల పాపము, చంద్రదర్శనం వల్ల తాపము, కల్పతరువు వల్ల దైన్యము నశించును. కానీ మీ వంటి సత్పురుషులు, తమ దర్శనముతో పాప తాప దైన్యములను యేకకాలంలో నశింపచేయగల సమర్థులు" అని వారి పాదములపై పడి నమస్కరించెను. స్వామివారు, ఆయనను దగ్గరకు కూర్చుండపెట్టుకొని, "సాయందేవా! నీకొక మాట చెప్తాను విను, ఈ బ్రాహ్మణుడు ఉదర రోగంతో బాధపడుతున్నాడు. ఇతన్ని తీసుకు వెళ్ళి మంచి భోజనం పెట్టు" అన్నారు. అంత సాయందేవుడు, "స్వామీ! నెలరోజులకొకసారి తింటేనే ఇతనికి రోగబాధ కల్గుతుంది. ఇప్పుడు నేను

తీసుకువెళ్ళి భోజనం పెడ్తే, ఆ బాధ తీవ్రతరమై చనిపోతాడేమో? బ్రహ్మ హత్యాపాతకం చుట్టుకొంటుందేమో" అన్నాడు. అప్పుడు గురుమూర్తి "నా మాట మీద విశ్వాసం ఉంచి, అతనికి భోజనం పెట్టు. ఈ రోజున తిన్న అన్నమే అతనికి ఔషదము కాగలదు" అన్నారు. అప్పుడు సాయందేవుడు "స్వామీ! మీరు కూడా శిష్య సమేతంగా, మా ఇంటికి వచ్చి, భిక్ష చేసి మమ్ములను కృతార్థులను చేయండి" అని వేడుకున్నాడు. శ్రీగురుడు శిష్య సమేతంగా సాయందేవుని ఇంటికి భిక్షకు వెళ్ళారు. సాయందేవుడు రంగవల్లులతో తీర్చిదిద్ది, మంగళవాయిద్యములతో, రుద్రసూక్తము, పురుషసూక్త విధానంగా పూజ చేసి హారతులిచ్చి, శిష్య సమేతంగా శ్రీ గురునికి భోజనం వడ్డించాడు. ఉదర రోగియైన బ్రాహ్మణుడు కూడా భోజనం చేశాడు. అద్భుతంగా ఆ ఉదర రోగియైన బ్రాహ్మణుని రోగం పోయింది.

ఓం శ్రీదత్తాయ గురవే నమః

ఓం శ్రీపాద స్వామినే నమః **ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః**

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

(13వ అధ్యాయం సంపూర్ణం)

జగమున గురుడుదయించిన
జగమునగల జనులు శరణు శరణనరొక్కో
జగమెఱిగి మ్రొక్క జూచెడి
నిగమాగమ నిర్వికార నిపుణుడువేమా


–వేమనయోగి



14 వ అధ్యాయము



శ్రీ గణేశాయ నమః



శ్రీ సరస్వత్యై నమః



శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

శ్లో. శిష్యత్వేనోరరీకృత సాయందేవం రరక్షయః ।
భీతంచక్రూర యవనాత్ శ్రీదత్తశ్శరణం మమ ॥

(భావము : సాయందేవుని, రాజు వలన కలిగిన మృత్యుభయము నుండి శ్రీ గురుడు రక్షించుట)

(ఈ పై శ్లోకమును చదివి క్రింది అధ్యాయమును పారాయణ చేసిన యెడల మరణభయము నుండి, పై అధికారుల ఆగ్రహమునుండి రక్షింపబడుదురు. సంకటములు తొలగును) (108 పర్యాయములు)

సిద్ధయోగి ఇంకా ఇలా చెప్పాడు : సాయందేవుడు శ్రీ గురుని భోజనాదులు అయిన తర్వాత, వారు విశ్రాంతి తీసుకొనుటకు గాను అన్నీ సమకూర్చి, వింజామరతో స్వామి వారికి వీచి, సేద తీర్చి పాదాలు వత్తుతూ కూర్చొని "ప్రభూ! సకల జీవులకూ నీవే ఆధారుడవు. ప్రస్తుతం నేను గొప్ప కష్టంలో ఉన్నాను. భుక్తి కొరకు ఒక యవన రాజు సేవలో పనిచేస్తున్నానని చెప్పాను కదా! ఆ రాజు నరరూప రాక్షసుడేను. ప్రతీ

సంవత్సరం ఒక బ్రాహ్మణుని చంపుతాడు. ఈ సంవత్సరం నన్ను చంపాలనే ఉద్దేశ్యంతో నన్ను పిల్చాడు. ఈ ప్రాణాపాయం నుంచి నన్ను మీరే రక్షించాలి." అని దుఃఖిస్తూ స్వామిని ప్రార్థించాడు. అప్పుడు శ్రీ గురుడు "నాయనా! భగవంతుడే సర్వానికి యజమాని. ఆ రాజు నిన్నేమి చేయలేడు. అతని చేత నీవు సత్కరింపబడి తిరిగి వస్తావు. నీవు వచ్చేవరకూ మేమిక్కడే ఉంటాము. దీర్ఘాయుష్మాన్ భవ!" అన్నారు.

సాయందేవుడు శ్రీ గురుని స్మరించుకుంటూ రాజ ప్రాకారంలోనికి అడుగు పెట్టాడు. అప్పుడా రాజు పిలిచిన వెంటనే రాకుండా ఆలస్యంగా వచ్చినందుకు కోపంతో లోపలికి వెళ్ళాడు. ఇంతలో ఆ రాజుకి అకారణంగా మత్తు ఆవహించినది. ఆ మత్తులో ఒక స్వప్న మొచ్చినది. ఆ స్వప్నంలో ఒక బ్రాహ్మణుడు తనను చంపుతున్నట్లుగా దర్శనమయింది. ఇతరులకు తాను చేస్తున్నటువంటి హింస ఎంత బాధాకరమో అతనికి తెలిసి వచ్చింది. వెంటనే అతనిలో సత్ప్రవర్తన అలవడి, వస్త్ర భూషణాదులతో బయటకు వచ్చి, సాయందేవుని సత్కరించి, క్షమాపణ కోరి పంపివేశాడు. అప్పుడు సాయందేవుడు సంతోషంతో ఇంటకి వచ్చి, గురుమూర్తిని సమీపించి, జరిగిన వృత్తాంతం అంతయూ వారికి చెప్పాడు. శ్రీ గురుడు సంతోషించి "నాయనా! సాయందేవా! ఇక మేము బయలుదేరుతాము. దక్షిణ దిక్కుగా తీర్థయాత్రలు చేసుకుంటూ వెళ్తాము." అన్నారు. సాయందేవుడు స్వామికి నమస్కరించి "స్వామీ! మీరు ప్రసాదించిన ఈ జీవిత శేషాన్ని మీ పాదసన్నిధిలో సేవ చేసుకొని గడిపేటట్లుగా అనుగ్రహించండి. నేను కూడా మీ వెంట వస్తాను." అన్నాడు. అంత శ్రీగురుడు అతనితో "నాయనా! నీవు వచ్చే సమయం ముందున్నది. మేము 15 సంవత్సరముల తర్వాత మరలా ఈ గ్రామము సమీపమునకు వస్తాము. అప్పుడు నీవు భార్యాపుత్ర

సమేతంగా వచ్చి దర్శించుకొనవచ్చును. నీ కష్టములన్నీ తొలగును. చెడ్డ రోజులన్నీ వెళ్ళిపోవును." సుఖంగా ఉండుమని ఓదార్చి, శిష్య సమేతంగా దక్షిణ దిక్కుగా వెళ్ళి, అనేక తీర్థములను పర్యటిస్తూ 'వైద్యనాథము' అను క్షేత్రానికి వచ్చిరి. అక్కడ వారు కొంతకాలం గుప్తంగా ఉండ నిశ్చయించుకొనిరి.

ఓం శ్రీదత్తాయ గురవే నమః

ఓం శ్రీపాద స్వామినే నమః **ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః**

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః


(14వ అధ్యాయం సంపూర్ణం)

భుక్తి విద్యలన్నీ బోధించి తెల్పేటి
గురువులెల్ల ఫలము కూర్చగలరా?
భుక్తి విద్యలెల్ల ముక్తి విద్యల జేసి
మోహంబు తెగటార్చు గురువు కలడు
గురుతు తెలియని సద్గురు వరుండు.


దానధర్మము లేక దయయు సత్యము లేక
మానసంబున మంచి నీతి లేక
చెడుగుణములతో చెలగాడు చున్నట్టి హీనుడు
ఇలను చెడును, పరమున చెడును.

– శ్రీ స్వామిశివానంద మహరాజ్

15 వ అధ్యాయము



శ్రీ గణేశాయ నమః



శ్రీ సరస్వత్యై నమః



శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

శ్లో. ప్రేరయ తీర్థయాత్రాయై
తీర్థరూపోపియః స్వకాన్ ।
సమ్యక్ ధర్మముపాదిశ్య
శ్రీదత్తశ్శరణం మమ ॥

(భావము : శ్రీగురుడు వైద్యనాథమనే క్షేత్రమున కొంతకాలం గుప్తంగా వుండదలచి శిష్యులను తీర్థయాత్రలకు పంపుట)

సిద్ధయోగి ఇంకా ఇలా చెప్పాడు. "నాయనా! నామధారకా ! శ్రీ గురుని యొక్క కీర్తి అన్ని దిక్కులా వ్యాపించి, దూరదూర ప్రాంతముల నుంచి ఎందరెందరో మంచివారు, చెడ్డవారు ఆయన దర్శనానికి వచ్చేవారు. శ్రీ గురుడు కొద్దికాలం గుప్తంగా జీవించదలచి, వైద్యనాథ క్షేత్రంలో శిష్యులందర్నీ దగ్గరకు పిల్చి, గృహస్థ శిష్యులకు ఈ విధంగా సెలవిచ్చారు. "నాయనలారా! **ఉపనయనాది సంస్కారముల తర్వాత, బ్రాహ్మణులు వేదాధ్యయనం చేస్తూ భక్తితో గురువును సేవించాలి. అతడికి పగటి నిద్ర తగదు. దొరికిన భిక్షాన్నము గురువుకు అర్పించి, సమావర్తన హోమం చేయాలి.**

ఆ తర్వాత గురువు ఆజ్ఞతో తగిన కన్యను పెండ్లాడి, గృహస్థాశ్రమ ధర్మాన్ని పాటించాలి. పిల్లలు కలిగిన తర్వాత, పుత్రుడికి సర్వస్వమూ సమర్పించి, భార్య అనుమతితో సన్యసించాలి. అతడు స్త్రీ కథలను వినకూడదు. వాహనములను ఎక్కరాదు. మంచము తాకరాదు. పగలు నిద్రించరాదు. వెదురు, సొరకాయ, చెక్క, మట్టి వీటితో చేసినటువంటి పాత్రలు మాత్రమే ఉపయోగిస్తూ, దండధారియై పగలు మాత్రమే భుజించాలి. మూడు పగళ్ళు మించి ఏ గ్రామంలో నివసించక స్థిరచిత్తుడై ఉండాలి. అలా తిరగడానికి శరీరంలో శక్తి లేకపోతే సదా దైవాన్ని ధ్యానిస్తూ ఒక క్షేత్రంలో నివసించాలి. శ్రీ గురుడు ఇలా గృహస్థ శిష్యులకు చెప్పి, సన్యాసులైన శిష్యులకు ఈ క్రింది విధంగా చెప్పారు. "నాయనలారా ! మీరందరూ తీర్థయాత్రలకు వెళ్ళండి. మీకు శ్రీశైలంలో బహుధాన్యనామ సంవత్సరంలో మా దర్శనం లభిస్తుంది." అన్నారు. అప్పుడా శిష్యులు "స్వామీ ! మీ పాదాల వద్దనే సకల తీర్థాలు ఉన్నాయి కదా ! మిమ్ములను విడచి మేము ఎక్కడికి పోగలము?" అన్నారు. స్వామి నవ్వుతూ, "నాయనలారా ! **సన్యాసులమైన మనము 5 రోజులకు మించి ఎక్కడా ఉండకూడదు. సర్వతీర్థాలు దర్శించుట మన ధర్మం. అందువలన మనస్సు స్థిరం కల్గుతుంది. ఆ తర్వాత ఒకే చోట స్థిరంగా ఉండటం శ్రేయస్కరం"** అని చెప్పారు. అంతట శిష్యులు, "స్వామీ ! మీ మాటే మాకు వేదవాక్కు. మేము ఏ ఏ తీర్థాలు సేవించాలో సెలవీయండి" అని వేడుకున్నారు. అప్పుడు శ్రీ గురుడు **"తీర్థాలన్నింటిలో ఉత్తమమైనటువంటి కాశీకి వెళ్ళి, గంగను సేవించి, గంగాతటయాత్రను చేయండి. ఆ తర్వాత యమునా, సరస్వతి నదులను సేవించండి. కుశావర్తము, సతధృవు, విపాశ, శరావతి, విసత్థ, అసిక్ని, మరుధృత, మధుమతి, ధృతవతి నదుల వెంట యాత్రలు**

చేయండి. ఈ పై నదులలో స్నానం చేస్తే బ్రహ్మహత్యా పాతకాలు నశిస్తాయి. చంద్రభాగ, గోమతి,రేవతి, వేదిక, కౌశిక, సహస్ర వక్త, పూర్ణ బహుధ నదులను సేవించండి. నదుల యొక్క సంగమములో స్నానం చేసినచో త్రివేణి స్నానఫలం లభించును. వైరోచని, పుష్కరతీర్థం, కురుక్షేత్రం, శ్రీశైలం, శ్రీరంగం, రామేశ్వరం, అనంతశయనం, మహలయ తీర్థం, నైమిశారణ్యం, కేదారము, నర్మదానది, కోకోముఖి, గోముఖి, అయోధ్య, గోకర్ణము, ద్వారక ఇవన్నీ కూడా ముక్తి క్షేత్రాలు. గోదావరీ తీరంలో ఆరు ఆమడలు యాత్ర చేసేవారు. 'వాజపేయ వ్రత ఫలితం' పొందుదురు. గోదావరీ నదికి మూడు పర్యాయములు ప్రదక్షిణ చేసిన వారు మహాపాపాల నుంచి విముక్త లౌతారు. భీమేశ్వరము, పంచర ఈ రెండు క్షేత్రాలు ప్రయాగతో సమానము.

'కుశతర్పణము' అను క్షేత్రం బహు ఫల ప్రదము. గోదావరీ సాగర సంగమమున స్నానం చేసినట్లైతే, **36** యజ్ఞములు చేసిన ఫలితం దక్కుతుంది. పూర్ణ నదీయాత్ర, కృష్ణవేణి నదీ యాత్ర, తుంగభద్రానదీ స్నానము పవిత్రము. పంపాసరోవరము పవిత్రము. హరిహర క్షేత్రము సర్వపాపహరము. భీమా నదీతీరమున ఉన్న పాండురంగడు భక్తసులభుడు. భీమ, అమరజ నదీ సంగమమున గంధర్వపురం (గాణ్గాపురం) కలదు. ఇచ్చట కోటి తీర్థములు కలవు. ఇచ్చట అశ్వద్ధవృక్షం సాక్షాత్తూ కల్పవృక్షమే. అశ్వద్ధవృక్షము సమీపమున నృసింహ తీర్థము, దానికి ఉత్తరమున పాపనాశనము, వారణాశీ, రుద్రపాద తీర్థము, చక్రతీర్థము, కోటి తీర్థము, మన్మథ తీర్థము, మొదలగు తీర్థములు కలవు. అచ్చట కల్లేశ్వరుడను ఈశ్వరుడు కలడు. ఆ క్షేత్రము 'గోకర్ణము'తో సమానము. ఆ క్షేత్రమునకు వెళ్ళి అనుష్టానము చేసుకొన్న వారికి మనోరథములు తప్పక ఫలించును." ఈ విధంగా శ్రీ గురుడు సన్యాస శిష్యులకు బోధించారు. శ్రీశైలమునందలి

పాతాళ గంగ యందు స్నానము చేసిన వారికి, మల్లికార్జున దర్శనం చేసుకున్నవారికి, ముక్తియే సిద్ధించును. బృహస్పతి సింహరాశికి వచ్చినప్పుడు గంగ, గోదావరి యందు సంగమించును. దానినే 'పుష్కరము' అందురు. బృహస్పతి కన్యారాశిలో ప్రవేశించినప్పుడు గంగ కృష్ణానదికి చేరును. మహానదులకు **12** సంవత్సరములకొకసారి పుష్కరము అను పుణ్యకాలం వచ్చుటచే ఆ నదుల యందు అప్పుడు స్నానములు చేసిన, అత్యధిక ఫలితములు లభించును. భీమ, కృష్ణానది కలియు చోట స్నానం చేస్తే, వారు సిద్ధులై **60** పర్యాయములు బ్రాహ్మణుడుగా జన్మించును. శేషాద్రి, కుంభకోణము, కన్యాకుమారి, మశ్చతీర్థము, పక్షితీర్థము, ధనుష్కోటి, రామేశ్వరము, మహాలక్ష్మి నివాసస్థానమైన కొల్హాపురము, ముఖ్యక్షేత్రం కాబట్టి ఆ క్షేత్రమును సేవింపుడు. కృష్ణానదీ తీరమునందు 'భిల్లవటి' అనే గ్రామం కలదు. అక్కడ భువనేశ్వరి అమ్మవారు కలరు. ఆ క్షేత్రమును సేవింపుడు. కృష్ణానదీ తీరమునందు 'అమరపురం' అను క్షేత్రం గలదు. అచ్చట ఐదు నదులు కృష్ణతో సంగమించును. యుగాలయము, శూర్పాలయము - ఈ తీర్థములు పరమ పవిత్రములు. 'మలాపహా' అనునది కృష్ణతో సంగమించును. అక్కడ విశ్వామిత్రుడు తపమొనర్చిన స్థానం కాబట్టి పరమ పవిత్రము.

ఓం శ్రీదత్తాయ గురవే నమః

ఓం శ్రీపాద స్వామినే నమః ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః


శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

(15వ అధ్యాయం సంపూర్ణం)

16 వ అధ్యాయము



శ్రీ గణేశాయ నమః



శ్రీ సరస్వత్యై నమః



శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

సిద్ధముని నామధారకునితో ఈ విధంగా చెప్పాడు. నాయనా! స్వామి వారు శిష్యులందర్నీ కూడా తీర్థయాత్రలకు సాగనంపారు. కానీ నేను మాత్రం వారి సేవలోనే ఉన్నాను. ఈ వైద్యనాధమనే క్షేత్రం కదు మనోహరం అయినది. ఇక్కడ స్వామివారు గుప్తంగా ఒక సంవత్సరం నివశించారు. వారు అక్కడ ఉన్న కాలంలో ఒక చిత్రం జరిగినది. ఒక బ్రాహ్మణుడు స్వామి వారి వద్దకు వచ్చి సాష్టాంగ నమస్కారం చేసి, వారిని స్తుతించి **"స్వామీ! నేను చాలా కాలం నుండి తపస్సు చేసుకుంటున్నాను. అయినా గానీ నా మనస్సు స్థిరం అవ్వలేదేమి?" అని అడిగాడు. స్వామివారు నవ్వుతూ, 'నాయనా! గురువు లేకుండా నీవు తపస్సు ఎలా చేశావు?' అని అడిగారు.** అందుకా బ్రాహ్మణుడు 'స్వామీ! నేను ఒక గురువు వద్ద చాలా కాలం సేవ చేశాను. ఆయన ఉపదేశం ఏదైనా ఇస్తారనే ఉద్దేశంతో సేవించాను. అయినా వారు నాకేమి ఉపదేశం ఇవ్వలేదు. వారు ఏమీ చెప్పలేదనే ఉద్దేశ్యంతో ఒక రోజు వారు చెప్పిన సేవ చేయలేదు. అందుకు వారు నన్ను తిట్టారు. అందువలన వారిని విడిచి వచ్చేశాను. మీ దర్శన భాగ్యంతోడనే నాకు శాంతి లభించింది" అన్నాడు. అప్పుడు స్వామి వారు

ముక్కు మీద వేలు వేసుకొని 'అయ్యో! బ్రాహ్మణా! ఎంతపని చేశావు? ఇలా దొరికిన ప్రతి గురువు వెంటబడి తిరుగుతూ ఉంటే, మనస్సు స్థిరం అవుతుందని అనుకుంటున్నావా? నీవు చాలా తప్పు చేశావు. దేవాలయంలో మల విసర్జన చేసి, అందుకు తిట్టిన వాడిని తప్పు పట్టినట్లుగా ఉంది నీ పని" అని అన్నారు. అందుకు ఆ బ్రాహ్మణుడు శ్రీ గురుని పాదములపై పడి, క్షమించమని, గురుతత్త్వాన్ని భోధించమని వేడుకున్నాడు. అప్పుడు శ్రీ గురుడు ఈ విధంగా చెప్పారు. "నాయనా! వెనుకటి కాలంలో శిష్యులు గురువుల ఆశ్రమాలకు వెళ్ళి సేవ చేస్తూ విద్యను అభ్యసించేవారు. **శిష్యులలో ఉన్నటువంటి తమోగుణాన్ని అహంకారాన్ని అంతరింప చేయుట కొరకు, గురువులు అనేక రకాల పరీక్షలకు గురిచేసేవారు. గురువు యొక్క కృపాదృష్టిచేతనే సర్వమూ సిద్ధిస్తుంది.** అందుకు తార్కాణం చెబుతాను విను" అని ఈ క్రింది విధంగా చెప్తూ ఉన్నారు.

ద్వాపర యుగంలో 'ధౌమ్యుడు' అను బ్రహ్మర్షి ఉండేవారు. ఆయన దగ్గర అరుణి, బైద్యుడు, ఉపమన్యువు అనే ముగ్గురు శిష్యులుండేవారు. ఒకనాడు ధౌమ్యులవారు, అరుణిని పిల్చి, నాయనా! మన పొలంలోని వరి ఎండిపోతూ ఉన్నది. దానికి నీరు పెట్టు అని సేవను అప్పగించారు. అరుణి గురుసేవ లభించినందుకు ఎంతో సంతోషించి, పొలానికి వెళ్ళి గండి పెట్టి నీరు మళ్ళించాడు. పొలంలోని గండికి అడ్డు వేయాలనే ఉద్ధేశ్యంతో, ఎంత మట్టి వేసినా నిలువలేదు. ఎలాగైనా గురువు చెప్పిన పనిని చేయాలనే ఉద్దేశ్యంతో ఆ గండికి తానే అడ్డుగా పడుకున్నాడు. నీటి ప్రవాహ వత్తిడివలన శరీర బాధకల్గి స్పృహ కోల్పోయాడు. చీకటి పడినా శిష్యుడు ఇంకా రాకపోయేసరికి, ధౌమ్యుల వారు పొలానికి వచ్చి పొలం నిండా నీరుండడం గమనించి అరుణి కోసం వెతికారు. చుట్టూ

చూచి, అరుణి కోసం వెతుకుతూ గండి వద్దకు వచ్చారు. ఎక్కడా అరుణి కనిపించక పోయేసరికి అరుణి కోసం పిలిచారు. అప్పుడే స్పృహ నుండి మేల్కొన్న అరుణిని చూచి అతని గురుభక్తికి మెచ్చి శిష్యుని లేవనెత్తి, అతని సేవకు ఎంతో సంతోషించి సంపూర్ణమైన అనుగ్రహమును ప్రసాదించి, "నాయనా! నీవు సమస్త శాస్త్ర పారంగతుడవు అగుదువు గాక! ఇంటికి పొమ్ము. తగిన కన్యను వివాహమాడి, సుఖముగా ఉండుమని" చెప్పి ఆశీర్వదించిరి. ధౌమ్యుల వారి యొక్క ఆశీర్వచనముతోడనే అరుణిలో విశేషమైన జ్ఞానము ఉదయించినది.

ఆ తర్వాత ధౌమ్యులవారు రెండవ శిష్యుడైన బైద్యుని పిల్చి "నాయనా! వరి పైరు పక్వానికి వచ్చినది. నీవు పొలమునకు వెళ్ళి పైరును జాగ్రత్తగా కాపలా కాసి పైరుని కోసి, గింజలు ఊడ్చి, ధాన్యమును రాశి వేసి రమ్మని పంపించిరి. బైద్యుడు ధౌమ్యులవారు చెప్పినట్లే చేసి, ధాన్యపు రాశిని సిద్ధము చేసితినని విన్నవించెను. అప్పుడు ధౌమ్యులవారు ఒక బండిని, ఒక దున్నపోతును ఇచ్చి బండిలో ధాన్యపు రాశిని ఎక్కించుకొని రమ్మని పంపిరి. బైద్యుడు ఎంతో సంతోషించి, బండి లోనికి ధాన్యపు రాశిని ఎక్కించి, దానికి ఒక వైపు దున్నపోతును కట్టివేసి, రెండవ దున్నపోతు లేనందున కాడిని తన భుజమునకు కట్టుకొని వస్తూ వుండగా దారిలో ఒక బురద గుంటలో బండి కూరుకుపోయింది. కాడి నుంచి దున్నపోతును తొలగించి బురద గుంట నుంచి బండిని ఎలాగైనా లేపాలన్న ఉద్ధేశ్యంతో చక్రాన్ని భుజంపై ఎత్తుకొని ఆ శ్రమకు ఓర్వలేక పడిపోయాడు. ఇంతలో ధౌమ్యులవారు అక్కడికి వచ్చి రక్తసిక్తమై ఉన్న అతని భుజమును చూచి గురుభక్తికి మెచ్చి, శిష్యునిపై తన అనుగ్రహమును ప్రసరింప చేశారు.

వెంటనే అతనిలో విశేషం అయిన జ్ఞానము ఉదయించి సర్వ శాస్త్ర పారంగతుడైనాడు.

ఇక మూడవ శిష్యుడైన ఉపమన్యువు – ఇతడు భోజనమును అమితంగా తినేవాడు. సోమరితనం అతని శరీరానికి అంటుకొన్నది. ఒక రోజున ధౌమ్యులవారు ఉపమన్యువుని పిల్చి 'నాయనా! నీవు ఆవులను తోలుకొని అడవికి వెళ్లి మేపుకొని రా! అని చెప్పారు. అతడు కూడా గురుసేవ లభించినందుకు ఎంతో సంతోషించి, ఆవులు తోలుకొని అడవికి వెళ్ళి మధ్యాహ్న సమయమున ఆకలి బాధించుటచే ఆశ్రమానికి వచ్చాడు. ధౌమ్యులవారు అది చూచి, "నాయనా! నీవు సూర్యాస్తమయ సమయం వరకూ ఉండి, ఆవులను మేపుకు రావాలి" అని చెప్పారు. అతడు మరుసటి రోజునుంచి, మధ్యాహ్నసమయమందు ఆకలికి ఓర్వలేక దగ్గరలో ఉన్న బ్రాహ్మణుల ఇళ్ళకు వెళ్ళి, భిక్ష తీసుకుని తింటూండేవాడు. ఒక రోజున ధౌమ్యుల వారు అతని శరీరంలోని బలుపు తగ్గనందు వలన మధ్యాహ్న ఆకలి వేళ ఏమి చేస్తున్నావని అడిగారు. అప్పుడు ఉపమన్యువు తాను బ్రాహ్మణుల ఇళ్ళలో భిక్ష తెచ్చుకొని తింటున్నట్లు చెప్పాడు. అంత ధౌమ్యుల వారు "నన్ను విడచి, నీవు భుజిస్తున్నావుటరా!" అని నీవు తెచ్చుకున్న భిక్షను నాకు ఇవ్వు' అన్నారు. ఉపమన్యువు అలాగే చేస్తున్నాడు. ఉపమన్యువు ఆకలికి ఓర్వలేక రెండవసారి భిక్ష ను తెచ్చుకొని తినేవాడు. ధౌమ్యుల వారు కారణం తెల్సుకొని, రెండవసారి బిక్షను కూడా తనకే ఇవ్వమని చెప్పారు. ఉపమన్యువు చేయనది లేక రెండవసారి భిక్షను కూడా గురువుకు అర్పించి, ఆవుల దగ్గర దూడలు తాగగా మిగిలినటువంటి పాలను తాగుతూండేవాడు. ధైమ్యులవారు అతని శరీరంలో మార్పును గమనించి, కారణం అడిగి తెల్సుకొని "ఓరేయ్ ! నీవు పశువుల ఎంగిలి తాగితే నీవు

కూడా పశువైపోతావు. తాగవద్దు" అని హెచ్చరించారు. ఉపమన్యువు ఆకలి బాధకు ఓర్వలేక జిల్లేడు పాలు ఎంగిలివి కావని తలచి, దొప్పలో పట్టుకొని తాగుతూ ఉండగా, అవి చిదిమి, కళ్ళల్లో పడి, గ్రుడ్డి వాడై దారి కన్పించక నడుచుకుంటూ వెళ్ళి, ఒకపాడు పడిన బావిలో పడిపోయాడు. ధౌమ్యులవారు సూర్యాస్తమయ సమయం అయినా శిష్యుడు ఇంకా ఇంటికి రాకపోయేసరికి ఉపమన్యువును వెతుకుతూ, ఆ బావి వద్దకు వచ్చి, పెద్దగా పిల్చారు. గురువు గారి పిలుపు విన్న ఉపమన్యువు బావి నుండే పెద్ద శబ్ధం చేసి తెల్పాడు. ధౌమ్యులవారు జరిగినదంతా గ్రహించి, అశ్వనీదేవతలను ప్రార్థించమని చెప్పారు. అతడు స్మరించినంతనే దృష్టి వచ్చి, బావి నుంచి బయటకు వచ్చి భక్తితో గురునికి నమస్కరించెను. ధౌమ్యుల వారు అతన్ని కౌగిలించుకొని, ఆశీర్వదించి, నాయనా! నీ భక్తికి నేను సంతసించితిని, అని హస్తమును శిష్యుని నెత్తిపై ఉంచిరి. తక్షణమే అతడు కూడా అరుణి, బైద్యుల వలె సకల శాస్త్ర పారంగతుడైనాడు. విశేషమైన జ్ఞానం ఉదయించింది. అప్పుడు ధౌమ్యుల వారు అతనితో "గృహమునకు వెళ్ళి తగిన కన్యను వివాహమాడి, సుఖముగా జీవించుము. నీతో సమానుడగు ఉద్ధంకుడనే శిష్యుడు నీవద్ద విద్య అభ్యసించును. నీకు గురు దక్షిణగా పాతాళలోకం నుండి నాగకుండలములు తెచ్చి సమర్పిస్తాడు. నీ కీర్తి ఆ శిష్యుని ద్వారా చిరస్థాయిగా ఉండగలదు. " అని అతనిని పంపివేశారు. శ్రీ గురుడు ఆ బ్రాహ్మణునితో గురుభక్తి ప్రభావంతో కూడిన ఈ కథను చెప్పి "నాయనా! **గురువే తల్లీ, తండ్రీ, దైవమూ. ఎవరైతే ఈ భావంతో గురువును అర్చిస్తారో వారికి ఆయన దర్శనము తోడనే సకలము సిద్ధించును.** గురద్రోహికి ఇహపరమున సుఖము లేదు. ఇప్పటికైనా అజ్ఞానమును విడనాడు. నీ పూర్వపు గురువు

దగ్గరకు వెళ్లు." అని ఆజ్ఞాపించిరి. అప్పుడా బ్రాహ్మణుడు "స్వామీ! ఇప్పుడు నేను గురువు యొక్క నిజతత్త్వాన్ని తెలుసుకున్నాను. నేను నిజంగా గురుద్రోహాన్ని చేశాను. ఇక నేను జీవించి ప్రయోజనం ఏమున్నది? ఆత్మహత్య చేసుకుంటాను." అన్నాడు. అంత శ్రీ గురుడు, "నాయనా! పశ్చాత్తాపమే మొదటి మెట్టు. నీలో సగం పాపం నశించినది. నీవు నీ గురువును దర్శించి, ఆ రూపములో నన్ను ధ్యానించు. ఆయన సంతుష్టులగుదురు" అని అన్నారు. అప్పుడా బ్రాహ్మణుడు స్వామి పాదములపై పడి, 'స్వామీ! అజ్ఞానమనే గాఢాంధకారంలో మునిగి ఉన్న నాకు జ్ఞాన జ్యోతివలే కనిపించి అజ్ఞానాన్ని పారద్రోలారు' అని శ్రీ గురుని ఆశీస్సులు తీసుకొని, వెళ్ళి పూర్వపు గురువును ఆశ్రయించి కృతార్థుడైనాడు.

ఇలా శ్రీనృసింహసరస్వతీ స్వాములవారు వైద్యనాథ క్షేత్రంలో ఒక సంవత్సరం ఉండి, తర్వాత ఆ క్షేత్రాన్ని విడిచి, కృష్ణానదీ తీరంలో 'భిల్లవటి' అను గ్రామమును చేరి, నదికి పశ్చిమ తీరమున ఉన్న ఔదుంబర వృక్ష సమీపమున కొంతకాలం నివసించిరి.

ఓం శ్రీదత్తాయ గురవే నమః

ఓం శ్రీపాద స్వామినే నమః **ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః**


శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

సశిష్యః పర్యవీక్షేత్రే వైద్యనాథ సమీపతః ।
స్థిత్వోద్దార మూఢయః శ్రీ దత్త శరణం మమ ॥

(మోక్షాపేక్ష కల్గినటువంటి వారు, పుణ్యశీలురు, గురు అనుగ్రహం కావల్సినవారు, ఈ శ్లోకాన్ని చదివి, పై అధ్యాయాన్ని పారాయణ చేసినచో, గురు అనుగ్రహము కల్గును)

(16వ అధ్యాయం సంపూర్ణం)

17 వ అధ్యాయము



శ్రీ సరస్వత్యై నమః



శ్రీ గణేశాయ నమః



శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

సిద్ధముని ఇంకా ఇలా చెప్పాడు : 'నాయనా ! మబ్బు వేసే ముందు చల్లని గాలి వీచునట్లుగా గురు కథను వినటం వల్ల నీకు, అది వినిపించటం వల్ల నాకు, ప్రీతి కల్గుతున్నది. శ్రీ గురుడు భక్తుల పాలిట కల్పతరువు, కామధేనువు కనుక శ్రీ గురుని లీలలు చెప్తాను విను."

నామధారకుడు, సిద్ధయోగికి నమస్కరించి "భగవంతుడైన శ్రీ గురుడు తపస్సు, అనుష్టానం ఎందుకు చేశారు? ఆయన అందరికీ అన్నీ ఇవ్వగలరు కదా! భిక్ష ఎందుకు చేశారు?" అని అడిగాడు. అప్పుడు సిద్ధయోగి "నాయనా! శివుడు భిక్ష చేయలేదా? **మహాత్ములు భిక్ష చేయటం, తీర్థయాత్ర చేయటం, తపస్సు చేయటం భక్తులను ఉద్ధరించటానికే.** ఆయన ఉత్తమ తీర్థాలను ఎన్నో ప్రకటన చేయటానికి ఈ విధంగా చేశారు." కానీ, తడి గుడ్డలో పెట్టినటువంటి ఇంగువ వాసన ఏ విధంగా బహిర్గతం అవుతుందో, కస్తూరి వాసన ఏవిధంగా దాగి ఉండలేదో, సూర్యుని తేజస్సు ఏ విధంగా దాగి ఉండలేదో, ఆయన మహిమ కూడా ఈ విధంగా వెల్లడి అయినది. కరవీరపురంలో వేదశాస్త్ర పరాంగతుడు అయిన బ్రాహ్మణుడు ఉండేవాడు. అతడు కణ్వశాఖీయుడు.

మహాపండితుడైన అతడికి ఒక కొడుకు పుట్టాడు. చిన్నతనములోనే తల్లిదండ్రులు చనిపోయారు. ఆ పిల్లవాడు మందమతి, జడుడు అయ్యాడు. మేనమామ సంరక్షణలో పెరిగాడు. మతిమరుపు వలన గాయత్రీ మంత్రం కూడా ఉచ్చరించలేకపోయేవాడు. పిల్లవానికి ఎనిమిదవ సంవత్సరంలో మేనమామ కూడా చనిపోయాడు. ఊళ్ళోని జనం అతన్ని చూస్తూ హేళనగా మాట్లాడుతూ, "ఓరేయ్! మందమతీ! నీ బ్రతుకు వ్యర్థము, అంతటి మహాపండితుని కడుపున పుట్టి పేరు చెడగొట్టావు. నీవు ఎందులోనైనా దూకి చావరాదా? పొట్టకోస్తే అక్షరము ముక్కలేదు నీకు. నీవు భిక్ష చేసుకొని బ్రతకటానికి కూడా పనికిరావు" అని హేళన చేస్తూండేవారు. ఒకనాడు అతనికి జీవితంపై విరక్తి కల్గి, భిల్లవటిచేరి, భువనేశ్వరీదేవిని దర్శించి, అచట మూడు రోజులు ఉపవాసం ఉన్నాడు. మూడు రోజుల్లో తల్లి దర్శనం ఈయక పోయేరికి తన దగ్గరున్న కత్తితో నాలుక కోసి, దేవీ పాదముల ముందు ఉంచి "అమ్మా! నీవు నన్ను ఇంకా అనుగ్రహించకుంటే, రేపు నీకు నా తలను నరికి సమర్పిస్తాను" అని చెప్పుకున్నాడు. ఆనాటి రాత్రి, దేవి కలలో కన్పించి "నాయనా! నాపై అలుగవద్దు. ఔదుంబర వృక్షం క్రింద తపస్సు చేసుకుంటున్న యతి, సాక్షాత్తూ పరమేశ్వరుడు, శ్రీ దత్తుడు, అపారశక్తిమంతుడు. నీ కోరిక తీర్చగలడు" అని చెప్పింది. వెంటనే అతను బయలుదేరి శ్రీ గురుని వద్దకు చేరి నమస్కరించాడు. శ్రీ గురుడు అతని శిరస్సుపై చేయి ఉంచి ఆశీర్వదించారు. తక్షణమే అద్భుతంగా పోయిన నాలుక రావటమే కాకుండా అతనికి సకల విద్యలూ సిద్ధించాయి. కాకి మానస సరోవరం చేరి రాజహంసగా మారినట్లు పరుశవేది స్పర్శతో ఇనుము బంగారమైనట్లు, శ్రీ గురుని హస్తస్పర్శతోడనే ఆ విప్రకుమారుడు మహాజ్ఞాని అయ్యాడు.

శ్లో. విద్వత్ శుత మవిద్యం యా ఆగతం లోక నిందితం ।
ఛిన్న జిహ్వం బుధం చక్రే శ్రీ దత్త శరణం మమ ॥

(పరీక్షల యందు ఉత్తీర్ణులు కాగోరు వారికి, బుద్ధిమాంద్యం వలన బాధపడ్తున్న పిల్లలకు విద్యాప్రాప్తికి, ప్రతి రోజు పై శ్లోకమును చదివి, ఈ అధ్యాయాన్ని పారాయణ చేసినచో విశేష అభివృద్ధి కల్గును)

ఓం శ్రీదత్తాయ గురవే నమః

ఓం శ్రీపాద స్వామినే నమః ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

(17వ అధ్యాయం సంపూర్ణం)

హెచ్చు చదువు చదివి యింద్రియలోలురై
చచ్చు వారి కన్న స్వల్పమైరి
ఇంద్రియముల శక్తి యినుమడించును గాని
అట్టి చదువు చదివి ఆర్యుడగునే
చచ్చు చదువు చదివిసంతసము లేక
ఆత్మచింత నొందువాడు చదువరుండు
అట్టి ఆత్మశాంతి గురుపాద సేవచే కల్గును
మరిచిపోకుడు శివానందుని మంచిమాట

– శ్రీ స్వామిశివానంద మహరాజ్



18 వ అధ్యాయము



శ్రీ సరస్వత్యై నమః



శ్రీ గణేశాయ నమః



శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

శ్లో. నరసింహ వాటి కాస్థోయం ప్రదదౌశాక భుక్ నిధిం ।
దరిద్ర బ్రాహ్మణాయా సౌ శ్రీదత్త శరణం మమ ॥

(గర్భ దారిద్ర్యముతో జీవించుచున్న వ్యక్తులు, ఋణబాధలు పడ్తున్న వ్యక్తులు ఈ పై శ్లోకమును చదివి, క్రింది అధ్యాయమును నిత్యము 40 రోజులు నియమ నిష్టలతో పారాయణము చేసినచో ఋణ విమోచన, దారిద్ర్యనాశము కలుగును.)

నామధారకుడు, సిద్ధమునికి నమస్కరించి, "స్వామీ! మీరు చెప్పుచున్న గురులీలల వల్ల భక్తి తీవ్రతరమౌతున్నది, మనస్సు స్థిరమగుచున్నది. ఆ పై శ్రీ గురుని లీలలను గూర్చి చెప్పండి." అని ప్రార్థించాడు. సిద్ధముని నామధారకుని ఆశీర్వదించి "నాయనా! నీవు ధన్యుడవు ఇవి వినటం వలన నీ కెంత ప్రయోజనమో, అవి చెప్పటం వలన నాకూ అంతే ప్రయోజనం, శ్రద్ధగా విను."

శ్రీ గురుడు కొంతకాలం 'భిల్లవటి' యందు నివసించి, అచ్చట నుంచి 'వరుణా సంగమం' చేరి, కృష్ణాతీరము నందలి క్షేత్రములను దర్శించుచూ, పంచనదీ సంగమ తీరమున ఉన్న 'అమరపుర' మనే

గ్రామానికి వచ్చి అక్కడ 12 సంవత్సరములు నివసించిరి. అక్కడ ఐదు నదులు కృష్ణానది యందు కలియుట వలన ప్రయాగక్షేత్రము కంటే పవిత్రమైనది. అచ్చట శివ, భద్ర, భోగవతి, కుంభి, సరస్వతి అను ఐదు నదులు కృష్ణ యందు వచ్చి చేరును. ఇక్కడ స్నానము చేసిన మహాపాతకములు కూడా నాశనమగును. ఈ సంగమమున 'అమరేశ్వరుడు' అను శివుడు కలడు. అందుచే ఆ పురమునకు అమరపురమని పేరు వచ్చింది. అంతేగాక ఇక్కడ శక్తి తీర్థము కూడా కలదు. ఇక్కడే 60 మంది యోగినులు గుప్తముగా జీవించుచున్నారు. ప్రయాగయందు మాఘమాసం నెలరోజులు స్నానం చేస్తే వచ్చే పుణ్యము, ఈ శక్తి తీర్థమున ఒక్క స్నానము వలననే కల్గును. ఇక్కడ కృష్ణ దక్షిణ వాహినియై ప్రవహించును. ఇక్కడ శుక్ల తీర్థమను తీర్థము కూడా కలదు. ఇక్కడ ఒక మేడి చెట్టు కలదు. ఆ మేడిచెట్టు సాక్షాత్తూ కల్పవృక్షమే. దాని సమీపమున పాపవినాశనము, కామ్యతీర్థము, వరద తీర్థం అను తీర్థములు దగ్గర దగ్గరగా కలవు. సంగమమున శక్తి తీర్థము, అమర తీర్థము, కోటి తీర్థము అను ముఖ్యమైన మూడు తీర్థములుకలవు. ఇట్టి పుణ్య తీర్థములుండుటచే, శ్రీ నృసింహసరస్వతీ స్వామి వారు ఇక్కడ కొంతకాలము నివసించిరి. ఆయన అచ్చట నివసించుటచే గుప్తములైన ఆ తీర్థములన్నీ లోక విఖ్యాతి కాంచినవి. స్వామివారు ప్రతి నిత్యమూ కూడా అమరపురమునకు మధ్యాహ్న సమయమున భిక్షకు వెళ్ళేవారు. ఆ గ్రామమున ఒక వైదిక బ్రాహ్మణుడు కలడు. అతడు మిక్కిలి సాధుజీవనుడు. అతని భార్య పతివ్రత, ఆ బ్రాహ్మణుడు బీదవాడగుటచే యాయవారవృత్తిలో జీవించు చుండెడివాడు. వారి ఇంటి ప్రాంగణమున ఒక బచ్చలితీగ ఉండెను. ఏ దినమున వారికి భిక్ష లభించలేదో, అప్పుడు వారు ఆ బచ్చలి ఆకులను గిల్లి అదే

ఉడకబెట్టుకొని భుజించెడివారు. ఒకరోజు అదృష్టవశమున శ్రీ గురుడు వారింటికే భిక్షకు వెళ్లెను. బాపని భార్య స్వామిని ఆహ్వానించి, షోడశోపచారములతో పూజగావించి, తాము వండుకున్న బచ్చలి కూరను స్వామికి భిక్షగా సమర్పించెను. స్వామివారు తృప్తిగా సేవించి, సంతృప్తి నొంది, "నేటితో మీ దారిద్ర్యం తీరిపోయినది" అని చెప్పి, వెళ్ళుచూ దారిలోని ఆ బచ్చలి పాదును పీకేసి వెళ్ళిపోయిరి. అది చూచి, ఆ బ్రాహ్మణ దంపతులు ఎంతో దుఃఖించిరి. ఆ బ్రాహ్మణ గృహిణి, "అయ్యో! మనము స్వామి కేమి అపరాధము చేసితిమి? ఎప్పుడైనా భిక్ష దొరకని వేళ ఈ బచ్చలి ఆకుతో కడుపు నింపుకొనుచుంటిమే! ఇప్పుడు ఈ ఆధారము కూడా తీసివేసినారు. గర్భదారిద్ర్యం అనుభవించున్న మనం ఎలా జీవించగలం? ఈ పిల్లలను ఎలా పోషించగలం?" అని దుఃఖించింది. అప్పుడు ఆ బ్రాహ్మణుడు "సర్వం ఈశ్వర ఆజ్ఞవల్లనే జరుగుచున్నది. ఈశ్వరుడు వారి ప్రారబ్ధములను అనుసరించి ఆయా కాలముల యందు సుఖ దుఃఖములను అనుభవింప చేయును" అని ఒక పలుగును తీసుకొని తిరిగి ఆ పాదును అక్కడే నాటుదామనే ఉద్దేశ్యంతో త్రవ్వడం ఆరంభించెను. త్రవ్వుచుండగా, గడ్డపలుగుకు లోహ పాత్ర తగిలి శబ్దం వచ్చెను. ఆశ్చర్యముగా దంపతులిద్దరూ పైపై మట్టిని తీసి చూడగా రాగి బిందె నిండుగా బంగారపు నాణెములున్న నిధి కన్పించెను. అప్పుడా బ్రాహ్మణుడు "చూశావా! స్వామి ఈ లతను పీకివేయటం వల్లనే మనకీ నిధి దొరికింది. స్వామి సాక్షాత్తూ పరమేశ్వరులే" అనుకొని శ్రీగురుని వద్దకు వెళ్ళి, స్వామి పాదములపై పూలు వేసి, జరిగిన దంతయూ చెప్పిరి. స్వామివారు నవ్వుతూ 'నాయనా! నేటితో మీ దారిద్ర్యము తీరిపోయినది, నేటి నుంచి మీరు పిల్లాపాపలతో, అష్టైశ్వర్యాలతో తులతూగ గలరు. కానీ ఈ నిధి దొరికిన

రహస్యము ఎవ్వరికీ చెప్పవద్దు. అలా చెప్పినచో లక్ష్మి మీ ఇంట ఉండదు. వెళ్ళి సుఖముగా జీవింపుడు” అని వారిని ఆశీర్వదించి పంపిరి.

చూచావా! నామధారకా! గురుకృపకు పాత్రుడైన వాడికి కష్టములుండవు. కల్పవృక్షమే వారింట నివసించును. ఎవరైతే భక్తితో సద్గురువును సేవిస్తారో వారు తప్పక గురు కృపకు పాత్రులు కాగలరు. నీవు కూడా భక్తితో సద్గురువును భజింపుము అని సిద్ధయోగి చెప్పాడు.

ఓం శ్రీదత్తాయ గురవే నమః

ఓం శ్రీపాద స్వామినే నమః **ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః**

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

(18వ అధ్యాయం సంపూర్ణం)

సేవచేసి గురుని స్థిర భావమందెదు
త్రోవనంటి జ్ఞప్తి దొలగనీక
భావమందె పరము బరికించి చూడరా
విశ్వదాభిరామ వినురవేమ


భావము : గురుసేవ చేసి స్థిరభావము నొందవలసిన త్రోవనంటి జ్ఞప్తిని తొలగనీక భావములోనే పరతత్త్వమును పరికించి చూడుము. ఇదియే ముక్తికి సాధనము.

లేదు లేదు ధనముపై ప్రీతి నాకు
వలదు వలదు ఘనకీర్తి వలదు నాకు
దత్త సాయి చరణభజన సేవయే చాలు నాకు
పుణ్యాత్ములకు, పుణ్యకార్యములకు
యాచించెదన్ మిమ్ములన్ ఆర్తితోడ
మరచిపోకుదు శివానందుని మంచిమాట


–శ్రీ స్వామి శివానంద మహరాజ్



19 వ అధ్యాయము



శ్రీ సరస్వత్యై నమః



శ్రీ గణేశాయ నమః



శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

నామధారకుడు "స్వామీ! అశ్వద్ధ వృక్షం వంటి పవిత్ర వృక్షాలు ఎన్నో ఉన్నాయి కదా! మరి శ్రీగురుడు ఔదుంబర వృక్షం (మేడి చెట్టు) మూలములోనే నివసించుటకు కారణమేమి? ఆ వృక్షం యొక్క ప్రాధాన్యతను వివరించండి' అన్నాడు. అప్పుడు సిద్ధయోగి "నాయనా! నామధారకా! పూర్వము నరసింహస్వామి అవతారంలో హిరణ్యకశపుని చంపినప్పుడు, హిరణ్యకశపుడి పొట్టలో ఉన్న విషరక్తం స్వామి చేతి గోళ్ళ కంటుకొని, విపరీతంగా మంటలు పుట్టసాగాయి. అప్పుడు లక్ష్మీదేవి మేడిపండ్లతో స్వామివారికి ఔషధం తయారుచేసి, చేతిగోళ్ళకు కట్టింది. స్వామివారికి బాధ ఉపశమనం అయ్యింది. అందుకు గాను శ్రీ మహావిష్ణువు ఆ మేడి చెట్టుకు వరములను అనుగ్రహించారు.

"అక్కడికి దగ్గరలో వున్న బ్రాహ్మణులంతా శ్రీ గురుడు తమ ఇండ్లకు భిక్షకు రాకపోవటం గురించి రకరకాలుగా అనుకుంటుండేవారు, వారికి నిత్యము భిక్ష ఎక్కడ దొరుకుతున్నదో తెల్సుకొనుటకై, శ్రీ గురునికి కాపలాగా ఒక వ్యక్తిని ఉంచారు. ప్రతిరోజూ, మధ్యాహ్నం సమయం అయ్యేసరికి,

అతని హృదయంలో విపరీతం అయిన భయం ఆవహించి, అచ్చట నుంచి పారిపోయేవాడు. ఎవరైతే మహాత్ములను పరీక్షింపకోరుదురో వారికి అధోగతి తప్పదు. అక్కడికి దగ్గరలో ఉన్న పొలము యజమాని, 'గంగానుజుడు' అనేవాడు ఒక రోజు శక్తి తీర్థము నందలి నదీ గర్భం చీలి, 60 మంది యోగినులు వచ్చుట చూచి, ఆశ్చర్యచకితుడైనాడు. మరుసటి రోజు కూడా అదే విధంగా జరుగుట చూచి, వారేమి చేస్తారో తెల్సుకుందామన్న కుతూహలం ఎక్కువై ఒక చెట్టు చాటునుంచి అంతా గమనిస్తున్నాడు. జల ప్రవాహం నుంచి వచ్చిన యోగినీ గణాలు స్వామి వారిని సమీపించి, కొంతసేపు పూజచేసి, స్వామివారిని తీసుకొని మరల జల ప్రవాహములోనికి వెళ్ళుట గమనించి, ఆ గంగానుజుడు కూడా వారి వెనుకనే వారు చూడకుండా ప్రవేశించి గమనించసాగెను. స్వామిని నదీగర్భములోనికి తీసుకొని వెళ్ళిన యోగినీ గణాలు, శ్రీగురుని రత్నఖచిత సింహాసనముపై కూర్చుండ బెట్టి, షోడశోపచార పూజగావించి, పంచ భక్ష్య పరమాన్నములతో వారికి విందు గావించి, సేద తీర్చుట గంగానుజుడు గమనించెను. శ్రీగురుడు తమ స్థానమునకు వచ్చే ముందు బైట నుంచుని ఉన్న గంగానుజుని చూచి "నాయనా! నీవు ఎవ్వరవు? ఎక్క డనుంచి వచ్చావు" అని అడిగారు. వాడు 'స్వామీ! నా పేరు గంగానుజుడు. ఈ దగ్గర్లో ఉన్న పొలము నాది. సాక్షాత్తూ మీరు పరమేశ్వరులేను. అజ్ఞానంధకారులైన మానవులు మీ నిజస్వరూపాన్ని తెల్సుకోలేక పోవుచున్నారు. నా తప్పిదాన్ని క్షమించి నన్ను కాపాడి రక్షించండి' అని దీనంగా ప్రార్థించెను. అప్పుడు శ్రీగురుడు అతనితో 'నాయనా! నేటితో నీ కష్టములు తీరినవి. నీకు సద్గతి లభించును. కాని ఇక్కడ చూచినది మాత్రము ఎవ్వరితో చెప్పకు సుమా! నీకు మంచి జరుగుతుంది. చెబితే

తక్షణమే నీవు మరణిస్తావు" అని అతన్ని ఆశీర్వదించి స్వామి ఔదుంబరానికి చేరిరి. ఆ మరునాడే అతడు పొలము దున్నుచుండగా నాగలికి, లోహపాత్ర తగిలిన శబ్ధమయ్యెను. నిధి దొరికెను. నిధిని ఇంటికి తీసుకువెళ్ళి సుఖంగా జీవించెను.

ఒక మాఘపూర్ణిమ సమయమందు గంగానుజుడు శ్రీ గురుని వద్దకు వచ్చి నమస్కరించి 'స్వామీ! మాఘమాసంలో ప్రయాగ స్నానం పుణ్యమంటారు కదా! కాశీ దర్శనం పవిత్రమంటారు కదా! నేనింతవరకూ వాటిని దర్శించలేదు. వాటి శ్రవణం వలన కూడా పుణ్యము దక్కుతుందంటారు. ఈ క్షేత్ర మహాత్మ్యములను నాకు తెలియపర్చండి' అని పల్కెను. అప్పుడు శ్రీగురుడు "నాయనా! ఈ కృష్ణానదీ సంగమమే మనకు ప్రయాగ, కొల్హాపురమే మనకు గయ, ఇక్కడ సమీపమునున్న యుగాలయము 'కాశీ'. నీ భక్తి శ్రద్ధలకు మెచ్చాను. ఇప్పుడే నీకు వాటి దర్శనం కల్గుతుంది. నా పాదుకలను గట్టిగా పట్టుకొని కన్నులు మూసుకో" అన్నారు. అతడు అట్లే చేసినాడు. తక్షణమే స్వామివారు కనులు మూసి తెరుచునంతలో ప్రయాగ దర్శనం చేయించి, మరలా సాయం సమయానికి ఔదుంబర వృక్షం చేర్చారు. ఇట్లు కొంతకాలం జరిగిన తర్వాత స్వామి ఆ క్షేత్రమును విడిచిపో నిశ్చయించుకున్నారు. ఆ సంగతి విని ఆ యోగినీ గణాలు "స్వామీ! నిత్యమూ మీ దర్శనము, సేవ వలన మా లోపములన్నీ నశించినవి. మీరు మమ్మల్ని వదిలి వెళ్ళటం ధర్మమా!' అని ప్రార్థించారు. అప్పుడు శ్రీగురుడు ఈ ఔదుంబరమే మాకు నివాస స్థానము, ఇక్కడ గుప్తముగా మేము నివసించెదము. ఈ ఔదుంబరమూలంలో మమ్ము భక్తితో ఎవ్వరు పూజింతురో వారికి సకల కోరికలూ సిద్ధించును. ఈ ఔదుంబర వృక్షమును పూజించిన వారికి సకల కోరికలూ సిద్ధించును.

ఈ ఔదుంబర వృక్షమును పూజించిన వారికి సర్వ కార్యములు నెరవేరును. అంతే గాక ఇక్కడ అన్నపూర్ణా దేవిని గూడా స్థాపిస్తున్నాను. ఈ క్షేత్రం నందు బ్రాహ్మణ సమారాధనలు నిత్యమూ జరుగుచుండును. ఇచ్చట ఉన్న పాపనాశము, కామ్యతీర్థము, శిద్ధ తీర్థములందు స్నానము చేసి ఏడు పర్యాయాలు ఈ ఔదుంబర వృక్షమును ఎవ్వరు నీటితో తడుపుదురో అట్టివారికి గొడ్రాలితనం పోయి దీర్ఘాయుష్మంతులగు పుత్రులు కల్గుదురు. ఇచ్చట ఒక బ్రాహ్మణునికి భోజనం పెడితే, కోటి బ్రాహ్మణులను తృప్తిగా భుజింప చేసిన ఫలితం దక్కును. ఈ ఔదుంబర వృక్షమునకు ప్రదక్షిణ చేసిన వారికి కుష్టురోగం నశించును. మేము లోక దృష్టికి ఇచ్చట నుంచి వెళ్ళినట్టు కన్పిస్తాము గానీ అదృశ్య రూపంలో ఇక్కడనే ఉంటాము' అని స్వామి వారు చెప్పిరి.

శ్లో. భక్తాయ త్రిస్థలి యాత్రాం దర్శయామాసాంయః క్షణాత్ ।
చకారవరదం క్షేత్రం శ్రీ దత్త శరణం మమ ॥

(ఈ పై శ్లోకమును చదివి, పై అధ్యాయమును పారాయణ చేసిన వారికి తీర్థయాత్రలు, కాశీ, గయ, ప్రయాగ దర్శనం చేసిన ఫలితం దక్కును)

ఓం శ్రీదత్తాయ గురవే నమః


ఓం శ్రీపాద స్వామినే నమః **ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః**

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

(19వ అధ్యాయం సంపూర్ణం)



20 వ అధ్యాయము



శ్రీ సరస్వత్యై నమః



శ్రీ గణేశాయ నమః



శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

నామధారకుడు సిద్ధయోగికి నమస్కరించి, 'స్వామీ! శ్రీనృసింహ సరస్వతీ స్వామి వారు ఆ ఔదుంబర వృక్షమూలంలోనే గుప్తంగా నివసిస్తున్నారని అన్నారు కదా! అదెలా సంభవము? అందుకు తార్కాణమేమున్నది?' అన్నాడు. అప్పుడు సిద్ధయోగి "నాయనా! **శ్రీగురుని యొక్క లీలలు వర్ణించటం ఎవరి తరమూ కాదు. పరమాత్మ స్వరూపుడైన ఆయన మహిమలకు సాధ్యాసాధ్యములు లేవు.** అయిననూ అక్కడ జరిగిన ఒక వృత్తాంతము చెప్తాను శ్రద్ధగా విను."

ఇక్కడికి దగ్గరలోనే 'శిరోల' అనే గ్రామం కలదు. అచ్చట ఒక సద్బ్రాహ్మణుడు కలడు. ఆయన భార్య సుశీల మహాపతివ్రత. వారికి ఐదుగురు పుత్రులు పుట్టి చనిపోయిరి. ఎందరో దేవతలకు మ్రొక్కిరి, కానీ ఎట్టి ఫలమూ లేకుండా పోయింది. ఆ సుశీల ఎన్నో వ్రతాలు, ఉపవాసములు కూడా ఆచరించింది. ఫలితం లేకుండా పోయింది. అప్పుడు ఆమె ఒక జ్యోతిష్కుడ్ని కలసి, తనకు పుత్ర వియోగము కల్గుటకు కారణమేమిటో చెప్పమని ప్రార్థించింది. ఆ జ్యోతిష్కుడు, 'అమ్మా! ఎవ్వరు

గర్భపాతమును ఒనర్తురో, పరద్రవ్యమును అపహరింతురో, గోవులను గాని అశ్వములను గాని హింసింతురో అట్టివారు రాబోవు జన్మమున పుత్రులు లేని వారగుదురు. ఒక వేళ బిడ్డలు కల్గుచున్నను మరణింతురు. నీవు కూడా పూర్వ జన్మమున శౌనకగోత్రుడైన ఒక బ్రాహ్మణుని వద్ద నుంచి 100 రూకలు అప్పుగా తీసుకొని ఎంతడిగిననూ నీవు తిరిగి ఇవ్వనందున, ద్రవ్యలోభముచే మదనపడి అతడు ఆత్మహత్య చేసుకొని, పిశాచమై, అతడే ఈ జన్మమున నీ బిడ్డలను చంపుచున్నాడు' అని చెప్పెను. అందుకు సుశీల ఖిన్నురాలై, ఆశ్చర్యముతో 'అయ్యా! మరి నా పాపముపశమించుటకు ఏదైనా ఉపాయము చెప్పండి' అని ప్రార్థించినది. అప్పుడా జ్యోతిష్కుడు "నీనిమిత్తముగా చచ్చిన బ్రాహ్మణుడు పిశాచం అయ్యాడు. అతనికి వంశీయులు లేకుండుట వల్ల కర్మకాండలు జరిగి ఉండలేదు. నీవు అతనిని ఉద్ధేశించి ప్రేతకర్మలు చేయుము. అతని గోత్రీకుడైన బ్రాహ్మణునకు ఆ 100 రూకలు అప్పును చెల్లించుము. కృష్ణానదీ తీరమునందు, పంచగంగా తీరంలో ప్రతి రోజూ స్నానం చేస్తూ, అచ్చటనున్న శ్రీ గురుని పాదుకలను పూజింపుము" అని చెప్పాడు. ఆమె 'అయ్యా! మీరు చెప్పిన మాసవ్రతమును నేను ఆచరించగలను కానీ, ఇప్పుడు నేను కడు బీదరాలను నేనా అప్పు చెల్లించలేను. ఇప్పుడు నేనేమి చేయాలి?' అని అడిగింది. ఆ జ్యోతిష్కుడు 'అమ్మా! సాక్షాత్తు శ్రీగురుని సేవించు. నిన్ను పిశాచ బాధ నుంచి ఆయనే రక్షించగలరు' అని చెప్పారు. అందుకామె సంతోషించి, మేడిచెట్టు మూలంలో ఉన్న శ్రీగురుని పాదుకలను, సకలోపచారములతో పూజించి, ఉపవాసదీక్షతో కామ్య తీర్థములో ఉన్న జలమును తీసుకొని వచ్చి మేడిచెట్టు మూలమును తడిపి, ప్రతిరోజూ ప్రదక్షిణ నమస్కారములు చేస్తూండేది. ఇట్లు మూడు రోజులు

గడిచిపోయాయి. మూడవ రోజు రాత్రి స్వప్నమున ఆమెకు పిశాచము కనబడి "నా ద్రవ్యము నాకిమ్ము లేనిచో నిన్ను చంపేస్తాను' అని బెదిరించుచూ ఆమెను సమీపించెను. ఆమె భయంతో మేడి చెట్టు వద్దకు పరిగెత్తి మూలమున ఉన్న శ్రీగురుని పాదుకలను గట్టిగా పట్టుకొని, ప్రార్థించుచూ కన్నులు మూసుకొనెను. మరలా కన్నులు తెరచునంతలో, పరమ కారుణ్య దయామూర్తియైన శ్రీ నృసింహ సరస్వతీ స్వాముల వారి దర్శనమయ్యెను. అప్పుడామె శ్రీ గురునితో, పిశాచ బాధ నుంచి రక్షించమని వేడుకొన్నది. ఇంతలో పిశాచము అక్కడకు వచ్చి స్వామివైపు చూస్తూ "స్వామీ! ఈమె పూర్వజన్మమున నా ద్రవ్యమును అపహరించి నా చావుకు కారకురాలైనది. మీరు యతీశ్వరులు. అట్టి మీరు ఆమె యందు పక్షపాతమును చూపుట ధర్మముకాదు" అన్నాడు. అప్పుడు శ్రీ గురుడు "ఓరీ! ఈమె నీ వద్ద 100 రూకలు తీసుకున్నది. పూర్వ జన్మలో కదా! పాపము, ఈ జన్మలో ఈమె బీద వనిత. అంత ద్రవ్యమును ఆమె ప్రస్తుతం చెల్లించలేదు. ఆవిడ చేత నీకు ఊర్ధ్వ దైహిక కర్మలు చేయించి, శక్తికి తగిన దానము నీ గోత్రీకుడైన బ్రాహ్మణునికి ఇప్పిస్తాము. మేము చెప్పినది నీకు నచ్చితే సరి, లేకపోతే శిక్షిస్తాము" అని గంభీర స్వరంతో శ్రీగురుడు పల్కిరి. అందుకు పిశాచము, 'స్వామీ మీ దర్శనం చేతనే నాలో తమోగుణం అంతరించినది, మనస్సు శాంతించినది, తమరి ఇష్టం వచ్చినట్టు చేయండి' అన్నాడు. అప్పుడు శ్రీ గురుడు, సుశీల వంక చూస్తూ ప్రేతమును ఉద్దేశించి, 'అమ్మా! మాసవ్రతమును ఆచరించుము. నీకు చేతనైనంత ధనమును ఈ పిశాచ గోత్రీకునకు దానమిమ్ము. నీకు పూర్ణాయుష్మంతులైన పుత్రులు కల్గెదరు' అని చెప్పి స్వామి వారు అదృశ్యులయిరి. ఆమె శ్రీగురుడు స్వప్నంలో చెప్పినట్టుగానే మాసవ్రతము ఆచరిస్తూ వుండేది. ఒక రోజు

ఆమెకు స్వప్నములో మరలా స్వామి దర్శనం ఇచ్చి రెండు కొబ్బరికాయులు ఆమె ఒడిలో ఉంచి, 'ఈ ఫలమును భక్షింపుము, నీకు సంతాన వృద్ధి కల్గును. నీకు పిశాచ బాధ తొలగిపోయింది. పిశాచమునకు కూడా సద్గతి లభించింది." అని చెప్పి అంతర్ధానమైరి. ఆమెకు మెలుకువ వచ్చింది. మెలకువ వచ్చి చూచేసరికి ఆమె ప్రక్కనే రెండు కొబ్బరికాయలున్నవి. ప్రక్కనే నిద్రపోతున్న భర్తను లేపి జరిగినదంతా చెప్పి, ప్రక్కనే ఉన్న కొబ్బరికాయలను తీసుకొని ఇంటికి వెళ్ళి ఆరగించినది. గురుకృపచే ఆమె గర్భవతి అయింది. నవమాసములు నిండి ఇద్దరు పిల్లలు జన్మించారు. పెద్దవానికి ఏడవ సంవత్సరము రాగా, వానికి ఉపనయనము, చిన్నవానికి క్షురకర్మ చేయించాలనే ఉద్దేశ్యంతో ముహూర్తం ఏర్పాటు చేసుకున్నది. రేపు ముహూర్తమనగా అదేం విచిత్రమో గాని, పెద్దవాడు మరణించాడు. అప్పుడా తల్లి దుఃఖముతో శిరస్సును బాదుకొనుచూ, నేలపై పడి పొర్లుతూ, కన్నీరు మున్నీరుగా దుఃఖించ సాగింది. "నాయనా! కుమారా! ఎచ్చటికెళ్ళావు నీవు? నీ ముద్దు మాటలను నేను మరువగలనా? ఎందరో పిల్లలు చనిపోయిన తర్వాత శ్రీగురుని వరము వలన కలిగిన నీవు దీర్ఘాయుష్మంతుడవని సంతోషించాను. మా ముసలితనము నందు నీవు మమ్ములను కాపాడతావని ఆశించాము. దైవానుగ్రహం కోసం దేవాలయంలోకి వెళ్ళిన వ్యక్తి మీద దేవాలయం విరిగిపడినట్లుగా, మంచి నీటికని కొలను చేరిన వాడు మొసలి నోట్లో పడ్డట్టుగా, పులి నుంచి తప్పించుకున్న ఆవు గోమాంసం తినే యవనుడి పాలిట పడినట్టుగా అయినది నా పని. శ్రీ గురుని వరము ననుసరించి ఎంతో ఆశ పెట్టుకున్నాను" అని ఆశవంపై బడి దుఃఖించసాగెను. ఇంతలో ఆ ఊరి వారందరూ వచ్చి అమ్మా! జరిగినదేదో జరిగిపోయింది. పుట్టిన వానికి

మరణం తప్పదుకదా! శవానికి అంత్యక్రియలు ఏర్పాటు చేయండని చెప్పారు. కానీ ఆవిడ మాత్రము 'శవంతో బాటు నన్ను కూడా దహనం చేయండి, అంతే గాని నేను మాత్రం శవాన్ని ఇవ్వను'. అని బిడ్డ మీద వాత్సల్యంతో శవాన్ని అక్కున చేర్చుకొని దుఃఖించసాగింది. ఇంతలో అక్కడకు ఒక బ్రహ్మచారి వచ్చి ఆమెకు తత్త్వాన్ని ఉపదేశించాడు. అతడు ఎవ్వరో కాదు, త్రిమూర్తి స్వరూపుడు, భక్త వత్సలుడైన శ్రీగురుడే.

ఓం శ్రీదత్తాయ గురవే నమః

ఓం శ్రీపాద స్వామినే నమః   **ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః**

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

(20వ అధ్యాయం సంపూర్ణం)


కొలది కొలదిగా పుట్టును తొలుత చెదలు
కొరికి తినివేయు త్వరలోన కొయ్యనంతా
దుష్ట గుణములు సూక్ష్మమై తోచు మొదలు.
పిదప నాశంబు చేయు నేపెద్దనైనా
రాగము అరికట్టనేరని జోగి యైనను పతనము నొందు
భోగము విడనాడు వానికే యోగమిలలో పట్టుపడునురా
మరచిపోకుడు శివానందుని మంచిమాట


★★★

గురురసంబును ప్రీతితో అలరార గ్రోలితి
పూర్తిగాను మారిపోయితి నేను
కుండ కాలియుండ కుమ్మరి సారెపై
పెట్టడింక అని శివానంద పలికె
మరచిపోకుడు శివానందుని మంచిమాట

– శ్రీ స్వామి శివానంద మహారాజ్

21 వ అధ్యాయము





శ్రీ గణేశాయ నమః



శ్రీ సరస్వత్యై నమః

శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

సిద్ధమునీంద్రుడు ఇంకా ఈ విధంగా చెప్తున్నాడు. పుత్రశోకంతో ఖిన్నురాలై వున్న సుశీలా దేవి వద్దకు ఒక బ్రహ్మచారి వచ్చి, ఇలా అన్నాడు. "అమ్మా! నీవు మూర్ఖంగా దుఃఖించవద్దు. మాయకు వశులైన మానవులు, ఈ దేహమే తామన్న భ్రాంతిని పొంది, బిడ్డ, భార్య, మిత్రులు అనే మమకారాన్ని పెంచుకుంటారు. వారు సత్వ గుణం వలన దేవత్వాన్ని, రజోగుణం వలన మానవత్వాన్ని, తమోగుణం వలన అధోగతిని పొంది కర్మఫలాన్ని అనుభవిస్తారు. ఎవరైనా వారి వారి పూర్వజన్మలను అనుసరించే మరణిస్తారు. నిజానికి ఈ శరీరం రక్తము, మాంసము, ధాతువులతో నిండి ఉంది. ఎవరెవరు ఎన్నెన్ని జన్మలలో ఎవరికి తల్లులో, ఎవరికి బిడ్డలో ఎవరి కెరుక? అతడు నీ బిడ్డ అనే భ్రాంతిలో నీవు శోకిస్తున్నావు. ఆ మమకారాన్ని విడిచి పెట్టి శవాన్ని అంత్యక్రియలకు అప్పగించు" అన్నాడు.

ఆ మాటలు విన్న సుశీలాదేవి "తండ్రీ! నీవు చెప్పేది ధర్మమేగాని, అది నా మనస్సులో కొంచెం కూడా నిలవటం లేదు. జనన మరణాలకు

మూలం 'కర్మే' అయితే భగవంతుడు సేవ వలన నశిస్తుందని చెప్పారు కదా! అలాగని శ్రీగురుడు నాకు అభయాన్ని గూడా ఇచ్చారు. మరిప్పుడు నాకు మంచి ఎందుకు జరగలేదు? రోగులు వైద్యులు ఇచ్చే మందుతో జబ్బును తగ్గించుకుంటారు. పేద వారు శ్రీమంతులిచ్చే ధనంతో కష్టాలను తొలగించుకుంటారు. అలాగే నేను కూడా శ్రీ గురుని సేవించి, ఆయన వరాన్ని నమ్ముకున్నాను. నా బిడ్డ దీర్ఘాయుష్మంతుడౌతాడని ఆయన వరమిచ్చారు. అటువంటిది ఇప్పుడు విఫలము ఎందుకవ్వాలి?" అన్నది. అప్పుడా బ్రహ్మచారి "అమ్మా అలాగైతే నీకు ఎక్కడైతే వరం లభించిందో, అక్కడకే ఈ శవాన్ని తీసుకొని వెళ్ళి అడుగు' అని అన్నాడు. అందుకా సుశీల శవాన్ని తన కడుపుకు కట్టుకొని, శ్రీ గురుడు అధివసించిన మేడిచెట్టు వద్దకు వెళ్ళింది. అక్కడ పాదుకలకు తన తలను కొట్టుకుంటూ దుఃఖించింది. రక్తంతో పాదుకలు తడిసిపోయాయి. సాయంకాల మయ్యేసరికి ఊరి వారందరూ వచ్చి 'అమ్మా! నీవు దుఃఖాన్ని అణచుకుని శవాన్ని అప్పగించు అంత్యక్రియలు చేస్తాము. శవం వాసన కూడా వస్తున్నది" అని అడిగారు. కానీ ఆవిడ మాత్రము శవాన్ని మరింత గట్టిగా పట్టుకొని, పాదుకులకు తలకొట్టు కొంటూ శవాన్ని ఇవ్వనన్నది. వేరు దారి లేక ఆ ఊరి వారందరూ 'వెళ్దాం పదండి చీకటి పడ్తున్నది. ఈ ప్రదేశం ఊరికెంతో దూరం కనుక, ఏకాంతము, భయంకరము అయిన ఈ ప్రదేశంలో ఎక్కువసేపు ఉండకూడదు. రేపు ఉదయం వద్దాము. అప్పుడిక శవం బాగా దుర్వాసన కొడుతుంది. అప్పుడు ఆవిడే అప్పగిస్తుంది. వెళ్దాంపదండి' అని అనుకొని తమ తమ ఇళ్ళకు వెళ్ళిపోయారు. సుశీల, ఆమె భర్త మాత్రం ఆ రాత్రి అక్కడే ఉండిపోయారు. దుఃఖించి అలసిన సుశీలకు తెల్లవారు ఝామున మంచి కునుకు పట్టింది.

ఆమెకు ఒక స్వప్నం వచ్చింది. స్వప్నంలో శ్రీ గురుడు దర్శనమిచ్చారు. ఆయన వీరున్న వృక్షం వద్దకు వచ్చి "అమ్మా మాపై కోపం ఎందుకు? నీ బిడ్డకు ఏమైంది? ఇప్పుడే నీ బిడ్డను బ్రతికిస్తాను' అని శవం వద్దకు వెళ్ళి బిడ్డ శరీరం నుంచి వెడలిపోయిన ప్రాణవాయువును మరల ప్రతిష్టించారు. ఇక దుఃఖించవద్దు" అని చెప్పి అంతర్థానమయ్యారు. సుశీలా దేవి త్రుళ్ళిపడి నిద్ర లేచింది. ఇది నా పుత్ర వ్యామోహం వల్ల వచ్చిన కలేగాని, చనిపోయివాడు ఇంక బ్రతుకుతాడా? నా కర్మ ఇలా ఉంటే శ్రీ గురుడు ఏమి చేస్తారు? అనుకున్నది. ఇంతలో పక్కనున్న శవం కదలసాగింది. శవాన్ని తాకి చూస్తే వెచ్చగా ఉంది. ఆమెకు ఆ శవ శరీరంలో ఏదైనా భూతం ఆవేశించిందేమో అని భయం వేసి దూరంగా వెళ్ళింది. కాని పిల్లవాడు లేచి కూర్చుని 'అమ్మా! నాకు ఆకలేస్తోంది, అన్నం పెట్టు' అన్నాడు. అపుడామెకు అద్భుతంగా స్తన్యం వచ్చింది. పక్కనున్న భర్తను లేపి, బిడ్డకు తృప్తిగా పాలిచ్చింది. అప్పుడా దంపతులు భక్తితో ఔదుంబర వృక్షానికి ప్రదక్షిణలు, సాష్టాంగ నమస్కారములు చేసి, శ్రీ గురునిలా ప్రార్థించారు.

"ఓ త్రిమూర్తి స్వరూపా! నీకు జయము ! జయము ! నీవు భక్త వత్సలుడవు! నీ మహిమలు వర్ణించుట ఎవరి తరము? మా అపరాధం క్షమించుము. పిల్లలు కోపం వచ్చినపుడు తల్లిదండ్రులను తూలనాడతారు. అలానే కష్టకాలము నందు మేము మిమ్ములను తూలనాడితిమి. మీరే మాకు శరణ్యము" అని ప్రార్థించి, రక్తంతో తడిసిన గురు పాదుకలను శుభ్రంగా కడిగిరి. ఇంతలో తెల్లవారినది. గ్రామస్థులు వచ్చి, బాలుడు బ్రతికి ఉండటం చూసి ఆశ్చర్య చకితులైరి.

నామధారకా ! ఈ గురుస్థానము యొక్క మహిమను తెల్సుకున్నావు

కదా! **శ్రీ గురుడు సర్వకాలముల యందు ఈ వృక్ష మూలమున ఉందురు. ఈ వృక్షమును పూజించిన వారికి మనోరధములన్నీ నెరవేరును. దరిద్రులు శ్రీమంతులగుదురు. రోగులు ఆరోగ్యవంతులగుదురు. కుష్టురోగంతో బాధపడువారు, అంగహీనులు సువర్ణదేహులు కాగలరు. హృదయ శూల, గండశూల అపస్మారకము మొదలగు రోగాలు సహతము ఉపశమించును.** అని సిద్ధముని నామధారకునితో చెప్పెను.

శ్లో. తత్త్వంయో మృత పుత్రాయై బోధ యిత్వాప్య జీవయత్ ।
మృతం కల్పదృమస్థఃస శ్రీ దత్త శ్శరణం మమ ॥

(ఈ పై శ్లోకమును చదివి, పై 20, 21 అధ్యాయాలు రెండునూ, నిత్యము 40 రోజులు నియమ నిష్టలతో పారాయణ చేసినచో సంతాన ప్రాప్తి కల్గును)

ఓం శ్రీదత్తాయ గురవే నమః

ఓం శ్రీపాద స్వామినే నమః ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

(21వ అధ్యాయం సంపూర్ణం)


(శుక్రవారపు పారాయణం పూర్తి అయినది)


హరికృపా తబ జానియే దేమానవ్ అవతార్
గురుకృపా తబజానియే ఛుడావే సంసార్

భగవానుని కృపచేత గురుదేవుడు మానవ దేహముతో గోచరిస్తాడు. గురుదేవుని కృప చేత సంసారసాగరము నుంచి బయటపడి తరిస్తాము.

– భక్త కబీర్

22 వ అధ్యాయము





శ్రీ గణేశాయ నమః



శ్రీ సరస్వత్యై నమః

శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

శ్లో. దో హయామాస భిక్షార్థం యోవంధ్యాం మహిషీం ప్రభుః ।
దారిద్ర దావదావస్సః శ్రీదత్తశ్శరణం మమ ॥

(దారిద్ర్యంతో బాధపడేవారును, పాడి పంటలు సమృద్ధిగా పొందగోరువారు ఈపై శ్లోకమును చదివి, క్రింది అధ్యాయమును 40 రోజులు పారాయణం చేసిన యెడల శ్రీ గురుని అనుగ్రహం లభించును)

నామధారకుడు సిద్ధయోగికి నమస్కరించి 'స్వామీ! అమరపురం నుంచి శ్రీగురుడు గంధర్వనగరం ప్రవేశించారని చెప్పారు కదా! అచ్చట లీలలను కూడా తెల్పి నన్ను కృతార్థుడను చేయండి' అని వేడుకున్నాడు. అంత సిద్ధయోగి "నాయనా! నామధారకా! నీవు గురుకృపకు పాత్రుడ వయ్యావు. కామధేనువుతో సమానం అయిన గురులీలను చెప్తాను, శ్రద్ధగా విను.

స్వామివారు గంధర్వపురంలో సంగమమున కొంతకాలం గుప్తంగా

ఉన్నారు. అచ్చట భీమానది ఉత్తర వాహినియై ప్రవహిస్తున్నది. అమరజానది వచ్చి భీమానదిలో కలియును. ఈ సంగమ స్థానము గొప్ప తీర్థ క్షేత్రము అయినది. అక్కడ ఒక అశ్వద్ధ వృక్షం కలదు. ఆ క్షేత్రం ప్రయాగతో సమానమైనది. ఇంకనూ ఇక్కడ అష్ట తీర్థములు కలవు. స్వామివారు సంగమమున అశ్వద్ధ వృక్ష ప్రాంతమున నివసించుచూ మధ్యాహ్న కాలమునకు భిక్షకై గంధర్వ నగరానికి వెళ్ళేవారు. అది ఒక బ్రాహ్మణ అగ్రహారం. అక్కడ ఒక బీద బ్రాహ్మణుడు ఉన్నాడు. వారి ఇంట గొడ్డుబోతు ముసలి బర్రె ఉన్నది. దానిని బరువులు మోయుటకు, బాడుగ పనులకు తీసుకుని వెళ్ళేవారు. ఆ గ్రామంలోని వారు 'ఈ సన్యాసి ఎవరో గాని ఆ బీద బ్రాహ్మణుడి ఇంటికే భిక్షకు పోవాలా? మన ఇళ్ళకు వచ్చినచో షడ్రశోపేతమైన భోజనం లభించును కదా! అక్కడ ఆయనకు ఏమి దొరకుతుంది?' అని శ్రీ గురుని గూర్చి అనుకునేవారు.

ఒక వైశాఖమాసము, మధ్యాహ్న సమయం ఎండ నిప్పులు గక్కుమున్న సమయంలో, శ్రీ గురుడు ఆ బ్రాహ్మణుని ఇంటికి వెళ్ళి భిక్ష అడిగెను. ఆ బ్రాహ్మణుని భార్య స్వామికి పీటవేసి కూర్చుండబెట్టి 'స్వామీ! యజమాని భిక్షకై గ్రామంలోనికి వెళ్ళారు. మా దురదృష్టవశమున ఈ రోజు ఈ బర్రెను బాడుగకు ఎవ్వరూ తీసుకువెళ్ళలేదు. వారు వచ్చే సమయం ఆసన్నమయినది. దయచేసి కొద్దిసేపు కూర్చోండి' అని ప్రార్థించింది. శ్రీ గురుడు ఆమె మాటకు నవ్వుతూ "అమ్మా! నీ భర్త వచ్చేదాక ఆగడానికి మాకు సమయం లేదు. ఆ బర్రె కలదు కదా! దాని పాలు ఇచ్చినచో త్రాగి వెళ్తాము" అన్నారు. అందుకామె "స్వామీ ఏమి చెప్పేది? ఈ గేదె ఇంతవరకూ కట్టనూ లేదు, ఈననూ లేదు. ముసలిదైపోయినదిప్పుడు. దీన్ని ప్రతిరోజు గ్రామస్థులు బాడుగకు తీసుకువెళ్ళేవారు. ఈ రోజు ఎవ్వరూ

రాలేదు. ఇది పాలెలా ఇవ్వగలదు?" అన్నది. శ్రీ గురుడు పెద్దగా నవ్వుతూ "అవన్నీ మాకు తెలియదు. ఆ గేదె పాలను మేము త్రాగుతాము" అన్నారు. వెంటనే ఆవిడ వారి కళ్ళ ముందే పాలు పితికితే నిజం తెలుస్తుందని, ఒక పాత్ర తీసుకుని, ఆ బర్రెను సమీపించి, పితకనారంభించింది. ఆశ్చర్యంగా ఆ గేదె రెండు పాత్రల నిండుగా పాలను ఇచ్చింది. ఆ బ్రాహ్మణుని భార్య అమిత ఆశ్చర్య ఆనందములతో వీరు సాక్షాత్తు పరమేశ్వరులే అన్నభావంతో, ఆ పాలను వేడిచేసి స్వామివారికి సమర్పించింది. శ్రీ గురుడు తృప్తిగా సేవించి "అమ్మా! మీరు అఖండ లక్ష్మి సంపన్నులు కాగలరు. ఇహపరసౌఖ్యములన్నీ పొందగలరు" అని ఆశీర్వదించి, తమ నివాసస్థానం అయిన సంగమానికి వెళ్ళిపోయిరి. నామధారకా! చూచావా! శ్రీ గురుని యొక్క మహిమ. వారు సాక్షాత్తు పరమేశ్వరులే" అని సిద్ధయోగి చెప్పాడు.

ఓం శ్రీదత్తాయ గురవే నమః

ఓం శ్రీపాద స్వామినే నమః **ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః**

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః


(22వ అధ్యాయం సంపూర్ణం)

కాగితంబు నందు కల్గిన అక్షరాల్
చదివినంతనే ధరణి చతురుడుగునా
అక్షరంబులయందు అర్థంబులనెరింగి
చదువునట్టివాడె శ్రేష్ఠుడగును.

-- శ్రీస్వామి శివానందమహారాజ్ --



23 వ అధ్యాయము



శ్రీ సరస్వత్యై నమః



శ్రీ గణేశాయ నమః



శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

శ్లో. **రాజప్రార్థితయే త్యాస్థాన్ మఠేయో గాణగాపురేచ ।**
బ్రహ్మరాక్షస ముద్ధర్తా శ్రీ దత్తశరణం మమ ॥

(నిత్యమూ ఈ పై శ్లోకాన్ని చదివి క్రింది అధ్యాయమును పారాయణం చేసిన యెడల వాస్తు దోషములు తొలగి గ్రహబాధలు తగ్గును.)

సిద్ధముని నామధారకునితో ఇంకా ఈ విధంగా చెబుతూ ఉన్నాడు. నామధారకా! శ్రీగురుడు గొడ్డు బఱ్రెనుంచి పాలు పితికించిన వార్త ఆ గ్రామ ప్రజలందర్కీ తెల్పి చివరకు ఆ నగరమేలే రాజుకు కూడా ఆ వార్త చేరింది. ఆ రాజు బ్రాహ్మణుని ఇంటికి వచ్చి జరిగిన వింత తెల్సుకుని, ఆ బఱ్రెను చూచి, ఆది సంగమంలో నివసిస్తున్న యతీశ్వరుని మహిమ అని తెల్సుకొని పుత్ర, మిత్ర, కళత్ర, బంధు సహితంగా సైన్యమును వెంటబెట్టుకొని శ్రీగురుని వద్దకు వచ్చి నమస్కరించి ఇట్లు స్తుతించెను.

"జగద్గురూ ! దత్త స్వరూపా ! మీరు త్రిమూర్తి స్వరూపులు. ఇంత కాలముగా అమరమైన మీ మహిమలను తెలియక దుఃఖిస్తున్నాను. మీరు విశ్వతారకులు. మాయామోహాంధకారంలో మునిగి ఉన్న నన్ను రక్షించండి.

సామాన్య మానవులకు సన్యాసిరూపంలో అగుపడుతున్న మీరు విశ్వాతీతులు" అని భక్తితో ప్రార్థించెను. శ్రీగురుడు "రాజా! మేము అరణ్యాలలో నివసించే సన్యాసులము. నీవు భార్యాపుత్రులతో ఇక్కడకు రావటానికి గల కారణమేమి?" అని అడిగారు. అప్పుడా రాజు "స్వామీ! మీరు భక్తులనుద్ధరించుటకు అవతరించిన నారాయణ స్వరూపులే. మీరు ఈ అరణ్యమునందు నివసించ వలదు. మా నగరమునకు విచ్చేసి మమ్మల్ని పావనం చేయండి. మీరు నివసించుటకు అనువుగా ఒక మఠమును నిర్మించి సమర్పించుకుంటాను. మాకు మీ సేవచేసుకొనే భాగ్యాన్ని కలుగచేయండి" అని ప్రార్థించాడు. స్వామి అతని భక్తికి సంతోషించి, తమలో తాము "కొంతకాలము ఇతని రాజ్యంలో ఉండి, ఇతని రాజ్యాన్నీ, భక్తులనూ, ఉద్ధరించాలి. ఇక మేము ప్రకటితమయ్యే సమయం ఆసన్నమైనది. ఇది భగవదేచ్ఛ" అని తలచి అంగీకారాన్ని తెల్పారు. అప్పుడా రాజు శ్రీగురుడ్ని సువర్ణమయమైన పల్లకీలో మెత్తని పడకలు ఏర్పాటు చేసి, అందు కూర్చుండ బెట్టి, బ్రాహ్మణులు వేద ఘోష చేయుచుండగా, మృదు మధుర మంగళ వాయిద్యాలతో అడుగడుగునా నీరాజనములు ఇచ్చుకుంటూ గంధర్వ నగరంలోనికి ప్రవేశించసాగారు. ఆ గ్రామానికి పశ్చిమ భాగమున అశ్వద్ధవృక్షం (రావి చెట్టు) కలదు. ఆ వృక్షమున ఎంతకాలం నుండియో ఒక బ్రహ్మరాక్షసి నివసించుచుండెను. అచ్చట రాక్షసి నివసించుట చేత ఆ ప్రాంతమంతయూ జన సంచారమునకు నోచుకోలేదు. శ్రీగురుని యొక్క పల్లకీ ఆ వృక్షం క్రింద నుండి వస్తూ ఉన్నది. బ్రహ్మ రాక్షసి చెట్టు నుండి దిగి, శ్రీగురున్ని సమీపించి, చేతులు జోడించి నమస్కరిస్తూ "స్వామీ! నన్ను ఉద్ధరించండి" అని వేడుకున్నది. శ్రీగురుడు తమ దివ్యహస్తములను దాని నెత్తిపై ఉంచి ఆశీర్వదించారు. తక్షణమే అంతవరకూ అదృశ్యరూపంలో ఉన్న ఆ పిశాచి మానవాకారం

కల్గి అందర్కీ కన్పించింది. స్వామివారు ఆ పిశాచితో "నీవు సంగమానికి వెళ్ళి స్నానం చేయి, ముక్తిని పొందగలవు" అని చెప్పారు. అది అలాగే చేసి ముక్తిని పొందినది. అద్భుతం అయిన ఆ లీలలను జనులంతా చూచి, స్వామి మానవమాత్రులు కారని పరమయోగీశ్వరుడైన దత్త స్వరూపమని, త్రిమూర్తి స్వరూపుడని నిశ్చయించు కున్నారు. అప్పుడు శ్రీగురుడు ఆ అశ్వద్ధ వృక్షం క్రిందనే పల్లకీని దింపించి, ఒక పాడు బడిన ఇల్లును చూపి "నాకిక్కడే మఠ నిర్మాణం చేయండి" అన్నారు. అప్పుడా రాజు అత్యంత సుందరంగా మఠం నిర్మించాడు.

శ్రీగురుడు ప్రతిరోజూ మఠం నుంచి అనుష్టానం కొరకు సంగమానికి వెళ్ళి వచ్చేవారు. ఆ రాజు స్వామిని పల్లకీలో కూర్చుండబెట్టి అనుష్టానమునకు, వన విహారమునకు తీసుకుని వెళ్లేవాడు. శ్రీగురుని యొక్క మహిమ విని ఎంతో మంది వచ్చేవారు. అచ్చట బ్రాహ్మణ సంతర్పణములు చాలా విరివిగా జరుగుతూండేవి. అచ్చటికి దగ్గరలో 'కుమసి' అను గ్రామం ఉంది. అక్కడ 'త్రివిక్రమ భారతి' అనే యతి ఒకడు కలడు. అతడు వేద శాస్త్రాలయందు పాండిత్యం కలవాడు. ఇతరుల నుండి శ్రీగురుని గురించి విని, శ్రీగురుని గూర్చి "ఆ యతి డాంభికుడు సన్యాసాశ్రమానికి విరుద్ధంగా వైభవాన్ని అనుభవిస్తున్నాడు. సన్యాసులకు పల్లకీతో, రాజులతో, జనసంచారంతో పనియేమి?" అని విమర్శిస్తూండే వాడు. ఒకసారి త్రివిక్రమ భారతి చేసిన స్వనిందను శ్రీగురుడు విన్నారు.


ఓం శ్రీదత్తాయ గురవే నమః

ఓం శ్రీపాద స్వామినే నమః **ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః**

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

(23వ అధ్యాయం సంపూర్ణం)

24 వ అధ్యాయము



శ్రీ సరస్వత్యై నమః



శ్రీ గణేశాయ నమః



శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

శ్లో. విశ్వరూపం నిందకాయ శిబికాస్థః స్వలం కృతః ।
గర్వహోదర్శయత్యః సశ్రీ దత్తశ్శరణం మమ ॥

(భావము : త్రివిక్రమ భారతికి విశ్వరూపమును స్వామివారు చూపించి అతని గర్వమును అణచుట)

సిద్ధయోగి నామధారకునితో ఇలా చెప్పాడు : నాయనా! నామధారకా! శ్రీనృసింహసరస్వతీ స్వాములవారు ఒకసారి మఠంలో కూర్చొని ఉండగా కుమసి గ్రామం నుంచి కొంతమంది భక్తులు వచ్చి స్వామివారిని తమ గ్రామానికి ఆహ్వానించారు. స్వామివారు అంగీకారమును తీసుకొని, పల్లకీలో కూర్చుండబెట్టి, గీత వాద్యములతో, మంగళ వాయిద్యములతో, మహోత్సవంగా కుమసి గ్రామానికి తీసుకువెళ్ళారు. ఆ రోజు త్రివిక్రమభారతి నిత్యపూజ చేసుకొనేందుకు కూర్చున్నాడు. త్రివిక్రమభారతికి ప్రతిరోజు నరసింహస్వామి వారి దర్శనం జరిగేది. అదేమి విచిత్రమోగాని, ఆనాడు పూజకు కూర్చున్నప్పటి నుండి మత్తు ఆవహించి ఉండినది. ఆ మత్తులో శ్రీ నృసింహ సరస్వతీ స్వాములవారి దర్శనం అయినది. మరలా కూర్చున్ననూ శ్రీగురుని ప్రతిరూపము అతని మనస్సున కన్పించుచున్నది.

అప్పుడతడు పూజను చాలించి, గ్రామంలోనికి వచ్చి, శ్రీగురుని దర్శించి, "స్వామీ నృసింహా! త్రిమూర్తి స్వరూపా!" అని స్తుతించాడు. అంతలో, అతనికి అక్కడ ఉన్న సమస్త ప్రాణులు – రాజు, అతని పరివారం, కుమసీ గ్రామస్థులు, నృసింహస్వామి వారి రూపాలుగా కన్పించారు. వెంటనే త్రివిక్రమ భారతి ఆశ్చర్య చకితుడై శ్రీగురునికి ప్రణామం ఆచరించి "స్వామీ! వీరందరిలో మీ రూపం ఏదో తెల్సుకోలేకపోతున్నాను. మీ నిజరూపాన్ని దర్శింపచేసి నన్ను ధన్యుడను చేయండి" అని వేడుకున్నాడు. అప్పుడు సమస్త ప్రాణులు యథార్ధ రూపాలతో కన్పించారు. త్రివిక్రమభారతి ఆశ్చర్యచకితుడై నమస్కరిస్తూండగా, శ్రీగురుడు "నాయనా! నన్ను విమర్శించావు గదా ! డాంభికుల లక్షణాలేమిటో నీ నుంచి తెల్సుకోవాలను కుంటున్నాను" అన్నారు. అప్పుడా త్రివిక్రమభారతి "స్వామీ! శ్రీగురూ! సచ్చిదానంద స్వరూపా! మీ మహిమ అపారము, నన్ను ఉద్ధరించండి" అని వేడుకున్నాడు. చూచావా! నామధారకా ! గురువు యొక్క మహిమను వర్ణించడం ఎవరితరం? ఎవరైతే అట్టి మహాత్ముని సామాన్యమానవునిగా భావించెదరో, అట్టివారు ఏడు జన్మలు నరకము అనుభవింతురు. గురువే బ్రహ్మ, విష్ణువు, శివుడని వేదములు ఘోషించుచున్నవి. కాబట్టి నాయనా! నీవు కూడా గురు పాదముల యందు విశ్వాసం ఉంచి సుఖంగా ఉండు. ఈ గురులీల అను చలివేంద్రమును భగవంతుడు మనకు ప్రసాదించెను. కావున పూర్వ జన్మ సుకృతం కల్గినవారే ఈ కథామృతమును పానము చేయగలరు.


ఓం శ్రీదత్తాయ గురవే నమః


ఓం శ్రీపాద స్వామినే నమః ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

(24వ అధ్యాయం సంపూర్ణం)

25 వ అధ్యాయము





శ్రీ గణేశాయ నమః



శ్రీ సరస్వత్యై నమః

శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

శ్లో. త్రివిక్రమేణచానీ తౌ గర్వితౌ బ్రాహ్మణద్విషౌ ।
బోధయామాస తౌ యః స శ్రీదత్త శరణంమమ॥

(త్రివిక్రమ భారతి గర్వాంధులైన ఇద్దరు బ్రాహ్మణ పండితులను తీసుకుని రాగా వారికి వేదమును బోధించిన శ్రీ దత్తా నీవే నాకు శరణు.)

నామధారకుడు సిద్ధమునితో "స్వామీ! త్రివిక్రమభారతికి విశ్వరూప సందర్శనం ఇచ్చిన తర్వాత శ్రీగురుడు గాణ్గాపురం వచ్చారని చెప్పారు కదా! ఆ తర్వాత జరిగిన లీలలు చెప్పి నన్ను కృతార్థుడను చేయండని వేడుకున్నాడు.

నాయనా! 'వైధూర్యమనే' నగరం ఒకటి కలదు. అక్కడ యవనరాజు ఒకడు కలడు. అతడు బ్రహ్మద్వేషి, కౄరుడు, అతడు బ్రాహ్మణులను పిలిపించి మీకు కావాల్సినంత ధనం ఇస్తాను. మీ వేదాల యొక్క అర్థం తెల్పిండి అని హింసించేవాడు. డబ్బుకాశించి వచ్చిన బ్రాహ్మణులు వేదార్థం చెప్పిన తర్వాత "యజ్ఞాలలో పశు హింసచేసే బ్రాహ్మణులు మమ్మల్ని ఆక్షేపింతురు. మీరెట్లు యజ్ఞములనే పేరుతో పశువులను

హింసించుచున్నారు?" అని పరాభవించేవాడు. కొందరు పండితులు మాత్రం వివేకంగా మాకు వేదార్థమే తెలియదని తప్పుకొనేవారు. ఒకసారి ఆ రాజ్యానికి దక్షిణాది నుంచి ఇద్దరు బ్రాహ్మణులు వచ్చి, రాజు వద్దకు వెళ్ళి "రాజా! మేము వేదములను సమగ్రంగా తెల్సుకున్నాము. వేదంలోమాతో వాదించగల వాళ్ళు ఎవరూ లేరు. మీ రాజ్యంలో ఎవరైనా ఉంటే పిలిపించండి" అన్నారు. ఆ తురక రాజు వారి మాటలు విని, పరాయి మతాన్ని కించపర్చడానికి మరో మంచి అవకాశం దొరికిందని తలచి, తన రాజ్యమంతా దండోరా వేయించాడు. ఆ పండితులిద్దర్నీ ఓడించిన వారికి ఘనంగా బహుమతులును, అగ్రహారాన్ని బహుమతిగా ఇస్తానని దండోరా వేయించాడు. ఆ రాజు తత్త్వాన్ని తెల్సిన పండితులెవ్వరూ చర్చలో పాల్గొనలేదు. అప్పుడా రాజు వారిద్దరికీ భారీఎత్తున దక్షిణలిచ్చి, సత్కరించి, ఏనుగులపై ఊరేగించి ఒక అగ్రహారం కూడా బహుమానంగా ఇచ్చాడు. ఆ మూర్ఖ పండితులు ఇద్దరూ ఆ రాజ్యంలోనే ఉంటూ, ప్రతీరోజూ ఏనుగులపై ఊరేగుతూ, మిగతా పండితులందర్నీ విమర్శించి దూషించేవారు. ఒకసారి పండితులిద్దరూ రాజు వద్దకు వెళ్ళి "రాజా! ఇక్కడ మా ప్రతిభ అంతా తెలియటం వల్ల ఎవ్వరూ మాతో వాదనకు రావట్లేదు. కనుక మేము దేశం అంతా తిరిగి పండితులందరితో వాదించి జయపత్రికలు ప్రోగుచేద్దాం అనుకుంటున్నాము. మాకు తగిన ఏర్పాట్లు చేయండి" అన్నారు. అందుకు రాజు తగిన ఏర్పాట్లు చేశాడు. ఆ మదాంధులు ఊరూరా తిరుగుతూ, కనిపించిన పండితులనందర్నీ విమర్శిస్తూ, జయపత్రికలు ప్రోగు చేసుకుంటూ కుమసీ గ్రామానికి దగ్గరగా వచ్చి ఇచ్చట వేద పండితుడెవడు? అని తెల్సుకొని, త్రివిక్రమ భారతి వద్దకు వచ్చి, వాదమైన చేయమని లేదా జయపత్రికైనా ఇవ్వమని అన్నారు.

అప్పుడు త్రివిక్రమ భారతి "అయ్యా! నేనా అరణ్యంలో ముక్కు మూసుకొని తపస్సు చేసుకుంటున్న భిక్షువును. నాకూ, మీలా వేదాలు తెల్సి ఉంటే రాజసన్మానాలు చేయించుకుంటూ సుఖంగా జీవించే వాడిని కదా!" అన్నాడు. అందుకు ఆ అహంకారులు జయపత్రిక ఇవ్వమని, లేదా వాదించమని పట్టుబట్టారు. అప్పుడా త్రివిక్రమభారతి వీరికి పాండిత్యము తలకెక్కింది. వీరికి బుద్ధి చెప్పుటకు గురుదేవులే సమర్థులు అనుకొని 'అయ్యా! నేను స్వతంత్రుడను గాను. గంధర్వపురంలో నృసింహ సరస్వతీ స్వామి అనే మా గురువు గారున్నారు. వారి ఆజ్ఞ తీసుకొని, వారేది చేయమంటే అది చేస్తాను' అన్నాడు. అందుకు మదాంధులు అంగీకరించి గంధర్వపురానికి బయలు దేరారు. త్రివిక్రమ భారతి వినయంతో కాలి నడకన వెళ్తూంటే, వారిద్దరూ ఏనుగుల మీదనెక్కి బయలుదేరారు. సాధు సత్పురుషుల వద్దకు అలా వెళ్ళటం వల్ల ఆయుఃక్షీణమవు తుందన్న విషయాన్ని గూడా వారు మర్చిపోయారు. మఠం చేరుకున్న తర్వాత త్రివిక్రమభారతి శ్రీ గురునికి నమస్కరించి "పరాత్పరా! గుడ్ల గూబ పగటి వెలుగును చూడలేనట్లే అజ్ఞానాంధకారులైన మానవులు మిమ్మల్ని ఎరుగలేరు, అని అంటూ పండితులిద్దరి విషయంగురించి వివరించి చెప్పి, మీరేది చేయమంటే అది చేస్తాను'' అన్నాడు. శ్రీగురుడు వారితో "నాయనలారా! మీ వంటి వేదవిదులకు వాదించటం వల్ల లాభం ఏం ఉన్నది? వాదంలో సాటి విప్రులను పరాభవించినందు వలన మీకు కల్గే ప్రయోజనం ఏమిటి? మా వంటి సన్యాసులకు మీతో వాదించి గెల్చినా, ఓడినా, ప్రయోజనం ఏమీలేదు'' అన్నారు. అందుకు ఆ మూర్ఖ పండితులిద్దరూ' మరి అయితే అందరి పండితులూ ఇచ్చినట్లు జయపత్రిక ఇవ్వకుండా త్రివిక్రమభారతి మమ్మల్నిద్దర్నీ ఇక్కడకెందుకు తీసుకువచ్చాడు?

మీ ఇద్దరిలో ఎవరైనా సరే జయపత్రిక అయినా ఇవ్వండి లేదా వాదం అయినా చేయండి' అని పట్టుబట్టారు. అప్పుడు శ్రీ గురుడు 'అయ్యా! వేదం సంపూర్ణంగా తెలుసుకోవటం బ్రహ్మకే సాధ్యం కాలేదు. వేదాలు అపారమైనటువంటివి. అటువంటప్పుడు మేము వేద విదులమని చెప్పుకోవటం ఎంత పిచ్చి తనము? ఈ జయపత్రిక వల్ల మీకు లాభమేమిటి? మా మాట విని ఇటువంటి ప్రగల్భాలు మానండి" అన్నారు. అప్పుడు వాళ్ళు రోషంతో "మేము క్షుణ్ణంగా వేదం అంతా నేర్చుకున్నాము. మమ్మల్ని మించిన వారెవ్వరూ లేరు" అన్నారు.

ఓం శ్రీదత్తాయ గురవే నమః

ఓం శ్రీపాద స్వామినే నమః **ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః**

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

(25వ అధ్యాయం సంపూర్ణం)


చక్రహస్తుని ప్రకటించు చదువు చదువు
కుంభినీధవుని చెప్పెడి గురుడు గురుడు
హరిని జేరుమనెడి తండ్రి తండ్రి
మరచిపోకుడు శివానందుని మంచిమాట

✻✻✻

ఉచ్ఛ కులమునందు ఉద్భవించిన నేమి
ఉచ్ఛ కర్మలను చేయకున్న ఎడల
కనక (బంగారం) కలశమందు కల్లున్న ఎడల
గురుడు కల్లు కుండే అనుచు కాలితో త్రోయు
మరచిపోకుడు శివానందుని మంచిమాట

– శ్రీ స్వామిశివానంద మహరాజ్

26 వ అధ్యాయము



శ్రీ గణేశాయ నమః



శ్రీ సరస్వత్యై నమః



శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

శ్లో. ఉక్తాచతుర్వేద శాఖా తదంగాదిక మీశ్వరః ।
విప్ర గర్వహరోయః స శ్రీదత్తః శరణంమమ ॥

(భావము : గర్వితులైన వేద బ్రాహ్మణులకు శ్రీగురుడు వేద విభాగమును వివరించి గర్వము హరింపజేసిన శ్రీ దత్త ప్రభూ నాకు నీవే శరణము)

నామధారకుడు అత్యంత ఆసక్తితో, "స్వామీ! మరి ఆ మూర్ఖపండితులకు శ్రీగురుడు ఏ విధంగా బుద్ధి చెప్పారో తెలియపర్చండి" అన్నాడు. అప్పుడు సిద్ధయోగి ఇలా చెప్పాడు.

శ్రీగురుడు ఇంకొంచెం తీవ్రమైన కంఠంతో అమూర్ఖులకు ఇలా చెప్పారు. నాయనలారా! మీరీ విధంగా మాట్లాడటం చాలా తప్పు. ఎవరైనా వేద విదులమని అనుకోవటం దురహంకారం. **వేదాల లక్ష్యం పరమార్థమే కాని, ధన కీర్తి, అహంకారం కావు. సమదర్శనమే పండితుల లక్ష్యం.** నిజానికి వేదం అంతా తెల్సిన వారు ఎవ్వరూ లేరు.

పూర్వం భరద్వాజ మహర్షి వేదాన్ని సంపూర్ణంగా చదవాలని మూడు

సార్లు బ్రహ్మదేవుని వరంతో దీర్ఘాయువును పొందాడు. 5,000 సార్లు నాలుగు యుగాలూ పునరావృతం అయితే బ్రహ్మకు ఒక పగలు. బ్రహ్మ భరద్వాజమహర్షి తపస్సుకు మెచ్చి అపారమైన వేదరాసుల్ని చూపించాడు. అవి చూచి భయపడి, అయ్యో! నేను ఇంత కాలం నేర్చుకున్నది ఒక పిడికెడైనా లేదే? ఇదంతా అధ్యయనం చేసేంత వరకూ నేను జీవిస్తానా? అది అసలు సాధ్యం అవుతుందా?' అని అనుకుని, బ్రహ్మవైపుకు తిరిగి "నాకు అవసరం అయిన దాన్ని మీరే ప్రసాదించండని" అన్నాడు. అంత, బ్రహ్మ ఆ వేదరాశుల నుంచి మూడు పిడికిళ్ళు తీసి భరద్వాజుని చేతిలో వేసి "ఇది తెల్సుకొనే వరకూ నీవు జీవింతువు గాక!" అని వరం ఇచ్చాడు. ఆ మూడు పిడికిళ్ళ వేదమే అధ్యయనం చేయడం ఇంతవరకూ పూర్తికాలేదు. కనుక నారాయణుడే బాదనారాయణునిగా అవతరించి, వేదాన్ని నాలుగు భాగాలుగా విభజించి, వాటినిపైలుడు, వైశంపాయనుడు, జైమిని, సుమంతుడు అను నలుగురు శిష్యులకు ఒక్కొక్క వేదం తెల్పాడు. వారు ఆ కాలంలో కల్పాంతం వరకూ అభ్యసించి కూడా పూర్తిగా తెల్సుకోలేక పోయారు. అటువంటప్పుడు అల్పాయుష్కులైన మీరు నాలుగు వేదాలనూ క్షుణ్ణంగా చదివామనటం ఎంత వెర్రితనము? వేదమంతా నేర్చుకోవటం ఏ ఒక్కరికీ సాధ్యం గాదు.

అందుకే వ్యాసుడు దానిని నాలుగు భాగాలుగా చేశాడు. ఋగ్వేదాన్ని పైలుడు అనే శిష్యునికి చెప్పి, దాన్ని ధ్యానించడానికి, దాన్ని గురించి ఈ విధంగా చెప్పాడు: ఋగ్వేదానికి ఉపవేదం ఆయుర్వేదం, ఆత్రేయస గోత్రం, గాయత్రీ ఛందము. ఋగ్వేదానికి అధిదేవత బ్రహ్మ, ఎర్రని వర్ణము. తామర రేకుల వంటి కళ్ళు, సుస్పష్టమైనటు వంటి కంఠము, గిరజాల జుట్టు, వంకమీసం కల్గి రెండు మూరల పొడవైన దేహంతో ఉంటాడు. నీవు ఆ

రూపాన్ని ధ్యానించు దీనిలో చర్చ, శ్రావకము, శ్రవణీయపారము, క్రమపారము, జర, రథ క్రమము, దండక్రమము అనే భాగాలున్నాయి. ఆ క్రమం ప్రకారమే దాన్ని చదవాలి. ఈ వేదానికి అశ్వలాయని, సాంఖ్యాయని, శాకల, భాష్కల, మాండుకేయులనే శాఖలు ఉన్నాయి. వాటిని ఆనాడు వ్యాసుడు పైలునకు చెప్పాడు గాని, ఈనాడు సంపూర్ణంగా చదివిన వాడు లేడు.

తర్వాత వ్యాసమహర్షి రెండవ శిష్యుడైన వైశంపాయనుడికి యజుర్వేదం చెప్పి, యజుర్వేదానికి ఉపవేదం ధనుర్వేదం, భారద్వాజస గోత్రం, తృష్టుప్ చందస్సు దీనికి రుద్రుడు అధిదేవత, సన్నగా ఉండి చేతిలో కపాలం ధరించి, సుమారు ఐదు మూరల పొడవు గల్గి ఉండి తామ్రవర్ణ శరీరం కల్గి ఉంటాడు. దీనికి గల 85 శాఖల్లో ఇప్పుడు 18 మాత్రమే ఉన్నాయి. యజుర్వేదం విశేషించి యజ్ఞ విధానాన్ని చెప్తుతుంది. మంత్ర బ్రాహ్మణ సంహిత' దీనికి మూలం. ప్రతిపదం, అనుపదం, చందస్సు, భాష, ధర్మము, మీమాంస, న్యాయం తర్కం అనే ఉపాంగాలు, శిక్ష, కల్పం, వ్యాకరణం, నిరుక్తము, ఛందస్సు, జ్యోతిషము అనే ఆరు అంశాలు ఉన్నాయి. ఇంత విస్తారమైన యజుర్వేదాన్ని వైశం పాయునునకు వివరించి చెప్పి, వేదవ్యాసుడు మూడవ శిష్యుడైన జైమినికి సామవేదాన్ని బోధించారు. సామవేదానికి ఉపవేదం గంధర్వము. జగతీ చందస్సు కాశ్యపస గోత్రం. దీని ధ్యేయ మూర్తి మెడలోదండ, మొలకు తెల్లని వస్త్రం, చర్మం ధరించి, ఆరు మూరలు పొడవు కల్గి ఉంటాడు. ఆయన శరీరచ్ఛాయ తెలుపు, శమము, దమము మొదలగు దైవీ సంపద కలవాడు. ఇట్టి వేదానికి వెయ్యి శాఖలుండేవి. ఇది పూర్తిగా చదివిన వారెవ్వరూ లేరు.

వ్యాసుడు నాల్గవ శిష్యుడైన సుమంతునికి అథర్వణ వేదం గురించి చెప్పి, దీనికి అస్త్ర రూపము ఉపవేదము. గోత్రము భైజానకము, ఇంద్రుడు అధిదేవత. తృష్టుప్ ఛందస్సు. అథర్వణ వేద పురుషుడు, తీక్షణమైన ఆకారం, నల్లని వర్ణం కల కామరూపుడు. ఏక పత్నీవ్రతుడు, ఏడు మూర్ల పొడవు కల్గి ఉంటాడు. ఈ వేదానికి తొమ్మిది శాఖలు ఐదు కల్పాలు ఉన్నాయి.

పూర్వం అన్ని వేదాలనూ క్షుణ్ణంగా తెల్సిన పండితులెందరో భూమిపై ఉండేవారు. కనుకనే వేదాలన్నీ నిలువ గల్గినాయి. ఈ కలియుగంలో బ్రాహ్మణులు కర్మభ్రష్టులగుతున్నారు. కనుక మంత్రాలలో శక్తి లోపిస్తున్నది. పూర్వపు బ్రాహ్మణుల్లో దేవత్తు, మహత్తు ఉండేది. అందుకనే వారిని 'భూసురులు' అనేవారు. రాజులు కూడా వారిని సేవించేవారు. ఎంత ధనమిస్తామన్నా లెక్క చేయక, భోగాల పట్ల నిర్లిప్తులుగా ఉండేవారు. వేదాధ్యయన బలం వల్ల త్రిమూర్తులు కూడా వారికి అధీనులై ఉండేవారు. మాటమాత్రం చేత గడ్డి పరకను మేరు పర్వతంగాను, మేరు పర్వతాన్ని గడ్డి పరకగాను చేయగల్గి ఉండేవారు. **జగత్తంతా దేవతల అధీనము. దేవతలందరూ మంత్రాధీనులు. మంత్రాలన్నీ బ్రాహ్మణుల అధీనంలో ఉండేవి. వారిని దేవతలు కూడా పూజించేవారు.** ఈ కలియుగంలో బ్రాహ్మణులు ధనాశకు లొంగి మ్లేచ్ఛుల ఎదుట కూడా వేదం చదువుతున్నారు. అట్టి వారి మొహం కూడా చూడకూడదు. అటువంటప్పుడు మీరు వేదవేత్తలమని విర్రవీగుచూ, మిగతా పండితులందర్నీ అవమానిస్తూ ఉండటం వలన మీకు ఒరిగేదేమిటి? మీకు అసలు ఇట్టి దుస్సంకల్పాన్ని ప్రేరేపించిందెవరు? మిమ్మల్ని మీరు పొగడుకొని జయపత్రికను ఇవ్వమంటున్నారే? ఇలాంటి దురహంకారంతో

లేనిపోని కష్టాలను తెచ్చుకోవలదు. ఇకనైన మామాట విని మంచి జీవితము గడపండి అని శ్రీగురుడు అన్నారు. కానీ ఆ దుర్మార్గులు తమ పట్టువదలకుండా, జయపత్రిక అయినా ఇవ్వమనీ లేదా వాదం అయినా చేయమని గట్టిగా పట్టుబట్టారు.

ఓం శ్రీదత్తాయ గురవే నమః

ఓం శ్రీపాద స్వామినే నమః **ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః**

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

(26వ అధ్యాయం సంపూర్ణం)

బ్రహ్మతత్వంబు ఒక్కటి తెలియకున్న
ఎన్ని విషయములను ఎరింగి ఏమి ఫలమూ
బ్రహ్మతత్వంబు నుండి మరలు నన్ని
అన్ని కూడి బ్రహ్మమై అమరదెపుడూ
మరచిపోకుడు శివానందుని మంచిమాట

***

అద్భుతంబు గొలుపు గురు దర్శనంబు
మరుగుపరచు, బయలు పరచవలదూ
వేదములు, ఖురాను దాన్ని వీక్షింపలేకుండె
ఎవరు విశ్వసింతురీ నిజంబు
మరచిపోకుడు శివానందుని మంచిమాట


– శ్రీ స్వామిశివానంద మహరాజ్



27 వ అధ్యాయము



శ్రీ గణేశాయ నమః



శ్రీ సరస్వత్యై నమః



శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

శ్లో. సప్తజన్మ విదం సప్తరేఖోల్లంఘనతోదదౌ ।
యోహీనాయ శృతి స్ఫూర్తిం శ్రీ దత్తశరణం మమ ॥

(భావము : పంచమ జాతివానిచే వేదములు చెప్పించి, బ్రాహ్మణుల గర్వమణచుట)

నామధారకుడు సిద్ధయోగికి నమస్కరించి 'స్వామీ! అటు తర్వాత ఏమి జరిగింది?' అని అడిగాడు. దానికి సిద్ధుడు ఇలా చెప్పాడు :

శ్రీగురుడు ఎంత చెప్పినా వారు వినలేదు. అప్పుడు శ్రీగురుడు వారితో అలాగైతే మీ కోరిక ఇప్పుడే తీరుస్తాము అని, అటు పక్కగా పోతున్న ఒక వ్యక్తిని పిల్చి "నాయనా! నీవెవ్వరు? నీ కులమేది? ఎక్కడికి పోతున్నావు? నీదేవూరు?" అని అడిగారు. అందుకతడు "అయ్యా! నేను మాలవాడిని. నన్ను మాతంగుడు అంటారు. నేనీ ఊరు బయట ఉంటాను. దగ్గర్లోనే ఉన్న మాలపల్లెనాది. ఇప్పుడు అక్కడికే వెళ్ళుచున్నాను." అని నమస్కరించి చెప్పాడు. శ్రీ గురుడు అతనిపై తమ కృపా దృష్టిని సారించి,

శిష్యునికి ఒక కర్రను ఇచ్చి నేలపై ఏడు గీతలు గీయించి, ఆ మాలవాని పై వీభూతి చల్లి "ఒక్కొక్క గీత దాటుకుంటూ చెప్పు" అన్నారు. అతడు మొదటి గీతను దాటి "నేను అడవి జాతివాడిని" అని, రెండవ గీతను దాటి "నేను రావణుడనే కిరాతకుణ్ణి" అని, మూడవ గీతను దాటి "నేను గాంగేయుడనే జాలరిని" అని, నాల్గవ గీతను దాటి "నేను శూద్రుడు అయిన రైతును" అని, ఐదవ గీతను దాటి నేను సోమదత్తుడనే కోమటిని అని, ఆరవ గీతను దాటి "నేను గోవర్ధనవర్మ అనే రాజుని" అని, ఏడవ గీతను దాటి నేను "వేదవిదుడనైన బ్రాహ్మణుడను" అని వెనుకటి జన్మలలో తానెవరో చెప్పాడు. శ్రీగురుడు "నాయనా! నీవు వేదవిదుడవు కదా! వాదంలో ఈ విప్రులను జయించు" అన్నారు. అప్పుడతడు వెంటనే వేదగానం చేసి, చర్చకు సంసిద్ధుడైనాడు. ఇదంతా చూచిన ఆ మూర్ఖ పండితులకు భయంతో నోరెండిపోయినది. కడుపులో నొప్పి ఆరంభం అయ్యింది.

అప్పుడు వారు శ్రీగురుని పాదాలపై పడి "స్వామీ! మీరు సాక్షాత్తూ పరమేశ్వరులే. మిమ్మల్ని ధిక్కరించాము. బ్రాహ్మణులను దూషించాము, గురువు ఆదేశాన్ని ఉల్లంఘించి, మ్లేచ్ఛుల ఎదుట కూడా వేదం చదివి పాపులమయ్యాము. మా అపరాధాన్ని క్షమించి, మమ్మల్ని కాపాడండి" అని వేడుకున్నారు. అంత శ్రీగురుడు వారితో 'మీరు ధర్మోల్లంఘున చేసి, బ్రాహ్మణులను దూషించారు. గనుక మీరు 12 సంవత్సరాలు బ్రహ్మరాక్షసులై ఉందురు' అని అన్నారు. వారు తమను క్షమించమని శ్రీగురుని పాదాలు పట్టుకొని వేడుకున్నారు. అప్పుడు దయామయుడైన శ్రీ గురుడు వారితో "నాయనలారా! మీలో పశ్చాత్తాపము కల్గింది. కనుక మీరు 12

సంవత్సరాలు తర్వాత ఒక బ్రాహ్మణుడు నారాయణమంత్రం ఉచ్చరిస్తూంటే అది మీరు విని, శాప విముక్తులై, సద్గతిని పొందుతారు" అన్నారు. వారు గ్రామం దాటి బాహ్య ప్రదేశమునకు రాగానే హృదయశూల రోగంతో మరణించి పిశాచ రూపం ధరించారు. శ్రీగురుని ఆజ్ఞ ప్రకారం 12 సంవత్సరాలు తర్వాత ఒక బ్రాహ్మణుని వలన నారాయణ మంత్రం వినుట వల్ల పిశాచ విముక్తులై వారు సద్గతిని పొందారు.

కావున నామధారకా! ఎవరు చేసిన కర్మను వారనుభవించవలసినదే. పూర్వ జన్మనెరిగిన మాతంగుడు శ్రీగురునితో "గురుదేవా! మీరు త్రికాలవేత్తలు, పూర్వ జన్మల క్రిందట బ్రాహ్మణుడనైన నేను ఈ జన్మలో మాలవాడిగా ఎలా అయ్యాను?" అని అడిగాడు.

ఓం శ్రీదత్తాయ గురవే నమః

ఓం శ్రీపాద స్వామినే నమః **ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః**


శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః


(27వ అధ్యాయం సంపూర్ణం)

కోపమున్న వాని కూడి చేరంగవచ్చు
పాము పక్కనైనా పరుండవచ్చు
మత్సరంబుగల మానవుని స్నేహంబు
క్రూర మృగముకంటే హీనమగును.

-- శ్రీ స్వామి శివానందమహారాజ్ --

28 వ అధ్యాయము





శ్రీ గణేశాయ నమః



శ్రీ సరస్వత్యై నమః　　　శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

శ్లో. త్రివిక్రమాయాహ కర్మగతిందత్త విదాపునః ।
విముక్తం పతితంచక్రే శ్రీ దత్త శరణం మమ ॥

(భావము : శ్రీ గురుడు చల్లిన భస్మ ప్రభావము వలన కల్గిన జ్ఞానమును నీటితో కడిగించుట)

సిద్ధముని నామధారకునితో శ్రీ గురుని కథను ఈ విధంగా వివరిస్తున్నాడు. ఇవి చదువు వారికి, విన్నవారికి, సర్వదోషములు నశించి, జ్ఞానము ఉదయించును.

శ్రీగురుడు కర్మపాశమును గూర్చి మాతంగునితో "నాయనా! బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర ఈ నాలుగు జాతులు తమ తమ జాతి ధర్మములను మరచి జీవిస్తే, వచ్చే జన్మయందు వారు ఛండాల యోనులయందు జన్మింతురు. బ్రాహ్మణ స్త్రీ యందు శూద్రుని వీర్యముతో జన్మించువాడు ఛండాలుడే. తల్లిదండ్రులను, గురువులను, చేసుకున్న భార్యను కులదేవతలను త్యజించువారు ఛండాలురగుదురు. జీవ హింస చేయువారు, అబద్ధం ఆడువారు, కన్యావిక్రయం చేయువారు, శూద్రుని

ఇంట భుజించువారు, దాసీలతో రతి సాగించువారు ఛండాలురగుదురు. అరణ్యమును దహించెడి వారు, తల్లిదండ్రులను వేరు చేసి ప్రత్యేకముగా జీవించేవారు, ఎద్దునెక్కి తిరిగేవారు, తీర్థయాత్రలకు వెళ్ళి శ్రాద్ధం చేయనివారు, ఈశ్వరునికి అభిషేకము చేయకుండా కపిలగోవు పాలు త్రాగువారు, ఒకామెతో జీవించుచూ, ఇంకొక ఆమెతో సంపర్కము పెట్టుకొనువారు, ఇతరుల వృత్తులకు భంగమొనర్చువాడు, శివపూజను విఘ్నం చేయువాడు, సంధ్యాకాలమున భుజించువాడు, అన్న మాటను నిలబెట్టుకోనివాడు, సంధ్యాకాలమున నిద్రించువాడు, పర్వదినముల యందు స్త్రీ సాంగత్యమును కోరువాడు, అందరూ నడచు మార్గమున మలవిసర్జన చేయువాడు, తన పుణ్యములను తానే చెప్పుకొనువాడు, విధవా స్త్రీతో రతి చేయువాడు, గురువును ఎవరైనా నిందించుచుండ సంతోషముతో హర్షించువాడు బ్రహ్మ రాక్షసులయ్యెదరు. ఇతర దేవతలను నిందించువాడు దరిద్రుడయి అపస్మారక రోగ పీడితుడగును. బ్రాహ్మణులను అవమానించి వేదాలను దూషించువాడు మూత్ర రోగము వచ్చి బాధపడును. ఇతరుల యొక్క మర్మములు బయట పెట్టేవాడు జన్మాంతరాన గుండె నొప్పితో బాధపడును. స్త్రీలకు గర్భపాతమొనరించువాడు మృతవంధ్యుడై జీవించును. ఎవరు ధర్మమును చెప్పిన వినరో, ఎక్కువగా భుజించిన వారిని హేళన చేయుదురో వారు చెవిటి వారుగా పుట్టెదరు. చెడ్డవానితో స్నేహం చేయువారు గాడిదగా జన్మింతురు. బ్రహ్మహత్య చేయువారు క్షయ రోగులుగాను, కల్లు తాగువారు పిప్పిపళ్ళు గలవారుగాను, గురుభార్యతో రమించువారు కుష్టురోగులుగాను జన్మింతురు. గుర్రమును, గోవును హత్య చేయువారు సంతానహీనులౌదురు. పాపం చేసిన వాడు ముందుగా నరకాన్ని అనుభవించి, అనంతరం రోగియై భూలోకంలో జన్మించును.

విశ్వాస ఘాతం చేయువాడు వమన రోగంచే బాధపడును. పరస్త్రీని అపహరించువాడు దారుణమైన నరకాన్ని అనుభవిస్తాడు. సర్పమును చంపేవాడు సర్పమై పుట్టును. సువర్ణమును అపహరించువాడు మధుమేహవ్యాధి కలవాడగును, పుస్తకమును అపహరించువాడు అంధుడగును. వస్త్రాలు దొంగిలించువాడు బొల్లిరోగం కలవాడుగను, ద్రవ్యాన్ని దొంగిలించిన వాడు గండమాల రోగిగను, చనిపోవు వాని ద్రవ్యమును అపహరించిన వాడు చిరకాలము కారాగార శిక్షను అనుభవించును. పరులను ద్వేషించువాడు, పరుల ధనాన్ని దోచుకొనువాడు, జన్మాంతరమున అపుత్రుడగును. అన్నము అపహరించిన వాడు గుల్మరోగముచే బాధపడును. ధాన్యం దొంగిలించినవాడు రక్తగాత్రుడుగను, తైలం అపహరించిన వాడు దుర్గంధంగల శరీరం కలవాడుగను, బ్రాహ్మణ ద్రవ్యమును దొంగిలించిన వాడు బ్రహ్మ రాక్షసి అగును. రత్నాలు, మాణిక్యములు, మౌక్తికములు దొంగిలించినవారు హీన జాతిలో జన్మింతురు. ఫలములను అపహరించువాడు తామర రోగిగను, రక్తపానము చేయువాడు జోరీగగను, కంచు, దూది, లోహం అపహరించినవాడు నరకం అనుభవించి తెల్ల కుష్టురోగంతో బాధపడును. దైవధనం అపహరించినవాడు మేత మేయని పశువై జన్మించును. అతిధులను విడిచి భుజిస్తే పాండు రోగి అగును. ధనమును అపహరించేవాడు ఒంటెయై జన్మించును. ఫలము దొంగిలిస్తే కోతి అగును. నీరు దొంగిలిస్తే చాతకపక్షి అగును. గృహానికి అవసరం అయినవి దొంగిలించినవాడు కాకియై జన్మించును. తేనె అపహరించువాడు తేనెటీగ అగును. పరస్త్రీని ఆలింగనం చేసుకున్నవాడు 100 జన్మలు కుక్కయై జన్మించిన తర్వాత సర్పమగును. పరస్త్రీ యోనిని చూచువాడు గ్రుడ్డివాడుగను, మూఢుడు అగును. బంధు స్త్రీతో రతి

చేయువాడు గాడిద అగును. ఎవరు దుర్బుద్ధితో పరస్త్రీ మోహం చూచెదరో వారు నేత్రరోగం కలవారగుదురు. ఇవి వింటున్న మాతంగుడు శ్రీగురునితో 'స్వామీ! ఇది వరకు తెలిసో తెలియకో తప్పు చేస్తే దాని విమోచనమునకు మార్గం బోధించండి' అని అడుగగా, శ్రీగురుడు ఇలా చెప్పారు: "నాయనా! పశ్చాత్తాపమే అందుకు మొదటి మెట్టు. ఎవరికి పశ్చాత్తాపం కల్గునో వారి పాపాలు కొంత నశించును. తరువాత బ్రాహ్మణుల సభలో తమ పాపములు చెప్పుకొని వారు విధించినట్టుగా తమ శక్తి కొలదీ గోదానమునో, చాంద్రాయణ వ్రతమునో ఆచరించాలి. శక్తిలేని వారు ప్రతిగా ద్రవ్యమును దానమివ్వాలి. అజ్ఞానంతో చేసిన పాపములను పశ్చాత్తాపంతోను, గురుసేవ చేతను నశించును. సువర్ణదానం వల్లను, తీర్థయాత్రలు చేయుట వల్లనూ కొంత పాపము నశించును. 10 వేల గాయత్రీ జపం చేసినచో సామాన్య పాపములు నశించును. గాయత్రీ హోమం చేత బ్రహ్మహత్య చేసిన పాపము కూడా నశించును. మొదట మూడు రోజులు ఉపవాసము, తరువాత మూడు రోజులు పాలు, మిగతా మూడు రోజులు నెయ్యి త్రాగి ఉండుట. ఇట్టి వ్రతాన్ని 'కృశ్చము' అందురు. శక్తిలేని వారు నువ్వులు భక్షింపవచ్చును. శక్తిగలవారు మారేడు, రావి, కమలములు, దర్భ, గరిక వీటిని నీటిలో వేసి స్నానం చేసిన, ఆ నీటిని త్రాగిన కొంత పాపము నశించును. దీనిని 'పర్ణకృశ్చము' అందురు. పాప శాంతి కొరకు చాంద్రాయణ వ్రతాన్ని చేయవలెను. అది ఎలాగనగా అమావాస్యనాడు ఉపవాసం ఉండి, తిథిక్రమమును అనుసరించి, తిధికొక ముద్ద చొప్పున పెంచుకుంటూ పౌర్ణమి నాటికి 15 ముద్దలు పూర్తి చేసి, మరల చంద్రకళలను అనుసరించి రోజుకొక ముద్దను తగ్గించుకుంటూ అమావాస్యనాడు ఉపవసించవలెను. దీన్నే చాంద్రాయణ వ్రతం అంటారు. ఈ వ్రతముచే సమస్త పాపములు

నశించును. పుణ్యక్షేత్రమున నివసించినందువల్ల సర్వపాపములు నశించును. సముద్ర స్నానం వల్ల భ్రూణహత్యా పాపములు (శిశుహత్య) నశించును. మితాహారుడై పురుష సూక్తమును ఆరు నెలలు పారాయణం చేసినచో, అన్ని పాపములు పోగలవు. విష్ణు సహస్రనామ పారాయణం వలన ఏడు జన్మల పాపములు కూడా పోవును. ప్రాయశ్చిత్తం చేసుకొను వ్యక్తి ముందురోజు ఉపవాసం ఉండి 'పంచగవ్య తీర్థమును' సేవించవలెను. (గోమూత్రము, గోమయము, గోక్షీరము, గోఘృతము, గోదధి ఒక పాత్రలో కలిపి, అందు ఉదకమును కూడా చేర్చి వైదిక మంత్రములచే మంత్రించి, మంత్ర పూర్వకంగా ఆచార్యుల ద్వారా పుచ్చుకోవలెను). గురువు అనుగ్రహం చేత సర్వపాపములూ నాశనం అగును. శ్రీగురుడు పతితుడైన మాతంగుని చూస్తూ "నాయనా! పూర్వ జన్మలో నీవు చేసుకున్నటువంటి పాపముననుసరించి ఈ జన్మలో హీనజాతి వానిగా జన్మించావు" అని చెప్పారు. అందుకా హీనజాతివాడు "స్వామీ! మీ కటాక్షమనే గంగా ప్రవాహంతో నేను పాప విముక్తుడనయ్యాను. కాకి మానస సరోవరం చేరి రాజహంసగా మారినట్లు, పరవువేదిని తాకిన ఇనుము బంగారము అయినట్లు మీ దర్శనం వల్లనేను పవిత్రుడనయ్యాను. నాకు ఇవన్నీ ఎందుకు? నాకు జ్ఞానం కల్గేలాగా మంత్రించి నన్ను బ్రాహ్మణులలో చేర్చండి" అని అన్నాడు. అప్పుడు శ్రీగురుడు "నాయనా! పూర్వ పాపకర్మల ఫలితంగా ఈ జాతిలో జన్మించిన నీకు అదెలా సాధ్యం అవుతుంది? పూర్వం విశ్రామిత్రుడు బ్రహ్మర్షి అనిపించుకోవాలని తపస్సు చేసి తనకది ప్రసాదించమని బ్రహ్మను కోరాడు. బ్రహ్మ ప్రత్యక్షమై అది తన వల్ల కాదని, వశిష్ట మహర్షి వల్లనే అవుతుందని చెప్పాడు. అప్పుడు అతడు వశిష్టమహర్షిని ఆశ్రయించి కోరగా ఆయన అది అసాధ్యమని చెప్పారు.

అందుకు కోపంతో విశ్వామిత్రుడు వశిష్టుని యొక్క నూర్గురు కొడుకులను చంపివేశాడు. వశిష్టుడు అతనిని శిక్షించలేదు కానీ బ్రహ్మర్షి అనిమాత్రము అంగీకరించలేదు. విశ్వామిత్రుడు కోపంతో ఒక పెద్ద బండనెత్తుకొని వశిష్టమహర్షిపై వేయాలనుకొన్నాడు. కానీ అతడు చనిపోతే 'బ్రహ్మర్షి' అని అంగీకరించగల్గే వారు ఎవరున్నారు? దేవతలందరూ అతన్ని అనుసరించేవారే కదా! అని తలచి పశ్చాత్తాపంతో ఆయన పాదాలపై పడి వేడుకున్నాడు. వశిష్టుడు, "నాయనా! నీవు సూర్యకిరణాలతో నీ శరీరాన్ని తపింప చేసుకొనిరా! అప్పుడు బ్రహ్మర్షి అని అంగీకరిస్తాను" అని చెప్పారు. విశ్వామిత్రుడు అలాగే చేసి వశిష్టుని కృపకు పాత్రుడై బ్రహ్మర్షి అయ్యాడని అనిపించుకున్నాడు. అలాంటిదేమీ చేయకుండానే నిన్ను బ్రాహ్మణ జాతిలో చేర్చడం ఎలా వీలవుతుంది?" అని శ్రీగురుడు ఆ హీనజాతి వానితో అన్నారు.

ఇంతలో ఆ హీనజాతి వాని భార్యబిడ్డలు వచ్చి ఇంటికి రమ్మని పిల్చారు. అప్పుడు అతడు "ఛీ, ఛీ మీరు దూరంగా పొండి, నన్ను తాకవద్దు, నేను సద్బ్రాహ్మణుడను" అన్నాడు. అందుకు ఆ భార్యబిడ్డలు దుఃఖిస్తూ శ్రీగురుని దగ్గరకు వచ్చి, పాదాలపై పడి, దీనంగా ప్రార్థిస్తూ, "ప్రభూ! ఇతనికి నేనంటే చాలా ప్రేమ, ఎప్పుడూ నన్ను ఎంతో ప్రేమగా చూసుకొనేవాడు, నన్ను చూడకుండా జీవించలేడు. ఈ పిల్లలను పెట్టుకొని నేనెలా జీవించగలను? మీరైనా ఇతని బుద్ధి మార్చి మా వెంట పంపే ఏర్పాటు చేయండి" అని ప్రార్థించింది. అప్పుడు శ్రీగురుడు ఒక శిష్యుని దగ్గరగా పిల్చి "నాయనా! ఊరిలో వాణిజ్యం చేసుకుంటున్న ఒక పిసినారి బ్రాహ్మణుని తీసుకురమ్మని" పంపారు. బ్రాహ్మణుడు వచ్చిన తర్వాత, శ్రీగురుడు అతనితో "నాయనా! నీవు కుండనిండా నీళ్ళు తీసుకొని ఇతని

నెత్తిపై కుమ్మరించు. తిరిగి ఇతని కుటుంబంపై మమకారం మేల్కొంటుంది" అని చెప్పారు. అతడు అట్లే చేశాడు. హీనజాతివానికి ఒక్కసారిగా బుర్ర గిర్రున తిరిగి, భార్య బిడ్డలవైపు చూస్తూ "ఏమే! నీవిక్కడకు ఎందుకు వచ్చావు? నేను ఒంటరిగా ఉన్నానన్న భయం నీకెందుకు? ఇది పగలే కదా! నాపై నీకింత మోహమెందుకు? పద, ఇంటికి వెళ్దాం" అని చెప్పి, భార్యా బిడ్డలను తీసుకొని వెళ్ళిపోయాడు. ఈ లీల అంతా చూస్తున్న త్రివిక్రమ భారతి "స్వామీ! త్రిమూర్తి స్వరూపా! దయాసాగరా! అజ్ఞానాంధకారంలో మునిగి ఉన్న మానవులు నీ మహిమను తెల్సుకోలేక పోతున్నారు. ఆ హీనజాతి వాడికి జ్ఞానం ఎలా వచ్చింది? క్షణంలో ఎలా పోయింది? దయచేసి వివరించండి" అని ప్రార్థించాడు. శ్రీగురుడు అతనితో "నాయనా! విభూతి యొక్క మహిమ వల్ల అతనిలో జ్ఞానం ఉదయించింది. అది కడిగివేయగానే పోయింది. ఈవిభూదికి మహాత్ముల స్పర్శ ఉంటే ఇంకా ప్రభావితం కాగలదు" అని చెప్పారు. దానికి త్రివిక్రమ భారతి విభూతి మహిమను వివరించాల్సిందిగా ప్రార్థించాడు.

ఓం శ్రీదత్తాయ గురవే నమః

ఓం శ్రీపాద స్వామినే నమః **ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః**

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

(28వ అధ్యాయం సంపూర్ణం)


(ఈ అధ్యాయము నిత్యము పారాయణచేసినచో కర్మక్షయమునకవసరమైన జ్ఞానము లభించును.)



29 వ అధ్యాయము



శ్రీ గణేశాయ నమః



శ్రీ సరస్వత్యై నమః



శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

శ్లో. రక్షసే వామదేవేన భస్మమహాత్మ్యముద్గతిమ్ ।
ఉక్తాంత్రివిక్రమాయాహ శ్రీదత్తః శరణం మమ ॥

(వామదేవుడు చెప్పిన భస్మమహాత్మ్యము త్రివిక్రమ భారతికి తెలిపి అనుగ్రహించిన శ్రీదత్త ప్రభూ నీవే శరణు)

నామధారకుడు సిద్ధయోగికి నమస్కరించి 'సద్గురోత్తమా! మీరీ గురుకథలను చెబుతూ ఉంటే నామనస్సుకు ఆనందం కల్గుతున్నది. శ్రీగురునిపై గురి కుదురుతున్నది. అదృష్టవశమున తమరి దర్శన భాగ్యం కల్గింది. మరిన్ని గురు లీలలను తెలుపవలసినది" గా సిద్ధయోగి పాదములపై పడి వేడుకున్నాడు. అప్పుడు సిద్ధయోగి, అతడిని ఆశీర్వదించి, పైకి లేవనెత్తి కౌగిలించుకొని, "నాయనా! నామధారకా శ్రీగురుని లీలలను చెబుతాను, శ్రద్ధగా విను!' అని చెప్తూ ఉన్నాడు.

పూర్వం నైమిశారణ్యంలో వామదేవుడు అనే మునీశ్వరుడు జడలు, నారబట్టలు ధరించి, శరీరం నిండా విభూతి పూసుకొని, జీవన్ముక్తుడై అవధూతగా సంచరించేవాడు. అతడు నిత్యమూనిర్గుణోపాసనలో ఉండి,

ప్రపంచాన్ని కూడా మైమరచి తిరిగేవాడు. ఆ ప్రాంతంలోనే సంచరించు ఒక పిశాచం ఆయన్ను చూసి, పీక్కు తిందామనే ఉద్దేశ్యంతో ఆయనపై పడింది. ఆయన శరీరంపై నున్న విభూతి కొంచెం ఆ పిశాచానికి అంటుకొన్నది. వెంటనే పిశాచిలో సత్వ గుణం ప్రవేశించి, హృదయం శాంతించింది. అతనిలో విశేషం అయిన జ్ఞానం కూడా ఉదయించింది. అప్పుడు అతడు ఆ ముని పాదములపై పడి "సద్గురోత్తమా! నీ స్పర్శనంతోడనే నాలో తమోగుణం అంతరించింది. నా పాపాలన్నీ తొలగిపోయాయి. నన్ను రక్షించు" అని వేడుకున్నాడు. అపుడా ముని "నాయనా! నీవెవ్వరు? ఈ అడవిలో ఎందుకు ఉన్నావు? నాతో నీకేమి పని?" అని అన్నాడు. అప్పుడు ఆ పిశాచి "స్వామీ మీ దయవలన నా పూర్వజన్మలన్నీ ఇప్పుడు గుర్తుకు వచ్చాయి. నాకు 25 జన్మల క్రిందట మానవ జన్మ లభించింది.

నేనొక రాజును. అప్పుడు నేను ఎన్నో పాపాలు చేసి, ప్రజలను ఎన్నో బాధలు పెట్టాను. మదంతో కూడుకున్నవాడినై పరస్త్రీలను ఎందరినో చేజిక్కించు కున్నాను. ఆ తర్వాత వారిముఖమైన చూచేవాడిని గాను. అప్పుడు వారంతా కలసి నాకు శాపమిచ్చారు. అయినా లెక్కచేయకుండా ఇంకా చాలా మంది స్త్రీలను నాశనం చేశాను. చివరకు నాకు క్షయ రోగం వచ్చింది. నన్ను శత్రు రాజులు జయించి నా రాజ్యాన్ని అక్రమించుకున్నారు. చివరకు చనిపోయాను. 10 వేల సంవత్సరాలు నరకంలో ఘోరం అయిన బాధలను అనుభవించి ఆ తర్వాత 100 సంవత్సరములు పిశాచంగా తిరిగాను, ఆ తర్వాత 24 జన్మలెత్తి (కోతి, కుక్క, కప్ప, తాబేలు, సర్పం, ఒంటె, నక్క, గ్రద్ద, కాకి, గాడిద, ఎలుగుబంటి, పందికొక్కు, చేప, పిల్లి, జింక, కుందేలు, కోడి, గుడ్డిగాడిద, గుడ్లగూబ,

తోడేలు, ఊరపంది, కొండచిలువ, పులి, అడివికోడి) 25వ జన్మలో బ్రహ్మరాక్షసుడనైనాను. ఇప్పుడు మీరు కనబడగానే, మిమ్మల్ని తినాలనే గర్భాత్రంతో మీ మీదకు వచ్చి మిమ్మల్ని తాకగానే నాకీ జ్ఞానం కల్గింది. నేను చేసిన పాపాలన్నీ ఒక్కసారిగా తుడిచి పెట్టుకొని పోయాయి. నాకు జన్మరాహిత్యం ప్రసాదించి రక్షించండి. నాకేనాటి పుణ్యమో ఉండటం వల్ల మీ దర్శనం లభించింది. నాకింత జ్ఞానం ఎలా కల్గిందో తెలియచేయండి" అని వేడుకున్నాడు.

అప్పుడు వామదేవుడు "నాయనా! ఇది నా మహిమ కాదు. నా వంటిపై వున్న భస్మం మహిమ. దాని మహిమను తెలుసుకున్న వారు ఎవ్వరూ లేరు. సాక్షాత్తూ పరమేశ్వరుడు దాన్ని ధరిస్తాడు. అందుకు నిదర్శనం చెబుతాను విను. పూర్వం ఒక బ్రాహ్మణుడు ఉండేవాడు. అతడు చెడు వ్యసనములకు బానిసయై దురాచారి అయ్యాడు. అతడిది ద్రావిడ శాఖ. ఒక శూద్ర స్త్రీతో తిరుగుతూ ఉండేవాడు. చివరికి అతన్ని అతని తల్లిదండ్రులు, ఊరి వారందరూ కూడా వెలివేశారు. అతడు క్రమంగా త్రాగుడుకు కూడా అలవాటై, అందుకు ధనం లేక దొంగతనాలు కూడా చేస్తుండేవాడు. ఒకనాడు అతను తప్పతాగి, శూద్ర స్త్రీ వద్దకు వెళ్ళినప్పుడు అక్కడ వేరొక ప్రియుడు ఎదురై ఇతన్ని చితకబాది, ఊరి బయట గోతిలో పడేశాడు. కొన ఊపిరిలో పడి వున్న ఇతడు చిన్నగా మూల్గుతూ ఉన్నాడు. ఇంతలో ఒక కుక్క అతన్ని చూచి, శవం అనుకొని, పీక్కు తిందామనే ఉద్దేశ్యంతో అతని దగ్గరగా వెళ్ళింది. కుక్క శరీరం మీద ఉన్న విభూతి కొంచెం అతని తలపై బడి అతనికి అంటుకొన్నది. అతడు మూల్గుతుండటం చూచి భయంతో పరుగెత్తింది. అవసాన దశ రాగానే అతని ప్రాణాన్ని తీసుకువెళ్ళాలని యమదూతలు వచ్చారు. ఇంతలో ఎక్కడ నుంచి వచ్చారో

కాని శివదూతలు వచ్చి వారిని తరిమివేశారు. యమధర్మరాజు ప్రత్యక్షమై కారణం అడిగాడు. అప్పుడు శివభటులు "యమధర్మ రాజా! విభూతి పూసుకున్న వారినందర్నీ కైలాసానికి తీసుకురమ్మని శివుని ఆజ్ఞ" అని చెప్పారు.

'కనుకనే నేను భక్తితో విభూతి ధరిస్తాను' అని వామదేవుడు పిశాచితో చెప్పాడు. అప్పుడా రాక్షసుడు ఆయనతో, "స్వామీ! మీరు ధరించు ఇంతటి మహిమ కల్గిన విభూతిని ఏ విధంగా ధరించాలో నాకు తెలియపర్చండి" అని వేడుకున్నాడు.

ఒకప్పుడు గణాలతో క్రీడించుటకు మందర పర్వతానికి వచ్చాడు శివుడు. అచ్చటికి ఇంద్రాది దేవతలు, సిద్ధులు, సాధ్యులు, మహర్షులు, వశిష్ట నారదాది ఋషులు, యక్షులు, గంధర్వులు వచ్చారు. అప్పుడు వారి మధ్య సింహాసనం మీద కర్పూర కాంతి కల్గిన దేహంతో శివుడు కూర్చుని ఉన్నాడు. ఆ సభలో నుంచి సనత్కుమారుడు లేచి "స్వామీ! లోకులను పాపాల నుండి ఉద్ధరించుట కొరకు ఉపాయం ఏదైనా చెప్పవలసినది" అని వేడుకున్నాడు. అంత శివుడు ఈ విధంగా భోదించాడు. నాయనా! సులభంగా నాలుగు పురుషార్థాలను సాధించటం ఒక్క విభూతి వల్లనే సాధ్యము. భస్మంతో త్రిపుండరాలను ధరిస్తే సర్వపాపాలు పోతాయి. గోమయాన్ని సేకరించి (ఆవుపేడ) దానితో హోమం చేయాలి. వచ్చినటు వంటి భస్మాన్ని 'సద్యోజాతం' అనే మంత్రంతో చేతిలోనికి తీసుకొని 'అగ్నిరీత్యా' అనే మంత్రంతో అభిమంత్రించి, 'మానసోక్తా' అనే మంత్రం చదువుతూ, దాన్ని బొటనవేలితో నలుపుతూ 'త్రయంబకం' అని చెప్తూ శిరస్సున ధరించాలి. "త్రయాయుషం జమదగ్నే" అనే మంత్రాలతో

త్రిపుండరాలను ధరించాలి. వీటిలో ఏ రేఖా కూడా కనుబొమ్మలను దాటకూడదు.

ఆ రేఖలలో చివరి, మధ్యమ, అనామిక అను వేళ్ళతో అద్దుకున్నాక, అప్పుడు బొటన వేలితో కుడివైపు నుంచి, ఎడమవైపుకు రేఖని దిద్దుకోవాలి. వీటిలో మొదటి రేఖకు ఆకారం వర్ణం. 'గార్హపత్యాగ్ని' భూ తత్త్వము, రజోగుణం, ఋగ్వేదం, క్రియాశక్తి, ప్రాతఃసదనము, బ్రహ్మదేవత అర్థము. రెండవ రేఖకు అర్థము 'ఉ' కారము వర్ణము, దక్షిణాగ్ని ఆకాశతత్త్వము, యజుర్వేదము, మాధ్యందిన స్తవనములకు సంకేతము. ఇచ్ఛాశక్తి విష్ణు దేవతకు చిహ్నము.

మూడవ రేఖకు అర్థము ''మ'' కారము. అవాహనీయాజ్ఞి సత్త్వగుణము, జ్ఞానశక్తి, తృతీయ సదనము, శివునికి సంకేతము. ఇలా భావించి త్రిపుండ్రములను ధరించాలి. ఆ రూపంగా భస్మం ధరించిన వారికి ముక్తి లభిస్తుంది.

నాలుగు ఆశ్రమాలకు చెందిన వారు భస్మమును ధరించవచ్చు. దానివల్ల పాపాలు నశించి పుణ్యం దొరుకుతుంది. ఈ విధానం తెలియకపోయినా సంపూర్ణం అయిన విశ్వాసంతో భస్మం ధరించినా చాలు. భూమిపై ఉన్న తీర్థాలన్నింటిలో స్నానం చేసినటువంటి ఫలితం లభించడమే కాక, ఇతరులకు కూడా ఉత్తమగతి లభిస్తుంది. ఐశ్వర్యము, జ్ఞానం లభిస్తాయి. వ్యాధులు తొలగుతాయి అని శివుడు చెప్పాడు.

ఇంకా వామదేవుడు ఇలా అన్నాడు. 'కనుకనే ఓ రాక్షసుడా! నేను భస్మాన్ని ధరిస్తాను. ఆ భస్మం వల్లనే నీకిట్టి జ్ఞానం కల్గింది.' అని మంత్రించి

కొంత భస్మాన్ని ప్రసాదించాడు. ఆ భస్మం ధరించి ఆ రాక్షసుడు ఆ మునికి పాదాభివందనం చేసి వెళ్ళిపోయాడు.

శ్రీ గురుడు వివరించి చెప్పిన భస్మ మహిమను త్రివిక్రమభారతి విని నమస్కరించి, శ్రీ గురుని వద్ద తీర్థ ప్రసాదములు స్వీకరించి, తన గ్రామమునకు వెళ్ళిపోయాడు.

ఓం శ్రీదత్తాయ గురవే నమః

ఓం శ్రీపాద స్వామినే నమః **ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః**

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

(29వ అధ్యాయం సంపూర్ణం)


(శనివారపు పారాయణం పూర్తి అయినది)

మాయరా! మటుమాయరా! ఉన్నదంతా
మాయరా! మత్తులో మునిగి ఉన్నంతవరకూ
అంతమాయరా! మత్తు వదిలితే కాని పట్టు
దొరకదు - పట్టు దొరికితేనే పండగరా !

-- అవధూత గీత --

చిలుకలాగ పలికిన ఏమాయె
ఆచరించుటొకటే సార్థకంబు
కార్యరూపముకన్న కర్మాచరణము మిన్న
మరచిపోకుడు శివానందుని మంచిమాట

- శ్రీ స్వామి శివానంద మహరాజ్



30 వ అధ్యాయము



శ్రీ గణేశాయ నమః



శ్రీ సరస్వత్యై నమః



శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

శ్లో. గోపినాధ సుతో రుగ్ణో మృతస్త స్త్రీ శుచోచతామ్ ।
బోధయామాసయో యోగీ శ్రీదత్తః శరణం మమ ॥

(భావము : ఒక స్త్రీ రోగగ్రస్తుడైన భర్తను నీ వద్దకు తీసుకుని రాగా అతను మృతి నొందెను. ఆమెకు ఓ యోగి రూపములో తత్వబోధ చేసిన శ్రీదత్తా నీవే నాకు శరణము.)

(ఈ పై శ్లోకమును చదివి 30, 31, 32 అధ్యాయములు కలిపి పారాయణము 40 రోజులు చేసిన యెడల అఖండ సౌభాగ్యము కలుగును. విడిపోయిన భార్యాభర్తలు కలుసుకొని సుఖంగా జీవించుదురు)

నామధారకుడు సిద్ధమునికి నమస్కరించి "స్వామీ! అమృత తుల్యమైన ఈ గురుకథలు నా మనస్సును హరింపచేస్తున్నవి. శ్రీ గురుడు చెప్పిన 'కర్మానుష్టాన రహస్యము'ను విని ముగ్ధడనయ్యాను. నా శరీరము కనిపించుచున్నది. నా స్థితి ఎండమావులలో దాహంతో ఉన్నవానికి అమృతం దొరికినట్లు, ఆకలితో ఉన్న లేగదూడకు, పచ్చిక చిగుళ్ళు

దొరికినట్లున్నది. నా పాలిట శ్రీ గురుడు మీరేను దయచేసి మరిన్ని గురులీలలను చెప్పి నన్ను కృతార్థుడను చేయండి" అని వేడుకున్నాడు. అప్పుడు సిద్ధయోగి సంతోషించి "నాయనా! నీ గురుభక్తికి సంతోషించాను. శ్రద్ధగా విను" అన్నాడు.

శ్రీగురుని యొక్క మహిమ దేశ విఖ్యాతమైపోయినది. ఎందరెందరో భక్తులు వారి ఖ్యాతిని విని, దూర దూర ప్రాంతాల నుండి వచ్చి, వారి అనుగ్రహాన్ని పొందేవారు.

మాహురపురము అనే పట్టణములో గోడేనాధుడు అనే సద్బ్రాహ్మణుడు కలడు. అతని భార్య పతివ్రత. ఆ దంపతులిద్దరూ దత్తాత్రేయ స్వామిని ఎప్పుడూ భక్తితో సేవిస్తుండేవారు. వారికి ఎంతో కాలం నుండి బిడ్డలు పుట్టి చనిపోతూండేవారు. వారి అదృష్టవశమున ఒక మగ సంతానం కల్గినది. వారు దత్తాత్రేయస్వామిని పూజించి "స్వామీ! ఎంతో కాలం నుండి పుత్ర వియోగులమైన మాకు మీ అనుగ్రహంతో బిడ్డ పుట్టాడు. వీడినైనా మాకు దక్కించు" అని ప్రార్థించారు. ఆ బిడ్డడికి దత్తస్వామి పేరుమీదుగా దత్తాత్రేయుడు అని నామకరణము చేసుకున్నారు. దత్తాత్రేయుడు పెరిగి పెద్దవాడై 16 సంవత్సరాల వాడు అయ్యాడు. తల్లిదండ్రులు కన్యాన్వేషణ చేసి, రూపవతి, సుగుణాల రాశియైన సావిత్రి (సుందరి) అనే కన్యతో వివాహం చేశారు.

అదేమి చిత్రమోగాని, ఒక సంవత్సరం తర్వాత దత్తాత్రేయునికి వ్యాధి సంక్రమించి, తీవ్రంగా జబ్బుచేసి, ఎన్ని చికిత్సలు చేయించినా తగ్గని పరిస్థితి ఏర్పడింది. దానికి తోడు అతనికి అన్నద్వేషము కూడా ఏర్పడింది. ప్రతిరోజూ ద్రవాహారమే తీసుకుంటూండేవాడు. చివరికది

క్షయవ్యాధిగా బలపడింది. అతని భార్య కూడా అతను తినగా మిగిలిన పదార్థమే తింటూ నిరంతరమూ అతని సేవలో నిమగ్నమై ఉండేది. భర్త శుష్కించిన కొద్దీ, ఆ సావిత్రి కూడా శుష్కించసాగింది. భర్త రోగంతో బాధపడ్తున్న కారణంగా ఆ సావిత్రి అలంకారం చేసుకొనక, పాతచీరలే ధరిస్తూ, జుట్టు కూడా దువ్వుకొనేది కాదు. ఆమె పరిస్థితిని చూసి అత్తమామలు ఎంతో దుఃఖించేవారు. ఆమె తమకు కల్గిన ధనమును వెచ్చించి, జ్యోతిష్కుడు చెప్పిన వ్రతాలు, శాంతులు ఎన్నెన్నో చేయించింది. ఎంతో మంది వైద్యులు ఇచ్చిన ఎన్నో రకాల మందులను కూడా భర్తచేత తాగించింది. కాని ఆశలు ఫలించలేదు. దత్తుని పరిస్థితి గమనించి అందరూ కూడా అతని మీద ఆశలు వదులుకున్నారు. ఆ తల్లిదండ్రులు దత్తాత్రేయ స్వామిని తలచి 'స్వామీ దత్తాత్రేయా! ఇప్పుడు ఇతన్ని మాకు దక్కించకుంటే మేము ఏమి చూసుకొని బతకాలి?' అని దుఃఖిస్తుండేవారు. రోగబాధతో ఉన్న దత్తుడు, తల్లిదండ్రులను దగ్గరకు పిలిచి, మనకెంత ఋణానుబంధం ఉంటుందో అంతవరకే ప్రాప్తమని అంతకంటే మీరు ఆశ ఎక్కువ పెట్టుకోవద్దు అని చెప్తూండేవాడు. ఆ మాటలు వినగానే తల్లిదండ్రులకు దుఃఖం మరింత పొర్లుకొచ్చేది. అప్పుడు దత్తుడు తల్లితో "అమ్మా! నీవు నాకు ఒక్క ఘడియ సేపు పాలిచ్చిన ఋణమైనా తీర్చుకోలేకపోయాను మిమ్మల్ని కొంచం కూడా సుఖపెట్టలేకపోయాను" అని అనేవాడు.

దత్తుడు తన భార్య సావిత్రితో "ప్రేయసీ ! నీవు నాకోసం పడిన కష్టాలకు అంతేలేదు. నీకు గత జన్మలో శత్రువును గాబోలు, నేను నిన్ను సుఖపెట్టలేక పోయాను. ఇక ముందు కూడా నీకు అండలేదని భయపడవద్దు, నా తల్లిదండ్రులు నిన్ను కన్న కూతురిలా చూచుకుంటారు, నాతో నీకు సుఖంగా కాపురం చేసుకొనే అదృష్టం లేదు" అని బాధపడేవాడు.

సావిత్రి ఆ మాటలు భరించలేక ఏడుస్తూ "స్వామీ! మీరు నన్ను విడిచిపోతారా? భార్యకు భర్తయే దిక్కుగానీ వేరేకాదు. పెళ్ళి అయిన క్షణంలోనే నేను మీ శరీరంలో భాగమునే కదా! మీ రెక్కడ ఉంటే నేను అక్కడే ఉంటాను" అని అనేది. ఆ మాటలు విని అత్తమామలు మరింత దుఃఖపడేవారు. సావిత్రి వారి వద్దకు వెళ్ళి "మీరేఇలా దుఃఖపడ్తే ఎలాగ? ధైర్యంగా ఉండాలి, మాకు ధైర్యాన్ని చెప్పాలి, అందరమూ కలిసి భగవంతుడ్ని ప్రార్థిద్దాము. మనకు మంచి జరుగుతుంది." అని ధైర్యం చెబుతూండేది. ఒకసారి ఒక వైద్యుడు వచ్చి దత్తుడ్ని గాలిమార్పుకై వేరే ప్రాంతానికి తీసుకు వెళ్ళమని చెప్పాడు. అపుడు అదృష్టవశమున ఎవరో గ్రామస్థులు సావిత్రితో "అమ్మా! మీరు దత్త భక్తులు కదా! గంధర్వపురం వెళ్ళండి" అక్కడ దత్తావతారమైన శ్రీ నృసింహసరస్వతి అనే సన్యాసి ఉన్నారు. వారు సాక్షాత్తూ దత్తాత్రేయులే వారి అనుగ్రహం వలన మీకు మంచి జరుగుతుంది" అని చెప్పారు. అపుడు ఆమె అత్తమామల వద్దకు వెళ్ళి వారితో ఈ సంగతిని వివరించి చెప్పి తమకు అక్కడకు వెళ్ళడానికి అనుజ్ఞనిచ్చి తగిన ఏర్పాట్లు చేయండని నమస్కరించి అడిగింది. అపుడా వృద్ధులు తాము ఆశలు వదులుకున్న బిడ్డ ఎలాగైనా బ్రతికితే చాలని తగిన ఏర్పాట్లు చేశారు. సావిత్రి అత్తమామలతో "మీరు ధైర్యంగా ఉండండి. నా భర్తను ఆ శ్రీగురుడు బ్రతికిస్తారన్న నమ్మకం కల్గుతున్నది" అని సెలవు తీసుకొని బయలుదేరింది. తమ కోడలు ధైర్యానికి అత్తమామలు సంతోషించి "అమ్మా సౌభాగ్యవతీ భవ! మా అబ్బాయి చిరంజీవి అగుగాక" అని ఆశీర్వదించి పంపారు.

సావిత్రి భర్తకు శ్రమ కల్గకుండా ఒక పల్లకీని, అందులో మెత్తని పడకలను ఏర్పాటు చేసి, దత్తుణ్ణి అందులో పడుకోబెట్టి, బోయీలను ఏర్పాటుచేసి బయలుదేరి గంధర్వ నగరం సమీపించారు. సావిత్రి దారిలో

కన్పించిన వారందర్నీ శ్రీగురుని గూర్చివిచారిస్తునే ఉన్నది. అంత దూరం ప్రయాణం చేసి అలసినందు వలన దత్తునికి రోగబాధ తీవ్రమైనది. చివరి దశ సమీపించిందన్నట్లుగా అతడు బాధతో గిలగిలలాడుతున్నాడు. చిన్నగా పల్లకీని దించి సావిత్రి అక్కడ ఉన్న గ్రామస్థులను, శ్రీగురుడు ఎక్కడ ఉంటారని అడిగింది. వాళ్ళు స్వామి అనుష్టానానికి సంగమానికి వెళ్ళారని చెప్పారు. సావిత్రి దత్తుని తీసుకొని అక్కడకు వెళ్దామని పల్లకీ వద్దకు వచ్చేసరికి పాపం దత్తుడు మరణించాడు. ఆమె గుండెలు బాదుకుంటూ ఏడుస్తూ ఉన్నది. ఆ శోకం భరించలేక ఆమె కత్తి తీసుకొని పొడుచుకో బోయింది. అక్కడ ఉన్న వారందరూ వచ్చి ఆ చర్యను ఆపారు. అప్పుడామె పెద్దగా రోదిస్తూ "అయ్యా! స్వామీ నాకు ఇదేమి గతి? ఓ ! శ్రీగురూ! మీరు ప్రాణ రక్షకులని గంపెడాశతో మీ వద్దకు వచ్చాను. కానీ నా పని దైవానుగ్రహం కోసం ఆలయంలోనికి వెళ్ళిన వానిమీద ఆలయం విరిగిపడినట్లు, మంచి నీటికని పోయిన వాడు మొసలి నోట్లో పడ్డట్లు, నా భర్తను బ్రతికించుకుందామని వచ్చి అతన్ని పోగుట్టుకున్నాను నేను. నా పని పులి బారి నుండి తప్పించుకున్న ఆవు గోమాంసం తినే యవనుడి చేతిలో పడినట్లుగా అయినది. వృద్ధులైన అత్తమామలకు వారి ఒక్కగానొక్క బిడ్డను దూరం చేసి ఊరుకాని ఊరులో దిక్కులేని చావు చచ్చేలా చేశాను" అని హృదయ విదారకంగా రోదిస్తూ ఉన్నది. అప్పుడు అక్కడున్నవారిలో కొందరు "అమ్మా! ఇపుడేడ్చినందు వల్ల లాభం ఏమున్నది? విధి లిఖితం విష్ణువునైన విడిచి పెడ్తుందా!" అని తెలియచెప్పాలని చూచారు. కానీ వయస్సులో చిన్నదైన ఆమెకు అతనితో కాపురం చేసిన మధురమైన రోజులు జ్ఞప్తికి వచ్చి ఆమె హృదయాన్ని కలచి వేస్తున్నాయి. ఆమె దీనాతి దీనంగా వారితో "అయ్యలారా! ఇప్పుడు నేను ఎవరి అండన ఉండాలి? నా

ప్రాణనాథుడు మరణించాక నేనెలా బ్రతికేది? నా భర్త వంటి సుగుణాల సంపన్నుడు మరెక్కడా లేడు. చిన్నప్పుడు గౌరీ వ్రతము, భవానీ పూజలు, వివాహమయ్యాక సౌభాగ్యవతీ వ్రతం ఎన్నో చేశాను. ఆ పుణ్యం అంతా ఏమైపోయింది? నా మాంగళ్య రక్షణ కోసం సంపద అంతా వదులుకున్నాను. అందుకు నాకు ఈ పసుపుతాడు కూడా దక్కకుండా పోయింది" అని శవంపై పడి ఏడుస్తూ "స్వామీ! నన్ను విడచి ఎక్కడకు పోయారు? మీరు లేకుండా నేనెలా బ్రతుకుతాను? ఈ వార్త విన్న వెంటనే మీ తల్లిదండ్రులు మరణిస్తారు. నేనీ పనిచేసినందు వలన ముగ్గురి ప్రాణాలు తీసిన దోషినైనాను. శ్రీగురునితో చెప్పి మిమ్మల్ని బ్రతికిద్దామని వారిని మోసం చేశాను. ఇప్పుడు వారికి ముఖం ఎలా చూపించేది? నేను మీతోనే వస్తాను" అని అంటూ ఏడుస్తూ ఉన్నది. అంతలో అక్కడకు మెడలో రుద్రాక్షమాలలు, చేతిలో శూలం, శరీరం నిండి భస్మం ధరించిన ఒక తపస్వి వచ్చి సావిత్రికి ఇలా వివేకమును ఉపదేశించాడు. "పిచ్చిదానా! నీవిలా ఏడ్చినందువల్ల ప్రయోజనం ఏమిటి? పోయిన ప్రాణం తిరిగి వస్తుందా? ఈ భూమి మీద చనిపోకుండా ఎవరుంటారు? అయినా ఇతడు ఎక్కడికి వెళ్ళాడనుకుంటున్నావు? ఆలోచించు, అసలు నీవెవరు? ఎక్కడి నుంచి వచ్చావో చెప్పు ప్రవాహంలో ఎక్కడినుంచో కల్సుకున్న కట్టెలు లాగా భూమిపై జీవులు కల్సుకుంటారు, కొద్ది సమయం కాగానే విడిపోతారు. పక్షులు సంధ్యాకాలంలో గూటికి చేరినట్లు జీవులు ఎక్కడ్నుంచి వచ్చినవి అక్కడకు వెళ్ళవలసినదే. నీటిలో నుంచి వచ్చే బుడగవలే ఈ శరీరాలు వచ్చి నశించవలసినదే. పుట్టేవాడు, చనిపోయేవాడు ఎక్కడ ఉన్నాడు? అతడెవరు? మాయావశులైన మానవులు "నావి, నావాళ్ళు" అనుకోవటం ఒక భ్రాంతి మాత్రమే. ఈ శరీరమే నీ భర్త అనుకుంటున్నావా?

జీవులు కర్మ వలన శరీరం ధరిస్తారు. కర్మ త్రిగుణాల వల్ల ఏర్పడిన శరీరం సుఖదుఃఖాలును కల్గిస్తుంది. గుణాలన్నవి మాయ వలన ఉన్నట్లు కన్పిస్తాయి కానీ నిజానికి లేనేలేవు. మృత్యువు అంటావా! సుదీర్ఘమైన ఆయువు కల్గిన దేవతలు కూడా కల్పాంతరంలో నశించవలసినదే. కాలం వలన పుట్టి, దాని కధీనం అయిన ఈ శరీరం స్థిరంగా ఉండటం సాధ్యమా! గర్భములో పడినది మొదలు ముసలి వాడయ్యేవరకూ వెనుక చేసుకున్న కర్మననుసరించి ఎప్పుడో ఒకప్పుడు మరణించక తప్పదు. ఎక్కడ ఏ సమయంలో ఎలాంటి సుఖదుఃఖాలు అనుభవించాలో అట్టిది అనుభవించాల్సిందే. ఎప్పుడైనా ప్రాయశ్చిత్త కర్మల ద్వారా దుష్కర్మను నశింప చేసుకోవచ్చు. కానీ ఇప్పటి మీ సంబంధమే నిజమైతే గత జన్మలో నీ కెవరితో ఎట్టి సంబంధమున్నదో చెప్పగలవా? లేదా వచ్చే జన్మలో ఏం జరుగుతుందో చెప్పగలవా? ఇది ఆలోచించకుండా వ్యర్థంగా దుఃఖం పడవద్దు. ఈ పాంచభౌతిక శరీరం ఎప్పటికైనా నశించాల్సిందే. ఇక నుండైనా ఈ శోకాన్ని నిగ్రహించుకొని జన్మచక్రం నుంచి బయటపడు" అన్నాడు. సావిత్రి ఆయన పాదాలకు నమస్కరించి "స్వామీ! నాకు తరుణోపాయం చెప్పండి. నాకు నీవే తల్లివి, తండ్రివి. నేనీ సంసారం నుంచి బయటపడే మార్గం ఉపదేశించండి" అన్నది.

ఓం శ్రీదత్తాయ గురవే నమః

ఓం శ్రీపాద స్వామినే నమః **ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః**

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

(30వ అధ్యాయం సంపూర్ణం)

31 వ అధ్యాయము



శ్రీ గణేశాయ నమః



శ్రీ సరస్వత్యై నమః



శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

శ్లో. గుర్వ గస్త్యర్షి సంవాద రూపం స్త్రీ ధర్మమాహయః ।
రూపాంతరేణ సప్రాజ్ఞః శ్రీదత్తః శరణం మమ॥

(అగస్త్య మహర్షికి బృహస్పతికి మధ్య జరిగిన సంవాద రూపమున స్త్రీ ధర్మములను బోధించిన శ్రీదత్తా నాకు నీవే శరణము)

యోగీశ్వరుడు ఆ స్త్రీతో పతివ్రతా ధర్మాలను ఈ క్రింది విధంగా చెప్పుచున్నాడు. పూర్వము కాశీ పట్టణము నందు అగస్త్య మహర్షి ఉండేవారు. ఒకనాడు నారదుడు త్రిలోక సంచారియై తిరుగుతూ, వింధ్యుని వద్దకు వచ్చి, "నీకు ఎందునూ కొదువలేదు కానీ, మేరు పర్వతంతో మాత్రము సమానము కాలేవు" అన్నాడు. అప్పుడు వింధ్య పర్వతమునకు రోషము వచ్చి మేరు పర్వతము కన్నా ఎత్తుగా పెరగసాగాడు. అందుచే వింధ్య పర్వతపు దక్షిణ భాగమంతయూ చీకటి వ్యాపించెను. సూర్యరశ్మి లేనందువలన ఆ ప్రదేశం అంతయూ యజ్ఞములు లేక అంధకార బంధురమయ్యెను. అప్పుడు ఆ ప్రాంతంలోని ఋషులంతా ఇంద్రునితో తమ విషయమును మొరపెట్టుకొన్నారు. ఇంద్రుడు ఋషులను

వెంటబెట్టుకొని, చేయునది లేక బ్రహ్మ దగ్గరకు వెళ్ళి, వింధ్య పర్వతము పెరుగుదల గూర్చి, దాని వలన లోకమునకు కల్గు అనర్థమును గూర్చి బ్రహ్మతో చెప్పెను. అప్పుడు బ్రహ్మ ఆలోచించి "వింధ్య పర్వతమునకు గురువైన అగస్త్య మహర్షి కాశీలో నివసించుచున్నారు. వారి వద్దకు వెళ్ళి దక్షిణ దిక్కున తగిన సత్పురుషులు లేకున్నారు. దయతో మీరు అచ్చట ఉన్న మానవులను ఉద్ధరించుట కొరకు రండి అని ప్రార్థించండి. అప్పుడు అగస్త్యుడు దక్షిణ దిక్కుగా ప్రయాణం చేయుచూ వింధ్యుడ్ని సమీపిస్తారు. వింధ్య ఆయనకు శిరస్సు వంచి నమస్కరిస్తాడు. అప్పుడు ఆగస్త్యుడు ఇక నుండి నీవు లోకమునకు భంగము కలుగకుండా భూమి మీద పడి వుండు అని ఆశీర్వదిస్తారు" నీ కార్యము నెరవేరును" అని చెప్పి వారిని పంపివేశారు. అప్పుడు ఇంద్రుడు, దేవగురువైన బృహస్పతి కొందరు ఋషులు కలసి అగస్త్యుని ఆశ్రమానికి వచ్చి, ఆయన భార్య లోపాముద్రను కీర్తిస్తూ పతివ్రతా ధర్మాలను ఈ విధంగా చెబుతున్నారు.

"భర్త యొక్క ఉచ్ఛిష్ట భోజనము పతివ్రతకు ఆహారము. అతిధుల యొక్క పూజ విసుగన్నది లేకుండా ఆమె చేయవలెను. భర్త ఆజ్ఞలేనిదే దానధర్మములు, పూజలు, వ్రతములు సల్పరాదు. భర్త నిలుచున్న తాను కూర్చోరాదు. భర్తను అవమాన పర్చరాదు. పతి సేవయే యాత్రగా, పతియే శ్రీహరిగా పూజించి, పతి పాదోకమునే తీర్థముగా ఆవిడ స్వీకరించవలెను. రాత్రి సమయమునందు భర్తను నిద్రబుచ్చిన తర్వాతనే తాను నిద్రించి, మరలా అతడు లేవక ముందు మేల్కొని, స్నానమాచరించి, భర్త పూజ చేసుకొనుటకు వీలుగా అన్ని సౌకర్యములను కలుగ చేయవలెను. భార్య ధరించు బహిష్టు అయిన బట్ట భర్తకు తగలరాదు. భర్త గృహములో ఉన్నప్పుడు మాత్రమే అలంకారం చేసుకోవలెను. గ్రామాంతరం వెళ్ళిన

భర్త తిరిగి వచ్చే వరకూ అలంకారం చేసికొనక, భర్త రాగానే ఆయనకు ఎదురేగి, భక్తితో కాళ్ళు కడిగి ఆ పాద తీర్థమును నెత్తిపై చల్లుకొని సంతోషముతో గృహములోనికి ఆహ్వానించి కాళ్ళు పిసికి, భక్తితో సేద తీర్చి ఆయనకు ఇష్టమైన పదార్థములను మాత్రమే వండి భుజింప చేయవలెను. భర్త కోపంతో అన్నమాటలను మనసులో ఉంచుకోరాదు. భర్త విచారంతో ఉన్నప్పుడు తాను సంతోషంగా స్త్రీ ఉండరాదు. పర గృహమునకు వెళ్ళరాదు. వెళ్ళవలసివచ్చినచో భర్త అనుమతి తీసుకొని మాత్రమే తలవంచుకొని వెళ్ళవలెను. స్వతంత్ర్యముతో పర గృహములలో సంచరించు స్త్రీ గుడ్లగూబయై జన్మించును. గ్రామాంతరం భర్త వెళ్ళినప్పుడు గోవునకు ఆహారం పెట్టి, గో శేషమును మాత్రమే భుజించవలెను. గృహమును ఎప్పుడూ శుభ్రంగా ఉంచుకోవలెను. ఉత్సవములకు, యాత్రలకు, ఒంటరిగా వెళ్ళరాదు. భర్త ఆయుష్యాభివృద్ధికి గాను పసుపు, మంగళసూత్రము, నుదుట కుంకుమ ఎల్లప్పుడూ ధరించవలెను. దరిద్రులతోను, నీచజాతి స్త్రీలతోను, పతిని నిందించు స్త్రీలతోను కలియరాదు. అత్తమామలను, ఆడబిడ్డలను, బావమరుదులను విడచి వేరుగా ఉండాలని కోరుకోకూడదు. ఆడబిడ్డలను విడిచి వేరు ఉండు స్త్రీ, రాబోవు జన్మయందు ఆడకుక్కయై జన్మించును. ముఖ్యంగా స్త్రీ దిగంబరియై స్నానం చేయరాదు. రోలు, రోకలి మొదలగు వాటిపై కూర్చొనరాదు. భర్తతో వివాదమాడు స్త్రీ, దుఃఖమనుభవించును. భర్త అభాగ్యుడైనను, రోగియైనను అతడిని పతివ్రత దేవునిగా భావించవలెను. ఇంటికి అవసరమైన వస్తువులను పిల్లలచే చెప్పించవలెను కానీ తాను చెప్పరాదు. భర్త యొక్క మనస్సుకు నచ్చునట్లు చేయవలెను. ఇరుగు పొరుగు శ్రీమంతులను చూచి భర్త అసమర్థుడని నిందించరాదు. యాత్రికులు

యాత్రకు పోతూంటే తాను కూడా పోవాలని అనుకోకూడదు. పతితో కోపంతో మాట్లాడు స్త్రీ కుక్కయై జన్మించును. అత్తమామల యెదుట పెద్దగా మాట్లాడరాదు. నవ్వరాదు, భర్త కోపంతో తిట్టినా తాను శాంతంగా ఉండవలెను. భర్త లేకుండా చూచి పిండివంటలు చేసుకొని తినరాదు. అట్లు చేసినచో నక్కయై జన్మించును. భర్తతో నిష్ఠూరంగా మాట్లాడినచో ఏడు జన్మలు మూగదై పుట్టును. పరపురుషులను కన్నెత్తి చూడరాదు. భర్త సంతోషించినచో త్రిమూర్తులు సంతోషించినట్లే అని పతివ్రత భావించవలెను. గురువు, తీర్థము, సర్వమూ పతివ్రతకు భర్తయే. సంతానము లేని స్త్రీ గొడ్రాలుగా భావించబడును. ప్రయాణం చేయువారికి విధవ ఎదురైనచో ప్రమాదం లేదు. విధవల ఆశీర్వాదం పొందరాదు. పతివ్రత అయిన స్త్రీ భర్త అస్తమించిన తరువాత అతనితో సహగమనం చేసినచో 42 తరములు సుఖించెదరు. యమదూతలు కూడా ఆమెను చూచి భయపడెదరు. గంగా స్నానము వలన కల్గెడి ఫలితము పతివ్రతా దర్శనముననే కల్గును. ఏ ఇంట అటువంటి స్త్రీ ఉండునో అదియే ఇల్లు.' ఇట్లు ఆ యోగీశ్వరుడు సావిత్రీ దేవికి పతివ్రతా ధర్మములను బోధించెను.


ఓం శ్రీదత్తాయ గురవే నమః

ఓం శ్రీపాద స్వామినే నమః **ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః**


శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

(31వ అధ్యాయం సంపూర్ణం)

32 వ అధ్యాయము



శ్రీ గణేశాయ నమః



శ్రీ సరస్వత్యై నమః



శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

శ్లో. విధవా ధర్మమాదిశ్యానుగమంచాక్ష భస్మదః ॥
అజీవయన్మృతం విప్రం శ్రీదత్తః శరణం మమ॥

(విధవాధర్మములు, పతివ్రతా ధర్మములు విన్న తర్వాత సహగమనము చేయ సిద్ధపడిన సమయంలో, ఆమె భర్తను జీవింపజేసిన శ్రీదత్తా నాకు నీవే శరణ్యం)

ఇంకా, ఆ యోగీశ్వరుడు సావిత్రీ దేవితో 'అమ్మా! ఇంతవరకూ నీకు సువాసినీ ధర్మాలను, సుమంగళి అయిన స్త్రీ భర్తతో ఉన్నప్పుడు ఆచరించవలసిన ధర్మాలను చెప్పాను. ఇంకా కొన్ని పతివ్రతా ధర్మాలను చెబుతాను శ్రద్ధగా విను. ఒక వేళ భర్త దూరదేశమున మృతి చెందినా భర్త మరణించు సమమున భార్య గర్భవతిగా ఉన్నా, పసిబాలుని తల్లిగా ఉన్నా, సహగమనం చేయరాదు. శవం లభించని పక్షంలో సహగమనం చేయరాదు. అట్లు చేసినచో దోషం వచ్చును. అట్టి స్త్రీలు యావజ్జీవితము విధవా ధర్మములును పాటించిన, సహగమనము చేసిన ఫలితం లభించును. భర్త మరణించిన తర్వాత స్త్రీ కేశములు ఉంచుకోరాదు. అట్లు

ఉంచుకొన్నచో, జుట్టు అనే తాడుతో భర్తను కట్టివేసిన దోషం కల్గును. అట్టి స్త్రీ నిత్యము శిరఃస్నానము చేయవలెను. అట్టి స్త్రీ కొద్ది శాఖాహారమునైననూ, క్షీరపానమునైననూ త్రాగి జీవిస్తుండాలి. ప్రాణాలు నిలుపుకొనుటకు ఎంత అవసరమో, అంత మాత్రమే తిని జీవించవలెను. మంచమున పడుకోరాదు. మంగళ స్నానములు చేయరాదు. గంధ పుష్పములను, అక్షింతలను విసర్జించవలెను. సంతానం లేని విధవలు. భర్తకు పితృ తర్పణాలను, తిలలతో (నువ్వులు) ఆచరించవలెను. దేవుని పూజించవలెను. వ్రత, ఉపవాసములు యధాశక్తిగా ఆచరించవలెను. తన భర్తకు ప్రియమైన వస్తువులను బ్రాహ్మణులకు దానమియ్యవలెను.

మాఘ, కార్తీక, వైశాఖ మాసములందు స్నానాది ధర్మాలు ఆచరించవలెను. వైశాఖ మాసమునందు జల దానము, కార్తీక మాసమునందు దీప దానమును, మాఘమాసమునందు ఘృత దానమును చేయవలెను. ఎండాకాలం నిర్జన ప్రదేశములందు చలివేంద్రములను భర్త పేరుతో ఏర్పాటు చేయించవలెను. శివుని పూజించవలెను. విప్రులు రుద్రాభిషేకం చేస్తుంటే, భక్తితో నీటితో నిండిన బిందెను అర్పించవలెను. యధాశక్తిగా అన్నదానం చేస్తుండవలెను. తీర్థయాత్రలు చేయు సన్యాసులకు గొడుగు, పాదుకలు సమర్పించవలెను. బ్రాహ్మణులకు ఉదకపాత్రలను, కదళీ ఫలములను దానమివ్వవలెను. ఏ దానం చేసిననూ భర్త పేరుతో మాత్రమే చేయవలెను. కాంశ్య పాత్ర నిండా నెయ్యి ఉంచి బ్రాహ్మణునికి దానమివ్వవలెను. తాను భూమిపై పడుకొనుచూ మంచమును బ్రాహ్మణునకు దానం ఇవ్వవలెను. శక్తి ఉన్నచో భర్త పేరుతో గోదానం చేసినచో మంచి ఫలం లభించును. ఖర్జూరములు శక్తి ననుసరించి బ్రాహ్మణులకు దానం ఇవ్వవలెను. చలికాలమునందు కంబళ్ళు

దానమిచ్చినచో మంచి ఫలితం కల్గును. వీటన్నంటిలోనికి 'దీప దానం' చాలా శ్రేష్టం అయినది. వీరు రవికలు తొడగరాదు. తెల్లని వస్త్రాలనే ధరించవలెను. ఎర్రని, నల్లని వస్త్రాలను ధరించిన (మిగతా వస్త్రాలను కూడా) దోషం కల్గును. **పుత్రవతి అయినచో పుత్రుని ఆజ్ఞననుసరించి మాత్రమే ఇవన్నీ చేయవలెను.**

పతివ్రత యగు స్త్రీ భాగీరథితో సమానం. ఆమె భర్త శంకరునితో సమానం. ఇట్టి దంపతులే లోక పూజ్యులు. ఇట్లు ఆ యోగీశ్వరుడు సావిత్రీ దేవితో అమ్మా! నీకు సువాసినీ ధర్మాలను చెప్పాను. విధవా ధర్మాలనూ చెప్పాను. నీకేది అనుకూలంగా ఉంటే అది చేసుకో అని ఆశీర్వదించాడు. అప్పుడు సావిత్రీదేవి 'యోగీశ్వరా! నాకు మీరే తల్లిదండ్రులు. ఇచ్చట బంధువులెవ్వరూ లేరు, నేను ప్రస్తుతం యుక్తవయస్కురాలై ఉన్నాను. కాబట్టి విధవాధర్మములు పాటించుట బహుకష్టము. యవ్వనమున ఉన్నవారికి ఈ కలియుగమునందు నిందాపవాదములు కల్గును కదా! అయినా అది కత్తి మీద సాములా ఉంటుంది. కాబట్టి భర్తతో సహగమనం చేయడమే నాకు ఇష్టం, నన్ను ఆశీర్వదించుడు" అని పాదములకు నమస్కరించెను.

అప్పుడు ఆయన ఆమెను లేవదీసి "అమ్మా! నీ ఇష్టం వచ్చినట్లు కానిమ్ము విధి నెవ్వరు తప్పించగలరు? కానీ ఇంత దూరము శ్రీ గురుని దర్శించుటకు వచ్చావు గాబట్టి వారిని దర్శించుకొని నీవు సహగమనం చెయ్యి" అని చెప్పి తన చేతిలో ఉన్న రుద్రాక్షలను ఆమెకు ఇచ్చి "అమ్మా! శవ సంస్కారం చేసే ముందు వీటిని నీ భర్తకు అలంకరింపచేయి" అని ఆమెకు ఇచ్చి వెళ్ళిపోయారు. సావిత్రీ దేవి శ్రీగురుని స్మరించి ఆ రుద్రాక్షలను

శవమునకు అలంకరింపచేసి, తమతో వచ్చిన బోయీలను దగ్గరకు పిల్చి, ఇలా చెప్పింది. "అయ్యా! నేను నా భర్తతో సహగమనం చేద్దామను కుంటున్నాను. వృద్ధులైన నా అత్తమామలకు మాత్రం మీరు ఈ వార్తను వెంటనే చెప్పవద్దు. చెబితే వారి ప్రాణాలు పోతాయి. ఇక్కడ శ్రీగురుని సన్నిధిలో మేము సంతోషంగా ఉన్నామని మా అత్తమామలకు చెప్పండి. ఇక మీరు వెళ్ళవచ్చు." అని వారికి దక్షిణ ఇచ్చింది. అంతట, అక్కడ ఉన్న బ్రాహ్మణులకు ఘనంగా దక్షిణలు సమర్పించి, శవ సంస్కారానికి అన్నీ సిద్ధం చేయమని వారితో చెప్పి, ఈలోగా ఆ యతి చెప్పినట్లుగా శ్రీగురుని దర్శించి వచ్చి సహగమనం చేద్దామనే ఉద్దేశ్యంతో అక్కడ ఉన్న బ్రాహ్మణులతో "అయ్యలారా! నేను ఇంత దూరం శ్రీగురుని దర్శనం కోసం వచ్చాను కాబట్టి వారి దర్శనం చేసుకొని వస్తాను. ఈ లోగా ఏర్పాట్లు చేయండి" అని చెప్పి ఆవిడ శ్రీగురుని దర్శించుట కొరకై సంగమానికి బయలు దేరింది. అప్పుడు మనస్సులో ఈ విధంగా తలుస్తూ ఉంది. "స్వామీ! శ్రీగురూ! మిమ్మల్ని దర్శించి మీ అనుగ్రహాన్ని పొంది, నా భర్తను బ్రతికించుకుందామని ఇంతదూరం వచ్చాను. కానీ ఎన్నో లీలలు ప్రదర్శించిన మీరు నాయందు ఎందుకో కఠినత్వాన్ని వహించారు. నా సౌభాగ్యం మంట గల్సిపోయింది.' అని మనస్సులో తలుస్తూ, శ్రీగురునిపై నిష్టూరాలు ఆడుతూ సంగమానికి చేరింది. అంత దూరాన ఉన్న శ్రీగురుమూర్తిని చూడగానే, ఆమె హృదయంలో దుఃఖం పెల్లుబికి, అల్లంత దూరముననే సాష్టాంగ నమస్కారం చేసి, పరుగు పరుగున దుఃఖంతో రోదిస్తూ వచ్చి, శ్రీ గురుని పాదాలపై పడి, దీనాతి దీనంగా విలపించసాగింది. అప్పుడు శ్రీగురుడు "అమ్మాయీ! నీవెవరు? ఎందుకిలా దుఃఖిస్తున్నావు? లేవవమ్మా నీవు, సౌభాగ్యవతీ భవ!" అని ఆశీర్వదించారు.

ఆవిడ అత్యంత ఆశ్చర్యంతో చూస్తుండగా ఆవిడతో వచ్చిన కొందరు "స్వామీ! ఈవిడ భర్త మరణించాడు. శవసంస్కారానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈమె కూడా సహగమనం చేయబోతున్నది. మీరు ఈమెను 'సౌభాగ్యవతి' అన్నారు. ఈమె సౌభాగ్యం సుస్థిరం ఎట్లా అవుతుంది?" అన్నారు. అప్పుడు శ్రీగురుడు ఏమీ తెలియనట్టుగా "అలాగా! ఏది ఏమైనప్పటికీ మా వాక్కుకు తిరుగులేదు. శవ సంస్కారాన్ని నిలిపివేసి, శవమును ఇటు తీసుకు రండ"ని ఆజ్ఞాపించారు. శ్రీ గురు మహిమను తెల్సిన కొందరు పరుగు పరుగున వెళ్ళి శవ సంస్కారానికై జరుగుతున్న ఏర్పాట్లు నిలిపివేసి, శవాన్ని ఎత్తుకొని శ్రీగురుని వద్దకు వచ్చారు. ఇంతలో అక్కడున్న బ్రాహ్మణులు శ్రీగురుని పాదాలకు రుద్రగానంతో అభిషేకం చేయనారంభించారు. శ్రీ గురుడు శవాన్ని దింపించి, కట్టు విప్పదీయించి, తమ అమృతమయమైన కృపాదృష్టిని ఒక్కసారిగా శవంపై సారించి చూచారు. అదేమి చిత్రమోగాని క్షణంలోనే శవ రూపంలో పడి ఉన్న దత్తుడి శరీరంలో కదలిక ప్రారంభమై మరుక్షణంలో నిద్ర నుంచి మేల్కొన్న వానివలే లేచి కూర్చున్నాడు. ఆశ్చర్యంతో చుట్టుప్రక్కల చూచి, భార్యవైపు చూస్తూ శ్రీగురుని చూపిస్తూ 'సావిత్రీ! ఈయతీశ్వరులెవరు? ఇప్పుడు మనం ఎక్కడ ఉన్నాము? నా శరీరంలో రోగ బాధలేదు. ఇదంతా ఎలా జరిగింద'ని ఆశ్చర్యంగా అడిగాడు. అప్పుడు సావిత్రి తమ పాలిట శ్రీగురుడు ఆయనేనని, పరబ్రహ్మస్వరూపులైన వారి గురించి చెప్పి, జరిగినదంతా వివరించింది. దత్తుడు శ్రీగురుని పాదాలపై పడి, కృతజ్ఞతా పూర్వకంగా నమస్కరించాడు. శ్రీగురుడు సావిత్రీ దత్తాత్రేయుల నిద్దర్నీ లేవనెత్తి "నాయనా! నీకు శుభం కలుగు గాక! అష్టైశ్వర్యములతో అష్టపుత్రులును కల్గి సుఖంగా జీవించండి. చీకటి పడుతున్నది, పదండి

మఠానికి వెళ్దాం" అన్నారు. అప్పుడు అక్కడ ఉన్న వారందరూ ఆలీలలను చూచి, అద్భుతం అయిన శ్రీగురుని మహిమను తెల్సుకొని ఆయనకు హారతులిచ్చి భక్తితో నమస్కరించారు.

అక్కడున్న వారిలో ఒక ధూర్తుడు ముందుకు వచ్చి "అయ్యా! విధివ్రాతను ఎవ్వరు తప్పించలేరుకదా! మరి ఈ చనిపోయినవాడు మరలా ఎలా బ్రతికాడు?" అని అడిగాడు. శ్రీగురుడు అతనివైపు చూసి నవ్వుతూ "నాయనా! విధి వ్రాతను ఎవ్వరూ తప్పించలేరు అన్నది వాస్తవం. వచ్చే జన్మలోని జీవిత భాగాన్ని ఒక 30 సంవత్సరములు ఈ జన్మలోనికి మార్పించాము. అంతేగాని విధి వ్రాత అన్నది అందర్కీ సమానమే." అని అతనికి ఆ సత్యాన్ని దర్శింపచేశారు. ఇంతలో చీకటి పడ్తూ ఉన్నది. శ్రీగురుడు అందర్నీ తమ తమ ఇళ్ళకు వెళ్లిపోమ్మని, సావిత్రి దత్తాత్రేయులను మాత్రం తీసుకొని తమ మఠానికి చేరుకున్నారు.

ఓం శ్రీదత్తాయ గురవే నమః

ఓం శ్రీపాద స్వామినే నమః **ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః**

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః


(32వ అధ్యాయం సంపూర్ణం)

తాపత్రయాగ్ని తప్తానా మ శాంతప్రాణినాం ముదే
గురురేవపరాగంగా తస్మై శ్రీగురువేనమః


– గురుగీత

తాపత్రయములనెడి అగ్నిచే తపించి, శాంతిని కోల్పోయిన జీవుల హృదయాలు చల్లబడుటకు గంగానదిలాంటి గురుదేవునకు వందనములు.

33 వ అధ్యాయము



శ్రీ గణేశాయ నమః



శ్రీ సరస్వత్యై నమః



శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

శ్లో. వేశ్యాసత్యైతు రుద్రాక్ష మహాత్మ్యయుత మీట్కృతం ।
ప్రసాదం ప్రాహయస్యత్యే శ్రీ దత్త శ్శరణం మమ ॥

(భా: రుద్రాక్ష ధారణ వల్ల కోతి కోడి – రాజు, మంత్రి కుమారులై జన్మించుట)

సిద్ధయోగి నామధారకునికి ఆ పై కథను ఈ విధంగా వివరించాడు: మఠానికి చేరుకున్న సావిత్రి, దత్తాత్రేయులు మరునాటి ఉదయం శ్రీగురుని వద్దకు వెళ్ళి చేతులు జోడించి నమస్కరించారు. అప్పుడు సావిత్రి "శ్రీగురూ! నిన్న నా భర్త చనిపోయినప్పుడు శోకంతో విలపిస్తుంటే ఒక యతి వచ్చి మాకు రుద్రాక్షలనిచ్చి, వాటిని నా భర్తకు ధరింపజేయమని చెప్పి, నాకు ధర్మాన్ని ఉపదేశించినారు. స్వామీ! ఆయనెవరు? వారి దర్శనము ఎక్కడ లభిస్తుంది?" అని అడిగింది. శ్రీగురుడు 'అమ్మా! రుద్రాక్ష మహిమను తెలియజెప్పుట కొరకై మేమే ఆ యతి రూపములో మీకు దర్శనమిచ్చాము. రుద్రాక్ష మహిమను చెప్తాను. శ్రద్ధగా వినండి."

రుద్రాక్ష ధారణ వలన విశేషమైన పుణ్యం లభిస్తుంది. వెయ్యి

రుద్రాక్షలు ధరించినవాడు సాక్షాత్తు రుద్రుడే. అట్లు కానిచో భుజములందు 16, శిఖ యందు 1, చేతుల యందు 24, చెవుల యందు 6, కంఠమున 32, మస్తకమున 42, వక్షస్థలమున 108 ఎవరు ధరింతురో, వారు కుమారస్వామితో సమానం. రుద్రాక్షలతో పాటు స్ఫటికాలు, వైఢూర్యములు కలిపి మాలగా ధరించవచ్చు. రుద్రాక్షలు ధరించువారికి సద్గతి నిశ్చయంగా లభించును.

రుద్రాక్షమాలతో జపం చేస్తే అనంత ఫలితం కల్గును. రుద్రాక్షలు ధరించని వాని జన్మయే వ్యర్థము, రుద్రాక్షలు చెవులయందు ఆభరణముగ ధరించి స్నానం చేస్తే గంగా స్నాన ఫలం కల్గును. రుద్రాక్షను రుద్రాభిషేకంతో పూజిస్తే అనంత ఫలితం కల్గుతుంది.

పూర్వం, కాశ్మీర దేశమునందు 'భద్రసేనుడు' అను రాజు కలడు. అతనికి 'తారకుడు' అనే కొడుకు కలడు. మంత్రి సుధర్మునికి 'సద్గుణుడు' అనే కొడుకు కలడు. వారిద్దరూ చిన్నతనం నుంచీ మంచి స్నేహితులై కలసి జీవించుచూ, రుద్రాక్షలను ధరిస్తూ, నిత్యమూ భక్తితో శివుని పూజిస్తూండేవారు. ఎన్నో బంగారు ఆభరణాలున్ననూ వాటిని త్యజించి రుద్రాక్షలను మాత్రమే ధరించేవారు. ఒక రోజు పరాశర మహర్షి వారింటికి రాగా, ఆ రాజు, మంత్రులిద్దరూ తమ బిడ్డల విచిత్ర వైఖరికి కారణమేదో చెప్పమని ప్రార్థించారు. అప్పుడు పరాశరుడు, "రాజా! పూర్వమున 'నంది' అనే గ్రామంలో 'మహానంద' అనే వేశ్య, నిత్యము తన ఇంటనున్న నృత్యమంటపంలో నృత్యం చేసేది. అక్కడ ఒక్క కోతిని, కోడిని ప్రేమగా పెంచుకుంటూండేది. వాటిని నిత్యము రుద్రాక్షలతో అలంకరిస్తూండేది. ఒక రోజు వారింటికి రత్న లింగమును ధరించిన ఒక వైశ్యుడు వచ్చాడు.

అతని చేతికి సువర్ణమయమైన కంకణాలు ఉన్నాయి. అప్పుడు మహనంద అతని వద్దనున్న రత్నలింగమును చూచి, అది తనకు ఇవ్వమని తన సఖిచేత కబురు పంపించింది. అప్పుడా వైశ్యుడు మూడు రోజులు తనను సుఖంగా సంతోషపెట్టగల్గితే ఆ లింగమును ఇస్తానని చెప్పాడు. ఈ వేశ్య పతివ్రతా ధర్మమును అనుసరించి మూడు రోజులు ధర్మమును నిర్వర్తిస్తానని అన్నది. అప్పుడు ఆ వైశ్యుడు కులస్త్రీకి వలే వేశ్యకు అదెలా సాధ్యం అవుతుంది అన్నాడు. కానీ ఆవిడ మాత్రము తనను నమ్మమని అడిగింది. ఆ వైశ్యుడు ఆమెకు తన వద్దనున్న రత్నలింగాన్ని ఇచ్చాడు. దివ్యసుందర ప్రకాశంతో వెలిగిపోతున్న ఆ లింగమును చూచి ఆవిడ ఎంతో ఆనందించి, దానిని ఆ రోజు తన నృత్యమండపంలో పెట్టి, నృత్యం చేసి, వైశ్యునితో తన గదిలో ప్రవేశించింది. అదేమీ విచిత్రమో గానీ, ఆ రాత్రి నృత్యమండపం భగ్గున మండిపోయింది. ఆ లింగము, కోడి, కోతి కూడా ఆ మంటలో పడి బుగ్గయిపోయినాయి. వైశ్యుడు అది తెల్సుకొని ఏడుస్తూ "అయ్యో! నా ప్రాణలింగమే పోయింది. ఇది నా ప్రాణంతో సమానం. అది నీకు ముందే చెప్పాను" అని అక్కడే మంట వెల్గించి అందులో దూకేశాడు. అదంతా చూస్తున్న వేశ్య "నాథా"! అంటూ అందులో దూకటానికి ప్రయత్నించింది. అక్కడున్న వారందరూ, "పిచ్చిదానా! వేశ్యవైన నీకు ఇదేమిపని?" అంటూ ఆవిడను ఆపడానికి ప్రయత్నించారు. అప్పుడావిడ, "లేదు, నేను అతనితో 3 రోజులు పతివ్రతా ధర్మాన్ని అనుసరిస్తాను" అని ప్రమాణం చేశాను. ఇప్పుడు నేను నా ధర్మాన్ని నిర్వహించకుంటే నేను నరకానికి పోతాను, ఇప్పుడు నేను నా ధర్మాన్ని నిర్వర్తిస్తే 42 తరాలవారు తరిస్తారు." అని ఆవిడ ఆ నిప్పులో దూకబోయింది. ఇంతలో శివుడు ప్రత్యక్షమై 'అమ్మా! నేనే ఆ వైశ్యుని రూపంలో నీ వద్దకు వచ్చాను. నీ

శివభక్తిని పరీక్షించుట కొరకే ఇలా చేశాను" అని, ఆమెను కోటి సంవత్సరములు స్వర్గంలో ఉండేలా ఆశీర్వదించి, సంపూర్ణమైన అనుగ్రహాన్ని ప్రసాదించాడు. ఆ రోజు నాట్యమండపంలో బుగ్గి అయిపోయిన కోతి, కోడి మీ బిడ్డలుగా జన్మించారు. అందువల్లనే భక్తితో రుద్రాక్షలను వారు ధరిస్తున్నారు" అని పరాశర మహర్షి ఆ రాజుకు వివరించారు.

ఓం శ్రీదత్తాయ గురవే నమః

ఓం శ్రీపాద స్వామినే నమః **ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః**

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

(33వ అధ్యాయం సంపూర్ణం)

ఏక ఏవ పరోబన్దుర్విషమే పముపస్థితే ।
గురుస్స కల ధర్మాత్మా తస్మై శ్రీగురవేనమః ॥

– గురుగీత

విషమ పరిస్థితి ఆసన్నమగుచుండగా మనలను రక్షించు ఏకైక బంధువు గురుదేవుడే. గురుమూర్తి సకల ధర్మాత్మ స్వరూపుడు. అట్టి గురుదేవునకు నమస్కారము.


గాజుపూసలు మెడలోన కలిగియున్న
మకిలిగా పతివ్రత కనబడిన ఏమి నష్టము?
సూర్యచంద్రుల రీతిగా జ్యోతులీని
సఖులతో ప్రకాశించును స్వచ్ఛముగానూ
మరచిపోకుడు శివానందుని మంచిమాట

– శ్రీ స్వామి శివానంద మహరాజ్

34 వ అధ్యాయము



శ్రీ గణేశాయ నమః



శ్రీ సరస్వత్యై నమః



శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

శ్లో. శతరుద్రీయ మహాత్మ్యం మృతరాట్ సుతజీవనం ।
సత్యైశశంస సగురుః శ్రీ దత్తశ్శరణం మమ ॥

(భావము : రుద్రాభిషేకం యొక్క ప్రభావం వల్ల మృతులైన రాజు, మంత్రి కుమారులు తిరిగి జీవించుట)

(ఈ అధ్యాయము నిత్యము పారాయణము చేయుట వలన అపమృత్యు దోషము తొలగును)

నామధారకుడు సిద్ధయోగికి నమస్కరించి, మిగతా కథను వివరించమని కోరగా సిద్ధయోగి ఇలా చెప్పాడు.

పరాశర మహర్షి వివరించిన కథను విన్న రాజు, మంత్రులు ఆయనకు నమస్కరించి, "స్వామీ! పూర్వజన్మలో తెలియక రుద్రాక్షలు ధరిస్తేనే వీరు రాజవంశంలో జన్మించారు కదా! మరిప్పుడు ఇంత భక్తితో ధరిస్తున్నారు కదా! మరి వీరి భవిష్యత్తు ఎలా వుంటుందో దయచేసి వివరించండ"ని వేడుకున్నారు. ఆ మహర్షి సంశయిస్తూ, రాజా వీరి భవిష్యత్తు చెప్తే మీరు బాధపడ్తారు అన్నారు. అప్పుడారాజు చెప్పమని మరీ మరీ ప్రార్థించిన మీదట 'నాయనా! వీరు ఎనిమిది రోజుల్లో

చనిపోవలసి ఉన్నది' అన్నారు. ఆ రాజు, మంత్రి ఎంతో దుఃఖించి తరుణోపాయం చెప్పి రక్షింమని మరీ మరీ వేడుకున్నారు. పరాశర మహర్షి "నాయనా! వేదాల యొక్క సారమే రుద్రమంత్రము. అది భక్తితో జపించిన వారికి మృత్యుభయం ఉండదు. మానవులు సత్వగుణం వల్ల దేవత్వాన్ని, రజోగుణం వలన మానవ జన్మను, తమోగుణం వలన తిర్యక్ జన్మలను పొందుతారు. భక్తితో సత్వగుణోపేతులై ఏ మానవుడైనా రుద్ర మంత్రం జపిస్తే, కష్ట నష్ట అరిష్టముల నుండి బైటపడగలరు. భక్తితో మీరు కూడా ఈ ఎనిమిది రోజులు నిరంతరము రుద్రగానంతో శివునికి అభిషేకం చేసి, అభిషేక జలంతో ప్రతిరోజు మీ బిడ్డలిద్దరికీ స్నానం చేయించండి. అపమృత్యు భయముండదు." అని చెప్పారు. అప్పుడు ఆ రాజు ఈ కార్యక్రమం అంతనూ మీ చేతుల మీదుగానే జరిపించమని పరాశర మహర్షిని కోరారు. రాజు తన నగరంలో ఉన్న శివాలయాన్నింటిలో వేల మంది బ్రాహ్మణులను పెట్టి, వేల కొలదీ రుద్రసూక్తములతో శివునికి అభిషేకం చేయించాడు. నిత్యము వచ్చిన అభిషేక జలంతో ఆ కుమారులిద్దర్నీ స్నానం చేయిస్తున్నా, ఎనిమిదవ రోజు మధ్యాహ్న సమయాన ఆ బిడ్డలిద్దరూ స్పృహ తప్పి పడిపోయారు. దుఃఖ వదనములతో వుండగా పరాశర మహర్షి తమ చేతితో అభిషేక జలమునుతీసి వారి నెత్తిపై చల్లారు. తక్షణమే ఆ బిడ్డలిద్దరూ లేచి కూర్చున్నారు. పరాశర మహర్షి వారిని సంపూర్ణంగా ధీర్ఘాయుష్కులు కమ్మని ఆశీర్వదించారు. అప్పుడా రాజు, మంత్రులు అంతటి గొప్ప ఉపాయం చెప్పిన ఆ మహర్షిని దక్షిణ కానుకలతో ఘనంగా సత్కరించారు.

ఓం శ్రీదత్తాయ గురవే నమః

ఓం శ్రీపాద స్వామినే నమః **ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః**

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

(34వ అధ్యాయం సంపూర్ణం)

35 వ అధ్యాయము



శ్రీ గణేశాయ నమః



శ్రీ సరస్వత్యై నమః



శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

శ్లో. కచాఖ్యానం స్త్రీయో మంత్రనర్హత్వార్థ సుభాగ్యదం ।
సోమవ్రతంచయః ప్రాహ శ్రీదత్తశ్శరణం మమ ।

(భావము : పతివ్రతకు సోమవార వ్రత మహాత్మ్యమును శ్రీగురుడు చెప్పుట)

నామధారకుడు సిద్ధయోగికి నమస్కరించి, "స్వామీ, అటు తర్వాత శ్రీగురుని లీలలను వినిపించండని" ప్రార్థించాడు. అప్పుడు సిద్ధయోగి ఇలా చెప్తున్నాడు శ్రీగురుడు సావిత్రీ దేవికి "అమ్మా! రుద్రాక్ష ధారణ ఇంత పవిత్రమైనది." అని చెప్పారు. సావిత్రీ దేవి "స్వామీ! నేను ప్రతిరోజూ పూజించుట కొరకు, సాధన చేసుకొనే కొరకు నాకేమైనా మంత్రమును ఉపదేశించండ"ని ప్రార్థించింది. అప్పుడు శ్రీగురుడు 'అమ్మా! స్త్రీలకు మంత్రజపం తగదు. పతి సేవయే మోక్షదాయకం. తన భర్తనే నారాయణునిగా భావించి సేవించాలి" అన్నారు. సావిత్రి "స్త్రీలు మంత్రజపం ఎందుకు చేయకూడదో వివరించండి." అని ప్రార్థించింది.

అప్పుడు శ్రీగురుడు "పూర్వము దేవతలకు, రాక్షసులకు యుద్ధము జరుగుతున్నది. దేవతలు కనిపించిన రాక్షసుడినల్లా చంపేస్తున్నారు. రాక్షసగురువైన శుక్రుడు మృతసంజీవని మంత్రంతో వారందర్ని బ్రతికిస్తూండేవాడు. రాక్షసులు బలగర్వంతో ఎదురులేక దేవతలను పట్టి హింసిస్తూ ఉన్నారు. దేవతలందరు భయపడి, పరమశివుని వద్దకు వెళ్ళి శుక్రుని చర్యను ప్రతిఘటించమని ప్రార్థించారు. అప్పుడు శివుడు నందిని పంపి, ధ్యాన నిమగ్నుడై ఉన్న శుక్రుని తెప్పించి తన కడుపులో బంధించాడు. ఒకసారి శివుడు ఏమారి ఉన్నప్పుడు శుక్రుడు శివుని మూత్రం నుండి బయటకు వచ్చి, మరల రాక్షసులకు సహాయం చేస్తున్నాడు. దేవతలు భయపడి ఈ విషయాన్ని విష్ణుమూర్తికి విన్నవించుకున్నారు. ఆయన దేవగురువైన బృహస్పతిని పిలిపించి, శుక్రాచార్యుని చర్యను అడ్డగించుటకు ఉపాయం ఏదైనా పన్నమని చెప్పాడు. అప్పుడు బృహస్పతి తన కుమారుడైన 'కచుని' అందుకు నియమించాడు.

'కచుడు' బ్రాహ్మణ వేషంలో శుక్రుని వద్దకు వెళ్ళి, "అయ్యా! నేను మీ అపారమైన మహిమలు విని, మీ వద్దకు విద్య నేర్చుకోడానికై వచ్చాను" అని చెప్పాడు. శుక్రుని కుమార్తె అయిన దేవయాని అతన్ని చూచి మోహించి కామవశంచే తండ్రిని అందుకు ఒప్పించింది. కొన్నాళ్ళకు కచుడు శత్రు పక్షం వాడని తెల్సుకొని, రాక్షసులంతా కలసి అతన్ని చంపేశారు. దేవయాని అతనిపై మోహంతో తండ్రితో కచుని గూర్చి విచారించింది. శుక్రుడు దివ్యదృష్టితో తెల్సుకొని "అమ్మా! ఈ రాక్షసులు అతన్ని చంపేశారు," అని చెప్పాడు. కాని కుమార్తెపై నున్న ప్రేమతో శుక్రుడు కచుణ్ణి బ్రతికించాడు. మరొకసారి కూడా కచుడు కట్టెలకు అడవికి వెళ్ళిన సమయంలో మరల

రాక్షసులు అతనిని చంపి, శరీరమును దహనం చేసి, ఆ బూడిదను నలుదిక్కులా విరజిమ్మారు. శుక్రుడు మరల దివ్య దృష్టితో తెల్సుకొని బ్రతికించినాడు. మూడవసారి కూడా ఆ రాక్షసులు అతడ్ని చంపి, బూడిద చేసి మంచి నీటిలో కలిపి శుక్రుని చేతనే త్రాగించారు. ఈసారి శుక్రుడు దేవయానితో "అమ్మా! ఈ రాక్షసులు అతన్ని చంపి, నా కడుపులోనే బంధించారు. ఇప్పుడు అతన్ని బ్రతికించాలంటే నేను చచ్చిపోవాలి" అన్నాడు. అప్పుడు దేవయాని "తండ్రీ నీకు మృత సంజీవిని మంత్రం వచ్చు కదా! ఆ మంత్రాన్ని నాకు చెప్పండి. అతన్ని బ్రతికించి మీరు చనిపోయిన తర్వాత ఆ మంత్రంతో మిమ్మల్ని నేను బ్రతికిస్తాను" అన్నది. శుక్రుడు "అమ్మా! స్త్రీలకు మంత్ర జపం తగదు. అయినా మృతసంజీవినీ మంత్రం మూడవవాడు వినకూడదు. నీవు నన్ను బ్రతికిస్తున్నపుడు మూడవ వాడుగా కచుడు వింటాడు. అందువల్ల మంత్రం నష్టం అవుతుంది అన్నాడు. ఆమె మాత్రం పట్టు వదలకుండా అతడ్ని బ్రతికించకపోతే మాత్రం తాను ఆత్మహత్య చేసుకుంటానని తండ్రిని బెదిరించింది. కూతురిపై ఉన్న ప్రేమతో శుక్రుడు మృత సంజీవనీ మంత్రమును కుమార్తెకు ఉపదేశించి కచుణ్ణి బ్రతికించాడు. శుక్రుని కడుపు చీల్చుకొని బ్రతికి వస్తున్నపుడు మూడవ వాడుగా కచుడు ఈ మంత్రాన్ని విన్నాడు. అందువలన ఈ మంత్రం నష్టమైంది. స్త్రీకి ఉపదేశించటం వలన, మూడొవ వానిగా కచుడు విన్నందువల్ల, మంత్రం నష్టమై ఇక రాక్షసులు బ్రతకలేదు. తర్వాత దేవయాని కచునితో తనను వివాహమాడమని కోరింది. అంత కచుడు "నీవు గురు పుత్రికవు కనుక నాకు సోదరితో సమానము. నన్ను బ్రతికించావు కనుక తల్లితో సమానము. అందువలన వివాహము

చేసుకోను" అన్నాడు. దేవయాని అతనిపై కామవశంతో శపించింది. అందుకు కచుడు కూడా ప్రతిశాపం ఇచ్చి, గురువైన శుక్రునితో "అయ్యా! మీ దయవలన నేను వచ్చిన పని నెరవేరింది. నేను ఇంకా ఇక్కడ ఉంటే ఈ రాక్షసులు నన్ను బ్రతకనివ్వరు. అందువల్ల నా దారిన నేను వెడతాను" అని వెళ్ళిపోయాడు.

ఈ పై కథను శ్రీ గురుడు సావిత్రీ దేవికి చెప్పి "అమ్మా! నీకు ఉత్తమమైనటువంటి మార్గం చెప్తాను. సోమవార వ్రతాన్ని చేసుకో. సోమవారం రాత్రి మాత్రమే భోజనం చేస్తూ ఈ వ్రతాన్ని ఆచరించాలి" అని సోమవార వ్రతమహాత్మ్యమును క్రింది విధంగా సావిత్రికి ఉపదేశించారు.

పూర్వము ఆర్యావర్తమును చిత్రవర్మ అను రాజు పరిపాలిస్తుండేవాడు. అతడు పుణ్యాత్ముడు, ధార్మికుడు. అతనికి లేక లేక కల్గిన సంతానంగా ఒక కుమార్తెను పొందాడు. కుమార్తె యొక్క జాతకం పరిశీలించుటకు జ్యోతిష్యులను పిలిపించారు. వారు ఆ బాల జాతకాన్ని చూచి, ఆ పాప పార్వతివలె సర్వమంగళ రూపంతో ఉండునని, సీత వలె పతివ్రతగా తులతూగునని చెప్పారు. అప్పుడా రాజు అందుకు సంతోషించి, వారికి ఘనమైన దక్షిణ తాంబూలములతో సత్కరించి పంపాడు. నామకరణ మహోత్సవం నాడు ఆ బిడ్డకు "సీమంతిని" అని పేరు పెట్టుకొన్నారు. ఆ పిల్ల పెరిగి ఆటపాటల యందు వృద్ధి చెంది, గొప్ప సౌందర్యవతి అయింది. సీమంతినికి 12వ ఏట ఒక దైవజ్ఞుడు రాజు వద్దకు వచ్చి, "రాజా నీ కుమార్తె సర్వ శుభ లక్షణములు కల్గిననూ, పెళ్ళి చేసిన వెంటనే

వైధవ్యమును అనుభవించును" అని చెప్పి వెళ్ళిపోయాడు. అపుడా రాజు, కుమార్తె గురించి దుఃఖిస్తూ, ఆమె వివాహమును గూర్చి చింతిస్తుండేవాడు. సీమంతిని చెలికత్తెల ద్వారా ఈ విషయం తెలుసుకొని యాజ్ఞవల్క్య మహర్షి భార్యయైన మైత్రేయిని దర్శించి, ఆమెతో తన దురదృష్టమును వివరించి చెప్పి, తనను ఆ ఆపద నుంచి కాపాడమని వేడుకున్నది. అపుడు ఆమె "అమ్మా! నీవు శివపూజను చేయి. శివానుగ్రహం వల్ల నీకు సౌభాగ్యం కల్గును." అని చెప్పుచూ "సోమవార వ్రతమును చేయుము. సోమవారం ప్రాతఃకాలముననే స్నానం చేసి, ఉపవాసం ఉండి, పార్వతీ సమేతుడై ఉన్న పరమేశ్వరుని పూజింపుము. శివ అభిషేకంచే పాపములు తొలగును. పీట పూజచే సామ్రాజ్యం కల్గును. గంధ పుష్పాక్షతలచే పూజించినచో సౌభాగ్యం, సౌఖ్యము కల్గును. ధూపంచే సౌందర్యము, దీపంచే కాంతి, నైవేద్యంచే భోగములు, తాంబూలంచే లక్ష్మి, నమస్కారంచే చతుర్విధ పురుషార్థములు, మంత్రజపంచే అష్టైశ్వర్యములు, హోమంచే కోశ సంపద (భుక్తి), స్తోత్రంచే సర్వసంవృద్ధి, బ్రాహ్మణ భోజనంచే సర్వదేవతా సంతృప్తి కల్గును. కావున సీమంతినీ! నీవు కూడా ఈవిధంగా వ్రతం ఆచరించు నీ కష్టములు తొలగును." అని మైత్రేయి చెప్పెను. సీమంతిని తండ్రి అయిన చిత్రవర్మ శివునిపై సర్వ భారమూ ఉంచి ఇంద్రసేన మహారాజుకుమారుడైన చంద్రాంగవర్మకు సీమంతిని నిచ్చి వివాహం చేశాడు. ఆ వివాహం అత్యంత వైభవోపేతంగా జరిగెను.

అదేమి చిత్రమో గాని చిత్రవర్మ అల్లుడైన చంద్రాంగదుడు ఒక రోజు జలక్రీడని నదికి వెళ్ళి మునిగిపోయెను. రాజభటులు చింతా నిమగ్నులై పరుగు పరుగున వెళ్ళి ఈ విషయం రాజుకు విన్నవించారు.

రాజు, సీమంతిని నది వరకు వచ్చి, భటులను నదిలో దింపి అల్లుని కొరకు వెతికించిరి. గజఈతగాళ్ళను కూడా పెట్టి వెతికించిరి. ఎంత వెతికినా చంద్రాంగదుడు కన్పించలేదు. ఈ వార్త విన్న సీమంతిని మూర్ఛపోయింది. సీమంతిని మేల్కొన్న తర్వాత, శివునిపై నిష్ఠూరాలు ఆడుతూ తను ఎంతో భక్తితో వ్రతం చేసిననూ శివుడు తన భర్తను రక్షించ నందుకు దుఃఖిస్తూ తాను కూడా నదిలో దూకడానికి ప్రయత్నించింది. అప్పుడు అక్కడున్న కొంతమంది దైవజ్ఞులు ఆ చర్యను చూచి, శవం కన్పించకపోతే సహగమనం చేయకూడదని చెప్పారు. సీమంతిని మూడవ నెల కడుపుతో ఉన్నది. గర్భవతియైన స్త్రీ ఆత్మహత్య చేసుకోరాదని వారు బోధించారు. అప్పుడు దైవజ్ఞులు ఒక సంవత్సరం వేచి చూచిన తర్వాత, వైధవ్యమును ఆచరించవచ్చని చెప్పారు. కొలదికాలం గడిచింది. కాని సీమంతిని మాత్రం నిష్ఠతో ఆ వ్రతం ఆచరిస్తూ ప్రతీరోజూ ఆ నది వద్దకు వెళ్లి భర్తకోసం ఎదురు చూస్తూండేది.

ఆ రాజకుమారుడు నదిలో మునిగి పాతాళలోకానికి చేరాడు. అదృష్టవశమున నాగకన్యలు అతన్ని చూచి, తమ రాజైన తక్షకుని వద్దకు అతన్ని తీసుకొని వెళ్ళారు. ఆ నాగరాజు రాజకుమారుడ్ని చూచి, అతని చేత అమృతం త్రాగించి, తమ లోకంలోనే ఉండిపొమ్మని కోరాడు. అంత చంద్రాంగదుడు తన భార్య, అత్తమామలు తన కొరకు ఎదురు చూస్తూంటారని, తల్లిదండ్రులకు తను ఒక్కడేనని, తాను తిరిగి భూలోకానికి వెళ్ళడానికి అనుజ్ఞ నిమ్మని ప్రార్థించాడు. అపుడు ఆ నాగరాజు అతని భార్య కొరకు అమృతం నిండిన ఒక పాత్రను ఇచ్చి, "నీవు స్మరించినంతనే నీకు ప్రత్యక్షం అవుతాను," అని అనుజ్ఞనిచ్చి, తన భటులను పిల్చి, క్షేమంగా

ఇతన్ని తిరిగి భూలోకం చేర్చమని ఆజ్ఞాపించాడు. నది నుంచి బయటకు వచ్చిన చంద్రాంగదుడు నది వద్దనే కూర్చుని ఉన్న భార్యను చూచి, అమృత భాండమును ఆమెకు ఇచ్చి, భార్యతో సహా రాజ్యమునకు చేరుకున్నాడు.

చంద్రాంగదుడు నీట మునిగిన సంగతి తెల్సుకున్న శత్రురాజులు ఇంద్రసేన మహారాజు రాజ్యాన్ని చుట్టుముట్టి రాజును చెరసాలలో బంధించి రాజ్యం దోచుకున్నారు. చంద్రాంగదుడు ఈ విషయం అంతా తెల్సుకొని, శత్రురాజుల వద్దకు వెళ్ళి తాను తక్షకుని వద్ద నుంచి వరం పొందిన విషయం తెల్పి, తన రాజ్యం తిరిగి తనకు ఇమ్మనీ లేనిచో శిక్షించెదనని అన్నాడు. అంత శత్రురాజులు భయపడి, వారి రాజ్యాన్ని వారికి అప్పగించి పారిపోయారు. చంద్రాంగదుడు కారాగారమున ఉన్న తల్లిదండ్రులను విడిపించి, సంతోషంతో భార్యతో కలసి జీవించాడు.

శ్రీగురుడు ఈ కథను సావిత్రిదేవికి బోధించి "అమ్మా! ఇదంతా సీమంతిని చేసిన శివారాధనల ఫలితమేను. కనుక నీవు కూడా భక్తితో శివపూజలు చేయి. నీకు మంచి జరుగుతుంద"ని చెప్పారు. అప్పుడు సావిత్రి భర్త దత్తుడు **"స్వామీ! ఈ వ్రతములన్నీ మాకెందుకు? పరమపవిత్రము, శ్రేయోదాయకం అయిన మీ పాదసేవ మాకు చాలదా?" అన్నాడు. అప్పుడు శ్రీగురుడు "మీరు ఈ వ్రతాన్ని ఆచరిస్తేనే మీ సేవ మాకు లభిస్తుంది"** అని చెప్పారు. ఇంతలో శ్రీగురు సన్నిధిలో తమ కుమారుడు ఆయురారోగ్యవంతుడై సుఖంగా ఉన్న విషయం తెల్సుకొన్న గోడేనాధుడు, అతని భార్య అక్కడకు చేరుకొని, శ్రీగురుని భక్తితో పూజించి,

అక్కడున్న బ్రాహ్మణులందర్నీ ఘనంగా దక్షిణ తాంబూలాలతో సత్కరించి, అందర్కీ అన్న సమారాధన చేశారు.

చూచావా! నామధారకా! త్రిమూర్తి స్వరూపం అయిన శ్రీగురుని మహిమకు సాధ్యాసాధ్యములు లేవు. శ్రీగురుడు సాక్షాత్తూ పరమేశ్వరుడే, చనిపోయిన వ్యక్తిని తిరిగి బ్రతికించిన మహానుభావుడు అని సిద్ధయోగి చెప్పాడు.

ఓం శ్రీదత్తాయ గురవే నమః

ఓం శ్రీపాద స్వామినే నమః **ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః**

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః


(35వ అధ్యాయం సంపూర్ణం)

(ఆదివారపు పారాయణము పూర్తి అయినది)


ఎవనికెవనికి కాతడెంతెంత కూర్చునో
ఆతనికాతని కంతె అందియుండు
రవ్వపెరగబోదు రవ్వయూ తరుగదూ
తలలు పగులగొట్టికొని తన్నుకొనిన
మరచిపోకుదు శివానందుని మంచిమాట

– శ్రీ స్వామి శివానంద మహరాజ్

36 వ అధ్యాయము



శ్రీ గణేశాయ నమః



శ్రీ సరస్వత్యై నమః



శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

శ్లో. బ్రాహ్మణ్యాదుస్స్వభావంయో నివార్యాహ్నికముత్తమం ।
శశంసబ్రాహ్మణాయాసౌ శ్రీదత్తశ్శరణం మమ ॥

(భావము : పరాన్న భోజనము కుక్క కూటితో సమానమని నిరూపించుట)

నామధారకుడు సిద్ధయోగికి నమస్కరించి 'స్వామీ! అజ్ఞానం అనే గాఢ నిద్రలో మునిగి వున్న నాకు, ఈ గురులీలలను వినిపించి, నన్ను మేల్కొల్పారు. దయతో అటుపై వృత్తాంతములను కూడా తెలియపరచి, నాకు దృఢమైన జ్ఞానాన్ని కలుగ చేయండి" అన్నాడు. అప్పుడు సిద్ధయోగి సంతోషించి, "నాయనా! మరికొన్ని గురు లీలలు చెప్తాను, శ్రద్ధగా విను" అన్నాడు.

గంధర్వపురంలో సత్యవంతుడు అనే పేద బ్రాహ్మణుడు భిక్షాన్నముతో తృప్తిగా జీవిస్తుండేవాడు. అతడెవరింటికీ భోజనమునకు వెళ్ళేవాడు కాదు. కేవలం అతడు యాయవార వృత్తిలో జీవిస్తూండేవాడు. అతని భార్య

మాత్రము పరమ గయ్యాళి. ఆ గ్రామమున ఎందరో భక్తులు వచ్చి బ్రాహ్మణ సమారాధనలు చేసి, ఘనంగా దక్షిణలతో బ్రాహ్మణులను సంతృప్తి పర్చేవారు. సత్యవంతుడు మాత్రం తన నియమాన్ని మార్చుకోకుండా, పరాన్న సుఖం ఆశించకుండా, తృప్తిగా జీవిస్తుండేవాడు. కానీ అతని భార్య మాత్రము అటువంటి భోజనమును ఆశించి, దక్షిణలను స్వీకరించాలని ఎప్పుడూ కోరుకుంటూ ఉండేది. ఇట్లుండగా ఒకనాడు ఒక ధనికుడు వచ్చి, ఆనాడు తాను చేయనున్న సమారాధనకు విచ్చేసి, దక్షిణలను స్వీకరించమని ఆ బ్రాహ్మణుడుని కోరాడు. అప్పుడతని భార్య సమారాధనకు వెళ్దామని అతడ్ని ఒత్తిడి చేసింది. అతను "నేను మాత్రము రాను. నీకంతగా ఆశగా ఉంటే నీవు వెళ్ళవచ్చు" అన్నాడు. అప్పుడా ఇల్లాలు ఆ ధనికునితో, "అయ్యా! దంపత సహితంగా రావాలా? లేకపోతే నేను ఒక్కదాన్నీ రావచ్చా?" అని అడిగింది. ఆ ధనికుడు "దంపత సహితంగా మాత్రమే రావాలని" చెప్పి వెళ్ళిపోయాడు. ఆమె భర్తపై కోపంతో నానా మాటలు అంటూ, శ్రీగురుని వద్దకు వెళ్ళి తన బాధనంతా వెళ్ళబోసుకొని, ఆ రోజు భర్త తనతో సమారాధనకు వచ్చేలా శాసించమని ప్రార్థించింది. శ్రీగురుడు సత్యవంతుని పిలిపించి, "ద్విజోత్తమా! నామాట విని, ఈ ఒక్కసారి భోజనానికి వెళ్ళు. భార్య యొక్క కోరిక తీర్చుట భర్త ధర్మం కదా!" అన్నారు. అప్పుడా ద్విజుడు "స్వామీ! గురువు మాట కామధేనువని శాస్త్రాలు చెబుతున్నాయి. మీ ఆజ్ఞను పరిపాలించి నేను భోజనానికి వెళ్తాను" అని భార్యతో ఆ రోజు జరిగే సమారాధనకు వెళ్ళాడు.

బ్రాహ్మణులంతా పంక్తి భోజనానికి కూర్చొన్నారు. ఈ దంపతులు కూడా అందులో కూర్చున్నారు. పంచభక్ష్య పరమాన్నములతో వడ్డించారు. ఇంతలో, ఆ బ్రాహ్మణ స్త్రీకి తాము తినబోతున్న అన్నమును ఒక కుక్క,

పంది తాకి అపవిత్రం చేసినట్లుగా దర్శనం అయ్యింది. అందుకు ఆమె అసహ్యపడి, భోజనం నుంచి లేచి, అక్కడున్న వారందరితో కుక్కలు, పందులు తాకిన భోజనము మీరెలా తినుచున్నారని, లేచి వడివడిగా వెళ్ళిపోయింది. ఆమె భర్త కూడా వెళ్ళిపోయాడు. ఆ బ్రాహ్మణ దంపతులిద్దరూ శ్రీగురుని వద్దకు వచ్చారు. శ్రీగురుడు ఆమెకేసి చూసి నవ్వుతూ "అమ్మాయీ! ఇప్పుడు నీకోరిక తీరిందా? పరాన్న సుఖము తెల్సినదా?" అని అడిగాడు. ఆమె శ్రీగురుని పాదాలకు నమస్కరించి "స్వామీ! నా అపరాధాలు క్షమించండి. ఆ కుక్క కూటికి బలవంతాన నా భర్తను లాక్కుపోయాను. అనవసరంగా నా భర్తకు ఈ దోషాన్ని అంటించా"నని బాధపడింది. ఆ బ్రాహ్మణుడు కూడా శ్రీగురునితో, "శ్రీగురూ! ఈ దుర్మార్గురాలి వలన నాకీ దోషం అంటుకుంది. నా నియమం భంగమైనది" అన్నాడు. అప్పుడు ఆ బ్రాహ్మణునితో శ్రీగురుడు "నాయనా! ఇందువలననే నీకే దోషం అంటుకోదు. ఇక నుంచి ఆమెకూడా నీ ఆజ్ఞను అనుసరించును. ఎప్పుడైనా దేవ పితృకార్యాలలో భోక్త లభించనపుడు, భోక్తగా వెళ్ళినందువల్ల నష్టం లేదు" అన్నారు. గురు గృహమునందు తప్పక భుజించవచ్చు. మేనమామ, పిల్లనిచ్చిన మామ, సాధువులు, సోదరులు మొదలగు వారింట భుజించవచ్చు. శ్రాద్ధ కర్మలందు భోక్త లభించని యెడల భోక్తగా వెళ్ళి మరునాడు గాయత్రీ జపంతో శుద్ధుడవ్వవచ్చు. తల్లిదండ్రుల చేత సేవ చేయించుకొనే వానియింట, మల్ల యుద్ధం చేసేవాని ఇంట, యాచక వృత్తితో జీవించువాని ఇంట, క్రోధి ఇంట, జూదం ఆడువాని ఇంట, దొంగ ఇంట, స్నానం చేయకుండా భోజనం చేసేవాని ఇంట, సంధ్యావార్చని వారి ఇంట, దానం చేసే వానిని వద్దని చెప్పేవారింట, డబ్బు ఆశతో జపం చేసేవాని ఇంట,

విశ్వాసఘాతకుని ఇంట, కులదేవతలను అర్చించకుండువాని ఇంట, కుమార్తెను అల్లుని అవమాన పరుచువాని ఇంట, సంతానం కల్గునంత వరకు కూతురి ఇంట, గురునింద చేసేవాని ఇంట భోజనం చేయరాదు. ఇట్టి స్థలముల యందు భోజనం చేసినచో ఇంద్రియ వైకల్యము, అల్పాయుష్షు, బుద్ధి మాంద్యము కల్గును. అమావాశ్యనాడు పరాన్నము భుజిస్తే మాసము చేసిన పుణ్యము నశించును. సూర్యగ్రహణము లందు, సూతకములప్పుడు దానం తీసుకోరాదు. ఇలా చేసినటువంటి వారికి, స్వధర్మాన్ని అనుసరించినటు వంటివారికి, కష్టము లెప్పుడూ రావు. దేవతలు, సిద్ధులూ, కామధేనువు కూడా వారిని సేవిస్తుంటాయి" అన్నారు. అప్పుడా బ్రాహ్మణుడు నమస్కరించి, శ్రీ గురుని వైపు చూస్తూ "స్వామీ! స్వధర్మమంటే ఎలాంటిదో వివరించండని" ప్రార్థించాడు. శ్రీగురుడు నాయనా! పూర్వము నైమిశారణ్యంలో పరాశర మహర్షిని మునులందరూ అడిగితే ఆయన ఇలా చెప్పారు : ఋషులారా! **సదాచారం వల్ల సర్వమూ సిద్ధించును. బ్రాహ్మణుడు బ్రాహ్మీముహూర్తంలో లేచి, భక్తితో త్రిమూర్తులనూ పూజించి, నవగ్రహాలను, సనకాది సిద్ధులనూ, సప్తద్వీపాలను, సప్తఋషులను, మొదట స్మరించాలి. అప్పుడు ఆవుకు మొక్కి, ఆచమనం చేసాకనే కాలకృత్యాలు తీర్చుకోవాలి. భోజనాలకు ముందు స్నానం, ఆ తర్వాత ఆచమనం చేసుకోవాలి. చూడగూడనివి చూచినప్పుడూ, మాట్లాడకూడనివి మాట్లాడినప్పుడూ, వినిరానివి విన్నప్పుడూ ఆచమనం చేస్తే శుద్ధికల్గును. అందుకు నీరు లేనప్పుడు కుడి చెవిని తాకాలి. అందులో అగ్ని జలము, వరుణుడు, సూర్యుడు, వాయువు మొదలగు దేవతలుంటారు. ఆ తర్వాత మానసిక స్నానంతో పరిశుద్ధుడై సూర్యోదయం వరకూ గాయత్రిని తప్ప మిగిలిన ఏ ప్రార్థనా**

శ్లోకాలైనా చదువుకోవచ్చు. ఊరికి నైఋతి దిక్కున ఆరుబయట దేవాలయాలు, పచ్చని చెట్లు లేని చోట, బాటకు, నీరుకు దూరంగాను, ఆకులు గడ్డి లేనిచోట మలవిసర్జన చేయాలి. ఆ సమయంలో జంధ్యమును వేరుగా వేసుకొని అంగవస్త్రాన్ని తలకు చుట్టుకోవాలి. దిక్కుల కేసి ఆకాశం కేసి చూడరాదు. పగటివేళ ఉత్తర దిక్కుకు, రాత్రివేళ దక్షిణ దిక్కుకు కూర్చోవాలి. ఆ తర్వాత ఆచమనం చేసి కులదేవతను స్మరించాలి. ఇలా శ్రీగురుడు ఆచారకాండను ఆ బ్రాహ్మణునకు తెలియజేశారు.

ఓం శ్రీదత్తాయ గురవే నమః

ఓం శ్రీపాద స్వామినే నమః ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

(36వ అధ్యాయం సంపూర్ణం)

భక్తిమార్గాన చక్కగా పదము పెట్టి
ఈశ్వరుణ్ణి గూర్చి క్రీడించి హేళయందు
కామచయమను తైలంబుగా నొనర్చి
జ్ఞానదీపంబు వెలిగించువాడే సాధుజనుండు
మరచిపోకుడు శివానందుని మంచిమాట

* * *

సాధనములెన్నో సలిపి చూచితి గాని
వదలకుండా జీవభావముండే
సద్గురుండు నాకు సమకూరినంతనే
అంతరంగమందు చింత తొలగె
మరచిపోకుడు శివానందుని మంచిమాట


– శ్రీ స్వామి శివానంద మహరాజ్



37 వ అధ్యాయము



శ్రీ గణేశాయ నమః



శ్రీ సరస్వత్యై నమః



శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

శ్లో. గార్హస్థ ధర్మం విప్రాయ ప్రత్యవాయ జిహాసయా ।
క్రమముక్త్యైయ ఊచేసశ్రీ దత్త శరణం మమ ॥

(భావం : గృహస్థు యొక్క నిత్య కర్మాచరణమును బ్రాహ్మణునకు బోధించిన శ్రీ దత్తా నీవే శరణం)

సిద్ధయోగి ఇంకా ఇలా చెప్పాడు : నామధారకా! శ్రీగురుడు బ్రాహ్మణునకు గృహస్థాశ్రమ ధర్మాన్ని ఇలా చెప్పారు. నాయనలారా! మానవులు మూడు కాలాలలోను, ఆసనంపై కూర్చుని ప్రతీరోజూ తప్పకుండా భగవంతుని పూజించాలి. అందుకు అవకాశం లేకపోతే ఉదయం షోడశోపచార పూజ,మధ్యాహ్నం పంచోపచార పూజ, సాయంత్రం నీరాజనం సమర్పించాలి.

అందుకోసం ప్రతివారు తమ ఇంట మంచిగంధమును, నెయ్యిని, జింక చర్మమును ఉంచుకోవాలి. శ్రద్ధగా పీట మీద కూర్చొని, సంకల్పం చెప్పి, ప్రాణాయామం చేసి, మొదట పూజా ద్రవ్యాలను పూజించాలి.

ఇష్ట దేవతా విగ్రహమును ఎదుట సింహాసనంపై ఉంచి, దక్షిణ భాగమున శంఖమును, వామభాగమున గంటనూ ఉంచుకోవాలి. దేవునిపై వెనుక ఉన్న నిర్మాల్యమును తొలగించి, దీపము వెలిగించి గణపతిని పూజించి, గురువుని స్మరించి, పీటవేసి పూజ చేయాలి. మొదట ద్వారపాలకులను పూజించి, ఇష్ట దేవతా రూపమును హృదయంలో భావించి, ఆ రూపమే తన ఎదుట ఉన్న విగ్రహము నందు ఆహ్వానించాలి. భగవంతుడే స్వయంగా వచ్చి తన ఎదుట ఉన్నట్టుగా భావించుకోవాలి. ముందుగా సింహాసనము, పాద్యము, ఆర్ఘ్యము, ఆచమనీయము, మధుపర్క స్నానము మొదలైన ఉపచారములతో పూజించి, ఆవుపాలు మొదలైన పంచగవ్యములతో వేదమంత్రాలను పఠించుచూ, అభిషేకం చేసి, దేవతా విగ్రహం తుడిచి, పీఠంపై నుంచి, వస్త్రం, గంధం, యజ్ఞోపవీతము నుంచి పూజించి, అనంతరం సుగంధ ద్రవ్యాలతో, అక్షతలతో, పూలతో పూజించాలి. పూజకు తెల్లని పూలు శ్రేష్టం. పసుపు, ఎరుపు రంగు పూలు మధ్యమములు. నలుపురంగు పూలు అధమములు. ఆ తర్వాత నైవేద్యమును సమర్పించి, దేవుడు భుజించినట్టుగా భావించి, హస్తప్రక్షాళన చేసి, తాంబూలమును ఫల సమేతంగా సమర్పించి, నీరాజనం ఇవ్వాలి. అనంతరం పుష్పాంజలి భగవంతుని పాదాలకు సమర్పించి, ప్రదక్షిణ చేసి సాష్టాంగ నమస్కారం చేయవలెను.

తల్లిదండ్రులను, గురువులను, పూజ్యులను, ఎదురేగి నమస్కరించ వలెను. గురువులకు నమస్కరించినప్పుడు తన కుడి హస్తమును, గురుని కుడి పాదముతోను, తన ఎడమ హస్తమును గురుని ఎడమ పాదముతోను, స్పృశించి నమస్కరించాలి. ఆ తర్వాత మోకాలి మొదలు పాదాంతం వరకు హస్తంతో స్పృశించాలి. తల్లి, తండ్రి, గురువు, పోషకుడు, అన్నదాత,

సవితి తల్లి, పురోహితుడు, జ్ఞాన వృద్ధుడు వీరందర్కీ గురువుతో సమానంగా నమస్కరించాలి. అజ్ఞానులు, తనకన్నా చిన్నవారు, స్నానం చేయువారు, సమిధలు, పూజాద్రవ్యాలు మొదలగు వస్తువులు తెచ్చేవారు, హోమం చేయువారు, ధన గర్వితులు, కోపంతో ఉన్నవారు, మూర్ఖులు వీరికి నమస్కరించరాదు. శవమునకు కూడా నమస్కరించరాదు. ఏక హస్తంతో అసలు నమస్కరించరాదు.

ప్రతి వారు ఐదు విధాలైన పాపాలు నిత్యమూ కావింతురు. వీటినే "పంచ శూనములు" అందురు. అవి ఏమనగా కత్తి, తిరుగలి, రోకలి, నిప్పు, నీరు, చీపురుకట్ట. వీటితో జరుగు పాపములను పోవుటకు 'వైశ్వదేవం' చేయవలెను. అనగా వండిన పదార్థాలను దేవతలకు, పితరులకు, ఋషులకు అతిధులకు అర్పించే దానినే 'వైశ్వదేవం' అందురు. దీనినే 'కాకబలి' అని కూడా అందురు.

భోజన కాలమునందు ఎవరైనా అతిధిగా వచ్చినచో, కులముగాని, గోత్రముగాని పట్టించుకోక, భగవంతుడనే భావంతో భోజనం పెట్టాలి. అతిధికి పాదములు కడిగిన పితృదేవతలు సంతృప్తి నొందెదరు. అతిధికి సంతృప్తిగా భోజనం పెట్టినచో బ్రహ్మ విష్ణు మహేశ్వరులు తృప్తి నొందెదరు. అతిధిగాని, బ్రహ్మచారిగాని, భిక్షకు వచ్చిన ఎడల వైశ్వదేవం అవకున్ననూ భోజనం పెట్టవలెను. అట్టి అతిధిని విడనాడి భుజించినచో మరు జన్మయందు కుక్కయై, గాడిదయై పుట్టును. భుజించువారు పాదాలను, చేతులను ముఖమును నీటితో కడుగుకొని భుజించవలెను. వడ్డించుచోట అలికి, ముగ్గువేసి, దేవతలను ఆహ్వానించి, అక్కడ విస్తరివేసి, వడ్డన చేయవలెను. పితృ కార్యముల యందు ఉత్తర ముఖముగా కూర్చొని

భుజించవలెను. అన్నము భుజించునప్పుడు మొదట చిత్రగుప్తుని పేరుతో ఒక ముద్దను విస్తరి యందు కుడిప్రక్కగా నేల మీద ఉంచిన తర్వాతనే భుజింపవలెను. భగవంతుడు తనలో ఉండి, భుజించు చున్నాడని, తినబడు అన్నము పరబ్రహ్మ స్వరూపము అని భావించవలెను. ఎడమ పాదముపై చెయ్యి పెట్టి భుజించరాదు. చప్పుడు అగునట్లు తినరాదు. నీరును తినునంత వరకూ తాగరాదు. కుక్కను, రజస్వల అయిన స్త్రీని చూస్తూ భుజించరాదు. స్త్రీలు నల్లని వస్త్రం ధరించిగాని, గోచీలేకగాని వడ్డించరాదు. భుజించిన తర్వాత నోరు పరిశుభ్రంగా కడుగుకొనవలెను. ఆ తర్వాత అగస్త్యుని, కుంభకర్ణుని, బడబాగ్నిని స్మరించవలెను. తామస పదార్థాలను భుజింపరాదు. కుక్కలు, కాకులు, పిల్లులు స్పృశించిన అన్నం తినరాదు. చద్ది అన్నం తినరాదు. రాత్రులందు, సప్తమీతిథియందు, ఆదివారమునందు, ఉసిరికాయపచ్చడి తినరాదు. బ్రహ్మచారులు, విధవలు, రజస్వల అయిన స్త్రీలు తాంబూలం భుజించరాదు. సాయంకాలం పురాణములను సద్గ్రంథములు చదివి తాను దినమంతా చేసిన కర్మను భగవంతునకు అర్పించి, నిద్రించవలెను. ఉత్తరమున శిరస్సునుంచి నిద్రించరాదు. భర్తతో నిద్రించబోవు స్త్రీ నీల వస్త్రము ధరించరాదు. రతి సమయమునందు దీపము ఉండరాదు. రజస్వల అయిన స్త్రీతో నాల్గవ దినమున రమించిన అల్పాయుష్మంతుడగు పుత్రుడు జన్మించును. స్త్రీ పురుషులు రతి కాలమునందు ఎట్టి భావముననుందురో అట్టి సంతానమే కల్గును. ఇలా శ్రీగురుడు ఆ సద్బ్రాహ్మణునితో చెప్పి "నాయనా! నీవు ఈ ఆచార ధర్మాలను అన్నింటినీ పాటించి జీవించు. నీకు పూర్ణాయుష్మంతులైన బిడ్డలు కల్గి, సుఖ శాంతులు కల్గి జీవిస్తారని" అన్నారు. ఆ బ్రాహ్మణుడు, భార్యతో కలసి శ్రీగురుమూర్తికి నమస్కరించి, ఆయన ఆజ్ఞను తీసుకొని వెళ్ళాడు.

చూచావా! నామధారకా! ఇట్టి గురు లీలలను ఎవ్వరు శ్రద్ధతో వినెదరో, ఇందులోని ధర్మాలను ఆచరించెదరో, అట్టివారు మూర్ఖులు సహితము, ఉత్తమ జ్ఞాన సంపన్నులు కాగలరని సిద్ధయోగి తెల్పెను.

ఓం శ్రీదత్తాయ గురవే నమః

ఓం శ్రీపాద స్వామినే నమః **ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః**

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

(37వ అధ్యాయం సంపూర్ణం)

సగుణసేవ వలన సాధించుకొందురు
నిర్గుణమగు జ్ఞాననిష్ఠ మీరు
సగుణనిర్గుణముల సరణిపై నున్నట్టి
పరునిపైన ధ్యానగరిమ నాది
మరచిపోకుడు శివానందుని మంచిమాట

* * *

సంస్తుతి యొనర్చి నిన్ను పొందజాలదెవడు
సంస్తుతి యొనర్పక నిన్ను పొందజాలదెవడూ
ఎవడు విశ్వాసమున నిన్ను స్తుతియించుచుండునో
వాని చెంతనే ఎప్పుడు వుండు నీవు
మరచిపోకుడు శివానందుని మంచిమాట

– శ్రీ స్వామి శివానంద మహరాజ్

38 వ అధ్యాయము



శ్రీ గణేశాయ నమః



శ్రీ సరస్వత్యై నమః



శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

శ్లో. త్రిపుంపర్యాప్తపాకేన భోజయామాసయోన్నృణాం ।
సిద్ధశ్చతుస్సహస్రాణి శ్రీ దత్తశ్శరణం మమ ॥

(భావము : ఒక బీదబాపని యందు దయగల్గిన స్వామి, అతను తెచ్చుకున్న కొద్ది పదార్థములతో వేలమందికి అన్నదానము చేయుట)

నామధారకుడు సిద్ధయోగికి నమస్కరించి "స్వామీ! పరమ పవిత్రము, శ్రేయోదాయకము అయిన శ్రీగురుడు ఉపదేశించిన 'కర్మానుష్ఠాన రహస్యము'ను మీనోటి నుంచి విని ధన్యుడనయ్యాను. అటుపై లీలలను కూడా వినిపించి, నన్ను కృతార్థుడను చేయండి" అని ప్రార్థించెను. అప్పుడు సిద్ధయోగి 'నాయనా! నీ వంటి గురుశ్రోత లభించినప్పుడే అది వినిపించే భాగ్యము నాకు దక్కింది. ఇట్టి పవిత్రమైన లీలలను ఏ మానవులైతే వినెదరో, చదివెదరో అట్టి వారికి కష్టకాలము నుంచి గట్టెక్కినట్టే. అట్టి లీలలలో ఒక లీలను చెప్తాను శ్రద్ధగా విను.

గంధర్వపురంలో ఉన్న శ్రీగురుడు చేస్తున్న లీలలు దేశదేశములు

పాకిపోయినవి. దూర ప్రాంతాలనుంచి ఎందరెందరో భక్తులు వచ్చి వారి కష్టాలను తీర్చుకుంటున్నారు. సంతానం లేని వారు సంతానమును పొందుచున్నారు. అన్ని రకముల కష్టాల నుండి విముక్తులగుచున్నారు. ఆ కాలంలో, శ్రీగురుని సంతృప్తి కొరకు అక్కడ బ్రాహ్మణ సమారాధనలు ప్రతి రోజూ జరుగుతుండేవి. భాస్కరశర్మ అను నిరుపేద బ్రాహ్మణుడు శ్రీ గురునికి భిక్ష సమర్పించవలననే ఉద్దేశ్యంతో ముగ్గురకు సరిపడే భోజన పదార్థాలు సమకూర్చుకుని శ్రీగురుని మఠానికి వచ్చాడు. ఆ రోజు వేరెవరో భిక్షకు ఆహ్వానించినందు వల్ల అతడు తను తెచ్చుకున్న మూటను మఠంలో ఒక మూలన ఉంచి, అతడు కూడా సమారాధనకు వెళ్ళాడు. ఈ విధంగా రెండు మాసములు గడిచిపోయినవి. అప్పుడు అక్కడి బ్రాహ్మణులంతా భాస్కర శర్మను చూస్తూ 'ఓయీ! బ్రాహ్మణుడా! నీవు వచ్చినదెందుకు? నీవు చేస్తున్నదేమిటి? ఇక్కడ భోజనం బాగా దొరుకుతున్నది నీకు. రోజూ తిని ఇప్పుడు కాస్త లావెక్కావు." అని అతన్ని విమర్శిస్తూండేవారు. ఈ విమర్శలు రోజు రోజుకీ పెరిగిపోయి, ఒక రోజు శ్రీగురునికి తెల్సింది. శ్రీగురుడు భాస్కర శర్మను పిల్చి "నాయనా! రేపు భిక్ష నీవే సమర్పించాలి" అన్నారు. అతడు అన్నీ సమకూర్చుకొని, శ్రీగురునివద్దకు వచ్చి, అన్నీ సిద్ధం చేసుకున్నానని చెప్పాడు. అదే సమయంలో వేరొక బ్రాహ్మణుడు వచ్చి తాను భిక్ష సమర్పిస్తానని, తాను చేయనున్న సమారాధనను స్వీకరించమని, శ్రీగురుడ్ని అడిగాడు. అది విన్న శ్రీగురుడు "నాయనా! ఈ రోజు భాస్కరశర్మ ఇచ్చే భిక్షను మాత్రమే తీసుకుంటాము. నీవు వేరొక రోజు చేయవచ్చు" అన్నారు. అంత ఆ బ్రాహ్మణుడు "ఈ దరిద్రుడు తెచ్చుకున్నది సోలెడు బియ్యమే కదా! శ్రీగురునికి అదేమి సరిపోతుంది!" అని గొణుగుతూ వెళ్ళాడు. అంత శ్రీగురుడు భాస్కరశర్మను పిల్చి "నాయనా!

ఈ రోజు ఇక్కడ 4000 మందికి సమారాధన జరగాలి, వాటికి ఏర్పాట్లు చేయమని" చెప్పారు. అప్పుడు భాస్కరశర్మ శ్రీగురునిపై సర్వభారమూ ఉంచి రెండు పొయ్యిలను సిద్ధం చేసుకొని ఒక పొయ్యిపై ఎసరుపెట్టి, రెండవ పొయ్యిపై కూరలు, తదితర వాటిని సిద్ధం చేశాడు. నెయ్యిని, పెరుగును సమకూర్చుకున్నాడు. శ్రీగురుని వద్దకు వెళ్ళి అంతా సిద్ధమైనది అని చెప్పాడు. అప్పుడు శ్రీగురుడు సంగమం వద్ద స్నానం చేస్తున్న బ్రాహ్మణులను భిక్షకు ఆహ్వానించమని చెప్పారు. భాస్కరశర్మ సంగమానికి వెళ్ళి బ్రాహ్మణులను ఉద్దేశించి ఆ రోజు తాను చేయనున్న సమారాధనకు విచ్చేసి, తనను కృతార్థుడను చేయమని ప్రార్థించాడు. అప్పుడు ఆ బ్రాహ్మణులు పకపక నవ్వుతూ, "ఓరి వెర్రి బ్రాహ్మణుడా! నీవు తెచ్చుకున్నది సోలెడు బియ్యమే కదా? ఎవరికి తెలియదు. మేమంతా వస్తే ఒక్కొక్కనికి ఒక్కొక్క మెతుకు అయినా దొరుకుతుందా? నీవు శ్రీగురునికైనా కడుపు నిండా పెడితే అంతే చాలు, వెళ్ళు" అని ఈసడించుకున్నారు. భాస్కరశర్మ విచార వదనంతో శ్రీగురుని వద్దకు చేరి, వారు ఆడిన నిష్టూర పల్కులను శ్రీగురునికి చెప్పాడు. అప్పుడు శ్రీగురుడు వేరొక శిష్యుని పిల్చి, వారిని మఠానికి రమ్మనమని, ఇది శ్రీగురుని వాక్కుగా చెప్పమని, చెప్పారు. అప్పుడా శిష్యుడు వెళ్ళి శ్రీగురుని వాక్కును తెలియజేశాడు. ఇంతలో శ్రీగురుడు "నాయనా! అందరూ వచ్చే సమయం అయింది. నీ ఏర్పాట్లు నీవు చేయి" అని భాస్కరుని ఆజ్ఞాపించారు. భాస్కరశర్మ అంతా సిద్ధం చేసి శ్రీగురుని వద్దకు వచ్చి అంతా సిద్ధమైనదని చెప్పాడు. ఇంతలో శిష్యులంతా మఠానికి చేరుకున్నారు. శ్రీగురుడు శిష్యులందర్ని భోజనానికి కూర్చోమని ఆదేశించారు. శ్రీగురుడు భాస్కరశర్మను దగ్గరకు పిల్చి, తన పై కప్పుకున్న వస్త్రాన్ని తీసి, కొంత విభూదిని ఇచ్చి, అతను చేసిన

వంటకాలపై ఆ వస్త్రాన్ని కప్పి, విభూది చల్లి వస్త్రం తీయకుండా, వడ్డన కొనసాగించమని ఆదేశించారు. భాస్కరుడట్లే చేసి, ముందుగా శ్రీగురునికి విస్తరి వేసి, తర్వాత అక్కడున్న బ్రాహ్మణులందరికీ విస్తళ్ళు వేసి, వడ్డన వడ్డించారు. నెయ్యి కూడా ధారలు, ధారలుగా వడ్డించారు. అపుడు ముందుగా శ్రీగురుడు ఆపోశన తీసుకొని, ఆచమనం చేసి అందర్నీ కూడా స్వీకరించమని చెప్పి, తినడం మొదలుపెట్టారు. ఆ పంక్తి అయిపోయిన తర్వాత, శ్రీగురుడు బ్రాహ్మణులందరితో వారి వారి భార్యా బిడ్డలను కూడా పిలిచి భోజనం చేయమని ఆదేశించారు. ఆ తర్వాత ఊరివారందరికీ కూడా భోజనం పెట్టారు. ఆ తర్వాత భాస్కరుడు శ్రీ గురుని వద్దకు వెళ్లి, ఇంక భోజనం చేయని వారెవ్వరూ ఊరిలో లేరని చెప్పాడు. చివరికి భాస్కరుని కూడా భిక్ష తీసుకోమని, మిగిలినది జలచరాలకు వేయమని ఆదేశించారు. భాస్కరుడు తాను భిక్షను తీసుకొని, వంటకాలపై కప్పి ఉన్న వస్త్రాన్ని ఎత్తి చూసేసరికి, తాను వండిన వంట అంతా అలాగే ఉండటంతో, ఆశ్చర్యంతో ఆ వంటకాలను తీసుకొని వెళ్లి, నదీతీరమున ఉన్న జలచరాలకు వేశాడు. ఈ అద్భుత లీల చూచిన అక్కడి జనమంతా, శ్రీగురుడు మానవ మాత్రుడు కాదని, సాక్షాత్తూ త్రిమూర్తి స్వరూపుడని, అన్నపూర్ణేశ్వరుడని గుర్తించి, ఆయనకు హారతులు ఇచ్చి, సాష్టాంగ నమస్కారాలు చేసి, భక్తి భావాలతో ప్రార్థించారు.

చూచావా! నామధారకా! **"త్రిమూర్తి స్వరూపుడైన శ్రీగురునికి సాధ్యాసాధ్యాలు లేవు, ఆయన మహిమకు అంతులేదు. శ్రీగురుడు భగవంతుడు కాదని, మానవ మాత్రుడేనని తలచేవాడు. ఏడు జన్మల నరకము అనుభవిస్తాడు. శ్రీగురుని మహిమ ఇంత అని చెప్పుటకు వీలు అవుతుందా? వారి వారి మనస్సులో నున్న నమ్మకాన్ననుసరించి, ఆయన**

అనుగ్రహం ప్రసాదిస్తారు. ఆయనను నమ్మిన వారికి ఏ కొరతా ఉండదు. అంతే కాదు, ఈ లీలల రూపంలో ఈ గ్రంథంలో శ్రీగురుదు నిక్షిప్తమై, గుప్తరూపంలో ఉన్నారు. ఎవరు భక్తితో, విశ్వాసంతో ఈ లీలలు వినెదరో, చదివెదరో, వారికి శ్రీగురుని సంపూర్ణ అనుగ్రహం లభిస్తుంది. నీ పూర్వజన్మ సుకృతం వల్లనే నీకు శ్రీగురునిపై ప్రీతి కల్గింది, అందరికి ఆయన పేరును తలిచే అర్హత లేదు" అని సిద్ధయోగి నామధారకునితో చెప్పారు.

ఓం శ్రీదత్తాయ గురవే నమః

ఓం శ్రీపాద స్వామినే నమః ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

(38వ అధ్యాయం సంపూర్ణం)


(సోమవారపు పారాయణము పూర్తి అయినది)

ఏడు ఖండములును, మూడు లోకంబులునూ
గురునికన్న మిన్న దొరకరెవరూ
ఈశ్వరుండు తలచి ఏమి చేయగలేడు
గురుండు తలచెనేని జరుగునన్ని
మరచిపోకుడు శివానందుని మంచిమాట


– శ్రీ స్వామి శివానంద మహరాజ్



39 వ అధ్యాయము



శ్రీ గణేశాయ నమః



శ్రీ సరస్వత్యై నమః



శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

శ్లో. అశ్వత్థసేవామాదిశ్య పుత్రా యోదాత్ఫలప్రదః ।
చిత్రకృత్ వృద్ధవంధ్యాయై శ్రీదత్తశ్శరణం మమ ॥

(భావము : 60 ఏండ్ల గొడ్రాలి భక్తికి సంతసించి ఆమెకు సంతానమొసగుట)

(ఈ పై శ్లోకమున చదివి క్రింది అధ్యాయము పారాయణ నిత్యమూ చేస్తున్న యెడల సంతానములేని స్త్రీలకు సంతానం కల్గును)

నామధారకుడు సిద్ధయోగికి నమస్కరించి,"స్వామీ! కామధేనువు, కల్పవృక్షము వంటి గురు చరిత్రను నాకు తెల్పుతున్నారు. పూర్వజన్మలో ఏ కొద్దిపాటి పుణ్యమో నేను చేసుకోవటం వలన, ఇట్టి భాగ్యం నాకు దక్కింది. ఆ తరువాత కథను తెలుపండి" అని వేడుకున్నాడు.

అప్పుడు సిద్ధయోగి నామధారకునితో "నాయనా! పరమ యోగీశ్వరుడైన శ్రీ గురుని లీలలు అన్నీ చెప్పటం ఎవ్వరి తరమూ కాదు. ఆయన మహిమను వర్ణించటం మహా మహితాత్ములకే సాధ్యం కాదు. నాకు తెల్సిన మరికొన్ని లీలలను చెప్పాను, శ్రద్ధగా విను" అని చెప్తున్నాడు.

శ్రీగురుని మహిమ లోక ప్రసిద్ధమై, ఎందరెందరో ఆర్తులు వచ్చి, ఆయన అనుగ్రహ ఆశీస్సులు పొంది, కృతార్థులగుచున్నారు. గాణ్గాపురంలో సోమనాథుడు అనే బ్రాహ్మణుడు ఒకడు కలడు. అతనిది ఆపస్తంభశాఖ. శౌనకగోత్రుడు. అతని భార్య గంగాంబ మహాపతివ్రత. ఆమెకు 60 సంవత్సరాలు వచ్చిననూ, సంతానం కలుగలేదు. ఆమె మాత్రము ప్రతి రోజూ శ్రీగురుని మఠమునకు వచ్చి, స్వామి వారికి నమస్కరించి, పూజ చేసి హారతులిచ్చి, పోతూండేది, ఇలా రోజూ జరుగుతూ ఉండగా ఒకనాడు శ్రీగురుడు ఆమెను దగ్గరకు పిల్చి, "అమ్మా! నిత్యమూ నీవు శ్రద్ధతో నన్ను పూజిస్తున్నావు. కానీ నీ కోరికను మాత్రము ఇంతవరకూ చెప్పలేదు. నీకేమి కావలెనో కోరుకో! పరమేశ్వరుని కృప వలన అది నెరవేరుతుంది" అన్నారు. అప్పుడు గంగాంబ చేతులు జోడించి నమస్కరిస్తూ "స్వామీ! పిల్లలు లేని వారికి ఉత్తమ గతులు కల్గవని, అట్టి స్త్రీ మొహం చూడరాదని శాస్త్రాలు చెబుతున్నాయి. పుత్రులు లేని ఇల్లు అరణ్యంతో సమానం. నేను అటువంటి భాగ్యమునకు నోచుకోలేకపోయాను. ఇప్పుడు 60 సంవత్సరములు దాటిపోయాయి. మీ అనుగ్రహం వలన వచ్చే జన్మలోనన్నాబిడ్డలు కల్గుతారన్న ఆశతో మీ సేవ చేస్తున్నాను" అన్నది. అప్పుడు స్వామివారు నవ్వుతూ, ఆమెతో "పిచ్చితల్లీ! ఏమి కోరిక కోరావమ్మా, ఇప్పుడు మేము వరం ఇచ్చినా, అప్పుడు మా వలన బిడ్డలు పుట్టినట్టు నీకెలా తెలుస్తుంది? కనుక నీకు ఈ జన్మయందే ఒక పుత్రిక, పుత్రుడు కల్గుతారు" అని ఆశీర్వదించారు. ఆవిడ తన కొంగు ముడివేసుకొని "స్వామీ! శ్రీగురూ, నాకిప్పుడు 60 సంవత్సరాలు దాటిపోయినవి. బహిష్టు కాలం ఆగింది. కాని నేను వచ్చే జన్మలో అడుగుతుంటే మీరేవో ఇప్పుడే ప్రసాదిస్తామంటున్నారు. అందువల్లనే ఈ కొంగుకు ముడి వేసుకున్నాను.

అలాగని పరమేశ్వర స్వరూపులైన మీ వాక్కు ఎన్నడూ వ్యర్థం కాదు. నేనెన్నో వ్రతాలనూ ఆచరించాను. అశ్వద్ధ వృక్ష ప్రదక్షిణం చేస్తే బిడ్డలు కలుగుతారని నమ్మి, కన్పించిన రావిచెట్టుకల్లా ప్రదక్షిణం చేశాను. పూజలు చేశాను." అన్నది. అప్పుడు శ్రీగురుడు ఆమె వైపు చూసి నవ్వుతూ "అమ్మా! అశ్వద్ధ ప్రదక్షిణం కడు పుణ్యము. ఇప్పుడు దాన్ని కాస్తా నిందించి ఇంతవరకూ నీవు చేసిన ఫలమును పోగొట్టుకోవలదు" అన్నారు. అప్పుడా గంగాంబ స్వామికి నమస్కరించి "అశ్వద్ధ వృక్ష మహిమను తెలియజేయండి" అని ప్రార్థించింది.

"అమ్మా! అశ్వద్ధ మూలమున బ్రహ్మ నివసించును. మధ్య భాగమున విష్ణువు చివరి భాగమున రుద్రుడు నివసించును. సాక్షాత్తు వృక్షమే ప్రణవ స్వరూపము. దక్షిణ శాఖల యందు శూలపాణి, పశ్చిమ శాఖలయందు విష్ణువు, ఉత్తర శాఖలందు బ్రహ్మ ఉంటారు. ఇంద్రాది దేవతలు తూర్పు శాఖలందు, బ్రాహ్మణులు, ఋషులు, గోవులు, వేదాలు చివరియందు, వృక్షమూలము నందు నదులు, సప్త సముద్రాలు వుంటాయి. 'అ' కారము మూలము, 'ఉ' కారము (మధ్యభాగము) స్కంధము, 'మ' కారము అగ్రము (పై చివరి భాగము). అశ్వద్ధము సాక్షాత్తూ కల్పవృక్షము. దాన్ని సేవించిన భక్తులకు సమస్త కోరికలు తీరును. ఈ అశ్వద్ధ వృక్షమును ఆషాడ, పుష్య, చైత్ర మాసములందునూ, గురు శుక్ర మూఢము వచ్చినప్పుడు సేవింపరాదు. శుభ దినములందు శుచియై ప్రదక్షిణలు చేయాలి. రాత్రి వేళలందు ప్రదక్షిణ చేయరాదు. అశ్వద్ధ సేవ చేయువారు అబద్ధములు, జూదములు ఆడరాదు, ఇతరులను నిందించరాదు. తలంటుకొని, తడి బట్టలను ధరించి, రెండు కలశములతో నీటిని తెచ్చి, ఆ నీటితో ఏడు పర్యాయాలు వృక్షాన్ని తడుపవలెను. తిరిగి స్నానం చేసి శుచియై పొడి

బట్టలను ధరించి, షోడశోపచారములతో పూజించాలి. ఈ వృక్షాన్ని శ్రీ మహావిష్ణువుగా ధ్యానించాలి. లక్ష్మీ సమేతుడైన పితాంబరునిగా శంఖు, చక్రము, వరముద్ర, ఖడ్గము, చాపము, అభయ ముద్ర ఉన్న రూపంగా ధ్యానించాలి. వస్త్రముతో గాని, దారంతో గాని చుట్టి ప్రదక్షిణములు చేయాలి. మౌనముగా నామము ఉచ్ఛరించవలెను. నెమ్మదిగా ప్రదక్షణలు చేయాలి. ప్రతీ ప్రదక్షిణకూ నమస్కారం చేస్తూ రెండు లక్షల ప్రదక్షిణలు చేసిన, బ్రహ్మహత్యాపాపము కూడా నశించును. ఋణ బాధలు గ్రహ బాధలు తొలగును. సంతానం లేనివారు మనోవాక్కాయములతో అశ్వద్ధ ప్రదక్షిణం చేసినచో, తప్పక సంతాన ప్రాప్తి కల్గును. శనివారం అశ్వద్ధ ప్రదక్షిణం చేయుచూ,

శ్లో. 'మూలతో బ్రహ్మ రూపాయ, మధ్యతో విష్ణురూపిణే,
అగ్రతః శ్శివరూపాయ వృక్షరాజయతే నమః'

అని నమస్కరిస్తూ, అశ్వద్ధాన్ని పూజించాక,

శ్లో. కోణస్థః పింగళో భభ్రుః కృష్ణోరౌద్రాంతకోయమః
శౌరి శ్శనైశ్వరో మందః పిప్పిలాదేవ సంస్తుత ః

అనే మంత్రాన్ని దృఢ విశ్వాసంతో పఠిస్తే శనిపీడ తొలగి, సర్వకామ్యములను పొందుదురు. గురువారం, అమావాస్య కలిసిన రోజున ఈ అశ్వద్ధ వృక్షానికి నీళ్ళు పోస్తే పాపం నశించును. అక్కడ వేద విప్రునికి భోజనం పెడితే కోటి మంది బ్రాహ్మణులకు దానం ఇచ్చిన ఫలం కల్గుతుంది. అశ్వద్ధ వృక్షాన్ని నాటిన, వారి పితరులు శాశ్వత స్వర్గమును పొందెదరు. అశ్వద్ధ వృక్షమును నరికిన వారు పితరులతో సహా నరకాన్ని అనుభవింతురు. అట్టి వారు ప్రదక్షిణ పూర్తి చేసి ఉద్యాపన తరువాత

బంగారు అశ్వద్ధమును దక్షిణలతో వేద విప్రునకు దానం ఇస్తే, ఆ పాపం నుంచి విముక్తులగుదురు. "అమ్మా! ఇప్పుడు అశ్వద్ధ మహాత్మ్యం తెల్సింది కనుక ఎటువంటి సంశయం పెట్టుకోకుండా నీవు అలా చేసుకో. నీ అభీష్టం నెరవేరుతుంది అన్నారు." గంగాంబ అలాగేనని చెప్పి, స్వామి వద్ద సెలవు తీసుకొని, సంగమానికి వెళ్ళి, ప్రతీరోజు మూడు పూటలా 'షట్కాల తీర్థం'లో స్నానం చేసి, శ్రీగురుడు చెప్పినట్లుగా అశ్వద్ధాన్ని పూజించింది. మూడు రాత్రులు ఆ దంపతులిద్దరూ రాత్రి అక్కడే నిద్రించారు. మూడవ రోజు రాత్రి, ఆమెకు స్వప్నంలో ఒక బ్రాహ్మణుడు కన్పించి "అమ్మా! నీ కోరిక నెరవేరుతుంది. శ్రీ గురుని వద్దకు వెళ్ళు. ఆయన చెప్పినట్లు చేయి" అన్నాడు. అప్పుడు ఆవిడ నిద్రలేచి భర్తకు ఈ విషయం చెప్పి, తెల్లారి ఆమె శ్రీగురుని వద్దకు వెళ్ళింది. ఆమె వైపు శ్రీ గురుడు నవ్వుతూ చూచి రెండు కొబ్బరి కాయలను ఆమె ఒడిలో వేసి "అమ్మా! నీవు వీటిని భుజించు. నీకొక పుత్రిక, పుత్రుడు కల్గుతారు" అని ఆశీర్వదించారు. ఆమె సంతోషంతో ఇంటికి వెళ్ళి, వాటిని ఆరగించింది. ఆ సాయంకాలానికే ఆమె ఋతుమతి అయ్యింది. ఆమె ఆశ్చర్యంతో మూడు రోజులు నియమమును పాటించి, నాల్గవ రోజు శ్రీగురుని వద్దకు వెళ్ళి వారిని పూజించింది. ఆమె శ్రీగురుని వాక్కు వలన గర్భవతి అయ్యింది. ఆ గ్రామస్థులంతా,ఆ వింతను చూచి ఆశ్చర్యపోయారు. జుట్టంతా నెరసీ, పళ్ళన్నీ పట్టుతప్పిన ఆ వృద్ధురాలు ఆ వయస్సులో గర్భవతి ఎలా అయ్యిందని, జనం అంతా శ్రీ గురుని లీలకు ఆశ్చర్యపడి ముక్కన వేలు వేసుకున్నారు. ఆ తరువాత ఏడవ మాసంలో ఆమె భర్త సీమంతానికి అన్నీ ఏర్పాట్లు చేశాడు. సీమంతం అయిన తర్వాత ఆమె శ్రీగురుని దర్శించి, వారి ఆశీస్సులు పొందింది.నెలలు నిండిన తర్వాత, ఒక శుభముహూర్తంలో

ఆడపిల్లను కన్నది. ఆ పాపకు శ్రీగురుని పేరిట 'సరస్వతి' అని పేరు పెట్టుకున్నారు. ఆమె పసిబిడ్డను ఎత్తుకొని, శ్రీగురుని వద్దకేగి, "స్వామీ! వ్యర్థమైన వృక్షం, మీ కటాక్షంతో ఫలించింది. కానీ ఈ బిడ్డ ఆడపిల్ల, ఏనాటికైనా అత్తగారింటికి వెళ్ళేదే కదా!" అన్నది. శ్రీగురుడు ఆ బిడ్డని ఒడిలోనికి తీసుకొని, ఆశీర్వదిస్తూ ఇది ఆడపిల్లే గాని మగ పిల్లవాడు కాదే అయినప్పటికీ నీకు ఒక సంవత్సరంలోనే మగబిడ్డ పుడతాడు. కానీ ఒక 100 సంవత్సరాలు జీవించే మూర్ఖుడు కావాలా? 30 సంవత్సరాలు జీవించే విద్యావంతుడు కావాలా?" అని అడిగారు. అప్పుడు ఆమె, "స్వామీ, వ్యర్థమైన పుత్రుడు ఎందుకు? సుగుణాల సంపన్నుడు అయిన పుత్రుడ్నే ప్రసాదించండి, అయితే అతనికి ఐదుగురు బిడ్డలు కలిగేటట్లుగా ఆశీర్వదించండి" అన్నది. అప్పుడు శ్రీగురుడు ఒడిలో నున్న బిడ్డవైపు చూస్తూ "అమ్మా! మీకు ఆయురారోగ్యవంతుడు, సుగుణాల సంపన్నుడు, శివవ్రత దీక్షితుడు, అయిన వేదజ్ఞుడు అల్లుడుగా దొరుకుతాడు. దూరదేశం అయిన కాశీ నుంచి, నీ బిడ్డ కొరకు వెతుక్కుంటూ వస్తాడు" అని ఆమెకు మగ బిడ్డ పుట్టేట్లుగా కూడా ఆశీర్వదించారు.

"చూచావా! నామధారకా! శ్రీగురుని మహిమ ఎంతటిదో! గంగాంబకు సంవత్సరంలోగా మగ బిడ్డ పుట్టాడు. ఆమె కూతురికి ఐశ్వర్యసంపన్నుడైన వాడు అల్లుడుగా వచ్చాడు. అది నేను చూచాను" అని సిద్ధయోగి నామధారకునితో చెప్పాడు.

ఓం శ్రీదత్తాయ గురవే నమః


ఓం శ్రీపాద స్వామినే నమః **ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః**

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

(39వ అధ్యాయం సంపూర్ణం)



40 వ అధ్యాయము



శ్రీ సరస్వత్యై నమః



శ్రీ గణేశాయ నమః



శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

శ్లో॥ కారయిత్వా శుష్క కాష్ఠ సేవాం తద్ వృక్షతాం నయన్ ।
విప్రకుష్ఠం జహారాసౌ శ్రీదత్తః శరణం మమ॥

(కుష్ఠ రోగియైన బ్రాహ్మణునిచే ఎండిన మేడి కట్టెకు నీరు పోయించి, ఆ కట్టెను చిగురింపజేసి కుష్ఠురోగము పోగొట్టిన శ్రీ దత్తా శరణు)

సిద్ధయోగి శ్రీగురుని లీలలను ఇంకా ఇలా చెప్పాడు :

గంధర్వపురానికి ఒకనాడు 'నరహరిశర్మ' అనే కుష్టురోగి వచ్చాడు. అతనిది యజుశ్శాఖ, అతడు శ్రీగురుని మఠానికి వచ్చి, స్వామికి నమస్కరించి, చేతులు కట్టుకొని "స్వామీ! మీరు సాక్షాత్తూ పరంజ్యోతి స్వరూపులు. భక్తులపై ప్రేమతో ఇలా మానవ రూపంలో భూమిపై అవతరించారు. ఇప్పుడు నా జన్మ కాలికింద మట్టివలే వ్యర్థం అయిపోయింది. నాకు కుష్టువ్యాధి వచ్చినందువల్ల ఎవ్వరూ నా ముఖం చూడటం లేదు. అందరూ నన్ను చీదరించుకుంటున్నారు. నేను వేదం నేర్చుకున్నప్పటికీ ఈ వ్యాధి వలన ఎవరూ నన్ను భోజనానికి కూడా

పిలవటం లేదు. నాకు చచ్చిపోవాలనిపిస్తున్నది. ఈ తెల్ల కుష్టురోగం తొలగించుకోవటానికి ఎన్నో వ్రతాలు, పూజలను చేశాను. మీ మహిమను విని ఇప్పుడు మీరే దిక్కని మీ వద్దకు వచ్చాను. మీరు కూడా నన్ను రక్షించకుంటే, మీ పాదాల వద్దనే ప్రాణాలుతీసుకుంటాను" అన్నాడు. అప్పుడు శ్రీగురుడు అతడివైపు చూస్తూ 'నాయనా! నీవు ఎన్నో పాపాలు చేశావు. కనుకనే ఈ కుష్టువ్యాధి వచ్చింది. నేనొక మాట చెప్తాను. అలాగ చేస్తే నీ వ్యాధి నయం అవుతుంది" అని అటువైపుగా కట్టెల మోపుతో వెళ్తున్న ఒక వ్యక్తిని పిల్చి, ఆ మోపులో ఉన్న ఒక ఎండిపోయిన మేడి కర్రను తీయించి, దానిని కుష్టురోగియైన నరహరికి ఇచ్చి, "నాయనా! ఈ కట్టె ఈ ప్రాంతంలోనే ఎండిమోడై పోయింది. దీన్ని నీవు తీసుకొని వెళ్ళి సంగమం వద్దనున్న సంగమేశ్వర ఆలయం వద్ద పాతు. ప్రతిరోజూ నిత్యమూ స్నానం చేసి, తడి బట్టలతో రెండు కుండల నిండుగా నీళ్ళు తీసుకొని ఈ వృక్షం మొదట్లో పోస్తూఉండు. అది ఎప్పుడు చిగురుస్తుందో అప్పుడు నీకుష్టు రోగం పోతుంది" అన్నారు. ఆ నరహరిశర్మ శ్రీ గురునికి నమస్కరించి, మేడి కట్టెను తీసుకొని, వారి వద్ద సెలవుతీసుకొని, సంగమానికి వెళ్ళి, శ్రీగురుడు చెప్పినట్లే కట్టెను నాటి, ప్రతిరోజూ శ్రీ గురుడు చెప్పినట్లే చేస్తున్నాడు. ఇలా కొన్ని దినాలు గడిచింది. అక్కడ ఉన్న బ్రాహ్మణులు నరహరి శర్మతో "ఓరి పిచ్చి బ్రాహ్మణుడా! నీవు ఎన్నాళ్ళు ఇలా చేస్తే మాత్రం ఈ ఎండిన కట్టె చిగురు వేస్తుందా? శ్రీ గురుడు దయాస్వరూపుడు. ఆయన లీలలు నీవు వినలేదా? వారు తమ కృపాదృష్టితోనే నీ కుష్టు రోగాన్ని పోగొట్టగలరు. ఈ ఎండుకట్టె ఎందుకు? నీ వ్యాధి కుదిరేది కాదనే ఉద్దేశ్యంతోనే ఆయన నీకు ఎండిన ఈ మేడికట్టెను ఇప్పించారు." అని హేళన చేస్తూండేవారు. నరహరి శర్మ మాత్రము

శ్రీగురుని మాటపై సంపూర్ణ విశ్వాసం ఉంచి, విమర్శలు భరించి, **"శ్రీ గురుడు సత్య సంకల్పుడు. గురువాక్యము కామధేనువుతో సమానము. ఈ కట్టె తప్పక వృక్షం కాగలదు. నా ప్రాణాలున్నంతవరకూ శ్రీ గురుని ఆజ్ఞ ప్రకారం చేస్తాను. చనిపోయిన వ్యక్తులను బ్రతికించిన మహానుభావుడు, ఎండు కట్టెను చిగురింపచేయడంలో గొప్పేమి ఉన్నది?"** అని అనుకుంటూ దృఢ విశ్వాసంతో శ్రీగురుని ఆజ్ఞ ప్రకారం తన పని తను చేసుకొనేవాడు.

ఒక రోజున హేళన చేసిన బ్రాహ్మణులు శ్రీగురుని వద్దకు వెళ్ళి, "స్వామీ! మీరు కుష్టు రోగి బ్రాహ్మణునికి ఎందుకలా చెప్పారోగానీ, ఆ మూర్ఖుడు నీరైనా త్రాగకుండా, ఉపవాసదీక్షతో మీరు చెప్పినట్లు ఆచరిస్తున్నాడు. మేము వద్దని ఎంత చెప్పినా అతడు "గురువాక్యమే ప్రమాణము" అని అంటూ తనపని తాను చేసుకుంటున్నాడు" అని అన్నారు. అప్పుడు శ్రీ గురుడు **"నాయనలారా! గురువాక్యమే అన్నింటికీ ప్రమాణము. గురువాక్యమే కామధేనువని శాస్త్రాలు చెబుతున్నాయి. గురువు, దేవత, మంత్రము, తీర్థము, వైద్యుడు వీరిపై ఎవరికి ఎలాంటి భావం ఉంటుందో, అలాంటి ఫలితమే కల్గుతుంది.** అందుకు తార్కాణం చెప్తాను" వినండి.

"పూర్వము పాంచాల నగరము నందు సింహకేతు అనే రాజు పరిపాలిస్తూండే వాడు. ధార్మికుడు. అతని పుత్రుడు ధనుంజయుడు మంచి సత్ప్రవర్తన కల్గినవాడు. ఒకనాడు అతడు అడవికి వేటకు వెళ్ళాడు. భయంకరం అయిన కీకారణ్యంలో తిరుగుతూ అలసిపోయి, దాహంతో ఉంటే శబరుడు అనే కోయజాతివాడు అతని దాహాన్ని తీర్చాడు. రాజకుమారుణ్ణి విశ్రాంతి తీసుకొనుట కొరకు దగ్గర్లో నున్న శివాలయం

వద్దకు శబరుడు తీసుకువెళ్ళాడు. అది ఒక పాడు పడిపోయిన శివాలయం. శబరుడు అక్కడ ఉన్న శివలింగాన్ని తీసుకొని తదేకంగా చూస్తూ ఉన్నాడు. రాజకుమారుడు "నాయనా! నీకు ఈ శివలింగం ఎందుకు?" అన్నాడు. అప్పుడా శబరుడు, తాను ఎంతో కాలం నుంచీ శివపూజ చేసుకోవాలనుకుంటున్నట్లు చెప్పాడు. అప్పుడు రాజకుమారుడు నాయనా! ఈ శివలింగము చాలా పవిత్రమైనది. దీనిని తీసుకుని వెళ్ళి పూజించుకో అని చెప్పాడు. అప్పుడు శబరుడు "స్వామీ! నేను అడవిలో పెరిగిన వాడిని, పూజాది కార్యక్రమములు తెలియవు. దయచేసి దీన్ని ఎలా పూజించుకోవాలో నాకు తెల్పండి. మీరే నా గురువు" అని రాజకుమారుని పాదాలు పట్టుకొని నమస్కరించాడు. ధనుంజయుడు "ఓయీ! నీవీ శివలింగాన్ని ఇంటికి తీసుకొని వెళ్ళి, నీ ఇంటి బయట వున్న స్థలంలో ప్రతిష్ఠించుకో. ప్రతి రోజూ శ్మశానమునకు వెళ్ళి చితాభస్మమును తెచ్చి, శివునికి అర్పించి, పూజ చేయి. ఆ తర్వాతనే నీకు పనులు ఎన్ని ఉన్నా చేసుకో. దీని వలన నీకు మంచి జరుగుతుంది." అన్నాడు. శబరుడు ఆ శివలింగాన్ని ఇంటికి తీసుకువెళ్ళి, తన ఇంటి ప్రాంగణంలో ప్రతిష్ఠించి, ధనుంజయుడు చెప్పినట్లుగా, ప్రతీ రోజూ చితాభస్మాన్ని తీసుకువచ్చి, సమర్పించేవాడు. కొలది దినములు గడిచిన తర్వాత ఒక రోజెంత వెతికినా చితాభస్మం దొరకలేదు. అతడు బాధతో ఇంటికి చేరి భార్యతో "ఈ రోజు భస్మము దొరకలేదు. గురువు చెప్పినట్లు ఆచరించలేకపోయాను. ఈ రోజు భస్మం సమర్పించలేనందున ఇన్నాళ్ళు నేను చేసిన పూజ అంతా వ్యర్థం అవుతుంది. అంతేగాక గురువు చెప్పినట్లు చేయకపోతే నరకము, దారిద్ర్యము, అధోగతి తప్పద"ని చెప్పాడు. అపుడు అతని భార్య "ఏమయ్యా! ఎందుకు చింతిస్తావు? నేను ఇంటిలోనికి వెళ్ళాక, ఇంటికి నిప్పుపెట్టి

వచ్చిన భస్మమును శివునికి అర్పించు. నీ వ్రతము భంగము కాదు" అన్నది. అప్పుడా శబరుడు "నీ తల్లిదండ్రుల సాక్షిగా నిన్ను వివాహమాడాను. నిన్ను చంపితే పాపం వస్తుంది." అన్నాడు. అప్పుడతని భార్య "నా తల్లిదండ్రులు నీకిచ్చి పెళ్ళి చేసిన తరువాత, నేను నీదాన్నే కదా! నేను నీలోని అర్థభాగాన్నే కదా! నాపై నీకంత మోహం ఎందుకు? మనిద్దరికీ అంత భిన్న భావమేల?" అని అతనికి నచ్చజెప్పి, ఒప్పించింది. భార్య ఇంటిలోనికి వెళ్ళగానే శబరుడు నిప్పుపెట్టి, ఆ వచ్చిన భస్మమును శివలింగానికి అర్పించి, అలవాటు ప్రకారంగా ప్రసాదం తీసుకోవటం కోసం భార్యను రమ్మని కేకవేసి పిలిచాడు.

ఆమె వచ్చింది. ఆశ్చర్యంతో అతడు 'ఎలా వచ్చావని' అడిగాడు. ఆమె, "నాథా! అదేమి చిత్రమో గానీ, నీవు ఇంటికి నిప్పు పెట్టావు. కానీ నాకు ఇంటిలోనికి వెళ్ళిన తరువాత పక్కన అంతా మండుతున్నా గానీ, చెప్పలేని హాయి గల్గింది. చల్లటి గాలి వచ్చింది. నీవు పిలవగానే నీ కేక విని వచ్చాను." అన్నది. వారు ఇద్దరూ వెనక్కి తిరిగి తమ ఇల్లు చూచేసరికి, ఇల్లు ఎప్పటివలే ఉన్నది. ఆహా! ఏమీ ఈశ్వరుని లీల! అని అనుకునేసరికి, వారి ఎదుట శివుడు ప్రత్యక్షమై, వారు కోటి సంవత్సరాలు స్వర్గలోకంలో ఉండేటట్లుగా, ఇహలోకమునందు అఖండ ఐశ్వర్యములతో ఉండేటట్లుగా వరాన్ని ప్రసాదించి, అంతర్ధానం చెందాడు.

కాబట్టి నాయనలారా! గురువు మాట యందు విశ్వాసం ఉంచిన వారికి, మనోరథం తప్పక ఫలించును" అని శ్రీ గురుడు ఆ శిష్యులతో చెప్పి శ్రీ గురుడు సంగమమునకు వెళ్ళి, తన మాట యందు విశ్వాసం ఉంచి, మేడి కట్టెకు సేవచేస్తున్న నరహరి శర్మను చూచి, తమ

కమండలంలోని నీటిని తీసి, ఆ మేడి కట్టెపై చల్లారు. తక్షణమే ఆ మేడి కట్టె, చిగిర్చి కొద్ది క్షణములలోనే మహావృక్షంగా రూపొందింది. నరహరి యొక్క శరీరంలో కుష్టురోగం పోయి, సర్వాంగ సుందరుడుగా సువర్ణమయమైన కాంతితో వెలిగాడు. అప్పుడు నరహరి శర్మ తన శరీరమును చూచుకొని, సంతోషంతో శ్రీ గురుని పాదాలపై పడి ఒళ్ళు మరిచిన ఆనందంతో, కన్నులు నీరు కారుతుంటే, భక్తితో ఇలా స్తుతించాడు:

శ్రీనరహరి చేసిన గురుస్తోత్రం

1. కోట్యర్కభం కోటి సుచంద్రశాంతం
విశ్వాశ్రయం దేవ గణార్చితాంఘ్రిం ।
భక్తప్రియం త్వాత్రిసుతం వరేణ్యం
వందే నృసింహేశ్వర పాహిమాం త్వం ।

కోటి సూర్యుల కాంతితో, కోటి చంద్రుల చల్లదనంతో దేవతలందరి చేతా పూజించబడే భక్తప్రియుడు, భక్తులకు వరములొసగే అత్రి అనసూయల పుత్రుడై ఉండి, కలియుగమున ధర్మసంస్థాపమున కొరకు గాను, అవతరించిన శ్రీ నృసింహ సరస్వతీ స్వామీ! నీకు పాదాభివందనము. నన్ను రక్షింపుము తండ్రీ!

2. మాయాతమోఽర్కం విగుణం గుణాఢ్యం
శ్రీ వల్లభం స్వీకృత భిక్షువేషం ।
సద్భక్తసేవ్యం వరదం వరిష్టం
వందే నృసింహేశ్వర పాహిమాం త్వం ॥

మాయా పాశమను, అంధకారంలో ఉన్న భక్తులకు జ్ఞానజ్యోతివై, సూర్యుడవైనట్టి, విశాలమైన నేత్రములు కల్గిన లక్ష్మీ పతివైనట్టి, భిక్షువేషము స్వీకరించినట్టి, సేవించు భక్త బృందమునకు మంచి వరంబులను నొసగెడు

ఓ నృసింహసరస్వతీ స్వామీ! నీకు నమస్కరిస్తున్నాను, నన్ను రక్షింపుము తండ్రీ!

3. కామాది షణ్మత్త గజాంకుశం త్వామ్
ఆనందకందం పరతత్త్వ రూపం ।
సద్ధర్మగుప్త్యై విధృతావతారం
వందే నృసింహేశ్వర పాహిమాంత్వం ॥

చిత్తమందు ఉండెడి కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములనెడి మదపుటేనుగులకు అంకుశమై నట్టి, ఆనందమునకు మూలమైనట్టి, పరతత్త్వ రూపమైనట్టి, అత్యద్భుతం అయిన సన్యాసి అవతారమును సద్ధర్మరక్షణకై ధరించిన, ఓ నృసింహ సరస్వతీ స్వామీ! నీకు నమస్కరిస్తున్నాను. నన్ను రక్షింపుము తండ్రీ!

4. సూర్యేందుగుం సజ్జన కామధేనుం
మృషోద్య పంచాత్మక భూతమస్మాత్ ।
ఉదేతి యస్మిన్ రమతేస్తమేతి
వందే నృసింహేశ్వర పాహిమాంత్వం ॥

పంచభూతాత్మక జగత్కర్తవై యుండి, రాగద్వేషాదులు లేని సజ్జనులకు కామధేనువై కోరిన కోర్కెల తీర్చువాడును, సూర్యచంద్రులే కన్నులుగా కలవాడును, ఈ జగత్తంతయు యెవని యందు సృష్టి, లయముల నందు చున్నదో, అట్టి ఓ నృసింహాసరస్వతీ! నీకు వందనము. నన్ను కాపాడుము.

5. రక్తాబ్జపత్రాయకాంతనేత్రం
సద్దండకుండీ పరిహాపితాఘం ।
శ్రితస్మిత జ్యోత్స్న ముఖేందు శోభం
వందే నృసింహేశ్వర పాహిమాంత్వం ॥

ఎఱ్ఱకమలము వలే, విశాల నేత్రములు కల్గి, చంద్రునివలె ఆహ్లాదకరం అయిన ముఖారవిందంతో, భక్తుల ప్రచండ దురితములును (పాపాలు) పారద్రోలుటకు దండమును ధరించి, కమండలమును హస్తమున ధరించి, సన్యాసి వేషమున ఉన్న ఓ శ్రీహరిస్వరూపా! నృసింహసరస్వతీ స్వామీ! మీకు నమస్కరిస్తున్నాను, నన్ను రక్షింపుము తండ్రీ!

6. నిత్యం త్రయీ మృగ్య పదాబ్జధూళిం
నినాద సదిబందుకళా స్వరూపం ।
త్రితాప తప్తాశ్రిత కల్పవృక్షం
వందే నృసింహేశ్వర పాహిమాం త్వం ॥

వేద శాస్త్రాలచే స్తుతించబడు పాద పద్మములు కలవాడవై, నాదబిందు కళల స్వరూపము కలవాడవై యుండి, వాటికి అతీతుడవై తాపత్రయములచే పీడించబడుచూ సేవించెడి భక్తులకు, కల్పవృక్షమై విరాజిల్లెడి ఓ! నృసింహ సరస్వతీ స్వామీ! మాటి మాటికీ నీకు నమస్కరిస్తున్నాను. నన్ను రక్షింపుము తండ్రీ!

7. దైన్యాదిభీకష్టదవాగ్ని మీఢ్యం
యోగాష్టకజ్ఞాన సమర్పణోత్కం ।
కృష్ణానదీ పంచసరిద్యుతిస్థం
వందే నృసింహేశ్వర పాహిమాంత్వం ॥

జ్ఞానాంబుదివై, భక్తులు స్మరించినంతనే సంతోషించి, వారికి అష్టాంగ యోగ సిద్ధిని అనుగ్రహించుచూ అష్టకష్టములతో బాధపడుచూ, దీనులై శరణు పొందిన భక్తులకు సమస్త కోరికలను తీర్చుచూ, కృష్ణానదీ

పంచసరిత్తుల సంగమ తీరమునందలి 'నరసింహవాడి' క్షేత్రమున నివసించిన నీకు నమస్కారం, నన్ను రక్షింపుము తండ్రీ!

8. అనాది మధ్యాంత మనంతశక్తిం
అతర్క్యభావం పరమాత్మ సంజ్ఞం ।
వ్యతీత వాగ్ధక్పథ మద్వితీయం
వందే నృసింహేశ్వర పాహిమాంత్వం ॥

అనంతశక్తి గలవాడై, జగము యొక్క ఆది మధ్యాంతరముల యందు ఏక రూపమున విరాజిల్లుచూ, అవాఙ్మానస గోచరుడవై పరమాత్మరూపుడై ఉన్న ఓ నృసింహ సరస్వతీ స్వామీ! నీకు నమస్కరిస్తున్నాను. నన్ను రక్షింపుము తండ్రీ!

9. యో నృసింహ సరస్వత్యా అష్టకం పటతీహసః ।
దీర్ఘాయుః సంస్కృతితం తీర్త్వాఽభీష్టం లబ్ధ్వాఽమృతం వ్రజేత్ ॥

(ఫలశ్రుతి) ఘోరమైన సంసారం నుంచి తరింపచేయుటకు ఈ పై స్తోత్రమును, భావమును, ఎవరు నిత్యమూ పఠింతురో, వారికి సర్వకోరికలూ తీరును. అమృతత్వం లభించును.

ఈ విధంగా, నరహరిశర్మ శ్రీగురుమూర్తిని భక్తితో స్తుతించెను. శ్రీగురుడు అతడ్ని ఆశీర్వదించి, 'జ్ఞాన రాశివౌదువుగాక!' అని దీవించిరి. ఎండిన మేడికట్టె మహావృక్షం అగుట చూచిన జనులందరూ, శ్రీగురుని మహిమను చూచి, విస్మయం చెంది, శ్రీగురుని భక్తి భావములతో స్తుతించిరి.

సంగమం నుంచి శ్రీగురుడు నరహరిశర్మను వెంటబెట్టుకొని, మఠానికి వచ్చిరి. నరహరిశర్మ ఆ రోజు బ్రాహ్మణ సమారాధన చేసి, దక్షిణలతో అందర్నీ సత్కరించెను. అప్పుడు శ్రీ గురుడు నరహరి శర్మను దగ్గరగా తీసుకొని, "నాయనా! నీవు మా నిజమైన భక్తుడవు, నీవు ధనధాన్యములతో తులతూగ గలవు. నీ సంతానం లోకంలో విఖ్యాతి నొందును" అని అతన్ని ఆశీర్వదించి, అష్టాంగ యోగమును ఉపదేశించి 'యోగీశ్వరుడని' నామకరణం చేశారు. నీకు కుష్ఠురోగము పోయింది. కాబట్టి, ఇంటికెళ్ళి భార్యబిడ్డలను తీసుకొని మా మఠానికి వచ్చి జీవించు అని 'విద్యా సరస్వతీ మంత్రము'ను కూడా అతనికి ఉపదేశించారు. నరహరిశర్మ శ్రీగురుడు చెప్పినట్లు చేసి ఆయన కృపకు పాత్రుడయ్యెను.

ఓం శ్రీదత్తాయ గురవే నమః

ఓం శ్రీపాద స్వామినే నమః **ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః**

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

(40వ అధ్యాయం సంపూర్ణం)

(40, 41, 42 అధ్యాయములు నిత్యమూ పారాయణ చేసినందున దృఢము, నిశ్చలము అయిన గురుభక్తి లభించి గురు అనుగ్రహమునకు పాత్రులగుదురు)

గురువు యందు అత్యంత భక్తిశ్రద్ధలు గలవాడు గురువు సమక్షములో వున్నా, దూరముగానున్నా ఒక్కటే !

– టిబెట్ యోగి'మిలారేపా'



41 వ అధ్యాయము



శ్రీ గణేశాయ నమః



శ్రీ సరస్వత్యై నమః



శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

శ్లో॥ భజంతం కష్టతో ప్యాహ సాయందేవం పరీక్ష్యయః ।
గురు సేవా విధానం స శ్రీదత్త శరణం మమ॥

(తనను సేవించ వచ్చిన సాయదేవుని గురు భక్తిని పరీక్షించి, అతనికి గురు సేవా విధానము బోధించిన ఓ శ్రీదత్తా నీవే శరణం)

నామధారకుడు సిద్ధయోగికి నమస్కరించి 'శ్రీగురుని యంతటి అవతార మూర్తి యొక్క సాన్నిధ్యం పొందిన భక్తులు మీరు. ఈ గురులీలలు నా హృదయంలో జ్ఞానజ్యోతిని వెలిగిస్తున్నవి. నా పూర్వ పుణ్యం వలన మీ వంటి మహానుభావుల దర్శనం కల్గింది. మా పూర్వీకులు గురుభక్తులు ఎలా అయ్యారో తెల్సుకోవాలని ఉంది' అని ప్రార్థించాడు. అప్పుడు సిద్ధయోగి, "నాయనా! పూర్వం శ్రీ గురుడు తీర్థాటనం చేస్తూండగా ఆయన ప్రేమకు పాత్రుడైన సాయందేవుడే, మీ పూర్వీకుడు. శ్రీగురుడు గంధర్వ నగరంలో ఉన్న సంగతిని తెల్సుకొని, సాయందేవుడు ఎంతో ఆనందించి, ఒకనాడు శ్రీ వారి దర్శనానికి వచ్చాడు. శ్రీ గురుని మఠానికి వచ్చి, వారిని దర్శించగానే అతనికి రోమాంచితమై, కంఠం గద్గదమై, కన్నులు ఆనందభాష్పాలతో నిండి, సాష్టాంగ నమస్కారం చేసి, తన జుట్టుతో

వారి పాదాలను తుడిచి, ఇలా అన్నాడు : "పరమాత్మ! పరంజ్యోతి స్వరూపా! మీ లీల ఈ జగమంతా వ్యాపించింది. మీరు త్రిమూర్త్యాత్మకులే గాని మానవ మాత్రులు కారు. మీ పాదాలను దర్శించినంత మాత్రాన్నే పాపం నశిస్తుంది. కమండలాన్ని చేత ధరించిన మీరు సాక్షాత్తూ బ్రహ్మదేవులే. మీ కమండలంలోని అమృతంతో కూడిన నీటిని భక్తులపై చల్లి ఉద్ధరిస్తున్నారు. మీరు దండమును ధరించి, భక్తుల పాపాలను పోగొట్టి దుష్టులను సవ్యమార్గంలో పెట్టి రక్షిస్తున్నారు. మీరు సాక్షాత్తూ శివ స్వరూపులు. ఎవరి కృప వలన చచ్చినవాడు బ్రతికాడో, గొడ్డు బర్రె పాలిచ్చిందో, మేడికట్టె వృక్షం అయిందో, హీనుడు ఉద్ధరించబడ్డాడో, అట్టి మిమ్మల్ని ఎవరు ఎరుగ గలరు?" అని స్తుతించాడు. శ్రీ గురుడు సంతోషించి ఆనందంతో సాయందేవుని తలపై చేయి పెట్టి "నాయనా! సమారాధనకు సమయం అవుతున్నది అందరితో నీవు కూడా సంగమానికి వెళ్ళి, స్నానం చేసిరా! ప్రసాదం తీసుకుందువు" అన్నారు. సాయందేవుడు అట్లే చేశాడు.

ఆ తర్వాత, శ్రీ గురుడు అతన్ని పిలిచి, "నాయనా! నీవు ఎక్కడ ఉంటున్నావు? నీ భార్యాబిడ్డలు క్షేమమా! మనం చాలా కాలానికి కల్సుకున్నాము" అన్నారు. అంతట సాయందేవుడు "తండ్రీ! మీకు తెలియంది ఏమున్నది అంతా క్షేమమే. బిడ్డలు పెద్దవారయ్యారు. భార్యాబిడ్డలు ఉత్తర కంచిలో ఉన్నారు. కుటుంబ భారం అంతా పిల్లలు చూచుకుంటున్నారు. నేను మీ దగ్గరనే ఉండి మీ సేవ చేసుకొనుటకై వచ్చాను. ఆ భాగ్యాన్ని నాకు ప్రసాదించండి అన్నారు. శ్రీ గురుడు, "నాయనా! మేము సన్యాసులము. ఒకప్పుడు అడవిలో, ఒకప్పుడు ఊరిలో ఉంటాము. మా సేవ చేసుకోవటం చాలా కష్టం. బాగా ఆలోచించుకో" అన్నారు. అప్పుడు సాయందేవుడు "స్వామీ! మీ శరణుజొచ్చిన నన్ను మీ చరణ సేవకు దూరం చేయవద్దు. మీరుండగా నాకు భయం ఏమున్నది?

గురు సన్నిధి చేర్చే పాదాలే పాదాలు, గురుపూజ చేసే చేతులే చేతులు, గురుపాదాల నంటే శిరస్సే శిరస్సు. సకల పురుషార్థములను ప్రసాదించగల్గిన మీ కృప ఉండగా నాకు భయం ఏమున్నది? మీ చెంతనే ఉండి మీ పాద సేవ చేసుకుంటాను. ఆజ్ఞ ఇవ్వండి" అన్నాడు. అంతట శ్రీ గురుడు "నాయనా! నీ మనస్సులో అంత దృఢభావం ఉంటే అలాగే చేయి" అని అంగీకరించారు. ఇలా స్వామి సన్నిధిలో మూడు నెలలున్న తర్వాత, ఒకనాడు శ్రీ గురుడు సాయంత్రం పూట, సాయందేవుని తీసుకొని నదీ సంగమానికి వెళ్ళారు. శ్రీగురుడు అందరూ స్నానం చేసిన తర్వాత, మిగతా శిష్యులనందర్నీ కూడా మఠానికి వెళ్ళపొమ్మని చెప్పి, సాయందేవుని మాత్రమే అక్కడ ఉండమన్నారు. చీకటి పడింది. అప్పుడు శ్రీగురుడు ఒక అద్భుతం అయిన లీల చేశారు.

అదేమిటంటే, చీకటి పడిన క్షణంలోనే అకస్మాత్తుగా పెనుగాలి చెలరేగింది. గాలికి చెట్లు ఊగిపోయాయి. కొన్ని చెట్లు విరిగిపడిపోయాయి. ఆకాశం అంతా కారుమేఘాలు కమ్ముకొని, భయంకరంగా ఉరుములు, కన్నులు మిరిమిట్లు గొలిపే కాంతులతో మెరుపులు ఆరంభం అయ్యాయి. ఇంతలో కుండపోతగా వర్షం ఆరంభం అయ్యింది. సాయందేవుడు ఆ గాలికి ఎలాగో ఓర్చుకొని, తన వంటిపై ఉన్న ఉత్తరీయాన్ని తీసి శ్రీ గురునిపై కప్పి, ఆయనకు గాలిబాధ కల్గకుండా ఉండేందుకు అడ్డుగా నుంచున్నాడు. గాలి, వాన అర్ధరాత్రి రెండవ ఝాము వరకు కొనసాగాయి. కొద్దిగా గాలి వాన తగ్గిన తరువాత చలిగాలి ఎక్కువగా వీచసాగింది. అప్పుడు శ్రీగురుడు, సాయందేవునితో "నాయనా! మమ్మల్ని చలి బాధిస్తోంది. గ్రామానికి వెళ్ళి మఠం నుంచి అగ్ని తీసుకొనిరా"! అన్నారు. అప్పుడతను బయలుదేరుతుంటే బాటకు అటూ, ఇటూ చూడకుండా వెళ్ళి రమ్మన్నారు. సాయందేవుడు బయలుదేరి ఊరివైపు నడుస్తున్నాడు.

రహదారిలో ఎటు చూసినా మోకాలు లోతు బురదలో కాళ్ళు కూరుకుపోతున్నాయి. ఆ పైన నీటి ప్రవాహం వేగంగా ఉన్నది. కటిక చీకటిలో శ్రీగురుని స్మరిస్తూ చీకటిలో తడుముకుంటూ, మెరుపుల వెలుగులో దారిచూచుకుంటూ, మఠం చేరి, నిప్పు తీసుకొని తిరిగి బయలుదేరాడు. దారిలో వస్తూ శ్రీగురుడు దారికటూ ఇటూ ఎందుకు చూడవద్దన్నారో అన్న కుతూహలం ఎక్కువై ఒక్కసారిగా కుడిప్రక్కకు చూచాడు. భయంకరం అయిన ఐదు పడగలు కల్గిన నల్లని త్రాచుపాము వస్తూ కన్పించింది. అతడు భయంతో నెమ్మదిగా ఎడమవైపుకు చూచాడు. ఆ ప్రక్కనే ఇంకొక పాము కూడా వెంబడిస్తూ కన్పించింది. అతనికి భయంతో గుండెలు తారెత్తాయి. శ్రీగురుని నామాన్ని ఉచ్చరించుచూ గుండెదడ తగ్గించుకొని తన నా పాముల నుండి రక్షించమని ప్రార్థిస్తూ, సంగమం వద్దకు సమీపించాడు. ఇంతలో శ్రీగురుడు కూర్చున్న ప్రదేశంనుంచి వేలకొలదీ దీపములు వెలుగుతున్నట్లుగా కనిపించాయి. తీరా, శ్రీ గురుని వద్దకు చేరుకొనేసరికి ఆ కాంతులు లేవు. నిప్పును క్రింద పెట్టి నిప్పును రాజేసి తల పైకెత్తి చూడగానే, భయంకరమైన ఆ పాములు శ్రీ గురునికి నమస్కరించి వెళ్తున్నాయి. భయంతో మరింత వణికి పోతూంటే శ్రీ గురుడు అతనివైపు చూసి నవ్వుతూ "నాయనా! **గురుసేవ ఎంత కఠినమయినదో చూచావా? కలి ప్రభావం వలన ఇంద్రియ చాపల్యం అప ప్రచారాలు, ఎన్నో ఎక్కువ అవుతాయి. అయినా చలించకుండా నిశ్చలంగా గురుసేవ చేస్తే ఫలితం ఉంటుంది. గురువు దగ్గరే ఉంటూ విశ్వాసంతో సేవ చేస్తూండేవాడు, తేలికగా అభీష్టాలు పొందుతాడు. పతివ్రత తన భర్తను సేవించినట్లు సచ్ఛిష్యుడు గురువును అలా సేవించాలి. ఏకభావంతో ఆరాధించటమే ఉత్తమమైన సాధన. మంచి శిష్యుడు, గురువును విడవక నీడవలె సేవిస్తాడు. గురువే పరమేశ్వరుడని, ఆయన ప్రసాదమే భోజనంగా,**

ఆయన ధ్యానమే జీవనంగా, ఆయన పాద జలమే గంగా తీర్థంగా సేవిస్తాడు. గురువు ఎంతటి అసాధ్యం అయిన పని చెప్పినా అది చేయటానికి తన ప్రాణం అయినా అర్పించటానికి సిద్ధంగా ఉంటాడు. అటువంటి వాడిని యమధర్మరాజు కూడా చూచి భయపడ్తాడు" అని శ్రీ గురుడు చెప్పారు.

అప్పుడు సాయందేవుడు "స్వామీ! నేనేమీ తెలియని మూర్ఖుడను. గురుభక్తి ఎలాంటిదో తెలియచేయండి. దాని సహాయంతో మనస్థైర్యం చిక్కించుకొని మీ చెంతనే ఉండి సేవ చేస్తాను." అన్నాడు. అప్పుడు శ్రీ గురుడు ఇలా చెప్పారు. "నాయనా! పూర్వం 'త్వష్ట' అనే ఎనిమిది సంవత్సరాల బ్రాహ్మణ బాలుడుండే వాడు. అతడు విద్యాభ్యాస నిమిత్తమై ఒక మునీశ్వరుని వద్ద కుటీరంలో ఉండేవాడు. ఒకనాడు గురువు యొక్క కుటీరం వర్షం వల్ల పూర్తిగా తడిసిపోయింది. అప్పుడు ఆ గురువు 'త్వష్ట'ను పిల్చి, "నాయనా! ఈ కుటీరం ప్రతిసారీ వర్షానికి తడిసిపోతూ ఉన్నది. నాకు గాలి, వాన, అగ్ని వలన నశించనటువంటి కుటీరం నిర్మించి సమర్పించు" అన్నారు. ఇంతలో ఆ గురుపత్ని వచ్చి "నాయనా! నాకు ఎవ్వరూ నేయనిది, కుట్టనిది, రంగురంగులదీ, నాకు సరిపోయేది అయిన రవికను తెచ్చిపెట్టు" అన్నది. ఇంతలో గురు పుత్రుడు వచ్చి "అన్నా, నాకు కాళ్ళకు మట్టి అంటనివి, నీటి మీద కూడా నడిపించగల్గినవి, ఎప్పుడూ సరిపోయేవి, అందం అయిన పాదరక్షలు కావాలి" అన్నాడు. అప్పుడే చిన్నదైన గురు పుత్రిక వచ్చి "అన్నా! నా చెవులకు కుండలాలు కావాలి. ఆడుకునేందుకు ఒక బొమ్మరిల్లు కావాలి. అది ఒక్క స్తంభంతోటే చేసి ఉండాలి, దంతంతో చేసినదై ఉండాలి. పగలనిదిగా ఉండాలి. నా వెంట తీసుకువెళ్ళడానికి వీలుగా ఉండాలి. దాన్ని నెట్టుకెళ్ళడానికి క్రింద చక్రాలుండాలి. దాన్ని మడిచి వేయుటకు వీలుగా ఉండాలి. అందులో

పీట, కుర్చీ ఉండాలి. ఆడుకోవటానికి అందులో వంటపాత్రలుండాలి. అవి మట్టివి కావాలి. నాకు అవే వంట నేర్పాలి. అందులోని వంట ఎంత సేపైనా చల్లారకూడదు." అని చెప్పింది. త్వష్ట అంగీకరించి, గురువు వద్ద సెలవు తీసుకొని, అవన్నీ ఎలా సంపాదించాలా అని ఆలోచిస్తూ, దిక్కుతోచక, గురువును ధ్యానిస్తూ అరణ్య మార్గం గుండా వెళ్తున్నాడు. అప్పుడు ఒక అవధూత కన్పించి, త్వష్టను చూచి "నాయనా! నీవు ఎవ్వరవు? ఇంత చిన్నవాడివి ఈ కీకారణ్యంలో తిరుగుతున్నావేమి?" అని అడిగాడు. అంత త్వష్టకు అతన్ని చూడగానే మనస్సు శాంతించింది. ఆయనకు నమస్కరించి "స్వామీ! ఈ నిర్మానుష్యమైన కీకారణ్యంలో మిమ్మల్ని చూడగానే నా పాలిట ఈశ్వరుడనిపిస్తున్నది." అని తాను సాధించ వలసిన కష్టతరం అయిన పనులను గూర్చి చెప్పాడు. అప్పుడు అవధూత అతన్ని ఆశీర్వదించి, "నాయనా! అభీష్టప్రదుడైన లింగేశ్వరుడు కాశీలో ఉండగా భయం ఏమున్నది? నీవు కాశీకి వెళ్ళు. విశ్వనాథుని దర్శించి పూజించు. ఆయన వరంతో దేవతలు కూడా మహిమను పొందారు. కేవలం గుక్కెడు పాలకోసం కోరిన ఉపమన్యువుకు సాక్షాత్తూ పాల సముద్రానే ప్రసాదించిన దయాసముద్రుడు." అని చెప్పాడు. అంత త్వష్ట "స్వామీ! కాశీక్షేత్రం ఎక్కడున్నది?" అని అడిగాడు. అప్పుడా ముని "నాయనా! కాశీకి నేను తీసుకువెళ్తాను పద. దాని వలన నాకు కూడా విశ్వనాథుని దర్శన భాగ్యం కల్గుతుంది" అని తన లీలచేత మనోవేగంతో కాశీకి తీసుకువెళ్ళాడు.

ఓం శ్రీదత్తాయ గురవే నమః

ఓం శ్రీపాద స్వామినే నమః **ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః**

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః


(41వ అధ్యాయం సంపూర్ణం)



42 వ అధ్యాయము



శ్రీ గణేశాయ నమః



శ్రీ సరస్వత్యై నమః



శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

శ్లో॥ శివతోషకరీం కాశీయాత్రాం భక్తాయ యో వదత్ ।
సవిధిం విహితాం త్వష్టా శ్రీ దత్త శరణం మమ॥

(త్వష్ట అనే బాలుడు తన గురువు కోరిన వస్తువులను కాశీకి వెళ్ళి శివుని వరము వలన వాటిని పొంది గురువుకు సమర్పించి అనుగ్రహము పొందేటట్లు చేసిన దత్తదేవా నాకు శరణము నీవె)

ఆ పై కథను సిద్ధయోగి ఇలా చెప్పాడు :

వారిద్దరూ కాశీ చేరిన తర్వాత, అవధూత బోధించిన విధంగా త్వష్ట విశ్వనాధ దర్శనం చేసికొని, అంతర్ గృహ యాత్ర, స్నానం, దానము, అర్చన, శ్రాద్ధము చేసి అన్నపూర్ణ, విశ్వేశ్వర, బిందు మాధవ, డుండి వినాయక, దండపాణి, కాలభైరవ, గుహకాశి, మణికర్ణిక మొ॥వి అన్నీ దర్శించుకొని, తన పేరు మీదుగా లింగ ప్రతిష్ఠ చేసి, మనస్సులో గురు చరణాలను నిలుపుకొని ప్రార్థించాడు. వెంటనే ఈశ్వరుడు ప్రత్యక్షమై వరం కోరుకోమన్నాడు. అతడు తన గురువు, గురుపత్ని, గురుపుత్రుడు, పుత్రిక

అడిగినవన్నీ విన్నవించాడు. శంకరుడు వరం ఇచ్చి "నాయనా! నీ గురుభక్తికి మెచ్చాను. నీవు విశ్వకర్మ అనే సృష్టి కర్తవవుతావు." అని ఆశీర్వదించి అదృశ్యుడయ్యెను.

త్వష్ట సంతోషించి, తన గురువు, వారి కుటుంబం కోరినవన్నీ సమర్పించు కున్నాడు. వెంటనే గురువు సంతోషించి అతనికి జ్ఞానం, సర్వసిద్ధులు, నవనిధులు, యశస్సు కలిగేలా ఆశీర్వదించారు. "కావున సాయందేవా! **గురుభక్తి వలన సాధ్యం కానిది ఏదీ లేదు. గురుభక్తునికి ముగ్గురు మూర్తులూ వశమై అభీష్టసిద్ధిని ప్రసాదిస్తారు. గురువు లేక మోక్షము సిద్ధించదు"** అన్నారు. శ్రీగురుడు, గురుసేవా వృత్తాంతమును చెప్పేసరికి సూర్యోదయం అయ్యింది. గురుసేవా వృత్తాంతము విన్న సాయందేవుడు శ్రీగురునికి నమస్కరించి, పారవశ్యంతో, "ఓ కృపామూర్తీ! మీరు కాశీయాత్రను వివరిస్తుంటే, మీతో కలసి కాశీ క్షేత్రాన్ని దర్శించినట్లుగా అనుభవం అయ్యింది. జగద్గురూ, కృపాసాగరా! ఇది నిద్రావస్థో లేక జాగృదావస్థో తెలియటం లేదు. అజ్ఞానులైన మానవులు మిమ్మల్ని మానవమాత్రులుగానే అనుకుంటున్నారు. మీరు ఎక్కడ ఉంటే అదే కాశి." అని శరీరం అంతా రోమాంచితమై, కంఠం గద్గదమై కన్నుల ఆనందభాష్పాలతో శ్రీ గురున్ని ఇలా స్తుతించాడు.

1. **ఇందుకోటి తేజకిరణసింధు భక్తవత్సలమ్ ।**
నందనాత్రిసూనుదత్తమిందిరాక్ష శ్రీ గురుమ్ ।
గంధమాల్య అక్షతాది వృందదేవవందితమ్ ।
వందయామి నారసింహ సరస్వతీశ పాహిమామ్ ॥

భావం : కోటి సూర్యులు, కోటి చంద్రులతో సమమగు కాంతి

కలిగి, విశ్వాశ్రయమై, దేవతల చేత పూజింపబడెడి భక్తప్రియుడై, భక్తులకు వరములొసగెడి అత్రి అనసూయలకు తనయుడై అవతరించిన ఓ నృసింహ సరస్వతీ స్వామి, నీకు వందనము. నన్ను రక్షింపుము.

2. **మోహపాశ అంధకారజాతదూర భాస్కరమ్ ।**
ఆయతాక్ష పాహి శ్రీయవల్లభేశ నాయకమ్ ।
సేవ్యభక్త వృందవరద భూయో భూయో నమామ్యహమ్ ।
వందయామి నారసింహసరస్వతీశ పాహిమామ్ ।

భావం : మాయాపాశమను అంధకారములో నున్న భక్తులకు సూర్యుడవై నట్టియు, విశాలములైన నేత్రములు కలిగి లక్ష్మీపతివై సేవించు భక్త బృందమునకు శ్రేష్టములైన వరంబులొసగెడి ఓ నృసింహసరస్వతీ స్వామీ, నీకు మాటి మాటికి నమస్కారము. నన్ను రక్షింపుము.

3. **చిత్తజాత వర్గషట్కమత్త వారణాంకుశమ్ ।**
సత్త్వసారశోభితాత్మ దత్తశ్రీయ వల్లభమ్ ।
ఉత్తమావతార భూతకర్తృ భక్తవత్సలమ్
వందయామి నారసింహసరస్వతీశ పాహిమామ్ ॥

భావం : చిత్తమందు ఉదయించెడి కామ, క్రోధ, లోభ మోహమద మాత్సర్యము లనెడి మదపు టేనుగులకు అంకుశమైనట్టియు, భక్తులందలి వాత్సల్యముతో శుద్ధసత్వము నుపాధిగ స్వీకరించి, అత్యద్భుతమగు యతి అవతారము ధరించిన ఓ నృసింహసరస్వతీ స్వామీ! నీకు వందనము. నన్ను రక్షింపుము.

4. వ్యోమవాయు తేజ ఆప భూమి కర్తృమీశ్వరమ్ ।
కామక్రోధ మోహరహిత సోమసూర్య లోచనమ్ ।
కామితార్థ దాతృ భక్త కామధేను శ్రీ గురుమ్ ।
వందయామి నారసింహ సరస్వతీశ పాహిమామ్ ॥

భావం : పంచభూతాత్మకమైన జగమునకు కర్తలైయుండియు, రాగద్వేషములు లేని భక్తులకు కామధేనువై, వారికి కామితార్థములనొసగెడి, సూర్యచంద్రులు నేత్రములుగా గల ఓ గురుమూర్తీ! నృసింహసరస్వతీ! ఈశ్వరా! నీకు వందనము నన్ను రక్షింపుము.

5. పుండరీక అయతాక్ష కుండలేందు తేజసమ్ ।
చండదురిత ఖండనార్థ దండధారి శ్రీగురుమ్ ।
మండలీక మౌలిమార్తండ భాసితాననమ్ ।
వందయామి నారసింహ సరస్వతీశ పాహిమాం ॥

భావం : కమలములవలె విశాలమైన నేత్రములు కలిగి, చంద్రునివలె నాహ్లాదకరమైన ముఖారవిందముతో నొప్పుచు భక్తుల ప్రచండ పాపములను పారద్రోలుటకా యనునట్లు దండమును ధరించి, కమండలమును హస్తమున గలిగి, యతి వేషముననున్న ఓ శ్రీహరీ! నృసింహసరస్వతీ స్వామీ! నీకు వందనము. నన్ను రక్షింపుము.

6. వేదశాస్త్ర స్తుత్యపాదమాది మూర్తి శ్రీ గురుమ్
నాదబిందు కళాతీత కల్పపాద సేవ్యయమ్ ।
సేవ్యభక్తవృందవరద భూయో భూయో నమామ్యహమ్
వందయామి నారసింహ సరస్వతీశ పాహిమామ్ ॥

భావం : వేద శాస్త్రములచే స్తుతింపబడు పాదపద్మములు గల వాడవై, నాద బిందుకళలు స్వరూపముగా గలవాడై యుండియు వాటికతీతుడవై, తాపత్రయములచే పీడింపబడుచు సేవించెడి భక్తులకు కల్పవృక్షమై విరాజిల్లెడి ఓ నృసింహసరస్వతీ స్వామీ! మాటిమాటికి నమస్కృతులు గావించెద. నన్ను రక్షింపుము.

7. అష్టయోగతత్త్వనిష్ట తుష్టజ్ఞాన వారిధిమ్
కృష్ణవేణి తీరవాస పంచ నద్యసంగమమ్ ।
కష్ట దైన్యదూర భక్త తుష్ట కామ్యదాయకమ్
వందయామి నారసింహ సరస్వతీశ పాహిమామ్ ॥

భావం : జ్ఞానాంబుధివై, భక్తులు స్మరించిననంతనే సంతసించి వారలకు అష్టాంగ యోగసిద్ధిననుగ్రహించుచు, అష్టకష్టములతో బాధనొందుచు దీనులై శరణునొందిన భక్తులకు, సమస్త కామ్యములనొసంగుచూ, కృష్ణానదిలో పంచనదులు కలియుచోట నరసింహవాడి క్షేత్రమున నివసించు భక్తులనుద్ధరించిన, శ్రీ నృసింహసరస్వతీ స్వామీ! నీకు వందనము. నన్ను రక్షింపుము.

8. నారసింహ సరస్వతీశనామ అష్టమౌక్తికమ్
హారకృత్య శారదేన గంగాధరాఖ్య స్వాత్మజమ్ ।
ధారణీక దేవదీక్ష గురుర్మూర్తితోషితమ్
వందయామి నారసింహ సరస్వతీశ పాహిమామ్ ॥

భావం : శారద, గంగాధరుల పుత్రుని చేత కూర్చబడిన నరసింహసరస్వతీ అష్టకమును ముత్యాలహారమును సంతోషముతో

ధరించిన దేవయజ్ఞ దీక్షిత గురుమూర్తీ! శ్రీ నృసింహ సరస్వతీ నీకు వందనము. నన్ను రక్షింపుము.

9. నారసింహ సరస్వతీశ అష్టకంచ యఃపఠేత్
ఘోర సంసారసింధు తారణాఖ్య సాధనమ్ ।
సారజ్ఞాన దీర్ఘ ఆయురారోగ్యది సంపదామ్
చారువర్గ కామ్యలాభ నిత్యమేవ యఃపఠేత్ ॥

భావం : ఘోరమైన సంసారము నుండి తరింపజేయు సమర్ధమైన ఈ నరసింహసరస్వతీ అష్టక స్తోత్రము నెవ్వరు పఠింతురో వారు చతుర్విధ పురుషార్ధములను దీర్ఘాయుష్యమును, ఆరోగ్యమును, సంపత్తునుగూడ పొందెదరు.

సాయందేవుడు స్తుతించుచూ, శ్రీగురుని పాదాలపై పడి, భోరుభోరున ఏడ్చెను. శ్రీ గురుడతన్ని లేవనెత్తి "నాయనా! నీవే నా నిజమైన భక్తుడవు. నీవు సేవ చేయుచూ ఇక్కడే ఉండుము. ఇక మ్లేచ్ఛరాజు సేవలో ఉండకూడదు. నీ భార్య బిడ్డలను తీసుకువచ్చి మా వద్దనే నివసించుము' అని చెప్పి, సాయందేవునితో సహా మఠానికి తిరిగి వచ్చిరి. ఒకనాడు సాయందేవుడు శ్రీగురుని ఆజ్ఞను తీసుకొని తన గ్రామానికేగి, భార్యాబిడ్డలను తీసుకొని, మహా ఆనందంతో గాణ్గాపురం చేరి, శ్రీ గురునకు సాష్టాంగ నమస్కారం చేసి, చేతులు జోడించి, ఈ విధంగా ప్రార్థించెను.

ఓం నమో శ్రీసద్గురూ! చంద్రమౌళీ! మీరు త్రిమూర్తి స్వరూపులు. అజ్ఞానుల దృష్టికి మానవుల్లా కనిపిస్తున్నారు. మీ మహిమ అపారము, ఎవరికీ వర్ణింపతరంగాదు. పూర్వజన్మ పుణ్యముచే దయానిధులైన తమరి

దర్శనంచే పాపతాపములు రెండునూ నశించునని అంటూ కన్నడ భాషలో ఈ క్రింది విధంగా స్తుతించెను.

1. కన్నడం : కండేనిందు భక్త జనరభాగ్యనిదియా
భూమండలదోళగేనారాసింహయతిరాయా (పల్లవి)

సంస్కృతము : భక్తజన సుభాగ్యోదయాకారః మహీతలేయతీశ్వరః ।
దృష్టోమయావిశ్వతారః నరిసింహాసరస్వతీయతీశ్వరః॥

తెలుగు : భూమండలమున భక్త జనులకు భాగ్యనిధియై అవతరించిన శ్రీ నృసింహ సరస్వతీ స్వామిని నేడు చూడగల్గాను.

2. కన్నడం : కండేనిందు దృష్టియింద వారిజాదళ పాదవన్ను
హృదయ కమలదల్లి భజసి సుఖవనీవ జగత్పతియా

సంస్కృతం : దృష్టోదృక్కమల యుగేన తత్పదకమల ద్వంద్వమనేన ।
నష్టం స్మరణతోఽఘం క్షణేన సుఖదోఽసౌనో జగత్పతి॥

తెలుగు : హృదయమున భక్తితో ధ్యానించువారికి సుఖముల నిచ్చు జగత్పతియైన మీ చరణకమలమును నేడు దర్శించగల్గినాను.

3. కన్నడం : భక్త జనరిగె కామ్యఫలగళిత్తు సలహూతిరువ
యోగిని యరొడయ నారసింహసరస్వతీ గరిష్టం

సంస్కృతము : దీనబంధుః పూరయతీష్టం భోగిజనానాందయాబ్ధిరిష్టం।
యోగిజనానాంవందేశిష్టం నృసింహ సరస్వతీ గరిష్టం॥

తెలుగు : సంసారమున బాధపడ్తున్న భక్తులకు అభీష్టమునిచ్చి రక్షించు యోగులకు ప్రభువై యోగ సిద్ధిని అను గ్రహించు నరసింహసరస్వతీ స్వామిని చూచే భాగ్యం కలిగింది.

4. కన్నడం : వాక్యాకారణనాగి జగదోళుదండ కమండలనుధరిసి
సగుణనెనిసి సుజనరిగె బలిద శ్రీ గురుయతివరన్నా

సంస్కృతము : లక్ష్యోవాక్యైరాత్మ జగతి దండకమండలు ధృక్త్వం నయతిః ।
సగుణబ్రహ్మత్వం సత్ప్రీతిః న్యాసిశ్రేష్ఠోవై గురుమూర్తిః॥

తెలుగు : పరతత్త్వమే సగుణమై దండ కమండలాలను ధరించి, సత్పురుషులను ఉద్ధరించుచున్న ఓ నరసింహాసరస్వతీ! యతిసార్వభౌమా! నేను మిమ్మల్ని నేత్రపర్వంగా చూడగల్గినాను.

5. కన్నడం : ధరగె గాణగాపురకైలాస హరిదాసహోడయెనెనిసి
కరుణదివర విత్తుపొరెవ అనుదిన గురుభరణవన్ను

సంస్కృతము : హరిదాస ప్రియతరుణానిలయస్వ భక్తపాలక ప్రేమాతిశయ।
చరణ స్పర్శాత్తైకైలాసోభూద్గంధర్వపురమ్ ॥

తెలుగు : మీ చరణ స్పర్శవలన గంధర్వపురం భూకైలాసం అయింది. దయకు సముద్రులై, ప్రేమతో భక్తులను పరిపాలించు మీ పాదములను, నేను చూడగల్గినాను.

6. కన్నడం : కండెనమ్మా ఇందుకండెనమ్మా భూమండలదొళగె
యతివరరాయచంద్రాయన్నా

సంస్కృతము : భక్తసుభాగ్యోదయాకారః మహీతలేయతీశ్వరః ।
దృష్టోమాయావిశ్వతారః నరసింహసరస్వతీయతీశ్వరః॥

తెలుగు : యతులనబడే నక్షత్రములలో చంద్రుని వలె ప్రకాశించెడి మిమ్మల్ని నేను కన్నులతో చూస్తున్నాను. భక్త జనుల భాగ్యామే సాకారమై వెలసి భూమియందు యతీశ్వరుని రూపంగా మిమ్మల్ని చూస్తున్నాను.

7. కన్నడం : తత్త్వభోధయ ఉపనిషతత్త్వ చరితనా, వ్యక్త
వాద పరబ్రహ్మమూర్తి ఎనిసువనా ॥కండెనిందు॥

సంస్కృతము : జయజయాభూమాన్ సద్గురు మూర్తే జగద్దేతోదృత నరమూర్తే ।
కృపాగన త్వంభ్రాజ తీర్థైదయానిధేనః పాహివిజూర్తే॥

తెలుగు : స్వామిా! ఉపనిషత్తులన్నీ మీ పాదములలోనే ముద్రితమై ఉన్నవి. భక్తులను రక్షించటంలో జాగుచేయని దయఘనా! మీకు జయము !జయము!

8. కన్నడం : శేషశయన పరవేష కాయకనాలేసు కృపేయ
నిమేషవెంబభాషాపాలంనా ॥కండెనిందు॥

తెలుగు : శేషసాయియై మీరు సన్యాసి దేహమును ధరించి, మీ కృపాకటాక్షము ఎవరియందు ప్రసరించునో, వాడు ధన్యుడేధన్యుడు. అట్టి పవిత్రమైన మిమ్ములను నేను దర్శించుకున్నాను.

9. కన్నడం : గంధపరిమళ దిందశోభితాతనంద సాగరనా ఛందవుళ్ళ
యోగీంద్ర గోపీ వృంద వల్లవభనా ॥కండెనిందు॥

తెలుగు : ఆనందమునకు సముద్రులై, గంధ పరిమళములతో శోభిల్లేయోగీంద్రా! గోపీజన ప్రియుడైన శ్రీ కృష్ణ భగవానుని మీ రూపంలో దర్శిస్తున్నాను.

10. కన్నడం : కరిరాయనెని పంగెవరద గురురాయనా నరసింహా
సరస్వత్యంబ నారీ పురుషనామకనా ॥కండెనిందు॥

తెలుగు : కరిరాజైన గజేంద్రునకు మోక్షమును ఒసగిన శ్రీ మహావిష్ణువే ప్రకృతి - పురుషుల రూపం
(నరసింహసరస్వతీ) తో సార్ధకమొనర్చిన జగద్గురు రూపాన సంచరిస్తున్న మిమ్మల్ని కన్నుల పండుగగా దర్శించుకున్నాను.

ఈ విధంగా శ్రీగురుని సాయందేవుడు స్తుతించుచూ భార్యబిడ్డలను కూడా శ్రీగురుని పాదాల వద్ద చేర్చాడు. అప్పుడు సాయందేవుని పుత్రులలో పెద్దవాడైన నాగనాధుని చూస్తూ నాగనాధుని తలపై హస్తం ఉంచి, ఆశీర్వదించి, సాయందేవుని వైపు చూస్తూ "ఇతడే మా నిజమైన భక్తుడు, ఇతడి వలన మా కీర్తి దిగంతాలకు వ్యాపించగలదు" అని చెప్పి "నాయనా! ఇక నుండి అమ్లేచ్ఛరాజు సేవలో ఉండకూడదు. మా అనుగ్రహం వలన మీవంశమునకు కీర్తికల్గును" అని సంపూర్ణంగా వారిని ఆశీర్వదించిరి. తర్వాత శ్రీగురుడు, వారితో "నాయనా! మీరు సంగమమునకు వెళ్ళి,

స్నానం చేసి, అశ్వర్థ వృక్షాన్ని సేవించుకొని రండి". అని చెప్పిరి.

అదీకాక, ఆనాడు అనంత పద్మనాభచతుర్ధశి కాబట్టి, అనంత వ్రతం చేసుకొమ్మని చెప్పిరి. అప్పుడు సాయందేవుడు, "స్వామీ! మీరే నాకు అనంతులు, మీ పాదసేవయే మాకు అనంత వ్రతము, అట్లుకాక వేరొక అనంతుడెందుకు?" అనెను. అప్పుడు శ్రీగురుడు వారితో "నాయనా! మీరు కౌండిన్యస గోత్రీకులు. మీ గోత్ర ఋషియైన కౌండిన్యుడు అనే ఋషి ఈ వ్రతం వల్ల ఉద్ధరించబడ్డాడు, కనుక మీరు కూడా ఈ వ్రతాన్ని ఆచరించి, ఫలమును పొందండి" అని చెప్పిరి. అప్పుడు సాయందేవుడు "స్వామీ! మా గోత్ర ఋషి అయిన కౌండిన్యుడు ఈ వ్రతం వల్ల ఎలా ఉద్దరించబడ్డాడో తెలియచేయండి" అని ప్రార్థించెను.

ఓం శ్రీదత్తాయ గురవే నమః

ఓం శ్రీపాద స్వామినే నమః **ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః**

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

(42వ అధ్యాయం సంపూర్ణం)


మదియె మధుర ఔను, హృదయంబె ద్వారకా
కాయమొప్పుచుండు కాశి గాను
తలను ద్వారముండు, దానిలో గుడియుండు
సమర్దసద్గురు జ్యోతిని అచట కనుమూ
మరచిపోకుడు శివానందుని మంచిమాట

– శ్రీ స్వామి శివానంద మహరాజ్

43 వ అధ్యాయము



శ్రీ గణేశాయ నమః



శ్రీ సరస్వత్యై నమః



శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

శ్లో॥ కౌండిన్య ధర్మ విహిత మనంత వ్రతమాహయః ।
కారయా మాసతద్యోపి శ్రీదత్తః శరణం మమ॥

(కౌండిన్యుడు అనంత పద్మనాభ వ్రతము ఆచరించి సత్ఫలితము పొందిన విధము తెలిపి సాయందేవుని చేత కూడా ఆచరింపజేసిన శ్రీదత్తగురు నీవే శరణము నాకు)

సిద్ధయోగి ఇంకా ఇలా చెప్పాడు :

శ్రీ గురుడు "అనంత పద్మనాభవ్రత మహాత్మ్యము" ఈ విధంగా వివరించారు.

"ధర్మరాజు జూదంలో ఓడిపోయి పాండవులు అడవులలో వనవాసం చేస్తున్నపుడు దుర్మార్గుడైన దుర్యోధనుడు వారిని ఇంకా కష్టములకు గురిచేయుటకు దుర్వాస మహర్షిని, వారిపైకి పురి కొల్పెను. ఇన్ని కష్టాలను భరిస్తున్న ద్రౌపతీ దేవి శ్రీ కృష్ణ పరమాత్మునితో ధర్మాత్ముడైన నీవు మాకు అండగా ఉండి కూడా, మేము ఇన్ని కష్టాలకు గురికావాల్సి వచ్చింది

ఎందుకు? దీనికి తరుణోపాయం చెప్పమ"ని వేడుకొనెను. అప్పుడు శ్రీకృష్ణుడు "అనంతుడను నేను. సర్వవ్యాపిని. త్రిమూర్తులు, చతుర్దశ భువనాలు నాయందు ఇమిడి ఉన్నాయి. అట్టి అనంతుడుగానున్న నన్ను గుర్తించి నిష్ఠగా వ్రతం చేసుకుంటే మీ కష్టాలు తీరుతాయి" అని చెప్పాడు.

'ఈ అనంత వ్రతాన్ని భాద్రపద శుద్ధ చతుర్ధశి నాడు మధ్యాహ్న సమయాన భక్తితో ఆచరిస్తే, మీ రాజ్యం మీకు లభించగలదు', అని చెప్పి ఆ వ్రత మహిమను తెల్పే కథ నొకదానిని ఈ విధంగా చెప్పాడు.

పూర్వం వశిష్ట గోత్రంలో సుమంతుడనే ధర్మ నిష్టకల్గిన ఋషి ఉండేవాడు. అతడు భృగు గోత్రీయ 'దీక్ష' అను భార్యను పెండ్లాడెను. కొలది కాలంలోనే దీక్షకు 'సుశీల' అను కూతురు పుట్టినది. దీక్ష మరణించెను. తల్లిని పోగొట్టుకున్న సుశీల, తండ్రి అయిన సుమంతుడి వద్దనే పెరుగుచుండెను. సుమంతుడు కర్మానుష్టానానికి భంగం కల్గకుండా ఉండేందుకు మరొక వివాహం చేసికొనెను. ఆమె గయ్యాళి, ప్రతీరోజూ భర్తతోనూ సుశీలతోను పోట్లాడుచూ ఉండేది. ఇంతలో సుశీల యుక్త వయస్కురాలై ఉండుట చేత, 'కౌండిన్యుడు' అనే ఋషికిచ్చి వివాహం చేసిరి. సవతితల్లి పెట్టే బాధలు భరించలేక భర్తతో వేరు కాపురమునకై సుశీల బయలు దేరెను. సవితి కూతురు కాపురానికి వెళ్ళునపుడు దోవబత్తేనికి కించిత్తు పేల పిండిని ఇవ్వడానికైనా ఆమె అంగీకరించలేదు. సుమంతుడు భార్య చూడకుండా కొద్దిగా గోధుమపిండి మాత్రము మూటగట్టి కూతురుకు ఇచ్చి సాగనంపెను.

భార్యాభర్తలు ఇద్దరూ ప్రయాణించుచూ మధ్యాహ్న సమయానికి ఒక నదీ తీరానికి చేరుకున్నారు. అక్కడ కొందరు స్త్రీలు ఎర్ర చీరలు

కట్టుకొని, తడి బట్టలతో కలశములను పెట్టి పూజించుట చూచి, వారిని సుశీల సమీపించి "అమ్మలారా! మీరు ఏమి వ్రతం చేస్తున్నారు?" అన్నది. వారు సర్వాభీష్టములను ఒసగు అనంత వ్రతం తాము చేస్తున్నట్లు చెప్పారు. ఈ వ్రతాన్ని ఎలా ఆచరించాలో చెప్పమని సుశీల అడుగగా వారు ఇలా చెప్పారు :

భాద్రపద మాసమునందు శుద్ధ పక్షములో చతుర్థశీ తిథి నాడు ఈ వ్రతం చేయాలి 14 ముళ్ళు వేసిన ఎర్రని తోరమును సిద్ధం చేసుకొని, నదీస్నానం చేసి, పసుపు కుంకుమలు ధరించి, ఎర్రని వస్త్రం కట్టుకొని, శుచియై రెండు కలశాల నిండా నీరు పోసి, పూర్ణపాత్రల మీద వస్త్రాన్నుంచి, అష్టదళ పద్మాన్ని గీచి (గంధంతో) దర్భతో శేషసాయి అయిన విష్ణువును స్థాపించి, పూజించాలి. చతుర్భుజాలతో, శంఖుచక్రములతో కూడిన అనంతుని అందు భావించి, ధ్యానించవలెను. పాత తోరమును తీసివేసి, కొత్త తోరమును కుడిచేతికి మంత్రంతో కట్టుకొని, గోధుమ పిండి వంట చేసి, నివేదన చేసి దక్షణతో సహా వేదవిప్రునికి దానం ఇవ్వాలి.

శ్లో. కృత్వా దర్భమయం దేవం శ్వేత ద్వీపేస్థిరం హరం ।
సమన్వితం సప్తఫణైః పింగళాక్షం చతుర్భుజం ॥

అని నమస్కరించాలి. ఆ తర్వాత యధాశక్తి బ్రాహ్మణులకు భోజనం పెట్టాలి. ఇలా 14 సంవత్సరాలు చేసి, 14 కుండలను బ్రాహ్మణులకు దానం ఇస్తే అన్ని పురుషార్థాలు లభిస్తాయి అని, ఆ స్త్రీలు సుశీలాదేవికి వ్రత విధానాన్ని చెప్పి ఆమె చేత కూడా వ్రతం చేయించారు. ఆ తర్వాత భర్తతో కలసి ఆమె బయలుదేరింది. ఆ వ్రత మహిమ అన్నట్లుగా, దారిలో ఒక పట్టణంలో ప్రజలు కౌండిన్యునికి ఎదురు వచ్చి వారిని అక్కడే

ఉండమని ప్రార్థించారు. అక్కడ వారు కొంత కాలం నివసించి, శ్రీ మంతులై సుఖంగా ఉన్నారు.

ఒకనాడు కౌండిన్యుడు తన భార్యచేతికి ఉన్న తోరమును చూచి, "ఇదేమిటి? నన్ను వశం చేసుకోడానికి కట్టుకున్నావా?" అని అడిగాడు. ఆవిడ అది అనంతతోరమని, దాని మహిమ వలననే తాము ఈ రోజు సిరిసంపదలతో ఉన్నామని ఆవిడ ఎంత చెప్పినా వినకుండా తెంచి నిప్పులో పడేశాడు. కొద్దికాలంలోనే వారింట్లో దొంగలు పడి వంటపాత్రలుతో సహా సర్వమూ దోచుకుపోయారు. అప్పుడు కౌండిన్యుడు తాను చేసిన తప్పును గ్రహించి, అనంతుణ్ణి ఎలాగైనా దర్శించి, ఆయన్ను శరణుపొందనిదే భోజనమైనా చేయనని ప్రతిజ్ఞ చేసి, "అనంతా! అనంతా!" అని కేకలు వేస్తూ, ఒక భయంకరం అయిన కీకారణ్యంలో వెదుకుతూ వెళ్ళాడు. దారిలో ఒక పెద్ద మామిడిచెట్టును చూచాడు. దానికి పూత, కాయలు లేవు. అదేమి చిత్రమో కాని దాని మీద ఒక్క పక్షీలేదు. అనంతుడెక్కడ? అని ఆ చెట్టు నడిగితే నాకు ఆయన దర్శనం లభించలేదు మీకు కన్పిస్తే నా దుస్థితిని వివరించమని చెప్పిందాచెట్టు. మరొక చోట ఒక గడ్డి పరకైనా కొరకని ఆవును, దూడను చూచాడు. వాటినడిగితే అవీ అలానే చెప్పాయి. మరొక చోట అలాంటి ఆబోతు కన్పించింది. అది కూడా అలాగే చెప్పింది. ఇంకొంత దూరం వెళ్ళేసరికి రెండు కొలనులు కన్పించాయి. ఒక దానిలోని నీరు ఇంకొకదానిలోనికి ప్రవహిస్తున్నది. వాటి దగ్గర ఒక్క కొంగైనా వాలి లేదు. వాటినడిగితే అవి కూడా అలానే చెప్పాయి. ఇంకొంత దూరం వెళ్ళేసరికి గాడిద, ఏనుగు కన్పించాయి. అవి కూడా తమకు అనంతుడెక్కడా కన్పించలేదని, కన్పిస్తే తమ దుస్థితి చెప్పమని కోరాయి. అలసిపోయిన కౌండిన్యుడు ఒక చోట కూలబడ్డాడు. అప్పుడు ముసలివాని రూపంలో

అనంతుడు వచ్చి, చేయిపట్టిలేపి, అనంతుణ్ణి చూపిస్తాను రమ్మని ఒక అందమైన రాజభవనం వద్దకు తీసుకువెళ్ళి అదృశ్యుడయ్యాడు. అప్పుడు కౌండిన్యుడు అనంతుని వెదుకుచూ లోపలికి వెళ్ళి చూచుసరికి అందమైన సింహాసనంపై సుందరమైన విగ్రహకుని రూపంలో అనంతుడు దర్శనమిచ్చాడు. కౌండిన్యుడు అతడిని స్తుతించి నమస్కరించాడు. అనంతుడు అతనికి నాలుగు పురుషార్థములను, శాశ్వత వైకుంఠాన్ని వరంగా ప్రసాదించాడు. అప్పుడు కౌండిన్యుడు తాను అడవిలో చూచిన వింతలన్నింటినీ చెప్పాడు. అంత అనంతుడు "పూర్వము ఒక విప్రుడు విద్వాంసుడై కూడా, ఎవరికీ విద్య నేర్పకుండా తనకాలం అంతా శాస్త్రవాదంలోనే గడిపాడు. అందుకతడు వ్యర్థమైన మామిడి చెట్టై పుట్టాడు. చవిటి నేలను దానమిచ్చినవాడు మరుజన్మలో మేతమేయని పశువైనాడు. శ్రీమంతుడై కూడా కొంచెం అయినా దానం చేయనివాడు నీవు చూచిన ఆబోతుగా జన్మించాడు. ఒకరికొకరు దానమిచ్చి పుచ్చుకున్న అక్కా చెల్లెళ్ళే నీవు చూచిన చెరువులు. క్రోధం వహించిన వాడు గాడిదగాను, మదించి విచ్చలవిడిగా తిరిగిన వాడు ఏనుగుగాను జన్మించారు. నీవు పశ్చాత్తాపంతో పరిశుద్ధుడవు అయ్యావు గాబట్టి, ఆ వృద్ధుని రూపంలో నీకు దర్శనం ఇచ్చి నా సంపూర్ణ దివ్యస్వరూపాన్ని నీకు దర్శింపచేశాను. అవన్నీ కూడా పశ్చాత్తాపంతో తమ దుస్థితిని నీతో చెప్పుకుని పశ్చాత్తాపంతో కుమిలాయి కనుకనే, వాటికి కూడా ముక్తిని ప్రసాదిస్తున్నాను. నీవు పునర్వసు నక్షత్రమై శాశ్వతంగా ఆకాశంలో నిలుస్తావు", అని అనంతుడు ఆశీర్వదించి పంపాడు. ఆ తర్వాత కౌండిన్యుడు సుఖంగా జీవించి తర్వాత వైకుంఠానికి వెళ్ళిపోయాడు.

శ్రీ కృష్ణుడు చెప్పిన దంతా విన్న పాండవులు, ద్రౌపతీదేవి ఈ

వ్రతాన్ని ఆచరించి, అనంతుని కృప వలన, తాము కోల్పోయిన రాజ్యమును తిరిగి సంపాదించుకోగల్గారు. కనుక, "సాయందేవా! నమ్మి ఈ వ్రతాన్ని ఆచరించి, సత్ఫలితం పొందని వారే లేరు. కనుక నీవు కూడా కౌండిన్యస గోత్రుడవే కనుక మీ గోత్ర ఋషి అయిన ఆయన ఆచరించినట్లుగా నీవూ ఆచరించి సత్ఫలితం పొందు" అన్నారు. అప్పుడు సాయందేవుడు, శ్రీగురుడు చెప్పినట్లుగా ఆ వ్రతాన్ని ఆచరించి, అక్కడి బ్రాహ్మణులకు సమారాధన చేసి, ఘనంగా దక్షిణ తాంబూలాలతో సత్కరించాడు. తర్వాత సాయందేవుడు భార్య బిడ్డలను ఇంటి వద్ద దించి, తాను మాత్రం శ్రీ గురుని వద్దనే ఉండి, జీవితాంతం ఆయన సేవ చేస్తూ కృతార్థుడయ్యాడు. "నామధారకా! శ్రీ గురుడు సాక్షాత్తూ త్రిమూర్తి స్వరూపుడే. వారి మహిమకు సాధ్యాసాధ్యములు లేవు" అని సిద్ధయోగి నామధారకునికి చెప్పాడు.

ఓం శ్రీదత్తాయ గురవే నమః

ఓం శ్రీపాద స్వామినే నమః **ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః**

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః


(43వ అధ్యాయం సంపూర్ణం)

(మంగళవారపు పారాయణము పూర్తి అయినది)


త్రిగుణములు, ఇంద్రియములు తిరిగిపోయె
వాటికవే సద్గురుకటాక్షవైభవమున
బ్రహ్మాభావంబు హృదయాన ప్రకటమయ్యె
ఇంక వాదవివాదంబులేల నాకూ
మరచిపోకుడు శివానందుని మంచిమాట

– శ్రీ స్వామి శివానంద మహరాజ్

44 వ అధ్యాయము



శ్రీ గణేశాయ నమః



శ్రీ సరస్వత్యై నమః



శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

శ్లో. శ్రీశైలం తంతుకాయాస్తో యోగ గత్యావ్యదర్శయాత్ ।
శివరాత్రి వ్రతాహేష శ్రీ దత్తశ్శరణం మమ ॥

(భా॥ ఒక సాలె వానిని స్వామివారు క్షణకాలములో శ్రీశైలమునకు తీసికెళ్ళుట)

నామధారకుడు సిద్ధమునితో ఆ పై శ్రీగురుని లీలలను వివరించమని ప్రార్థించగా, సిద్ధయోగి ఇలా చెప్పాడు.

నామధారకా ! శ్రద్ధగా విను, గాణగాపురమునందు 'తంతుకుడు' అనుసాలె వాడుండేవాడు. వాడు స్వామి వారి యందు భక్తితో నిత్యమూ మఠమునకు వచ్చి, మఠము ఊడ్చి, నీళ్ళు చల్లి స్వామి సేవను భక్తితో చేస్తుండేవాడు. ఇలా కొంతకాలం జరిగిన తర్వాత, శివరాత్రి పర్వదినము సమీపించింది. అతని బంధువులంతా, శ్రీశైల యాత్రకు పోవుచూ అతన్ని కూడా రమ్మన్నారు. ఆ సాలెవాడు "మీరు అనవసరంగా అంతదూరం పోవుచున్నారు. శ్రీ గురుని మఠానికి మించిన శ్రీశైలం ఉన్నదా! శ్రీగురునికి

మించిన మల్లికార్జునుడున్నాడా? నేను మాత్రము రాను" అన్నాడు. అపుడతని బంధువులు అతడ్ని ఏమీ తెలియని మూర్ఖుడని పరిహసించి, శ్రీశైల యాత్రకు వెళ్ళిపోయారు. ఆ సాలెవాడు మాత్రము నిత్యము వలె మఠానికి వచ్చి, ముంగిలి ఊడ్చి, నీళ్ళు చల్లి సంగమం వద్ద నున్న శ్రీగురుని వద్దకు వెళ్ళి వారి పాదాలపై పూలు వేసి నమస్కరించి, ఓ పక్కగా కూర్చున్నాడు. అప్పుడు శ్రీ గురుడు అతనితో "నాయనా! మీ బంధువులందరూ శ్రీశైల యాత్రకు వెళ్తుంటే నీవు వెళ్ళలేదేమి?" అన్నారు. అందుకు అతడు చేతులు జోడించి నమస్కరిస్తూ "స్వామీ! నాకు మీ పాదముల యందే సర్వక్షేత్రములు ఉన్నవి. మీ మహత్మ్యమును ఎరుగని వారు మిమ్మల్ని సామాన్య మానవ మాత్రుడని అనుకుంటున్నారు" అని అన్నాడు. శ్రీగురుడు అతనివైపు చూసి నవ్వుతూ, "నాయనా! అది చాలా పవిత్ర పుణ్యక్షేత్రము. నీవు కూడా వెళ్తే బాగుండేది" అన్నారు. అప్పుడా సాలెవాడు మీరింతగా చెబుతున్నారు కావున మీరు చూపిస్తే చూడవలెనని కోరిక' అన్నాడు. ఇలా కొలది దినములు గడిచిన తరువాత శివరాత్రి పర్వదినం రానే వచ్చింది. ఒకనాడు సంగమక్షేత్రమున ఉన్న సమయంలో ఆ సాలెవాడు శ్రీ గురుని కలుసుకున్నాడు. అప్పుడు శ్రీగురుడు ఓ అద్భుతం అయిన లీలను చేశారు. సాలెవానిని దగ్గరగా పిలిచి "నాయనా! నీవే మా నిజమైన భక్తుడవు. నీ పవిత్ర భక్తికి మేము సంతసించాము. ఇప్పుడే నీకు శ్రీశైల దర్శనాన్ని చేయిస్తాము" అని తమ పాదుకలను గట్టిగా పట్టుకొమ్మని, కళ్ళుమూసుకొమ్మని చెప్పారు. క్షణకాలంలోనే అతనికి నిద్ర కమ్మినట్లుగా అయ్యింది. కనులు తెరచి చూసేసరికి తామున్నది సంగమక్షేత్రం కాదని, వేరొక ప్రదేశం అని గుర్తించి సాలెవాడు అయోమయ పరిస్థితిలో వున్నాడు. అప్పుడు శ్రీగురుడు "నాయనా! ఇదే పాతళ గంగ. ఇప్పుడు మనం పాతాళ

గంగ ఒడ్డున ఉన్నాము. నీవు వెళ్ళి క్షుర కర్మలు అన్నీ చేసికొని, శుచివై భక్తితో మల్లికార్జుని దర్శించుకొనిరా” అన్నారు. అపుడు ఆ సాలెవాడు, శ్రీ గురుడు చెప్పినట్లుగా క్షురకర్మలు పూర్తి చేసుకొని, పూజా సామగ్రి తీసుకొని, మల్లికార్జుని దర్శనానికి వెళ్ళాడు. ఇంతలో అతని బంధువులక్కడ కన్పించారు. వారు సాలెవాని వద్దకు వచ్చి “ఏమయ్యా! మాతో శ్రీశైలానికి రానన్నవాడివి మరలా ఎందుకు వచ్చావు?” అన్నారు. అంత సాలెవాడు తాను ప్రత్యేకంగా రాలేదని శ్రీగురుడే క్షణమాత్రములో, మహిమతో ఇక్కడకు తీసుకువచ్చారని చెప్పాడు. అందుకు వారు “వీడు మనవెనుకనే వచ్చి ఉండాలి, అబద్ధం చెప్తున్నాడు” అనుకొని అతనిని హేళన చేస్తూ దర్శనానికి వెళ్ళారు. సాలెవాడు మాత్రం భక్తితో మల్లికార్జునుని దర్శించగానే అక్కడ అతనికి అద్భుత దృశ్యం కన్పించింది. మల్లికార్జుని రూపంలో శ్రీ గురుడే కూర్చుని భక్తులు చేసే పూజలన్నీ ఆయనే అందుకుంటున్నట్లుగా దర్శనం అయింది. వెంటనే సాలెవాడు ఆనందంతో ‘శ్రీ గురుడు త్రిమూర్త్యాత్మకుడు కదా! వారు పరమేశ్వరుని రూపంలో దర్శనం ఇవ్వడంలో ఆశ్చర్యం ఏమున్నది?’ అనుకొని తను చేసే పూజలన్నీ ముగించుకొని, మరల పాతాళ గంగ ఒడ్డుకు వచ్చి, శ్రీగురుని దర్శించి, వారిపాదాలపై పడి, “స్వామీ! మీరు నన్ను ఇక్కడికి ఎందుకు తీసుకువచ్చారో తెలయడం లేదు. మల్లికార్జున్ని దర్శించుటకు ఆలయంలోనికి వెళ్ళినప్పుడు అందరూ చేసే పూజలన్నీ మల్లికార్జుని స్థానంలో కూర్చుని మీరే అందుకొంటున్నట్లుగా దర్శనం అయింది.” అన్నాడు. శ్రీగురుడు అతనితో, “నాయనా! ఈశ్వరుడు అంతటా కలడు. ఇక్కడ స్థల విశేషం బట్టి మహాత్త్యము ఉండును.” అన్నారు. అప్పుడా సాలెవాడు “స్వామీ! ఈ స్థల మహాత్త్యమును నాకు వివరించమని ప్రార్థించాడు. శ్రీగురుడు, “నాయనా! మాఘమాసమున

శివరాత్రి పర్వదినంలో, ఇక్కడ గొప్ప మహోత్సవం జరుగును. ఈ క్షేత్రమహాత్మ్యం అపారం. ఒక పురాణ ఇతిహాసాన్ని చెప్తాను శ్రద్ధగావిను.

పూర్వం కిరాత దేశమునందు విమర్షనుడు అనే రాజు పరిపాలిస్తూండే వాడు. అతడు బుద్ధిమంతుడు, నీతి శాస్త్ర నిపుణుడై ఉండి కూడా, పరస్త్రీలంపటుడై మంచి చెడ్డ లేక దురాచారుడుగా ఉండేవాడు. అట్లా ఉండి కూడా ప్రతీ రోజూ శివపూజను మాత్రం మరిచే వాడు కాదు. ప్రతి శివరాత్రి మహోత్సవము భక్తితో ఎంతో వైభవంగా జరుపుతూ ఉండేవాడు. అతని భార్య కుముద్వతి మహాపతివ్రత. తన భర్త దురాచారుడై ప్రతీ రోజూ శివపూజ మరువకుండా చేస్తూండటం గురించి ఆశ్చర్యంతో ఒకనాడు ఏకాంతంగా ఉన్న తన భర్తను సమీపించి “ప్రాణనాథా! మీరేమీ అనుకోనంటే ఒక మాట అడుగుతాను. మీరు దుర్వ్యసనములకు బానిస అయ్యి కూడా శివుని యందు మాత్రము భక్తితో నిత్యపూజ మరువకుండా చేస్తున్నారు. మీకింత శివభక్తి ఎలా అబ్బిందో తెలియచేయండి” అని ప్రార్థించింది. రాజు, ఆమెతో “దేవీ! నాపూర్వ జన్మ వృత్తాంతము నీకు చెపుతాను విను. పూర్వం ఒక గొల్లవాని ఇంట కుక్కనై జన్మించాను. ఒక శివరాత్రి పర్వదినం నాడు నేను ఆకలితో అలమటిస్తూ తిరుగుతూ ఉన్నాను. ఆనాడు శివరాత్రి కనుక ఉపవాసం పేరుతో ఎవ్వరూ వంటలు వండలేదు. ఊరి బయట నున్న శివాలయానికి జనులంతా వెళ్తుంటే, అక్కడ నాకు తినడానికేమైనా దొరుకుతుందని శివాలయంలోనికి ప్రవేశించినాను. శివాలయంలో పూజచేస్తున్న అర్చకులు నన్ను చూసి “కుక్కను కొట్టండి” అన్నారు. అప్పుడు కొంతమంది నా వెంట పడి నన్ను కొట్టుటకు ప్రయత్నించారు. జనం అంతా మూగడం వల్ల నాకు బయటకు వెళ్ళడానికి దారి కన్పించలేదు. అప్పుడు మూడు పర్యాయాలు ఆలయం చుట్టూ ప్రదక్షిణ

చేశాను భయంతో. చివరకు జనులలో ఎవ్వడో బలంగా కర్ర తీసుకొని నా నెత్తిపై బాదడంతో చనిపోయాను. శివరాత్రి పర్వదినమున శివునికి ప్రదక్షిణం చేసి, గర్భగుడిలోనికి వెళ్ళి ఆయనను దర్శించినందువల్లే ఈ జన్మాన నేను రాజునై జన్మించాను" అన్నాడు.

"ఇంక నా దూరాచారానికి కారణం ఏమనగా పూర్వం కుక్కగా ఉంటిని కాబట్టి మంచి చెడు విచక్షణ లోపించి పరస్త్రీలంపటునిగా ఉన్నాను. ఆ కుక్క బుద్ధి వలన ఎంత మార్చుకొందామన్నా ప్రవర్తనను మార్చుకోలేకపోతున్నాను." అన్నాడు. అంత రాణి, 'స్వామీ! మరి నా పూర్వ జన్మ వృత్తాంతమేమో తెల్పండి." అనగా అప్పుడా రాజు, "రాణీ! నీవు పూర్వ జన్మమున అడివిలో ఒక ఆడపావురంగా ఉన్నావు. ఒకనాడు మాంసపుముక్కను ముక్కున కరుచుకొని ఆకాశమార్గంలో వెళ్తున్నప్పుడు ఒక గ్రద్ద నిన్ను వెంబడించింది. అప్పుడు నీవు ప్రాణ భయంతో ఎగిరి, దైవవశంగా శ్రీశైల శిఖరమును సమీపించి, శిఖరం చుట్టూ మూడు పర్యాయాలు తిరిగి, అలసిపోయి శిఖరంపై నీవు కూర్చున్నప్పుడు గ్రద్దవచ్చి నిన్ను చంపింది. ఆనాడు శివరాత్రి పర్వదినము. అంత పవిత్ర దినమునందు నీకు తెలియకనే ప్రదక్షిణలు చేసి దేవాలయంపై ప్రాణ త్యాగం జరిగినది కాబట్టి ఈ జన్మాన నీవు నా రాణివై వైభవాన్ని అనుభవిస్తున్నావు" అని చెప్పాడు. అప్పుడామె "స్వామీ మీరు శివానుగ్రహం వల్ల సర్వజ్ఞులైనారు. మన రాబోవు జన్మల గురించి చెప్పండి" అని ప్రార్థించింది. అంత రాజు "నేను రాబోవు జన్మమందు సింధు దేశపు రాజకుమారునిగా జన్మిస్తాను. నీవు శృంజయ దేశపు రాజకుమార్తెగా జన్మించి నన్ను వివాహం చేసుకుంటావు. ఆ పై జన్మలో నేను శౌరాష్ట్రమునకు అధిపతినై ఉండగా, నీవు కళింగ దేశపు రాకుమార్తెగా నాకు దగ్గరౌతావు.

ఆపై జన్మలో నేను గాంధారదేశానికి అధిపతిగా ఉండగా, నీవు మగధరాజు కుమార్తెవై నన్ను చేపడతావు. ఆ పై జన్మలో నేను అవంతి దేశానికి అధిపతినై ఉండగా, నీవు యయాతి వంశమునందు జన్మించి నన్ను చేపట్టి నా రాణి అవుతావు. ఆ పై జన్మలో పాండ్య దేశ రాజునై నేను ఉన్నప్పుడు, నీవు విదర్భ దేశంలో పుట్టి స్వయంవరము నందు నన్ను వివాహం చేసుకుంటావు. అప్పుడు మనం యజ్ఞయాగాది కర్మలు చేస్తూ ధర్మపరాయణులమై అగస్త్య మహర్షి వలన బ్రహ్మజ్ఞానం పొంది ముక్తిని పొందగలము" అని రాజు, రాణితో చెప్పాడు.

నాయనా! శ్రీశైలక్షేత్రం ఇంత పవిత్రమైనది. ఆ క్షేత్ర ప్రభావం వలన సామాన్యమైన కుక్క ఏడు జన్మలు చక్రవర్తియై జన్మించాడు. కనుక నీవు కూడా ఇక నుంచి శివుని పూజించు మన గంధర్వపురంలో కూడా శివునితో సమానం అయిన కల్లేశ్వరుడు కలడు." అని చెప్పి "నాయనా నీవు మీ వాళ్ళతో కలసి వస్తావా? లేక మాతోటే వస్తావా?" అని శ్రీ గురుడు అడిగారు. అప్పుడు అతడు స్వామీ మీరు లేని చోట నేను ఉండజాలను అనేసరికి శ్రీ గురుడు నవ్వుతూ తన పాదుకలను పట్టుకొని గట్టిగా కన్నులు మూసుకొమ్మని అన్నారు. క్షణకాలంలో మరల అతన్ని సంగమానికి చేర్చారు.

గాణ్గాపురంలో గ్రామస్తులందరూ శివరాత్రి పర్వదినాన శ్రీ గురుని దర్శించుటకు సంగమానికి వచ్చారు. స్వామి వారు లేనందున దిగులుతో మరలిపోయారు. శ్రీగురుడు సంగమానికి ప్రవేశించిన తర్వాత తంతకుణ్ణి తమ రాకను అందరికీ తెల్పమని గ్రామానికి పంపారు. అప్పుడు గ్రామస్తులు తంతకుణ్ణి చూసి 'నీవు ఎక్కడికి వెళ్ళావు? శివరాత్రి పర్వదినాన క్షౌరం

చేయించుకున్నావేమి?' అని ప్రశ్నించారు. అప్పుడు అతను శ్రీగురుని మహిమను, శ్రీశైల క్షేత్ర సందర్శనమును గూర్చి తెలిపాడు. తన వద్ద నున్న విభూతి ప్రసాదాన్ని వారికి చూపించాడు. వారిలో కొందరు "నిన్న మధ్యాహ్నం వరకూ మేమిక్కడే చూశాము. ఇంకెక్కడో గుండు చేయించుకొని, ప్రసాదం తీసుకువచ్చి ఉంటావు. అబద్దం చెప్పుచున్నావు." అని హేళన చేశారు. అప్పుడు అతడు శ్రీగురుడు క్షణమాత్రంలో వాయువేగంతో శ్రీశైలానికి తీసుకువెళ్ళిన సంగతిని చెప్పాడు. శ్రీగురుని మహిమను నమ్మిన కొందరు ఆ లీలను విని ఆనందించారు. వారంతా సంగమంలో ఉన్న శ్రీగురుని వద్దకు వచ్చి వారిని దర్శించి భక్తితో పూజించి, హారతులిచ్చారు. శ్రీగురుని ప్రభావం తెలియక ఈ లీలను నమ్మనివారు కూడా శ్రీశైల యాత్రకు వెళ్ళిన సాలెవాని బంధువులు వచ్చిన తరువాత, వారు తాము తంతుకుణ్ణి శివరాత్రి దినమునందు శ్రీశైలంలో చూచినట్లుగా చెప్పింది విని, అప్పుడు నమ్మి శ్రీగురుడు మానవమాత్రుడు కాడని, ఈశ్వర అవతారం" అని తెలిసి భక్తులంతా ఆనందభరితులైనారు.

నాయనా! నామధారకా! ఇట్టి అద్భుతం అయిన గురులీలలను నీకు అందిస్తున్నాను. ఇట్టి లీలలను ఎవరు భక్తితో వినెదరో, చదివెదరో వారికి గురు కృప తప్పక లభించును.

ఓం శ్రీదత్తాయ గురవే నమః

ఓం శ్రీపాద స్వామినే నమః **ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః**

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

(44వ అధ్యాయం సంపూర్ణం)



45 వ అధ్యాయము



శ్రీ గణేశాయ నమః



శ్రీ సరస్వత్యై నమః



శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

శ్లో॥ జ్ఞాపయిత్వాప్యమర్త్యత్వం, స్వస్య దృష్ట్యా చ కారయః ।
వికుష్టం నంది శర్మాణం శ్రీదత్త శరణం మమ॥

(భా॥ నందిశర్మ కుష్ఠు రోగము పోగొట్టి గొప్ప కవిగా చేసిన శ్రీదత్తప్రభూ నీవే శరణం)

నామధారకుడు భక్తితో సిద్ధయోగి పాదాలకు నమస్కరించి "మహాత్మా! బ్రహ్మసాక్షాత్కారం కూడా ప్రసాదించగల్గిన శ్రీగురులీలను మీరు చెబుతున్నారు. ఇట్టి లీలలను వినగల్గిన నేను ఎంతో ధన్యుడను. నాకు భయంపోయి మనస్సు శాంతించింది. దయతో ఆ పై లీలలను కూడా వినిపించండి" అని ప్రార్థించాడు. సిద్ధయోగి సంతోషంతో ఇలా చెప్పాడు.

నామధారకా! నరహరిశర్మ అనే కుష్టురోగి శ్రీ గురుని వల్ల ఉద్ధరింపబడ్డం గురించి చెప్పుకున్నాము. అతని లాగానే మరిద్దరు కవులు కూడా శ్రీగురుని దర్శించి ముక్తులయ్యారు. అది చెప్తాను విను.

'నందిశర్మ' అనే బ్రాహ్మణునికి తెల్ల కుష్ఠురోగం ఉండేది. ఆ బాధను

తొలగించుకోటానికి తులజాపురంలో ఉన్న భవానీదేవి వద్దకు వెళ్ళి మూడు సంవత్సరములు సేవించాడు. ఫలితం కన్పించలేదు. తీవ్రవేదనతో ఆ తర్వాత మూడు రోజులు ఉపవాసం చేశాడు. మూడవ నాటి రాత్రి కలలో భవానీదేవి కన్పించి "చన్దలా పరమేశ్వరీదేవిని దర్శించి, సేవించమని చెప్పింది. అతడు అలాగే వెళ్ళి ఏడు మాసాలపాటు ఒంటి పూట భోజనంతో ఆ పరమేశ్వరిని పూజించాడు. ఒకనాటి రాత్రి ఆ దేవి స్వప్నదర్శనమిచ్చి గంధర్వపురంలో ఉన్న శ్రీగురుని వద్దకు వెళ్ళమని చెప్పింది. అంత నందిశర్మ నిద్రలేచి శ్రీగురుని లీలలు గురించి తెలియని అతను "అయ్యో! మూడు సంవత్సరములు భవానీని, ఏడు మాసాలు నిన్నూ పూజిస్తే చివరికి నన్ను ఒక మానవమాత్రుని దగ్గరకు వెళ్ళమంటారా? మీ దేవత్వాలు ఏమైపోయాయి? పరాశక్తులైన మీకు సిగ్గు వేయటం లేదా? మీ పూజలతో శక్తి కోల్పోయిన నేను ఈ బలహీన దశలో ఇంకెక్కడికి వెళ్తాను? ఇక్కడే ఉండి కొంతకాలం నిన్ను సేవిస్తాను. దేవీ! ఈ రోగము నీవు పోగొట్టకుంటే నీ పాదాల వద్దనే ప్రాణం తీసుకుంటాను" అని దేవికి చెప్పుకొని అక్కడే ఉన్నాడు.

మరునాటిరాత్రి కూడా దేవి దర్శనము ఇచ్చి శ్రీగురుని వద్దకెళ్ళమని చెప్పింది. అంతేగాక ఆ గుడి పూజారికి కలలలో కన్పించి అలాగే చెప్పింది. ఆ తెల్లవారే, ఆ పూజారి "నందయ్యగారూ! అమ్మవారి సెలవైపోయింది. ఇక మీరు ఇక్కడ్నుంచి వెళ్ళిపోవాలి. లేకపోతే నెట్టివేయాల్సి వస్తుంది" అన్నాడు. అప్పుడు అతడు చేసేది లేక బయలుదేరాడు. గంధర్వపురం చేరుకొని శ్రీగురునిమఠానికి వెళ్ళి ఉన్నారని తెల్సుకొని, వారి రాకకై ఎదురుచూస్తూ ఉన్నాడు. శ్రీగురుడు కొద్ది సేపట్లో వచ్చారు. శ్రీగురుడు రాగానే శిష్యులు వెళ్ళి నందిశర్మ వచ్చినట్టుగా తెలియజేశారు. శ్రీగురుడు,

"వాడు సంశయాత్మకుడు, అయిననూ ఎదుటికి రమ్మనండి" అని అతన్ని పిల్చి "ఏమయ్యా! దేవి ఆదేశిస్తే మాత్రం మా దగ్గరకు రావటం ఎందుకు?" అన్నారు. అతడు ఆశ్చర్యపడి, వారు మానవమాత్రులు కారని దివ్యజ్ఞాన సంపన్నులని తెల్సుకొని, "స్వామీ! మీరు సాక్షాత్తూ పరమేశ్వర స్వరూపులైన దత్తాత్రేయులే. మీ మహిమను తెలియక మిమ్మల్ని మానవునిగా తల్చాను. నా స్థితిని కూడా కొంచెం విన్నవించుకుంటాను." అని ఈ విధంగా చెప్పాడు.

"అయ్యా! నేను వేద విదుడైన బ్రాహ్మణుడను. నాకీ తెల్ల కుష్టువ్యాధి రావటం వల్ల నా కుటుంబీకులందరూ వెలివేశారు. చివరకు తల్లిదండ్రులు కూడా వదిలేశారు. కట్టుకున్న భార్య కూడా చీదరించుకొని వెళ్ళిపోయింది. ఇటువంటి పరిస్థితుల్లో నేను భవానీ దేవిని ఆశ్రయిస్తే, ఆవిడ చన్దలా పరమేశ్వరిని ఆశ్రయించమని చెప్పింది. కఠోరమైన పురశ్చరణ చేశాను. కానీ ఆవిడ మీ దగ్గరకు వెళ్ళమంది" అని చెప్పి తన బాధనంతా వ్యక్తపర్చుకున్నాడు. అప్పుడు శ్రీగురుడు, ఒక శిష్యుని దగ్గరకు పిల్చి, "నాయనా! నీవు ఇతన్ని తీసుకొని వెళ్ళి సంగమంలో స్నానం చేయించి, ఇతడు కట్టుకున్న బట్టలను విప్పించి, అవి కాల్చి పొడిబట్టలను కట్టించి మావద్దకు తీసుకుని రా" అని చెప్పారు. ఆ శిష్యుడు అలాగే నందిశర్మను తీసుకొని వెళ్ళి సంగమంలో స్నానం చేయించాడు. నందిశర్మ స్నానం చేసి సంగమంలో ఒక్క మునుగు మునిగిపైకి తేలగానే అతని శరీరంలో తెల్లకుష్టు లేకుండా పోయింది. అతడు బైటకు వచ్చి బట్టలు విప్పుదీసి, తగులబెట్టగానే ఆ పచ్చని గడ్డి ప్రాంతం అంతా చౌడుబారిపోయింది. వెంటనే పొడిబట్టలు ధరించి శ్రీగురుని మఠానికి చేరుకున్నారు. అంతవరకూ శరీరం అంతా కుష్టురోగంతో ఉన్న వ్యక్తి ఆరోగ్యవంతుడై తిరిగివచ్చుట

చూచిన జనులు ఆ దృశ్యం చూసి హాహాకారాలు చేశారు. శ్రీగురుడు "ఏమి నందిశర్మా! నీకోరిక తీరిందా! శరీరం అంతా చూసుకొని చెప్పు" అన్నారు. అప్పుడు అతడు శరీరం అంతా ఒక్కసారి చూసుకొని కొద్దిగా కుష్టు ఉండటం గమనించి "అయ్యా! శ్రీగురుమూర్తీ! ఈ వ్యాధి పూర్తిగ నశించలేదు. దయచేసి రక్షించండి" అని ప్రార్థించాడు. అంత శ్రీ గురుడు **"దేవతవల్ల కానిది, ఒక మానవమాత్రుని వల్ల అవుతుందా? అని నీవు సంశయించినంత మేరకు అది మిగిలిపోయింది. కావున పశ్చాత్తాపంతో స్తోత్రం చేయి. నీవీ సమస్యనుంచి బయటపడ్తావు"** అన్నారు. అప్పుడు నందిశర్మ "మూర్ఖుడనైన నేను ఇన్నాళ్ళు రోగంతో ఉన్న కారణంగా స్తుతించే సామర్థ్యాన్ని కోల్పోయాను" అని ఏడుస్తూ శ్రీ గురుని పాదాలపై పడి ప్రార్థించాడు. అప్పుడు శ్రీగురుడు నాయనా! మా వాక్కుకు తిరుగులేదు', అని కొంచెం భస్మం తీసుకొని, అతన్ని నోరుతెరవమని, అతని నాలికపై భస్మం వేశారు. తక్షణమే అతడు జ్ఞానవంతుడై లేచి, ఈ విధంగా స్తుతించాడు.

"ఓ! పరమేశ్వరా! శ్రీగురురూపా! నీవే సర్వకర్తవు, సర్వ భర్తవు, ఆత్మస్వరూపివి. నీవే ప్రకృతి యొక్క త్రిగుణాల నుండి భూతాలను పుట్టించి, మాయవశమై ఇంతగా విస్తరించిన జగత్తును సృష్టించావు. ప్రపంచం అంతటిలో మానవుడు కూడా దాటనలవిగాని ఈ సంసారంలో భ్రమిస్తున్నాడు. ఈ మాయనుండి బయట పడలేకపోతున్నాడు. ఒకప్పుడు సత్కార్యాలను ఆచరించి ఊర్ధ్వలోకాలకు పోయినా, ఆ పుణ్యం ఖర్చుకాగానే, క్రిందికి వచ్చి చంద్రమండలంలో పడతాడు. ఆ తర్వాత, వర్షంతో పాటు భూమిని చేరి అన్నం అవుతాడు. అప్పుడు జీవులచేత భక్షింపబడి

రేతస్వరూపుడై (ఇంద్రియము) తల్లిగర్భంలో పడతాడు. క్రమంగా నెలలు గడిచేకొద్ది ఎన్నోమార్పులు చెందుతూ, తల్లిసేవించే కారము, వేడి మొదలగు పదార్థాల వల్ల బాధపడ్తాడు. అయినా జ్ఞానం లోపించడం చేత పరమాత్మ అయిన నిన్ను గుర్తించలేకపోతున్నాడు. తల్లి గర్భచెర నుంచి బయట పడ్డాక కూడా బాధలు భయాలు ఎవరికీ చెప్పుకోలేక పసివయస్సులో ఎన్నో అనుభవిస్తాడు. బాల్యం అంతా ఆటలతో గడిచిపోతుంది. యవ్వనంలో మదించి ఎన్నో పాపాలు చేస్తాడు. అప్పుడు కామవశంతో వున్న కాలం అంతా గడిపేస్తాడు. ముసలితనంలో బలం క్షీణించడం వల్ల వ్యాధులు, సంసారిక చింతలు అతన్ని తలమునకలు చేస్తాయి. నేను కూడా ఇంతకాలం మిమ్మల్ని ఇలాగే గుర్తించలేకపోయాను. మీరు మానవ రూపాన్ని ధరించి ఈ విశ్వాన్ని తరింపచేయుటానికి అవతరించిన విశ్వపాలకులు. స్వామీ! నన్నీ సంసారం నుంచి తరింపచేయి", అని స్తుతిస్తూ, ప్రజలవైపుకు చూస్తూ, "ప్రజలారా ఇక్కడ మన మధ్యన వున్న శ్రీగురుడు సాక్షాత్తూ శివుడే! మానవుడు కాదు. ఈనాడు పెన్నిధివలె మనకు ఈయన లభించారు. మంచికోరే వారందరూ ఈయనను పూజించి ధన్యులు కండి. ఈయన వాక్కుకు వేదమే మూగపోతుంది" అని నోట మాటరాక ఆనంద భాష్పాలు చిందిస్తూ నిల్చుండిపోయాడు. శ్రీగురుడు అతని స్తోత్రానికి తృప్తి చెంది, దగ్గరకు పిల్చి అతడి నుదుటిపై విభూది పూసి, అచట వారితో ''నాయనలారా! ఈనాటి నుండి ఇతనికి ''కవీశ్వరుడు'' అనే బిరుదునిస్తున్నాము. మీరు కూడా ఇతన్ని, అలాగే పిలవండి" అన్నారు. నందిశర్మ పారవశ్యంతో తన శరీరం వైపు మరొక్కసారి పరిశీలించాడు. అంతకు ముందు మిగిలివున్న కుష్టు కూడా మటుమాయమవటం గమనించి, సంతోషించి, మరింత భక్తితో నమస్కరించాడు. ఆనాటి నుంచి

నందిశర్మ శ్రీగురుని సేవిస్తూ ఆయన మహిమలను కీర్తిస్తూ స్వామి సన్నిధిలోనే ఉండిపోయాడు.

ఓం శ్రీదత్తాయ గురవే నమః

ఓం శ్రీపాద స్వామినే నమః **ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః**

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

(45వ అధ్యాయం సంపూర్ణం)


కాశీక్షేత్రం నివాసశ్చ జాహ్నవీ చరణోదకం ।
గురు ర్విశ్వేశ్వర స్సాక్షాత్ తారకం బ్రహ్మనిశ్చయం: ॥

– గురుగీత


దేవుని చేరు త్రోవ బహుదుర్గమంబగు
మునులు చేరలేక మూలబడిరి
సద్గురు ప్రసాద సాక్షంబు గైకొని
చేరినాడని చెప్పె శివానంద నీతి వాక్యం
మరచిపోకుడు శివానందుని మంచిమాట

తాలు తరక చెరిగి మేలైన గింజల
వేరుపరచు చేట విధముగానూ
సాధువెపుడు తాను సదసద్వివేకియై
సత్యసారమెరిగి జీవింపవలెనూ
మరచిపోకుడు శివానందుని మంచిమాట

– శ్రీ స్వామి శివానంద మహరాజ్



46 వ అధ్యాయము



శ్రీ గణేశాయ నమః



శ్రీ సరస్వత్యై నమః



శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

శ్లో. నరకేసరిణేస్వ ప్నేశ్వం కల్లేశ్వరలింగగం ।
నర్సయిత్వానుజగ్రాహ శ్రీ దత్తశ్శరణం మమ ॥

(భావము: నరకేసరియను కవీశ్వరునకు శ్రీగురుడు దర్శనమిచ్చుట)

నందిశర్మ కీర్తనల వల్ల శ్రీగురుని మహిమలు ఎంతగానో విస్తరించాయి. వారిని దర్శించడానికి ఎందరెందరో వచ్చి నందిశర్మ శ్రీగురునిపై వ్రాసిన కీర్తనలను చదివి, శ్రీగురుని అనుగ్రహాన్ని పొందేవారు.

గాణ్గాపురమునకు సమీపంలో 'హిప్పగిరి' అనే ఊరుండేది. ఆ ఊరి గ్రామస్తులు కొందరు శ్రీగురుని దర్శనానికి వచ్చి, ఆయనకు పాదపూజలు చేసుకొని, తమ గ్రామానికి వచ్చి పావనం చేయమని ప్రార్థించారు. శ్రీగురుని అంగీకారం తీసుకొని, ఒకనాడు మేళతాళాలతో అత్యంత వైభవంగా తమ గ్రామానికి శ్రీగురుని తీసుకువెళ్ళారు. ఆ ఊరిలో ఒక శివాలయం ఉంది. ఆ శివుని పేరు 'కల్లేశ్వరుడు' ఆ ఊళ్ళోనే 'నరకేసరి' అనే బ్రాహ్మణుడుండేవాడు. అతడు మంచి కవి, శివభక్తుడు. అతడు

ప్రతినిత్యమూ కల్లేశ్వరుని స్తుతిస్తూ ఐదు పద్యాలను తన కవిత ద్వారా వ్రాసి కల్లేశ్వరునికి సమర్పించుకొనేవాడు. ఆ కల్లేశ్వరుని తప్ప మరే దేవతనూ స్తుతించేవాడు కాదు. ఒకనాడు అతడు నందిశర్మ శ్రీగురునిపై వ్రాసిన స్తోత్రాలను విని "ఇతని కవిత్వం చాలా బాగున్నది అయినప్పటికీ ఇది కేవలం నరస్తుతే" అని అనుకున్నాడు. శ్రీగురుడు, ఆ ఊరికి వచ్చిన రోజున గ్రామస్తులు కొందరు నరకేసరి వద్దకు వెళ్ళి "బ్రాహ్మణోత్తమా! శ్రీ గురునికి కవిత్వం అంటే ఎంతో ప్రీతి కనుక మీరు నాలుగు పద్యాలను వ్రాసి ఇస్తే మేము వారి వద్ద చదివి, వారి అనుగ్రహాన్ని పొందుతాము" అన్నారు. అప్పుడు నరకేసరి "శివ! శివ!" అని చెవులు మూసుకొని, "అయ్యా! అది నావల్లకాదు. నా కవితలను కల్లేశ్వరునికే అంకితం చేశాను. నేను కల్లేశ్వరుని తప్ప ఇంకెవ్వరినీ స్తుతించను. అయినా మానవమాత్రుడైన ఆయన్ని నా కవితతో స్థుతించమంటారేమి? మీకు బుద్ధిఉందా? లేదా?" అన్నాడు. ఆ తర్వాత అతడు నిత్యపూజ చేసుకోడానికి కల్లేశ్వరుని ఆలయానికి వెళ్ళాడు. అదేమి చిత్రమో గాని, పూజ ప్రారంభించిన దగ్గర్నుండి విపరీతంగా నిద్రరాసాగింది. అతడు ఎంత ఆపుకుందామని ప్రయత్నించినా ఆగలేదు. ఇంతలో ఒక స్వప్నం వచ్చింది. ఆ కలలో అతడు పూజ చేస్తున్నాడు కానీ, అతని ఎదుట కల్లేశ్వరుని లింగం మాత్రం లేదు. ఆ స్థానంలో శ్రీగురుడు కూర్చుని కన్పించారు. అపుడు శ్రీగురుడు ఆయనవైపు చూసి నవ్వుతూ "నీవు కల్లేశ్వరుణ్ణి తప్ప వేరొకరిని పూజించనన్నావు కదా! మానవమాత్రులైన మమ్మల్ని పూజిస్తున్నావేమి?" అన్నారు. నరకేసరి త్రుళ్ళిపడి, నిద్ర నుంచి మేల్కొని మరలా పూజ ప్రారంభించగా మరలా నిద్ర వచ్చి మరలా శ్రీగురుడు కలలో కన్పించారు.

అప్పుడాయన నరకేసరి వైపు చూచి నవ్వుతూ, "నాయనా! మేము,

కల్లేశ్వరుడూ వేరుకాము వచ్చి మమ్మల్ని దర్శించుకో" అన్నారు. వెంటనే నిద్ర నుంచి మేల్కొని "అయ్యో! నేనింతకాలం పొరబడ్డాను. శ్రీ నృసింహ సరస్వతీ యతివరేణ్యులు సాక్షాత్తూ పరమేశ్వరుడే. నేనింత వరకూ తలచినట్లు ఆయన మానవమాత్రుడు కాదు. లేకపోతే ఈనాడు నాకు పూజలో దర్శనం ఇచ్చి నా సందేహానికి సమాధానం ఎలా ఇవ్వగలరు?" అనుకున్నాడు.

వెంటనే బయలుదేరి, అడుగడుగునా సాష్టాంగ నమస్కారం చేసుకుంటూ, శ్రీగురుని దర్శించాడు. శ్రీగురుని దర్శించగానే అతనికి శరీరం రోమాంచితం అయ్యి, కళ్ళు ఆనంద భాష్పాలతో నిండిపోయి, ఈ విధంగా స్తుతించాడు :

"శ్రీగురూ! సచ్చిదానంద స్వరూపా! పరమేశ్వరా! మీరు సాక్షాత్తూ కల్లేశ్వరులే అది తెలియక నేను పొరబడ్డాను. చిరకాలం కఠోర తపస్సులు చేసిన యోగులకు కూడా మీ దర్శనం లభించదు. కల్లేశ్వరుని కృపవలన నాకీనాడు తమరి దర్శన భాగ్యం లభించింది. ఈ దుఃఖసాగరంలో మునిగి దారీ తెన్నూ కన్నించక బాధపడుతున్న భక్తులను రక్షించడానికే మీరు అవతరించారు" అన్నాడు. స్వామి అతనివైపు చూస్తూ నవ్వి, "నాయనా! ఇంతకాలం మేము మానవమాత్రులమన్నావు కదా! ఈనాడు నీ మనస్సు ఎందుకిలా మారింది? ప్రజలు ఇలా పూజించడం తగదు అన్నావు కదా?" అన్నారు. అప్పుడు నరకేసరి శ్రీగురుని పాదాలపై బడి చేతులు జోడించి, కన్నీరు కారుస్తూ "స్వామీ! అజ్ఞానపు చీకటిలో పడి ఉన్న నాకు జ్ఞానజ్యోతియై మీరు కన్పించారు. ఇంతకాలం నాకు మీ పాదసేవ లభించనందుకు చింతిస్తున్నాను." అని తనకు పూజలో కల్గిన దివ్యమైన అనుభవాన్ని గూర్చి

తెల్పాడు. శ్రీగురుడతన్ని ప్రేమగా లేవనెత్తి తలపై చేయి ఉంచి “నాయనా! నీ అభీష్టాలన్నీ నెరవేరుగాక”! అని ఆశీర్వదించారు. నరకేసరి ఎప్పుడూ ఆయన చెంతనే ఉండి సేవ చేసుకుంటానని ప్రార్థించాడు. అంత శ్రీగురుడు “నాయనా! ఈ కల్లేశ్వరుడంటే మాకెంతో ఇష్టము. పరమ శ్రేష్టుడతడు. కనుక నీవు ఎప్పటివలే అక్కడనే ఆ రూపంలో ఉన్న మమ్మల్ని పూజించుకో నీకు మంచి జరుగుతుంది” అని ఆదేశించారు. కానీ అతడు, “దత్తస్వరూపం అయిన సన్యాసివేషంలో ఉన్న ఈ రూపాన్నే మొదటగా స్తుతించుకోవాలని ఉన్నదని” చెప్పాడు. మరీ మరీ ప్రార్థించిన తర్వాత శ్రీగురుడు అంగీకరించారు. అప్పటి నుండి నరకేసరి నిత్యమూ తాను పూజించుకునే ఆలయంలో కల్లేశ్వరుడిని పూజిస్తున్నట్లే, శ్రీగురుని ముందుగా పూజిస్తూ, ఆయన్ని ప్రతి రోజూ ఐదు పద్యాలతో స్తుతిస్తూ ఉండేవాడు.


కనుక, నామధారకా! శ్రీగురుని అనుగ్రహం వలన ఈ విధంగా మారిన వారెందరో ఉన్నారు.

ఓం శ్రీదత్తాయ గురవే నమః


ఓం శ్రీపాద స్వామినే నమః **ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః**

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

(46వ అధ్యాయం సంపూర్ణం)



47 వ అధ్యాయము



శ్రీ గణేశాయ నమః



శ్రీ సరస్వత్యై నమః



శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

శ్లో. అష్టమూర్తి ధరోప్యష్ట గ్రామగోభక్తవత్సలః ।
దీపావళ్యుత్సవేభూపః శ్రీ దత్తశ్శరణం మమ ॥

(శ్రీగురుడు ఎనిమిది రూపములలో ఎనిమిది గ్రామముల యందు ఏకకాలమున పూజించబడుట.)

సిద్ధయోగి ఇంకా ఇలా చెప్పాడు.

ఒకనాడు శ్రీగురుడు మఠంలో సభాస్థానంలో కూర్చుని ఉండగా ఏడుగురు భక్తులు వేర్వేరు గ్రామాలకు చెందినవారు వచ్చి శ్రీగురుని దర్శించారు. వారు స్వామిని దీపావళికి ముందు వచ్చే ధనత్రయోదశీపర్వదినాన తమ తమ ఇళ్ళకు భిక్షకు ఆహ్వానించారు. అపుడు వారి ప్రార్థనను విన్న స్వామి నవ్వుతూ “నాయనాలారా! ఒకే సమయంలో అందరి ఇళ్ళకు వెళ్ళడం ఎలా సాధ్యమౌతుంది? కనుక మీలో మీరు సంప్రదించుకొని, ఎవరింటికి రమ్మంటే వారింటికి వస్తాము” అన్నారు.

అపుడు ఏడుగురు స్వామి తమ ఇంటికి రావాలంటే తమ ఇంటికి రావాలని వాదించుకో సాగారు. వారి వాదనలను విన్న స్వామి వారిని పిల్చి "నాయనలారా! మీ అందరిపై మాకు విశ్వాసం ఉంది. ఆ రోజు మా ఇష్టానికి వదిలిపెట్టండి. మాకు తోచిన చోటికి మేము రాగలము" అన్నారు. అపుడు ఆ భక్తులు నమస్కరించి, "స్వామీ! మా స్థితిగతులు ఎంచవద్దు." అన్నారు. కానీ, స్వామి "వారిలో ఎవరింటికీ రాకపోతే వారు ఆత్మహత్య చేసుకుంటామని" అన్నారు. వారిలో పేదవారు "అయ్యా, మేము పేదవారము. అయినా అలనాడు శ్రీకృష్ణుడు రారాజైన దుర్యోధనుడు ఆహ్వానించినా అతని ఇంటికి వెళ్ళక, తననే నమ్ముకున్న పేదవాడైన విదురుని ఇంటికే వెళ్ళాడు. అలాగే మీరు కూడా మా ప్రార్థనలను త్రోసిపుచ్చవద్దు అని ఎవరికి వారే వేడుకున్నారు. అపుడు శ్రీగురుడు "నాయనలారా! మీరు మీ ఇళ్ళకు వెళ్ళిపోండి. ఆ రోజు మాకు తోచిన చోటుకి మేము వస్తాము, సందేహించవద్దు" అన్నారు.

అలాగని ఎవరి ఆహ్వానాన్ని మన్నించి వస్తారో అని వారు వెళ్ళకుండా అక్కడే నిలబడి ఉన్నారు. శ్రీగురుడు వారు అలాచెప్తే వెళ్ళరని తలచి, వారిని ఒక్కొక్కరినే దగ్గరకి పిలిచి, "మేము మీ ఇంటికే భిక్షకు వస్తాము. అన్ని ఏర్పాట్లు చేసుకో ఇంకెవరికీ చెప్పవద్దు, మౌనంగా వెళ్ళు' అన్నారు. ఎవరికి వారు సంతోషంతో స్వామి తమ ఇంటికే వస్తారని వెళ్ళిపోయారు. ఇంతలో, ఈ విషయం అంతా తెల్సిన గంధర్వపురవాసులు వచ్చి "స్వామీ! ఆ పర్వదినాన మీరు మమ్మల్ని విడిచి ఎక్కడికీ వెళ్ళవద్దు" అని బ్రతిమలాడుకున్నారు. స్వామి నవ్వుతూ, "మేము ఎక్కడికీ వెళ్ళము, ఇక్కడే ఉంటాము" అని మాట ఇచ్చారు.

చివరకు ఆనాడు రానే వచ్చింది. ఏడుగురు గ్రామస్తులు శ్రీగురుడు తప్పక తమింటికే వస్తారని తలచి, ఎవరికి వారు ఎంతో ఘనంగా తమ సామర్థ్యాన్ని బట్టి ఏర్పాట్లు వైభవంగా చేశారు. స్వామి వారికోసం ఘనస్వాగతం, పూజకు అన్నీ సిద్ధం చేసుకున్నారు. కానీ గంధర్వపురంలోని శ్రీ గురుడు మాత్రం ఆ గ్రామాన్ని విడిచి ఎక్కడకూ వెళ్ళలేదు. ఆనాటి సాయంత్రం మంగళస్నానం చేసే సమయంలో శ్రీగురుడు ఏడు రూపాలలో, ఏడు గ్రామాలకూ వెళ్ళారు. అయినప్పటికీ, ఎనిమిదవ రూపంలో గాణ్గాపురంలోనే ఉండి అక్కడి వారి పూజలను అందుకున్నారు. కొద్ది రోజుల వరకూ ఆయన ఒక గ్రామానికి వెళ్ళిన సంగతి వేరొక గ్రామానికి పొక్కకుండా ఉండిపోయింది. కార్తీకమాసంలో కార్తీక పూర్ణిమ దీపాలు సమర్పించుకోడానికి అన్ని గ్రామాల నుండీ భక్తులు గాణ్గాపురం చేరారు. వారు అంతకు ముందు 15 రోజుల క్రితము తమ గ్రామాలలో జరిగిన ధన త్రయోదశీ ఉత్సవం గురించి చెప్పుకుంటూండగా ఒకరి మాటలు ఒకరికి నమ్మలేనివిగా తోచాయి. ఎవరికి వారు శ్రీగురుడు తమ ఇంటనే భిక్ష చేశారని, తమ పూజలు అందుకున్నారని వాదించుకుంటున్నారు. అదంతా విన్న గంధర్వపురవాసులు "మీకు పిచ్చి పట్టిందాయేమి? స్వామి ఆనాడు ఎక్కడకూ వెళ్ళలేదు. మేమే ఆనాడు ప్రత్యక్షంగా పూజించుకున్నాము" అన్నారు. ఈ వివాదాన్ని విన్న శ్రీగురుడు వారిని దగ్గరకు పిల్చి "నాయనలారా మీలో ఎవ్వరూ అబద్ధం చెప్పటం లేదు, మేము అంతటా ఉన్నాము" అన్నారు. ఈ మాటను విన్న వారందర్కీ శ్రీగురుడు అన్ని రూపాలలో వెళ్లి అందరి పూజలను అందుకున్నారనే విషయం బయటపడింది.

అద్భుతం అయిన ఈ లీలను చూచిన జనులంతా హర్షధ్వానాలు

పల్కుతూ జయ జయ ధ్వానాలతో శ్రీగురుని కీర్తించి, ఆయనకు పూజ చేసి, హారతులిచ్చారు.

చూచావా! నామధారకా! శ్రీగురుని మహిమ ఎంతటిదో! ఆయన మానవ మాత్రుడుకాడు. అని సిద్ధయోగి నామధారకునితో చెప్పాడు.

ఓం శ్రీదత్తాయ గురవే నమః

ఓం శ్రీపాద స్వామినే నమః **ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః**

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

(47వ అధ్యాయం సంపూర్ణం)


ప్రజ్ఞతో మనస్సును స్థిరపరచి
పుష్పిత వచస్సుల జగతి మోసపుచ్చి
ఎనుబది నాలుగు లక్షల జననముల యందూ
తిరుగాడు చుండెను శివానందుడనే నరుండూ
మరచిపోకుదు శివానందుని మంచిమాట

దేని కొరకు మీరు తిరిగెదరో జగమెల్ల
అద్దిహృదయమందు అమరియుండె
భ్రమపటంబు పైన పరుచుకొంటిరి కాని
కాన పింపకుండె దాని రూపు మీకూ
మరచిపోకుదు శివానందుని మంచిమాట


– శ్రీ స్వామి శివానంద మహరాజ్



48 వ అధ్యాయము



శ్రీ గణేశాయ నమః



శ్రీ సరస్వత్యై నమః



శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

శ్లో॥ అపక్వం ఛేదయిత్వాపి, క్షాత్రేశతగుణంతతః ।
ధాన్యం శూద్రాయయో దాత్స శ్రీదత్తః శరణం మమ ॥

(భావము : పామర భక్తుడు నీ ఆజ్ఞననుసరించి పక్వమునకు రాని జొన్నపైరు కోసి వేయగా నీ అనుగ్రహంతో నూరు రెట్లు పంట లభింపజేసిన ఓ దత్త దేవా నీవే శరణం)

"స్వామీ! గంధర్వపురంలో శ్రీగురుడు ఇంకా ఏమేం చేశారో సెలవియ్యండి" అని కోరిన నామధారకునితో సిద్ధయోగి ఇలా చెప్పాడు.

పరమాత్ముడైన శ్రీగురుడు ప్రతీరోజు స్నానానికి, అనుష్టానానికి సంగమానికి వెళ్ళివస్తూండేవారు. ప్రతిరోజూ వెళ్ళి వచ్చేటపుడు 'పర్వతేశుడు' అనే ఒక వ్యవసాయదారుడు స్వామికి నమస్కరించుకుంటూ ఉండేవాడు. ఒక రోజు శ్రీగురుడు అతన్ని చూచి నవ్వుతూ, "నాయనా! నీవెవ్వరు? ఇంత భక్తితో నమస్కరిస్తున్నావు. మా నుండి నీకేమి కావాలి? చెప్పు" అన్నారు. అతడు స్వామి పాదాలపై పడి, "సద్గురోత్తమా! మీరు

పరమేశ్వరులే. మీ మహిమలెన్నో విని, నేను మీ భక్తుడనయ్యాను. ఇలా భక్తితో నమస్కరించుకుంటూంటే నా మనస్సు స్థిరం అగుచున్నది, నా పేరు పర్వతేశుడు, ఇక్కడ దగ్గరలోనే ఉన్న పొలము నాది" అన్నాడు. అపుడు స్వామి నవ్వుతూ, "నాయనా! పొలంలో ఏమి పైరు వేశావు" అని అడిగారు. అపుడు అతడు "స్వామీ మీకు తెలియనిది ఏమున్నది? జొన్న పైరు వేశాను. ప్రతి రోజూ మీకు నమస్కరించుకుంటూంటే పైరు బాగా పెరుగుతున్నది. కాని దయతో మీరు ఒక్కసారి నా పొలంలో కాలుపెట్టి నన్ను కృతార్థుడను చేయండి" అని వేడుకున్నాడు. అపుడు శ్రీగురుడు అతనితో పొలానికి వెళ్ళి ఏపుగా పెరిగిన పైరును చూస్తూ "ఓయీ! నీకొక మాట చెప్తాము, అది చేస్తానంటే చెప్తాము" అన్నారు. అపుడతను శ్రీగురునికి నమస్కరించి 'స్వామీ! మీ వాక్కే మాకు ప్రమాణము. మీరు ఏది చేయమంటే అది చేస్తాను శలవీయండి" అన్నాడు. శ్రీ గురుడు, "నాయనా! మేమిపుడు సంగమానికి వెళ్తున్నాము. సాయంకాలానికి వస్తాము. మేము తిరిగి వచ్చేలోపులో ఈ చేలోని పైరంతా కోయించి వేయి," అన్నారు. అప్పుడు ఆ పర్వతేశుడు "స్వామీ! అలాగే చేస్తాను" అన్నాడు. స్వామి, సంగమానికి వెళ్ళిన తర్వాత, ఇంటికి వచ్చి ఆ పొలం యజమాని వద్దకు వెళ్ళి పైరు కోతకు అనుమతి పత్రం ఇవ్వమని అడిగాడు. క్రిందటి సంవత్సరం కంటే, ఈ సంవత్సరం పైరు బాగా పెరిగినందువల్ల క్రిందటి సంవత్సరం కంటే రెట్టింపు గుత్త చెల్లించేట్లుగా పత్రం వ్రాయించుకొని, కోతకు అనుమతి పత్రాన్ని ఇచ్చాడు. ఇంటికి వెళ్ళి, కొడవళ్ళు కట్టకట్టించి, కూలీలనందర్నీ సిద్ధం చేసుకొని పొలానికి బయలుదేరాడు. ఏపుగా పెరిగిన పైరును చూచి, కూలీలందరూ కొద్ది రోజులలో ధాన్యం పాలుపోసుకుంటుంది. ఇతడు ఇప్పుడు కోయిస్తున్నాడేమిటి? అనుకొని, ఏమైతేనేమి తమ కూలీ తమకు దక్కుతుందనే ఆశతో కోతకు ఉపక్రమించారు. ఇంతలో అతని భార్య బిడ్డలు

వచ్చి భోరు, భోరున ఏడ్చి ఇంకా కొద్ది రోజులలో కోతకు సిద్ధం అవుతున్న పైరు పోతోందని, నోటికి వచ్చిన కూడు కోయిస్తున్నాడని బాధపడ్తూ విలపించి కోతకు అడ్డుపడ్డారు. అప్పుడతడు వారిపై రాళ్ళు వేసి, వెళ్ళగొట్టాడు. వాళ్ళు ఏడుస్తూపోయి గ్రామాధికారితో ఈ విషయాన్ని చెప్పుకున్నారు. అపుడాయన "నేనేమి చేయగలను? ఏదైనా చేస్తే ఆ పొలం యజమాని చేయగలడు" అని ఆయన వద్దకు పంపాడు. ఆ తర్వాత యజమాని కూడా "వాడు ఎప్పుడు కోస్తే నాకెందుకు? రెట్టింపు గుత్త ఇచ్చేట్లుగా పత్రం వ్రాయించుకున్నాను. అయినా మీరింతగా ప్రాధేయపడుతున్నారు కాబట్టి నా సేవకుడ్ని పంపి, వారించ ప్రయత్నిస్తాను" అని పొలానికి ఒక సేవకుడిని పంపాడు. ఆ సేవకునితో పర్వతేశుడు "అయ్యా! నేనేమి చేసుకుంటే ఆయనకెందుకు? రెట్టింపు గుత్త ఇచ్చేందుకు పత్రం వ్రాశాను. యజమానికి ఇవ్వడానికి నా ఇంట్లో గాదెనిండా గింజలున్నాయి. అంతగా కాకపోతే దొడ్డినిండా పశువులున్నాయి. నాయిష్టం" అని చెప్పి తిప్పి పంపివేశాడు.

శ్రీగురుడు సంగమాన్నించి తిరిగివచ్చే సమయానికి పైరునంతా కోయించి, కట్టలు కట్టించి దారిలో వారి రాకకై ఎదురుచూస్తూ నిల్చున్నాడు. శ్రీగురుడు వచ్చి, అతనివైపు చూచి, నవ్వుతూ పొలానికి వెళ్ళి, కోయించిన పైరునంతా చూసి, "ఓరి పిచ్చివాడా! మేమేదో మాటవరసకన్నాము! నోటికి వచ్చిన కూడును పాడుచేసుకున్నావు కదా!" అని అన్నారు. అపుడా పర్వతేశుడు, "స్వామీ! మీ మాటే మాకు వేదవాక్కు. దానికి పదింతలు ప్రసాదిస్తారనే నమ్మకం నాకు ఉన్నది" అన్నాడు. అంత ధృడవిశ్వాసం ఉంటే అలాగే అవుతుందిలే" అని ఒక వింతైన చిరునవ్వు నవ్వి మఠానికి వెళ్ళిపోయారు.

పర్వతేశుడు శ్రీ గురుని పాదాలకింద మట్టిని తీసుకొని నెత్తిమీద వేసుకొని సర్వభారం గురునిపై వేసి ఇంటికెళ్ళాడు. అపుడు అతని భార్య ఒక సన్యాసి మాటలు నమ్మి నోటికి వచ్చిన కూడును పాడుచేసి నందుకు భోరుభోరున విలపిస్తూ ఉంది. అపుడతను "పిచ్చిదానా! ఆయన ఎవరో కాదు సాక్షాత్తూ పరమేశ్వరులే. వారిని నమ్ముకున్న వారికి చెడు జరగదు" అన్నాడు. కొద్ది రోజులల్లోనే వరదలు వచ్చి, అపుడే ధాన్యం పాలు పోసుకుంటున్న పొలాల్లోని పైర్లు అన్నీ కొట్టుకొనిపోయాయి. కాని పర్వతేశుని పొలంలోని కోయబడిన మోడుల నుంచి 10, 11 పిలకలు వచ్చాయి. కొద్ది రోజులకే అద్భుతం అయిన పంట పండింది. అపుడు పర్వతేశుడు భార్యతో "పిచ్చిదానా! ఆ రోజు స్వామి కోయించబట్టే ఈ రోజు మనకు ఈ పంట పండింది. చుట్టుప్రక్కల వారి పొలాలన్నీ పోయాయి. స్వామి మనల్ని ఈ ఆపద నుంచి రక్షించిన శివుడే వారు సర్వజ్ఞులు" అన్నాడు. పైరుకోత కోయడానికై భార్యాభర్తలు ఇద్దరూ పొలం వద్దకు వెళ్ళి భూమి పూజ చేసి శ్రీగురుని మఠమునకు వెళ్ళి శ్రీగురుని పాదాలపై పూలు వేసి, నమస్కరించారు. అపుడు శ్రీగురుడు, "నాయనా! ఏమిటి విశేషము?" అన్నారు. పర్వతేశుడు, "స్వామీ! మీరు సర్వజ్ఞులు. వరద బారి నుంచి నా పొలాన్ని రక్షించారు. ఈనాడు ఎన్నోరెట్లుగా పండింది నాకు" అన్నాడు. అపుడతని భార్య శ్రీగురుని పాదాలు పట్టుకొని, "స్వామీ! మీ మహిమ తెలియక, మిమ్మల్ని నిందించాను. మీరు మా పాలిట వరదాత. సాక్షాత్తూ అన్నపూర్ణేశ్వరులు. పైరుకోతకు సిద్ధంగా ఉంది. మీ ఆజ్ఞ ఇవ్వండి" అని ప్రార్థించింది. పర్వతేశుడు కూలీల నందర్నీ తీసుకుని వెళ్ళి పైరునంతా కోయించి, ధాన్యం రాశిపోసి, బండ్లకెత్తించి ఇంటికి చేరుకున్నాడు. ఆ తర్వాత వరద వల్ల పాడైపోయిన వారికి కొద్దికొద్దిగా ధాన్యమును దానం

చేసి, యజమానికి రెట్టింపు గుత్తను చెల్లించి, శ్రీగురుని మఠానికి వచ్చి, వేలమంది బ్రాహ్మణులకు అన్న సమారాధన చేసి, సుఖంగా జీవించి తరించాడు.

ఓం శ్రీదత్తాయ గురవే నమః

ఓం శ్రీపాద స్వామినే నమః **ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః**

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

(48వ అధ్యాయం సంపూర్ణం)

శివస్వరూపమ జ్ఞాత్వా శివపూజాకృతా యది ।
సాపూజా నామమాత్రం స్యాచ్చిత్రదీపివత్రియే ॥

– గురుగీత

ప్రియమైన పార్వతీ! శివస్వరూపమును తెలిసికొనక శివపూజ చేసినచో అది చిత్రపటమునందలి దీపమువలె నామమాత్రముగా నుండును.


దయ నివసించిన చోటే ధర్మముండు
పాపముండును లోభంబు ప్రాపుతోడ
క్రోధమున్న చోటనే చావు కొలువుచేయు
సద్గురుండు కొలువుండు క్షమయున్న పట్టునందూ
మరచిపోకుడు శివానందుని మంచిమాట

– శ్రీ స్వామి శివానంద మహరాజ్

49 వ అధ్యాయము



శ్రీ గణేశాయ నమః



శ్రీ సరస్వత్యై నమః



శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

శ్లో॥ గాణగాపురం క్షేత్రే యోష్ట తీర్థాన్య దర్శయత్ ।
భక్తేభ్యో భీమరథ్యాం స శ్రీదత్తః శరణం మమ ॥

(గాణ్గాపురమునందు అంతవరకు గుప్తముగానున్న భీమానది యందలి అష్టతీర్థములను భక్తులకు చూపిన శ్రీదత్త నాథా నీవే శరణము)

నామధారకుడు, సిద్ధయోగి పాదాలు పట్టుకొని "మహాత్మా! శ్రీగురుని లీలలు వింటూంటే మనస్సు పులకించి పోతున్నది. కానీ ఎన్నెన్నో పుణ్యక్షేత్రాలుండగా కరంజానగరంలో జన్మించిన శ్రీగురుడు, ఈ సంగమ క్షేత్రాన్నే తమ నివాసంగా ఎందుకు ఎన్నుకొన్నారో తెల్పి, ఆ క్షేత్ర మహాత్మ్యాన్ని వివరించండ"ని కోరాడు. అపుడు సిద్ధయోగి ఇలా చెప్పాడు:

నాయనా! ఒక అశ్వనీ మాసంలో కృష్ణ చతుర్దశి నాడు గంధర్వనగర వాసులందరూ దీపావళి పండుగకు ఎంతో ఉత్సాహంగా సంసిద్ధులయ్యే సమయంలో శ్రీ గురుడు వారందర్నీ పిలిచి, 'నాయనలారా! మనం 'త్రిస్థలీ' యాత్ర చేసి వద్దాము, బయలుదేరండి' అన్నారు. అపుడా భక్తులు "స్వామీ! అలాగయితే మేమీ యాత్రకు కావల్సిన సరంజామా సిద్ధం చేసుకొని,

డబ్బు సిద్ధం చేసుకొని వస్తాము' అన్నారు. ఆ మాటలు విన్న స్వామి "బిడ్డలారా! అవన్నీ ఎందుకు? ఈ సంగమ ప్రాంతం ప్రయాగతో సమానమయిన మహిమ గలది. ఇచ్చటి షట్కూల తీర్థాన్ని మించినది వేరొకటి లేదు. ఇది ప్రయాగను కూడా మించినది. ఈ భీమ అమరజ నదుల సంగమము గంగాయమునల సంగమం కంటే పవిత్రం అయినది. ఇక్కడ స్నానం చేస్తే ఇంకా పుణ్యప్రదము, ఇక్కడ పవిత్రమయిన తీర్థాలు ఎనిమిది ఉన్నాయి. అన్నారు. ఇంతలో ఒక భక్తుడు, స్వామిని ఇక్కడ నదికి 'అమరజ' అని పేరు ఎలా వచ్చిందని అడిగాడు.

పూర్వము దేవతలకు, రాక్షసులకు భయంకరమైన యుద్ధం జరుగుతున్న సమయంలో 'జాలంధరుడు' అనే రాక్షసుడు ఎందరో దేవతలను చంపేస్తూండేవాడు. అప్పుడు దేవతల రాజైన ఇంద్రుడు కైలాసంలో శివుని దర్శించి దేవతలకు యుద్ధంలో ఓటమి తప్పేటట్టుగా లేదని, యుద్ధంలో రాక్షసులు శరీరం నుండి కారిన రక్తపు చుక్కలలో ఒక్కొక్క చుక్క నుండి ఒక్కొక్క రాక్షసుడిగా వేలాది మంది రాక్షసులు పుట్టి, దేవతలను సంహరిస్తున్నారని మొరపెట్టుకున్నాడు. అంత శివుడు పట్టరాని కోపంతో త్రిశూలం తీసుకొని రుద్రుడై బయలుదేరాడు. అప్పుడు ఇంద్రుడు శివుని ఆవేశం తగ్గించి, దేవతలను రక్షించే ఉపాయం ఇమ్మని శివుని ప్రార్థించాడు. అంత శివుడు యుద్ధంలో చనిపోయిన దేవతలను బ్రతికించడానికి ఒక పెద్ద పాత్రలో అమృతాన్ని సృష్టించి ఇచ్చాడు. దాన్ని తీసుకొని ఇంద్రుడు వెళ్ళి చనిపోయిన దేవతల మీద చల్లగానే అద్భుతం అయిన శక్తితో, వీరావేశంతో దేవతలు లేచి రాక్షసులను మట్టుపెట్టారు. ఆ పాత్రలో మిగిలిన కొద్ది అమృతం భూమి మీద పడింది. అదే ఈ అమరజా నది రూపంలో ప్రవహిస్తున్నది. అందుకే దీనికి 'అమరజా నది'

అనే పేరు వచ్చింది. 'నాయనా! దీనిలోని నీరు సంజీవని వంటిది. ఇందులో భక్తి విశ్వాసాలతో స్నానం చేసిన వారికి మృత్యుభయం లేదు. ఇది అన్ని బాధలను, వ్యాధులను, పాపాలను తొలగించడంలో త్రివేణి సంగమంతో సమానమైనది. ఈ సంగమంలో వైశాఖ, కార్తీక,మాఘ మాసాలలో తెల్లవారు ఝామున స్నానం చేస్తే ఈ లోకంలో సుఖం, మోక్షం కల్గుతాయి. అంతేగాక ప్రత్యేకంగా గ్రహణ సమయంలో, పర్వదినాలలో ఏకాదశి తిధులలో స్నానం చేసిన అనంతమైన ఫలితం దొరుకుతుంది.

ఈ అశ్వద్ధ వృక్షం వద్ద ఉన్న 'మనోరధ తీర్థం' లో స్నానం చేస్తే మనోరధాలన్నీ నెరవేరుతాయి. భక్తితో ఈ రావి చెట్టును పూజించిన వారికి కలి ప్రభావం అంటక, మా దర్శనం లభిస్తుంది. మేము ఎల్లప్పుడూ ఈ వృక్ష మూలంలో ఉంటాము. ఈ కల్పవృక్షాన్ని, సంగమేశ్వరుణ్ణి పూజించి, త్ర్యయంబక మంత్రం పఠిస్తే సర్వకోరికలు తీరును. సంగమేశ్వరునికి నమస్కరించి, ఆ తర్వాత శివునికి ప్రదక్షిణం చేసి, సాష్టాంగ నమస్కారం చేశాక మూడు ప్రదక్షిణాలు అయ్యాక, ఎడమ చేత్తో నందీశుని వృషణాలను స్పృశించి, కొమ్ములపై కుడిచేతి బొటన వేలును, చూపుడు వేలును ఉంచి వాటి మధ్య భాగం నుండి శివలింగాన్ని దర్శించాలి. భక్తితో ఇలా చేస్తే కోరికలన్నీ తీరుతాయి. అలాగే ఈ ప్రక్కనే ఉన్న 'మహాతీర్థము' సాక్షాత్తూ వారణాశి. దానికి ఒక కథ ఉన్నది చెప్తాను.

పూర్వం భరద్వాజస గోత్రానికి చెందిన ఒక బ్రాహ్మణుడు నిరంతరం భక్తితో శివపూజ చేసి, పూర్ణవిరాగి అయి, అవధూత స్థితిలోఉండేవాడు : అతనికి ఎప్పుడూ శివదర్శనం కల్గుతూ ఉండేది. అతను ఎప్పుడూ ఆనంద పారవశ్యంతో దిగంబరంగా గంతులువేస్తూ తిరుగుతూ ఉండేవాడు. అతన్ని చూచిన లోకులంతా 'దెయ్యం పట్టింది కాబోలు' అనుకునేవారు. ఒకనాడు

అతని సోదరులైన పాండురంగడు, ఈశ్వరుడు కాశీ వెళ్తూ ఇతన్ని గూడా రమ్మన్నారు. అతను నవ్వి "కాశీ విశ్వనాథుడు మనకు దగ్గరలో ఉండగా, కాళ్ళీడ్చుకుంటూ అంత దూరం పోవడం ఎందుకు?" అన్నాడు. అప్పుడు వారు "అలాగైతే మాకు కూడా కాశీ దర్శనం చేయించగలవా?" అన్నారు. అందుకతడు అంగీకరించి, శివుడ్ని ధ్యానించి, 'వ్యోమకేశా!' దీనిని కాశీగా చేసి, ఇక్కడ నీ ప్రత్యక్ష దర్శనం అందరికీ చూపించు" అని ప్రార్థించగా అందరికీ అక్కడే వారణాశి దర్శనం లభించింది. ఈ కుండమే 'మణికర్ణిక' అయింది. కాశీలోని దైవ రూపాలన్నీ ఇక్కడే కన్పించాయి. అతని సోదరులిద్దరూ ఆశ్చర్యపడి, అక్కడే స్నానం చేసి, అక్కడి దేవతలను దర్శించారు. ఆ తర్వాత అతడు మహాజ్ఞాని అని తెల్సుకున్నారు. అప్పటి నుండి అతను తన దగ్గరకు వచ్చిన వారందరికీ కాశీ విశ్వేశ్వరుని దర్శనం ప్రసాదిస్తూ ఉండేవాడు. కనుక ఇది సాక్షాత్తూ కాశీయే.

శ్రీగురుడు ఆ తర్వాత భక్తులకు 'పాప వినాశ తీర్థం' చూపించి "నాయనలారా! ఇందులో స్నానం చేస్తే సర్వపాపాలుపోతాయి." అని చెప్తున్నప్పుడు శ్రీగురుని పూర్వాశ్రమంలో వారి సోదరి రత్న అక్కడకు వచ్చి, ఆయనకు సాష్టాంగ నమస్కారం చేసింది. అప్పుడు శ్రీ గురుడు ఆమెతో 'అమ్మాయీ! ఎన్నాళ్ళకు కన్పించావు? నీవు చేసిన పాపాలను గురించి ఆలోచించావా?' అన్నారు. అప్పుడామె నమస్కరించి 'స్వామీ! శ్రీగురూ! నేను మూఢురాలిని నన్ను మీరే రక్షించాలి' అని వేడుకున్నది. స్వామి 'అమ్మా నీవు చాలా పాపాలు చేశావు. నీకు కుష్టు వ్యాధి వస్తుంది' అని అంటూండగానే ఆమె శరీరం అంతా కుష్టుతో కుళ్ళిపోయింది. ఆమె భయపడి వణికిపోతూ, కన్నీరు కారుస్తూ దోసిలి ఒగ్గి "ఓ దయానిధీ! ప్రజలు పాపాలు పోగొట్టకోవటానికి పుణ్య తీర్థాలకు వెళ్తున్నట్లు మీ

దర్శనానికి నేను వచ్చాను. నన్ను రక్షించండి" అని ప్రార్థించింది. అప్పుడు, శ్రీగురుడు "అమ్మా! నీవెన్నో పాపాలు చేశావు, వాటిని నీవు ఈ జన్మలో అనుభవిస్తావా? లేక మరుజన్మలో అనుభవిస్తావా?" అని అడిగారు. ఆమె "స్వామీ! ఇంకా మరొక జన్మ ఎందుకు? నా పాపాలను ఇప్పుడే తొలగించి, నాకు మరుజన్మ లేకుండా చేయండి" అన్నది. అప్పుడు స్వామి "అమ్మా! అలా అయితే నీవు నిత్యమూ ఈ 'పాపవినాశ తీర్థం'లో స్నానం చేస్తూండు. ఒక్కొక్క స్నానానికి ఏడు జన్మల పాపం పోతుంది. ఈ కుష్టురోగం ఒక లెక్కా?" అన్నారు. ఆమె అలా చేయగా రోగం పోయింది. అది నేను చూశాను. అని సిద్ధయోగి నామధారకునితో చెప్పాడు.

ఆ తర్వాత శ్రీగురుడు మా అందరికీ కోటి తీర్థాన్ని చూపి 'నాయనలారా! ఇందులో సర్వ తీర్థాలూ ఉన్నాయి. ఇక్కడ దానం చేసిన వారికి కోటి గోవుల దానం చేసిన ఫలం దక్కుతుంది. ఆ తర్వాత రుద్రపాద తీర్థాన్ని చూపించి గయలో లాగే కర్మ చేసి, రుద్రస్వామిని పూజిస్తే మంచి జరుగుతుందని చెప్పారు. ఆ తర్వాత చక్ర తీర్థాన్ని చూపించి ఇక్కడ స్నానం చేస్తే జ్ఞానం కల్గుతుందని, మన్మథతీర్థంలో స్నానం చేసి అక్కడి కల్లేశ్వరుడిని పూజిస్తే అష్టసిద్ధులు, మోక్షం కల్గుతాయి' అని స్వామి చెప్పింది విని, అందరమూ సంతోషించి అష్ట తీర్థాలలో స్నానం చేసి, శ్రీగురుని వెనుకనే మఠానికి చేరి, వారికి పూజ చేసి, హారతులిచ్చి, సమారాధన చేశాము అని సిద్ధయోగి నామధారకునితో చెప్పాడు.

ఓం శ్రీదత్తాయ గురవే నమః


ఓం శ్రీపాద స్వామినే నమః **ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః**

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః


(49వ అధ్యాయం సంపూర్ణం)



50 వ అధ్యాయము



శ్రీ గణేశాయ నమః



శ్రీ సరస్వత్యై నమః



శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

నామధారకుడు సిద్ధమునితో “స్వామీ! ఆ తర్వాత కథను వినిపించి నన్ను ధన్యుడను చేయండి” అని ప్రార్థించాడు. సిద్ధయోగి ‘నాయనా! నీవు ధన్యుడవు కాబట్టే భగవంతుని కృపవలన నీకిట్టి అవకాశం లభించింది. అటుపై కథను చెప్తాను, శ్రద్ధగా విను” అన్నాడు.

వైఢూర్య నగరాన్ని ఒక యవన రాజు పరిపాలిస్తూండేవాడు. అతను విజ్ఞుడు, సర్వభూతుడు, శుద్ధాత్ముడు. పూర్వ జన్మ సంస్కారం వల్ల అతను హిందూ దేవతలను, పుణ్యక్షేత్రాలను, సద్బ్రాహ్మణులను ఆదరిస్తూ ఉండేవాడు. అది సహించలేని వారి మతగురువులు అతనితో ‘రాజా! మీరు మన ధర్మాన్నే పాటించాలి. ఇప్పుడు మీరు చేసేది చాలా తప్పు. హిందువులు బోధించేవన్నీ సత్యమైనవి కావు. వారు రాళ్ళలోను, చెట్టు చేమలలోను భగవంతుడుంటాడని అంటారు. అలాగే పూజిస్తుంటారు. వారిని మనతో సమానంగా గౌరవించటం తగదు” అనే వారు. అప్పుడా రాజు “సృష్టిలోని జీవులందరూ సమానమే. అందరమూ భగవంతుని బిడ్డలమే. అలా గాక బేధబుద్ధిని ప్రదర్శించటం అపచారం” అని అతడు

ఖండితంగా చెప్పేవాడు. మరికొందరు యవన మత గురువులు, 'రాజా! మీరు మన ధర్మాన్నే ఆచరించండి, మీరు చేసే పని మంచిది కాదు. అవయవాలన్నీ దేహానికి సమానం అయినప్పుడు మానవుల పట్ల వర్ణాశ్రమ బేధాలు ఎలా ఉంటాయి?" అనేవారు. అప్పుడా రాజు "మీరు చెప్పినట్టే అవయవాలన్నీ దేహానికి సమానమే కానీ, ఆ దేహంలోని అవయవములన్నీ ఒకే పనిని చేయలేవు కదా? నిజానికి వారు కూడా మనవలే భగవంతుడు సర్వవ్యాపి అంటారు. పిల్లలకు మొదట అక్షరాలు దిద్దించినట్లే పామరులకు ఏకాగ్రత కుదరటం కొరకు వారి పెద్దలు వారికి విగ్రహారాధన కల్పించారు. **విగ్రహారాధన మంద బుద్ధులకు ఒక సాధనమే గాని ధ్యేయం కాదు** అని వారి మతం కూడా చెప్తోంది. దుమ్ము కప్పిన అద్దంలో మన ప్రతిబింబము సరిగా కన్పించదు. శుద్ధమైన అద్దంలో స్పష్టంగా కనిపిస్తుంది. అలాగే మలినం అయిన మనస్సుతో ఉన్నవానిలో ఈశ్వరభావం ఉండదు. ఆ మాలిన్యం తొలిగాక హృదయం శుద్ధమై భగవంతుని ఉనికి తెలుస్తుంది" అనేవాడు.

ఒకప్పుడు విధివశాన ఆ మ్లేచ్ఛరాజుకు తొడ మీద పుండు లేచింది. అది ఎన్ని చికిత్సలు చేయించినా తగ్గలేదు. రోజు రోజుకూ ఎక్కువ కాసాగింది. అతనికి బాధ ఎక్కువై నిద్రాహారాలు కూడా కరువైనాయి. చివరికి అతడు ఒక బ్రాహ్మణుని పిలిపించి దానికి నివారణోపాయం చెప్పమని కోరాడు. ఆయన "రాజా! నీవు యవనుడివి, నేను బ్రాహ్మణుడను నేను చెప్పే ఉపాయం గురించి అది చెప్పింది నేనన్న సంగతి తెలిస్తే నీ వాళ్ళందరూ నన్ను బ్రతకనివ్వరు అందువలన ఏకాంతంలో చెప్తాను" అన్నాడు. రాజు అతనితో కలసి ఏకాంతస్థలంలోకి వెళ్ళాడు. అప్పుడా బ్రాహ్మణుడు 'రాజా! **నిజానికి గత జన్మ పాపాలే మానవుని రోగ రూపంలో**

బాధిస్తాయి. తీర్థయాత్ర, దేవతారాధన, దానము వీటి వలన కొన్ని పాపాలు, వ్యాధులు పోతాయి. వీటి అన్నింటి కంటే శ్రేష్టం అయినది సాధుదర్శనం. దీనివల్ల సర్వపాపాలు, వ్యాధులు పోతాయి. చివరకు అజ్ఞానమనే భవసాగరాన్ని కూడా దాటించి, జ్ఞాన జ్యోతిని వెల్గించగల సమర్థులు వారు. కనుక నీవు పాపవినాశ తీర్థానికి వెళ్ళి, అక్కడ స్నానం చేసి దాన ధర్మాలు చెయ్యి. ఈ వ్యాధికి నివారణోపాయం అక్కడ దొరుకుతుంది" అన్నాడు. అప్పుడా రాజు కొన్నాళ్ళు గుప్తంగా ఎవ్వరికీ చెప్పకుండా పాపవినాశ తీర్థానికి ఒక్కడే వెళ్ళి అక్కడ స్నానం చేస్తూండేవాడు. ఒకనాడక్కడొక ద్విజుడు కనిపించాడు. రాజు ఆ ద్విజుని వద్దకు వెళ్ళి చేతులు జోడించి నమస్కరించి, "స్వామీ! నేను మ్లేచ్ఛుడనని మీరు ఉపేక్షించవద్దు. నేను యవనుడనైనా, మీ ధర్మాన్ని ఆచరించేవాడినే కనుక దయతో ఈ వ్యాధికి నివారణోపాయం తెలిపి, పుణ్యం కట్టుకోండి" అని ప్రార్థించాడు. అప్పుడా ద్విజుడు కూడా! "రాజా! సాధు దర్శనం వలన నీవీ రోగం నుండి విముక్తుడవు కాగలవు" అన్నారు. అంత రాజు "స్వామీ! సాధుదర్శనం వలన ఎలా విముక్తుడనవుతాను? దాని మహిమను తెలియజేసి నన్ను కృతార్థుడను చేయండి" అని వేడుకున్నాడు. ద్విజుడు, "నాయనా! పూర్వం ఋషభయోగి అనే మహానుభావుడి వలన పతితుడైన బ్రాహ్మణుడు జన్మాంతరమున ఉద్ధరింపబడ్డాడు, ఆ కథను వివరంగా చెప్తాను.

పూర్వం అవంతీపురంలో ఒక బ్రాహ్మణుడు 'పింగళ' అను వేశ్యకు వశుడై, ధర్మాధర్మవిచక్షణ లేకుండా జీవితం సాగించేవాడు. ఒకనాడు ఋషభయోగి వారింటి ముందు నుండి వెళ్తూంటే ఆ బ్రాహ్మణుడు, వేశ్య, స్వామిని చూసి, ఇంటిలోనికి తీసుకొని వెళ్ళి, పాద పూజ చేసి, హారతి

ఇచ్చి, భిక్ష సమర్పించి, ఆనాటి రాత్రి స్వామిని శయనింపచేసి, సేవ చేసుకున్నారు. మరునాడు ప్రొద్దుటే, ఋషభయోగి వెళ్తూ, వారిని ఆశీర్వదించి వెళ్ళారు. కొద్దికాలంలోనే ఆ బ్రాహ్మణుడు చనిపోయాడు. మరుజన్మలో ఆ ప్రాంతం ఏలే రాజు మొదటి భార్య గర్భాన పడ్డాడు. రాజు రెండువ భార్య మాత్సర్యంతో రాజ్యాధికారము తనకు పుట్టిన బిడ్డకే రావాలనే అత్యాశతో పాలలో విషము కల్పి మొదటి భార్యకు ఇప్పించింది. ఆ విషప్రభావం వలన ప్రసవించిన బిడ్డ ఒళ్ళంతా కురుపులతో పుట్టాడు. రాజు రెండవ భార్య, రాజుతో 'పూర్వజన్మలో ఎన్నో పాపాలు చేసుకొని ఉంటే గానీ ఇలాంటి బిడ్డడు కలగడని' అతన్ని తన మాయమాటలతో నమ్మించి, బాలింతరాలని కూడా తలవకుండా, రాణిని భయంకరమైన కీకారణ్యంలో వదిలిపెట్టించింది. ఆమె రోగంతో ఉన్న బిడ్డను ఎత్తుకొని, ఆకలితో అలమటిస్తూ, క్రూర మృగాల నుంచి రక్షించుకుంటూ, దాహంతో ఒక కొలనును సమీపించింది. అక్కడ కొందరు స్త్రీలు నీటికై వచ్చినపుడు తన దుస్థితిని చెప్పుకొని, ఆ ప్రాంతం ఏలే రాజు పద్మాకరుడనే వైశ్యుడు, ధర్మాత్ముడని తెల్సుకొని, ఆ రాజు వద్దకు వెళ్ళి తన దుస్థితిని చెప్పుకొని విలపించింది. ధర్మపరుడైన ఆ రాజు ఆమెకు ఆశ్రయాన్ని కల్పించాడు. రోగంతో ఉన్న బిడ్డను బ్రతికించుకోడానికి ఎన్ని మందులు వాడినా లాభం లేకపోయింది. చివరకు బిడ్డ మరణించాడు. ఆమె రోదిస్తూ భగవంతుడు తనకు చేసిన అన్యాయాన్ని గూర్చి చింతిస్తూ, పెద్దగా కేకలు పెట్టి ఏడుస్తున్నది. ఆ సమయంలో ఋషభయోగి అటువైపుగా వెళ్తూ, అక్కడి పరిస్థితి తెల్సుకొని, ఆమెతో **"అమ్మా! అనవసరంగా ఎందుకు దుఃఖిస్తావు? పుట్టినవాడెవ్వడు? చనిపోయినవాడెవ్వడు? మాయలో పడిన జీవులు మమకారాన్ని పెంచుకుంటారు. ఎక్కడో ప్రవాహం నుంచి కొట్టుకు వచ్చిన**

కట్టెలు లాగ జీవులు కలుసుకుంటారు. నీటి అలల తాకిడికి కట్టెలు విడిపోయినట్లు వేరవుతారు" అని ఆమెకు తత్త్వాన్ని బోధించాడు. అపుడామె "స్వామీ నేను రాణినై ఉండగా నాకీ గతి పట్టింది" అని తన వృత్తాంతాన్ని అంతా రోధిస్తూ చెప్పింది. అపుడా ఋషభయోగి చనిపోయిన బిడ్డ వంక చూస్తూ, పూర్వజన్మలో వేశ్యతో కలిసి వీడు సేవచేశాడని గుర్తించి, కొంచెం విభూతి ప్రసాదించి, ఆమెకిచ్చి "అమ్మా! ఇది నీవు నీ బిడ్డ ధరించండి" అన్నాడు. అపుడామె ఆ విభూతిని బిడ్డపై చల్లగానే, ఆ బిడ్డ సర్వాంగసుందరమైన దేహంతో, సూర్యుని తేజస్సుతో వెలిగిపోతూ లేచి కూర్చున్నాడు. ఋషభయోగి, వారిని ఆశీర్వదించి "అమ్మా! మీరు దక్షిణ దిక్కుగా వెళ్ళండి, మీకు మంచి జరుగుతుంది. చివరకు మీ రాజ్యం మీకు దక్కుతుంది. ఈ బిడ్డ అఖండైశ్వర్యాలతో తుల తూగ గలడు" అని ఆశీర్వదించి వెళ్ళిపోయాడు. కనుక ఓ రాజా! ద్విజుడై ఉండి కూడా కామవశుడై, ధర్మాలను పాటించకుండా, జన్మాంతరంలో ఉద్ధరించబడి, రాజు అయి జన్మించి, అతనిచేత పావనమవ గలిగాడు. కనుక నీవు కూడా సాధుదర్శనంవల్ల ఈ రోగాన్ని పోగొట్టుకోవచ్చు అని దైవజ్ఞుడు మ్లేచ్ఛరాజుతో అన్నాడు. అపుడా మ్లేచ్ఛరాజు "అయ్యా! అటువంటి మహానుభావుడెక్కడ ఉన్నాడో చెప్పండి" అని వేడుకున్నాడు. అప్పుడా దైవజ్ఞుడు గంధర్వపురంలో "శ్రీనృసింహసరస్వతి" అనే యతీశ్వరుడు ఉన్నారు. వారు మానవమాత్రులుగా కన్పించినప్పటికీ, సాక్షాత్తూ త్రిమూర్తి స్వరూపుడైన దత్తాత్రేయుడే. వారీ మధ్యకాలంలో ఎన్నో లీలలు చేశారు. చనిపోయిన వ్యక్తినే తిరిగి బ్రతికించిన మహానుభావుడు. ఒళ్ళంతా కుష్టురోగంతో కుళ్ళిపోతున్న వ్యక్తిని ఆరోగ్యంగా చేయగల్గిన ఆయన మహిమను వర్ణించడం ఎవ్వరి తరమూ కాదు. కనుక నీవు అక్కడికి

వెళ్ళు" అన్నాడు. దానికా రాజు అంగీకరించి గంధర్వపురంలోని శ్రీగురుని వద్దకు బయలుదేరాడు.

సరిగ్గా అదే సమయానికి శ్రీగురుడు "మ్లేచ్ఛరాజు ఇక్కడికి వస్తున్నాడు. అందువలన ఆచారవంతులైనవారికి భంగం కల్గుతుంది. ఇక మేమిక్కడ ఎక్కువ కాలం ఉండకూడదు. భక్తిలేనివారు, సదాచారం పాటించని వారు కూడా పేరాశతో ఇక్కడికి వస్తారు. కనుక మేమింక అంతర్ధానం చెందుట మంచిది" అని తలచి బహుధాన్య నామ సంవత్సరములో బృహస్పతి సింహరాశిలోకి ప్రవేశించినపుడు, గౌతమీ నదికి పుష్కరం వస్తున్నది. ఆ నదిలో స్నానం చేయుటకని చెప్పి, మేము ఈ చోటు విడిచిపోతాము" అని తమలో తాము నిశ్చయించుకున్నారు.

ఆ రోజు అక్కడి భక్తులతో "నాయనలారా! ఇక్కడికి ఒక మ్లేచ్ఛరాజు రానున్నాడు. కనుక మీరంతా మీ ఇండ్లకు వెళ్ళిపోండి. నేను గౌతమీయాత్రకు బయలు దేరుతున్నాను." అన్నారు. అపుడు భక్తులు "స్వామీ! మీరు సాక్షాత్తూ దత్తాత్రేయులే. మీరు మా అండ నుండగా మాకు భయంలేదు. మీ సన్నిధిని విడిచి మేము ఎక్కడికీ పోము" అన్నారు. కొద్ది సమయం గడిచేసరికి మ్లేచ్ఛరాజు గంధర్వపురం చేరి, శ్రీగురుడు ఎక్కడుంటారని విచారించాడు. వారు చాల సేపటి వరకూ చెప్పనేలేదు. తను చాలాసేపు ప్రార్థించి "అయ్యా! నేను మ్లేచ్ఛుడనైనా మీ ధర్మాన్ని ఆచరించేవాడినే. నేను అర్థార్థినై స్వామి దర్శనానికి వచ్చాను." అని పదే పదే ప్రాధేయపడిన మీదట వారు "శ్రీగురుడు అనుష్టానానికి సంగమానికి వెళ్ళారని, మధ్యాహ్నానికి కానీ తిరిగి రారని" చెప్పారు. అప్పుడా రాజు పల్లకీ దిగి తన పరివారాన్నంతా అక్కడ ఉంచి తానొక్కడే సంగమానికి

వెళ్ళి, స్వామిని దర్శించి చేతులు కట్టుకొని నిలబడ్డాడు. అప్పుడు శ్రీ గురుడు అతనివైపు చూచి నవ్వుతూ "ఓరీ సేవకుడా! ఎన్నాళ్ళకు నీవు కనిపించావురా!" అన్నారు. ఆ మాట వినగానే అతని హృదయంలో ఆనందం ఉప్పొంగింది. పూర్వజన్మ స్మృతి వచ్చింది. పూర్వజన్మలో తాను చాకలినని, తమ ఎదుట ఉన్నది సాక్షాత్తూ శ్రీపాదవల్లభులేనని గుర్తుకు వచ్చి శ్రీగురుని పాదాలపై పడి "స్వామీ! మీరు మా శ్రీపాదులే, నేను మీ చాకలినే. రాజ వైభవాలలో చిక్కి మిమ్మల్ని మరిచి గడిపాను. చివరకు మీ ఎదుటకు వచ్చాక కూడా పరమ పావనం అయిన మీ పాదాలను గుర్తించలేకపోయాను. మీ పాదాలను ఇక వదలను. నన్ను ఉద్ధరించండి" అని ఆనందంతో భోరున భోరున ఏడుస్తూ శ్రీగురుని పాదాలపై పడి ఉండిపోయాడు. శ్రీగురుడు అతన్ని ఆశీర్వదించి "అభీష్ట సిద్ధిరస్తు" అన్నారు. అప్పుడా రాజు తనను బాధిస్తున్న కురుపు గురించి చెప్పాడు. ఆయన "ఏదిరా నీ వ్రణం చూపించు" అన్నారు. అతను తన తొడపై చూసుకొని కురుపు మాయమవటం గమనించి ఆశ్చర్యంతో భక్తితో నమస్కరించాడు. స్వామి గంభీరవదనంతో రాజువైపు చూస్తూ "నాయనా! నీకు ఇంకా కోరికలు మిగిలివున్నాయా? బాగా ఆలోచించుకొని చెప్పు" అన్నారు. అప్పుడా రాజు స్వామి పాదాలపై పడి చేతులు జోడించి "స్వామీ! తమ దయ వలన చాలాకాలం రాజ్యం ఏలాను. నా మనస్సుకు ఇప్పుడు తృప్తి కల్గింది. నా కొడుకులు పెద్దవారయ్యారు, వారు రాజ్యభారాన్ని చూచుకుంటున్నారు. మనుమలు కూడా కలిగారు, కానీ స్వామీ నాదొక విన్నపమున్నది. మీరు మాటిస్తేనే చెబుతాను." అన్నారు. ఆయన, "ఏమిటో చెప్పు" అన్నారు. అప్పుడా రాజు "స్వామీ! పవిత్రములైన మీ పాదాలను నారాజ్యంలో పెడితే మీరు కల్పించిన రాజ్యభోగాలను మీకు ఒక్కసారి

చూపించాలని నాకోరిక" అన్నాడు. స్వామి అతనివైపు నవ్వుతూ చూచి, "ఓరీ! సన్యాసులమైన మేము నీ మ్లేచ్ఛరాజ్యంలో అడుగుపెట్టకూడదు. మీ మతస్తులు గోవులను చంపుతారు. మాకది తగదు" అన్నారు. అప్పుడా రాజు, "స్వామీ అంతా మీరు ప్రసాదించినదే కదా! మీరాకకు అవరోధం అయిన గోవధను నిషేధిస్తాను, కనుక దయచేయండి" అని కాళ్ళా వేళ్ళాపడి బ్రతిమిలాడుకున్నాడు. అప్పుడు శ్రీ గురుడు మా మహాత్మ్యమును తెల్సుకోవటం వల్ల ఇంకా నీచులు ఎందరో వస్తారిక్కడికి, కనుక మేము ఈ స్థానాన్ని విడిచిపెట్టి వెళ్ళటమే కర్తవ్యము. బృహస్పతి సింహరాశిలోకి ప్రవేశించినపుడు, గోదావరి నది వద్దకు చేరి, ఎవరికీ కన్పించకుండా పోవటం మంచిది అనుకున్నారు.

శ్రీగురుడు అంగీకారం తెల్పిన వెంటనే ఆ యవనుడు ఉప్పొంగి శ్రీవారిని పల్లకీలో కూర్చోబెట్టి, వారి పాదుకలను తలపై పెట్టుకొని నడవసాగాడు. స్వామి అతని వైపు చూసి నవ్వుతూ "నాయనా! నీవు కూడా గుర్రం మీద కూర్చొని ప్రయాణం చేయి. రాజువైన నీవు ఒక బ్రాహ్మణ సన్యాసికి ఇలా దాసుడవై ప్రవర్తించటం లోకులు చూస్తే నవ్వుతారు, దూషిస్తారు," అన్నారు. అప్పుడా రాజు, "స్వామీ, శ్రీగురూ! నేనింకెక్కడి రాజును! అంతకంటే ముందు, మీ సేవకుడనైన చాకలినే కదా! మానవుడయిన నేను లోకానికి రాజునైనా, సర్వలోకాలకూ రాజులైన మీకు సేవకుడినే. ఎవరో ఏదో అనుకుంటారని మీ సేవను మానుకుంటానా!" అంటూ ముందుకు సాగిపోయి, తాను దూరాన విడిచి ఉంచిన పరివారన్నంతా శ్రీగురునికి చూపించాడు. శ్రీ గురుడు సంతోషించి "నాయనా! మనం చాలా దూరం వెళ్ళాలి. నా మాట విని ఇకనైనా గుర్రంపై

కూర్చుని ప్రయాణం చెయ్యి" అన్నారు. అప్పుడతడు వారితో కూడా గుర్రం మీదే బయలుదేరాడు. కొంతసేపటికి శ్రీగురుడు "నాయనా! సన్యాసులమైన మేము మీతో సమానంగా ప్రయాణిస్తే అనుష్టానానికి వీలు పడదు. కనుక మేము ముందుగా వెళ్తాము. పాపవినాశతీర్థం వద్దకు వచ్చి మమ్మ కలసుకోండి" అని క్షణంలో అదృశ్యం అయిపోయారు. ఆయన ఎక్కడా కన్పించక పోయేసరికి అందరూ ఆశ్చర్యపోయారు. అదృశ్యం అయిన శ్రీగురుడు పాపవినాశతీర్థం చేరి అక్కడ కూర్చొని అనుష్టానం చేసుకోసాగారు. ఇంతలో సాయందేవుని కుమారుడైన నాగనాధుడు శ్రీ గురుని వద్దకు వచ్చి ఆనందంతో వారిని ప్రార్థించి, తన ఇంటికి ఆహ్వానించి, పూజచేసి, హారతి ఇచ్చి భిక్ష పెట్టాడు. ఆ తర్వాత శ్రీగురుడు నాగనాధుని చూస్తూ, "నాయనా! మ్లేచ్ఛరాజును పాపవినాశన తీర్థానికి రమ్మన్నాము మేము అక్కడికి వెళ్తాము. లేకపోతే అతడు వెతుక్కుంటూ ఇక్కడికే వస్తాడు. అప్పుడు నీ ఆచారానికి భంగం కల్గుతుంది." అని చెప్పి పాపవినాశతీర్థానికి వెళ్ళి, భద్రాసనంలో కూర్చున్నారు.

శ్రీగురుడు అదృశ్యం అయిపోయిన వెంటనే యవనరాజు శ్రీగురుడు తనను వీడిపోయినందుకు ఎంతో బాధపడ్తూ, అయినా తనను పాపవినాశ తీర్థానికి రమ్మన్నారు. కాబట్టి వీలైనంత తొందరలో పరివారంతో సహా తీర్థానికి చేరుకున్నాడు. తర్వాత స్వామిని దర్శించి తన నగరానికి అత్యంత వైభవంగా తీసుకెళ్ళాడు. స్వామికి రాజు అడుగడుగునా హారతులు ఇప్పించడం వింజా మరలతో వీయడం చూచిన పురవాసులు శ్రీగురుని చూచి, "ఈయనెవరో భగవదవతారమేగానీ మానవమాత్రులు గారు. అయినా బ్రాహ్మణ సన్యాసికి ఒక యవనరాజు ఇలా ఎందుకు సేవచేస్తాడు?

ఇది అంతా కలికాల వైపరీత్యమే" అనుకున్నారు. ఢక్కా, మృదంగం, మంగళవాయిద్యాల మోతతో, వందలకొద్దీ ఏనుగులు, గుర్రాలు ముందు పోతుండగా, వంది మాగధులు శ్రీగురుని గూర్చి స్తుతిస్తూంటే అగరుధూపాలు చిమ్ముకుంటూ, దారి పొడవునా లెక్కలేనన్ని పూలు చల్లుతూ, స్వామిని ఆ రాజు నగర వీధుల గుండా రాజభవనానికి తీసుకువెళ్ళాడు. చివరకు పల్లకీని దింపి అందమైన పట్టువస్త్రాలు పరచి, వాటిపై శ్రీగురుని లోనికి తీసుకువెళ్ళి స్వర్ణ సింహాసనం పైన కూర్చుండ బెట్టాడు. ఆ తర్వాత రాజు ఆయనకు సాష్టాంగ నమస్కారం చేసి, వింజామరలతో వీస్తూ, ఓ ప్రక్కగా నిల్చున్నాడు. రాజు, రాణులను, అంతఃపుర కాంతలను, రాకుమారులను, కుమార్తెలను అందర్నీ పిలచి స్వామివారికి వారిచేత పాదపూజ చేయించాడు. అప్పుడు శ్రీగురుడు అతడు చేసిన పరిచర్యలకూ ఎంతో సంతోషించి, అందర్నీ దీవించి, రాజును దగ్గరగా పిల్చి "నాయనా! నీకింకేమైనా కోరికలున్నాయా? ఉంటే నిస్సంకోచంగా చెప్పుకో"! అన్నారు. అప్పుడతను సంతోషించి "స్వామీ! నాకు మీ పాదసేవ తప్ప వేరే కోరికలు లేవు" అన్నాడు. స్వామి సంతోషించి "నాయనా! ఈ రాజ్యభారం కొడుకులకి అప్పగించి, శ్రీశైలం వచ్చెయ్యి. మేము కూడా గంధర్వపురం వెళ్ళి అక్కడి భక్తులందర్కీ చెప్పవలసినది చెప్పి శ్రీశైలం వస్తాము. మరల మా దర్శనం నీకు శ్రీశైలంలో లభిస్తుంది." అన్నారు. ఆయన ఎడబాటును సహించలేని రాజు 'నిరంతరం మిమ్మల్ని గుర్తుంచుకొనుట కొరకు గురునామాన్ని ప్రసాదించండి' అని వేడుకొన్నాడు. శ్రీగురుడు అతనిని ఆశీర్వదించి, గోదావరీ యాత్రకు వెళ్ళారు. అక్కడ స్నానం చేసి మరల భీమా-అమరజా నదీ సంగమానికి చేరుకున్నారు. గంధర్వ పురవాసులందరూ స్వామి వద్దకు

వచ్చి "స్వామీ! మీరు ఎక్కడికి వెళ్ళారు? మీరులేని ఈ ఊరు అచేతనమైపోయింది" అన్నారు. శ్రీగురుడు వారితో నాయనలారా! బిడ్డలారా! మేము ఎక్కడికో వెళ్ళిపోయామని మీరంతా అనుకోవద్దు. ఈ గాణ్గాపురం మాకు ఎంతో ఇష్టం. ఇక్కడ మమ్మల్ని భక్తితో కొలచిన వారికి ఎప్పుడూ ప్రత్యక్షం అవుతూ ఉంటాము. ముందు, ముందు కలియుగం ఇంకా, పాపభూయిష్టం అవుతున్నది. కనుక మేము శ్రీశైలం వెళ్ళాలనుకుంటున్నాము. కానీ భక్తులకు, మమ్ములను నమ్ముకున్నవారికీ గుప్తరూపంలో మా దర్శనం లభిస్తుంది. ఇంకా ముందు ముందు ధర్మం బాగా క్షీణించిపోతుంది. దుర్మార్గులు ప్రబలి దుష్కృత్యాలను చేయబోతారు. దొంగ గురువులు, దొంగ సన్యాసులు, దొంగ స్వాములు తయారవుతారు. ఇంకా ఇక్కడికి ఎంతో మంది హీనులైన మ్లేచ్ఛులు కూడా వస్తారు. మా ప్రత్యక్ష దర్శనం అందరికీ కల్గకుండా మమ్మల్ని నమ్ముకున్నవారికి కల్గించుట కొరకు గుప్తంగా ఉండాలి" అన్నారు. అందుకు ఆ గాణ్గాపుర వాసులందరూ బాధపడ్తు నిశ్చేష్టులై బొమ్మలలాగా నిల్చుండిపోయారు.

"నాయనా! నామధారకా! **ఆ రోజు వరకు మానవ ఆకారంలో కన్పించిన శ్రీగురుని రూపం అటు తర్వాత స్థూలరూపాన్ని మరుగు పరచినప్పటికీ, సూక్ష్మరూపంలో ఈనాటికీ గాణ్గాపురంలో సుస్థిరంగా ఉన్నారు సుమా! అందుకు నేనే సాక్షిని. ఆయన్ను భక్తితో విశ్వసించిన వారి కోరికలు తీరుతాయి. ఇతర యుగాలలో ఎన్ని వేల సంవత్సరాలు తపస్సు చేసినా కన్పించని దత్తమూర్తి ఇప్పుడు భక్తులపాలిట కల్పవృక్షమై ఈ గాణ్గాపురంలోనే నేటికీ ఉన్నారు సుమా!"** అని సిద్ధయోగి నామధారకునితో చెప్పాడు.

శ్లో. పూర్వదత్తా పరాయాదాత్ స్పోటక రుగ్హరః ।
మ్లేచ్ఛా యదృష్టిం చేష్టం సః శ్రీదత్తశ్శరణం మమ ॥

(ఈ శ్లోకమును చదివిపై అధ్యాయాన్ని భక్తి శ్రద్ధలతో 40 రోజులు పారాయణ చేసిన వారికి కేన్సర్, రాచకురుపు, క్షయ ఇటువంటి మూలం అయిన వ్యాధులు నివారణ కల్గును.)

ఓం శ్రీదత్తాయ గురవే నమః

ఓం శ్రీపాద స్వామినే నమః **ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః**

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

(50వ అధ్యాయం సంపూర్ణం)

కొంగ (మాయ) ముక్కుపెట్టి ఎంగిలి జేసిన
జలము (జగత్తు) పూర్తిగాను మలినమయ్యె
పక్షి (జీవుడు) దానినెంతో పరవశంబున త్రాగు
హంస (జ్ఞాని) ముక్కుపెట్టి త్రాగదందులోన
మరచిపోకుదు శివానందుని మంచిమాట


మూగసైగల భావంబు మూగయే ఎరుంగు
జ్ఞాని అనుభూతిలో కల్గు జ్ఞాన సుఖము
జ్ఞాని ఒక్కడే తెలియజాలంగ యుండూ
అని చెప్పె శివానంద జ్ఞానానుభవ సుఖంబూ
మరచిపోకుదు శివానందుని మంచిమాట

– శ్రీ స్వామి శివానంద మహరాజ్



51 వ అధ్యాయము







శ్రీ గణేశాయ నమః

శ్రీ సరస్వత్యై నమః

శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

శ్లో. శ్రీశైల యాత్రామిషేణ వరదః పుష్పపీటగః ।
కతౌతిరోభవద్యస్సః శ్రీ దత్తశ్శరణం మమ ॥

(శ్రీశైలమున స్వామివారు పుష్పాసనము నధిష్ఠించి అంతర్ధానము చెందుట)

నామధారకుడు, సిద్ధయోగికి నమస్కరించి 'స్వామీ! ఆపైన ఏమి జరిగినదో సెలవీయమని ప్రార్థించాడు.

శ్రీగురుడు వైధూర్య నగరం నుండి గాణ్గాపురం వచ్చిన తరువాత మనస్సులో ఇలా అనుకున్నారు. మా మహిమలు లోకవిఖ్యాతం అయిపోయాయి. ఇక గుప్తరూపంలో ఉండాలి, లేని ఎడల దుష్టులు కూడా వచ్చి మా అనుగ్రహానికి పాత్రులౌతారు" అని భావించి శిష్యులందర్నీ పిల్చి, "నాయనలారా! మేము శ్రీశైలయాత్రకు వెళ్ళదామనుకుంటున్నాము" అన్నారు. అప్పుడు శిష్యులు స్వామివారి వియోగమును భరించలేక విలపిస్తున్నారు. శ్రీగురుడు వారితో నవ్వుతూ "నాయనలారా! మీరు

చింతింపకుడు. మేము ఈ గ్రామమునందే గుప్తరూపంలో ప్రతి నిత్యము అమరజా సంగమంలో స్నానం చేసి, మధ్యాహ్న వేళకు మఠానికి భిక్షకు వస్తాము. భక్తిలేని వారికి దర్శనము ఇవ్వక, నిజమైన భక్తులకు మా ప్రత్యక్ష దర్శనం ఎల్లప్పుడూ ఉంటుంది. మీ పూజలను ఎల్లప్పుడూ గ్రహిస్తూ ఉంటాము. మీరు ఏ మాత్రము సందేహము పెట్టుకోవద్దు. ఇచ్చట మా "నిర్గుణ పాదుకలను" వదులుతాము. ఎవరు సంగమమున స్నానం చేసి, ఇచ్చట అశ్వద్ధ వృక్షమును పూజించి మేము వదలిన పాదుకలను శ్రద్ధతో, భక్తితో ఎవ్వరు పూజింతురో, వారి మనోరథములన్నీ తీరును. ఇచ్చట చింతామణి వలె ఉన్న విఘ్నేశ్వరుని పూజించువారికి సర్వకార్యములు నిర్విఘ్నంగా కొనసాగును. ఇచ్చట అష్టతీర్థములలో స్నానం చేసిన వారికి మా అనుగ్రహము తప్పక లభించును. ఈ 'నిర్గుణ పాదుకలకు' త్రికాలములందు హారతులిచ్చినవారికి కోరికలన్నీ నెరవేరగలవు" అని వారిని ఊరడించి, తమ పాదుకలను మఠంలో విడిచి శ్రీశైలయాత్రకై బయలుదేరారు. గ్రామస్థులు, శిష్యులు బాధతో రోదిస్తూ స్వామివారిని ఊరి బయటి వరకూ వచ్చి సాగనంపి, దుఃఖవదనములతో తిరిగి మఠానికి చేరుకొని, రోదించసాగారు. క్షణమాత్రంలో శ్రీగురుడు వదిలి వెళ్ళిన పాదుకల స్థానంలో వారి ప్రత్యక్షరూపం అందరికీ దివ్యజ్యోతుల కాంతులతో దర్శనం అయింది. వారందరూ ఆనందంతో శ్రీగురుడు మానవమాత్రులు కారని, త్రిమూర్తి స్వరూపులని, ఇట్టి స్వామిని మానవుడుగా తలంచువారు నరకమును అనుభవించెదరని భావించి భక్తితో నమస్కరించారు. తిరిగి స్వామి అదృశ్యులయ్యారు.

ఆ తర్వాత స్వామివారు నల్గురు శిష్యులతో శ్రీశైలం, అందలి పాతాళ గంగను సమీపించి, శిష్యులతో "నాయనలారా! మీరు అరటి ఆకులతో,

పుష్పములతో ఒక నావను, ఆసనమును తయారుచేయండి. అందులో మేము కూర్చొని ఈ పాతాళగంగను దాటి, మల్లికార్జునిలో ఐక్యం అవుతాము" అని ఆజ్ఞాపించారు. అప్పుడు మేము పుష్పములను తెచ్చి, అరటి ఆకులతో ఒక నావను, అందు శ్రీగురుడు కూర్చొనుటకు ఆసనమును తయారు చేశాము. శ్రీగురుడు మమ్మల్ని వీడిపోతున్నందుకు దుఃఖ వదనములతో నివ్వెరపోయి ఉండగా శ్రీగురుడు ఆ నావను పాతాళగంగలోని నీటిపై ఉంచమన్నారు. అప్పుడు శ్రీగురుడు చివరిసారిగా తమ పాదస్పర్శనమును మాకిచ్చి, వడివడిగా వెళ్ళి ఆ నావలో కూర్చొన్నారు. చివరిగా ఆయన మా అందరితో చిరునవ్వులు చిందే వదనంతో మా వైపు చూస్తూ **"నాయనలారా! మీకు సర్వశుభములు ప్రాప్తించుగాక! మేము గుప్తరూపంలో ఎల్లప్పుడూ గాణ్గాపురంలోనే ఉంటాము. మీరు మీ ఇండ్లకు వెళ్ళి మా మఠంలో ఉన్న నిర్గుణ పాదుకలను ప్రతీ రోజు శ్రద్ధ, భక్తి విశ్వాసాలతో పూజింపుడు, నలుగురు ఒక్కచోటచేరి, మా లీలలను ఎవరైతే పారాయణము, శ్రవణములను చేసి భక్తితో కీర్తిస్తారో, ఈ గ్రంథంలోని స్తోత్రాలను పఠిస్తారో, సప్తాహపద్ధతిలో, నియమనిష్టలతో మమ్మల్ని అర్చించి, ఈ "గురులీలల" రూపంలో ఉన్న మా లీలలను ఎవరు చదువుతారో, వారికి చతుర్విధ పురుషార్థములు ప్రాప్తిస్తాయి. సంతానము లేని వారికి సంతానము, పెండ్లి కాని వారికి పెండ్లి, సమస్యలతో ఉన్న వారికి అవి తీరడము జరుగుతుంది. భక్తితో సప్తాహ పద్ధతిలో చేసినచో ఎనిమిదివ రోజుననే వారికి ఫలితం కన్పించును"** అని చెప్పారు. మేమందరమూ ధుఃఖితులమై కండ్లనీళ్ళు పర్యంతము రోదన వదనములతో శ్రీగురుని వైపు చూస్తూ ఉన్నాము.

బహుధాన్యనామ సంవత్సర ఉత్తరాయణంలో బృహస్పతి

కన్యారాశిలోకి వచ్చినప్పుడు, మాఘమాసము కృష్ణపక్షము శుక్రవారము రోజు శ్రీగురుడు మాతో ఇంకా ఇలా అన్నారు. **“నాయనలారా! మేము వెళ్ళినందుకు గుర్తుగా మీకు నాలుగు పుష్పాలను పంపిస్తాము అవి నీటిపై కొట్టుకొని వస్తాయి. మీరు వాటిని గ్రహించి మమ్ము ఎల్లప్పుడూ పూజించుకొనుడు. అలా పూజించిన వారికి లక్ష్మి వారి ఇంట ఎల్లప్పుడూ నివసించును. అంతేగాక, మాకు గానమనిన ప్రీతి కాబట్టి ఎవరైతే మా లీలలను వారి ఇంట ఎల్లప్పుడూ గానం చేస్తుంటారో వారి ఇంట వ్యాధులు గాని, దారిద్ర్యంగాని ఉండదు. వారు దీర్ఘాయుష్మంతులై పుత్రపౌత్రాభివృద్ధితో జీవించగలరు. ఈ మా లీలలను పఠించువారికి కష్టములు ఉండవు.”** అని వారు మాతో చెప్పి నావలో వెళ్ళిపోయారు. కానీ కాషాయవస్త్రంతో తలను కప్పుకున్న వారి రూపము మాలో ముద్రవేసుకొని పోయింది. వారి రూపమును కనుమరుగయ్యే వరకూ భక్తితో నమస్కరిస్తూ ఉన్నాము. ఇంతలో నాలుగు పువ్వులు నీటిలో కొట్టుకొని వస్తూ మాకు కన్పించాయి. కొందరు బెస్తవారు, అటుగా వస్తూ ఆ పూలను భక్తితో తీసుకొని మా వద్దకు వచ్చి “అయ్యా! కొంత దూరంలో ఓ స్వాములవారు పూలనావలో పోతున్నారు. వారు మాతో “మా పేరు నృసింహసరస్వతి. మేము మా నిజస్థానానికి వెళ్తున్నాము. అయినా గాణ్గాపురం నందు గుప్తరూపంలో ఎల్లప్పుడూ ఉంటాము. మీకు నాలుగు పువ్వులు కన్పిస్తాయి. అవి ఒడ్డున ఉన్న మా శిష్యులకు అందజేయండి. వారిని గాణ్గాపురంలో మా మఠంలో వదిలి వచ్చిన “నిర్గుణ పాదుకలను” భక్తితో ఎల్లప్పుడూ అర్చిస్తూ ఉండమనండి” అని చెప్పారు. కాబట్టి ఈ పువ్వులను మీ వద్దకు తెచ్చాము” అని ఆ బెస్తవారు మాకు ఆ పువ్వులను ఇచ్చారు.

అప్పుడు నామధారకుడు, సిద్ధమునితో “స్వామీ! శ్రీగురునికి

చాలామంది శిష్యులున్నారు కదా! ఆ పువ్వులు దొరికిన నలుగురు ఎవ్వరు?” అని అడిగాడు. అప్పుడు సిద్ధయోగి “నాయనా! శ్రీ గురునికి ఎంతో మంది శిష్యులు ఉన్నారు. ఒకడు కృష్ణ సరస్వతి, రెండవవాడు బాలసరస్వతి, మూడవవాడు ఉపేంద్ర సరస్వతి, నాల్గవవాడు మాధవ సరస్వతి. కానీ స్వామి ఆజ్ఞననుసరించి వీరంతా తీర్థయాత్రలకు వెళ్ళిపోయారు. శ్రీశైలయాత్రకు వచ్చినప్పుడు మాత్రము శ్రీగురుని వెంబడించినది సాయందేవుడు, నందిశర్మ, నరహరికవి, నాల్గవవాడిని నేను. ఆ పుష్పములు ప్రసాదముగా దొరికినది మాకే. అంతటి పవిత్రమైన పుష్పమునే శ్రీ గురుని లీలలు పేరిట గ్రంథంగా మార్చి కూర్చాను. నాకు దొరికిన పుష్పము ఇదిగో” అని సిద్ధయోగి పుష్పరూపంలో ఉన్న గ్రంథమును నామధారకునికి చూపించారు. “భక్తులారా! **ఈ “గురులీల” గ్రంథము భక్తులకు కామధేనువు. దీనిని పఠించువారికి, వినువారికి, దారిద్ర్యంలేక లక్ష్మీవంతులై, పుత్రపౌత్రులతో, సుఖించగలరు. దీనిని చదువువారికి ధర్మార్థకామ మోక్షములు లభించును. గ్రంథమును గృహములలో లిఖించుకొను వారికి సర్వసిద్ధులూ కల్గును. ఇట్టి “గురులీల”ను శ్రద్ధతో వినువారు భవసాగరమనే సంసారమును అవలీలగా దాటుదురు. అట్టివారికి పరమార్థము కరతలామలకము. అమృతముతో సమానమగు ఈ గురులీలలు సజ్జనులకు మాత్రమే రుచింపగలవు. ఈ గ్రంథములో ఉన్న గురు లీలలను శ్రద్ధతో వినువారిని దత్తస్వరూపం అయిన శ్రీ నృసింహసరస్వతీ స్వామి వంశపారంపర్యంగా రక్షించును.**


ఓం శ్రీదత్తాయ గురవే నమః

ఓం శ్రీపాద స్వామినే నమః   ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

(51వ అధ్యాయం సంపూర్ణం)

52 వ అధ్యాయము





శ్రీ గణేశాయ నమః



శ్రీ సరస్వత్యై నమః

శ్రీ గురుభ్యో నమః

శ్రీపాద శ్రీవల్లభ శ్రీ నృసింహ సరస్వతీ దత్తాత్రేయ గురుభ్యో నమః

సిద్ధముని వలన 'శ్రీ గురులీల'ను విన్న నామధారకుడు సమాధి నిష్టలో ఉండిపోయాడు. అప్పుడు సిద్ధముని అతనిని మేల్కొల్పి ఆలింగనం చేసుకొని, "నాయనా! నామధారకా! నీవు తరించావు. నీవిలా సమాధిలో ఉండిపోతే ఈ గురులీలలు బహిర్గతం అవుట ఎట్లు? నీ వలననే ఈ గురులీలలు ప్రజా బాహుళ్యంలోకి వెళ్ళి భక్తులు ఉద్ధరింపబడాలి. కావున మనస్సును గురు చరణములందు లగ్నం చేసి, లోకమునకు అనుకూలముగా నీవు మేల్కొని ఉండాలి. నీ వలన ఈ గురులీలలు లోకం అంతా వ్యాపించగలవు" అన్నాడు. అప్పుడు నామధారకుడు సిద్ధయోగి పాదములపై పడి చేతులు జోడించి నమస్కరించి "గురుదేవా! మీ వలననే భవసాగరమును దాటగల్గాను. అద్భుతం అయిన గురులీలలను వినగల్గాను. నా మనస్సు ఇప్పుడు తృప్తి పొందినది. ఈ గ్రంథమును ఏవిధంగా పారాయణ చేయాలో తెలియచేసి నన్ను ఉద్ధరించండి." అని ప్రార్థించాడు.

అప్పుడు సిద్ధయోగి "నాయనా! ముందు మంగళాచరణము,

ఇష్టదేవతా స్మరణము చేసి, గ్రంధ పూజ చేసి ప్రారంభించాలి. కలియుగమున అధర్మము వృద్ధి చెందుట వలననే శ్రీగురుడు అదృశ్యమయ్యారు. ఈ 'గురులీల' రూపంలో ఉన్న గురులీలలను శ్రద్ధతో సప్తాహపారాయణము చేయువారికి శ్రీగురుడు తప్పక మనోరథములను చెల్లించును. సప్తహపారాయణము చేయువారు గురువారం నాడు పారాయణం చేయు స్థలం శుద్ధి చేసుకొని, దీపము వెలిగించి, నియయము ప్రకారం గ్రంథమును పూజించి, ప్రారంభించాలి.

మొదటి రోజు	9వ అధ్యాయం చివరి వరకును,
రెండవ రోజు	21వ అధ్యాయం చివరి వరకును,
మూడవ రోజు	29వ అధ్యాయం చివరి వరకును,
నాల్గవ రోజు	35వ అధ్యాయం చివరి వరకును,
ఐదవ రోజు	38వ అధ్యాయం చివరి వరకును,
ఆరవ రోజు	43వ అధ్యాయం చివరి వరకును,
ఏడవ రోజు	గ్రంథాంతము వరకును పఠించాలి.

ఈ సప్తాహ పద్ధతిలో చేస్తున్నంత కాలమూ బ్రహ్మచర్యమును పాటించుట మంచిది. ప్రతిరోజూ తలంటుస్నానం చేయటం మంచిది. ఒంటిపూట భోజనం చేయుట మంచిది. పారాయణ చేస్తున్నంత కాలము అసత్యం పలుకకుండా, కఠిన వాక్కులు పలుకకుండా, నియమంగా చేస్తే ఉత్తమ ఫలితం దక్కుతుంది. అంతే కాక పారాయణ చేస్తున్నంత కాలము భూమిపై శయనించడం (క్రింద పడుకోవటం) మంచిది.

ఈ నియమం ప్రకారం పారాయణం చేస్తే తప్పక గురు కృప లభిస్తుంది." అని సిద్ధయోగి నామధారకునితో చెప్పాడు.

ఓం శ్రీదత్తాయ గురవే నమః **ఓం శ్రీపాద స్వామినే నమః**

అనంతకోటి బ్రహ్మాండనాయక
రాజాధిరాజ యోగిరాజ పరబ్రహ్మ
శ్రీదత్తాత్రేయ శ్రీపాదవల్లభ **ఓం శ్రీ నృసింహ సరస్వత్యై నమః**

(52వ అధ్యాయం సంపూర్ణం)

(బుధవారపు పారాయణం పూర్తి)

మన్నాథః జగన్నాథో మద్గురు జగద్గురుః ।
మమాఽత్మా సర్వభూతాత్మ తస్మై శ్రీ గురువేనమః ॥

మాలచేతిలో తిరుగు యుగాల కొలది
మనస్సు తిరుగుట మానేదేమాత్రమైనా
కరమునందలి జపమాల కడకు విసిరి
త్రిప్పవోయి మనోమాల దీక్షతోడ
మరచిపోకుడు శివానందుని మంచిమాట

యుక్తమైనదంతా ఉపదేశమిచ్చితి
ఇంక చెప్పదగినదేదీలేదు
ఒకని వెంట ఒకదు ఒదిగి బ్రహ్మమునందు
కలియగలరు కడలి అలల కరణీ
మరచిపోకుడు శివానందుని మంచిమాట

– శ్రీ స్వామి శివానంద మహరాజ్